సత్యమేవ జయతే

సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 16+32 పేజీల ఆదివారం అనుబంధం | వెల: ₹ 7.00 | సంపుటి: 17 | సంచిక: 347

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

SUNDAY Special

ఆదివారం 9-3-2025



'స్వచ్ఛమైన రక్షిత జలాలను అందిస్తేనే గోండు, చెంచు, ఆదివాసీ గిరిజనులు ఆరోగ్యంగా ఉంటారు.'



సామాజిక స్ఫూర్తికి సెల్యూట్

ఘనంగా సాక్షి ఎక్సలెన్స్ అవార్డుల ప్రదానం

- వివరాలు 14,15లో

లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డును సీనియర్ నటి రమాప్రభకు అందజేస్తున్న వైఎస్ భారతి రెడ్డి, సుకుమార్. చిత్రంలో నిర్మాత రవి, కిరణ్ అబ్బవరం, తేజ సజ్జా, మీనాక్షి చౌదరి, వైష్ణవి చైతన్య



నారీ శక్తికి సలాం

ఏ సమాజంలోనైనా, దేశంలోనైనా మహిళలను గౌరవించడమే ప్రగతి దిశగా తొలి అడుగని ప్రధాని మోదీ అభిప్రాయపడ్డారు.

- వివరాలు 6లో



ఇద్దరిపై గ్యాంగ్ రేప్..

కర్ణాటకలోని హంపిలో ఇజ్రాయెల్ మహిళతో పాటు స్థానిక మహిళపై దుండగులు దాడి చేసి సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు.

- వివరాలు 6లో

న్యూస్‌రీల్

నేడే 'చాంపియన్స్' ఫైనల్



దుబాయ్‌లో జరిగే తుది పోరులో న్యూజిలాండ్‌తో భారత్ తలపడుతుంది. గతంలో భారత్ ఈ టోర్నీలో 2 సార్లు విజేతగా నిలవగా, కివీస్ ఒకసారి టైటిల్ సాధించింది. మ. 2.30గం. నుంచి ఫైనల్ మ్యాచ్ ప్రారంభమవుతుంది. - 16లో

అలలపై కలల విహారం..



అలలపై తేలియాడుతూ ప్రయాణం.. ఇంద్రభవనం లాంటి సకల విలాసాలతో కూడిన నౌకల్లో విహారయాత్రలంటే ఎవరికి ఇష్టం ఉండదు. అందుకే దేశంలో లగ్జరీ క్రూజ్ టూరిజం సరికొత్త ట్రెండ్‌గా మారింది. గెట్ సెట్ క్రూజ్!! - 2లో

శనివారం సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగిన 'ఇందిరా మహిళా శక్తి' కార్యక్రమానికి హాజరైన మహిళలు



మీరే ట్రిలియన్ డాలర్ల శక్తి



సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో 'ఇందిరా మహిళా శక్తి' కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఎం రేవంత్

అదానీ, అంబానీలకు దీటుగా తెలంగాణ మహిళల వ్యాపారం

పరేడ్ గ్రౌండ్స్‌లో 'ఇందిరా మహిళా శక్తి' కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి

- కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా మార్చితే బలమైన ఆర్థిక శక్తిగా తెలంగాణ
- మహిళా సంఘాల ఆధ్వర్యంలో సోలార్ పవర్ ప్లాంట్లు.. ఆర్టీసీకి అద్దె బస్సులు..
- పదేళ్ల చంద్ర గ్రహణం వీడింది.. ఇందిరమ్మ రాజ్యంలో మహిళలకు వెలుగులు
- ప్రమాదాలను చూస్తూ పైశాచిక ఆనందంతో ప్రతిపక్షాలు నవ్వుకుంటున్నాయని మండిపాటు
- ఇందిరా మహిళాశక్తి మిషన్–2025 పాలసీ ఆవిష్కరణ

2లో

ఎప్పుడైనా కూడా మహిళలకు అండగా నిలిచింది ఇందిరమ్మ రాజ్యమే. ప్రజలు ఇందిరాగాంధీని అమ్మ అని పిలిచారు. ఆ తర్వాత ఎన్టీఆర్‌ను అన్నా అన్నారు. ఇప్పుడు నన్ను కూడా అన్నా అని పిలుస్తున్నారు. తోబుట్టువు మాదిరిగా ఆదరిస్తున్నారు. అలాంటి తోబుట్టువుల కోసం నేను ఎలాంటి రిస్క్ అయినా ఎదుర్కొంటా. ఇందిరమ్మ శక్తి, ఎన్టీఆర్ యుక్తి.. రేవంత్ స్ఫూర్తితో మీరు ముందుకెళ్లండి. ప్రజా ప్రభుత్వం ప్రధాన లక్ష్యం ఆడబిడ్డల అభివృద్ధే. ఇందిరా మహిళా శక్తి అంటే ప్రపంచానికే ఆదర్శంగా నిలబడేలా తీర్చిదిద్దుతా.


ఇందిరమ్మ శక్తి, ఎన్టీఆర్ యుక్తి.. రేవంత్ స్ఫూర్తి

పార్టీలకతీతంగా ఏకమవుదాం

కేంద్రం నుంచి నిధులు, ప్రాజెక్టులు, సహాయ సహకారాలు సాధించుకుందాం


- రాష్ట్ర ఎంపీల ప్రత్యేక సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పిలుపు
- పార్లమెంటులో రాష్ట్ర అవసరాలు, సమస్యలను లేవనెత్తాలి
- రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు కలసి రావాలని ఆశిస్తున్నాం
- వారం తర్వాత మరో సమావేశం పెడతాం.. ఎంపీలను నేను ప్రత్యేకంగా కలసి ఆహ్వానిస్తా
- పెండింగ్ ప్రాజెక్టుల సాధన కోసం వాయిదా తీర్మానం ఇచ్చే అవకాశాన్ని పరిశీలిస్తున్నట్టు వెల్లడి..

12లో



ప్రజాభవన్‌లో రాష్ట్ర లోక్‌సభ, రాజ్యసభ సభ్యుల సమావేశం..

హాజరుకాని బీజేపీ, బీఆర్ఎస్ ఎంపీలు..



5లో


కల్యాణం.. కమనీయం

శనివారం రాత్రి యాదగిరిగుట్టలో శ్రీలక్ష్మీనరసింహ స్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

అలలపై కలల విహారం

అలలపై తేలియాడుతూ ప్రయాణం.. గమ్యం చేరే వరకు ఎక్కడా బోర్ కొట్టకుండా ఆటలు, పాటలు, విందులు, వినోదాల్లాంటి బోలెదన్ని సరదాలు.. కళ్లు చెదిరే ఇంటీరియర్లతో అందమైన గదులు.. ప్రయాణ బడలిక తెలియనివ్వని పాన్పులు.. ఒకవేళ అలసటకు గురైతే స్పా, మసాజ్ లాంటి సర్వీసులు.. ఉన్న చోటే బోలెడంత షాపింగ్ చేసుకొనే అవకాశం.. ఇంకా ఈత కొలనులు.. జిమ్‌లు.. ఇలా ఒకటేమిటి ఇంద్రభవనం లాంటి సకల విలాసాలతో కూడిన నౌకల్లో విహారయాత్రలంటే ఎవరికి ఇష్టం ఉండదు. అందుకే దేశంలో లగ్జరీ క్రూజ్ టూరిజం సరికొత్త ట్రెండ్‌గా మారింది. పర్యాటకులను ఆనంద'సాగరం'లో ముంచెత్తే అనుభూతులు పంచుతోంది. ఇంకేం.. జీవితాంతం గుర్తుండిపోయే సముద్రమంత లోతైన జ్ఞాపకాలు కావాలనుకుంటే 'సీ'కేషన్‌కు సిద్ధమైపోండి. గెట్ సెట్ క్రూజ్!!

దేశంలో క్రూజ్ పర్యాటకం క్రమంగా పుంజుకుంటోంది. డెస్టినేషన్ వెడ్డింగ్స్, ప్రైవేటు పార్టీలు, కంపెనీల గెట్ టుగెదర్ వంటి కార్యక్రమాలకు కూడా క్రూజ్‌లు వేదికలుగా మారుతున్నాయి. ప్రస్తుతం దేశంలో క్రూజ్ ప్రయాణికుల సంఖ్య 4.5 లక్షలు దాటింది. కార్డీలియా క్రూజెస్ అనే స్వదేశీ సంస్థ 2021 సెప్టెంబర్‌లో సుమారు 2 వేల మంది ప్రయాణికుల సామర్థ్యంగల 'ఎంప్రెస్'నౌక ద్వారా భారత్‌లో తొలిసారిగా లగ్జరీ క్రూజ్ పర్యాటకానికి తెరతీసింది. బంగాళాఖాతం, అరేబియా సముద్రం, హిందూ మహాసముద్రాల్లో క్రూజ్ యాత్రలు నిర్వహిస్తోంది. పశ్చిమ తీరంలో ముంబై హోమ్ పోర్టుగా సెప్టెంబర్–జూన్ మధ్య గోవా, కొచ్చి, లక్షదీవులకు... జూన్–సెప్టెంబర్ మధ్య తూర్పు తీరంలో చెన్నై హోమ్ పోర్ట్‌గా క్రూజ్ ట్రిప్పులు తిప్పుతోంది. 2023 జూన్‌లో భారత్ నుంచి శ్రీలంకకు జర్నీతో విదేశీ క్రూజ్ సర్వీసులను ప్రారంభించిన ఘనతను కూడా కార్డీలియా సొంతం చేసుకుంది. ఇప్పుడు ఏటా చెన్నై–శ్రీలంక మధ్య జూన్–సెప్టెంబర్ నెలల్లో కార్డీలియా 'ఎంప్రెస్'విహారయాత్రలను నిర్వహిస్తోంది. గమ్యస్థానాల్లో వాటర్ అడ్వెంచర్లు, జంగిల్ సఫారీలు, ఆన్‌షోర్ సిటీ టూర్, అవుట్‌డోర్ పర్యటనలను కూడా అందిస్తోంది. దేశీయ గమ్యస్థానాలకు పర్యాటకుల ఆక్యుపెన్సీ 85 శాతం మేర ఉంటోందని.. వేసవి సెలవుల్లో టికెట్లు పూర్తిగా బుక్ అయిపోతున్నాయని కంపెనీ సీఈఓ జుర్గెన్ బైలోమ్ చెబుతున్నారు. కొత్త రూట్లు, గమ్యస్థానాలకు విస్తరణ నేపథ్యంలో భారతీయ క్రూజ్ ట్రాఫిక్ 25–30 శాతం పెరిగే అవకాశం ఉందన్నారు.



- దేశంలో సరికొత్త ట్రెండ్‌గా లగ్జరీ క్రూజ్ టూరిజం
- ముంబై నుంచి గోవా, కొచ్చి, లక్షదీవుల దాకా అందుబాటులో టూర్లు
- చెన్నై నుంచి విశాఖకు కూడా నడుస్తున్న సముద్ర విహారయాత్రలు
- మధ్యతరగతి ప్రజలకు సైతం అందుబాటు ధరల్లో ప్యాకేజీలు
- కేంద్రం చర్యలతో గంగ, బ్రహ్మపుత్ర నదుల్లో ఇప్పటికే రివర్ క్రూజ్ సర్వీసులు ప్రారంభం
- కృష్ణా, గోదావరి తదితర నదుల్లోనూ ఈ సర్వీసుల కోసం ప్రయత్నాలు

– సాక్షి, బిజినెస్ డెస్క్

కేంద్రం దన్ను..

దేశంలో సముద్ర క్రూజ్ పర్యాటకులను 2029 నాటికి ఏటా 10 లక్షల మంది స్థాయికి చేర్చడంతోపాటు ఈ రంగంలో 4 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించేలా ఐదేళ్ల భారత్ క్రూజ్ మిషన్‌ను కేంద్ర ప్రభుత్వం ప్రారంభించింది. ఇందులో భాగంగా 10 సముద్ర క్రూజ్ టెర్మినల్స్, 100 రివర్ క్రూజ్ టెర్మినల్స్ నిర్మించాలనేది ప్రభుత్వ లక్ష్యం. ప్రపంచస్థాయి మౌలిక వసతులతోపాటు పర్యాటక ప్రదేశాలను మరింతగా అభివృద్ధి చేయనున్నారు. బడ్జెట్లో కూడా క్రూజ్ పరిశ్రమ వృద్ధికి ప్రోత్సాహకాలు ఇవ్వడం విశేషం. గంగ, బ్రహ్మపుత్ర నదుల్లో ఇప్పటికే రివర్ క్రూజ్ సర్వీసులు ప్రారంభమయ్యాయి. కృష్ణా, గోదావరి, నర్మద, కావేరి నదుల్లోనూ ఈ సర్వీసులను అందుబాటులోకి తెచ్చే ప్రయత్నాలు జరుగుతున్నాయి. రివర్ క్రూజ్ పర్యాటకులను 2029 నాటికి ఏటా 15 లక్షలకు పెంచాలనేది మిషన్ లక్ష్యం.

విదేశీ క్రూజ్‌ల క్యూ

ఇటలీకి చెందిన కోస్టా క్రూజెస్ తొలిసారిగా 2023లో భారత్ పర్యాటకులకు అంతర్జాతీయ స్థాయి క్రూజ్ అనుభూతితోపాటు ఇటాలియన్ ఆతిథ్యాన్ని రుచి చూపించింది. ముంబై, కొచ్చి, గోవాతోపాటు లక్షదీవుల మధ్య మొత్తం 23 ట్రిప్పులు నిర్వహించింది. మొత్తం 14 అంతస్తులు (డెక్‌లు), 3,780 మంది ప్రయాణికుల సామర్థ్యంతో కోస్టా సెరీనా క్రూజ్ భారత సముద్ర జలాల్లో విహరించిన అతిపెద్ద నౌకగా రికార్డుకెక్కింది. ఆసియా పసిఫిక్ కార్యకలాపాల కోసం భారత్‌ను ప్రధాన కేంద్రంగా చేసుకోవడంపై దృష్టి పెడుతున్నామని కోస్టా క్రూజెస్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ రాబర్టో అల్బెర్టీ వెల్లడించారు. క్రూజ్ టూరిజానికి ప్రభుత్వ ప్రోత్సాహంతో మరిన్ని క్రూజ్ కంపెనీలు భారత్‌కు క్యూ కట్టనున్నాయి. వచ్చే ఏడాది నుంచి 'రిసార్ట్ వరల్డ్ వన్'క్రూజ్ లైనర్ మన దేశంలో సెయిలింగ్‌కు సై అంటోంది. రాయల్ కరీబియన్, డిస్నీ తదితర దిగ్గజ క్రూజ్ లైనర్లు కూడా భారత మార్కెట్లోకి అడుగుపెట్టే ప్రణాళికల్లో ఉన్నాయి.



కోస్టా సెరీనా క్రూజ్

వైజాగ్ హాట్ డెస్టినేషన్... జూలైలో మళ్లీ క్రూజ్ రెడీ

2022లో తొలిసారి కార్డీలియా క్రూజెస్ 'ఎంప్రెస్'నౌక విశాఖ–చెన్నై మధ్య సముద్ర విహారంతో పర్యాటకులకు సరికొత్త అనుభూతిని పంచింది. గతేడాది 'ద వరల్డ్'అనే విదేశీ లగ్జరీ క్రూజ్ షిప్ గ్లోబల్ టూరిస్టులను విశాఖకు తీసుకొచ్చింది. ఇక్కడ సకల సౌకర్యాలతో నిర్మించిన అంతర్జాతీయ క్రూజ్ టెర్మినల్‌లో లంగరేసింది. ఈ ఏడాది మళ్లీ జూలైలో కార్డీలియా ఎంప్రెస్ నౌక వైజాగ్–పుదుచ్చేరి–చెన్నై మధ్య ట్రిప్పులకు రెడీ అవుతోంది. సుమారు రూ. 100 కోట్ల వ్యయంతో విశాఖ పోర్టులో నిర్మించిన ఇంటర్నేషనల్ క్రూజ్ టెర్మినల్ నుంచి నౌకల రాకపోకలు మొదలవడంతో క్రూజ్ పర్యటకానికి కూడా వైజాగ్ హాట్ డెస్టినేషన్‌గా నిలుస్తోంది. షిప్ ఆకారంలో నిర్మించిన ఈ టెర్మినల్‌లోని బెర్త్‌లో 2,500 మంది సామర్థ్యంతో కూడిన భారీ క్రూయిజ్‌లను లంగరేయొచ్చు. త్వరలో ఇక్కడి నుంచి సింగపూర్, మలేసియా, థాయ్‌లాండ్, శ్రీలంక తదితర దేశాలకు క్రూజ్ సర్వీసులు ప్రారంభించేందుకు పలు క్రూజ్ కంపెనీలతో సంప్రదింపులు జరుగుతున్నాయి.



కార్డీలియా షిప్‌లోని ఫుడ్ కోర్టు

ఇక అలలపై ఆగ్నేయాసియా చుట్టేయొచ్చు!

భారత క్రూజ్ పరిశ్రమ ఇక అంతర్జాతీయంగానూ సత్తా చాటనుంది. కార్డీలియా తొలిసారిగా భారత్ నుంచి ఆగ్నేయాసియాలోని ప్రముఖ పర్యాటక దేశాలకు జూలైలో క్రూజ్ జర్నీ ప్రారంభిస్తోంది. ఇందుకోసం 2,500 మంది సామర్థ్యంగల రెండు కొత్త క్రూజ్‌లను కొననుంది. చెన్నై నుంచి మొదలయ్యే ఈ 10 రోజుల ట్రిప్‌లో థాయ్‌లాండ్ (ఫుకెట్), మలేసియా (కౌలాలంపూర్, లంకావీ)ల మీదుగా సింగపూర్ చేరుకోవచ్చు. అలాగే సింగపూర్ నుంచి మొదలై అవే డెస్టినేషన్లను కవర్ చేస్తూ చెన్నై చేరేలా టూర్లను ప్లాన్ చేశారు. ఇప్పటికే కార్డీలియా వెబ్‌సైట్ (www.cordeliacruises.com) తోపాటు ప్రముఖ ట్రావెల్ పోర్టల్స్‌లో బుకింగ్స్ మొదలయ్యాయి. బంగాళాఖాతం, హిందూ మహాసముద్రాలను చుట్టేయడంతోపాటు గమ్యస్థానాల్లో సిటీ టూర్స్, ఆన్‌షోర్ పర్యటనలతో ఒకే ట్రిప్‌లో మూడు దేశాలను కవర్ చేసే అవకాశం ఉంటుంది.

ప్యాకేజీలు ఇలా...

కార్డీలియా 'ఎంప్రెస్'షిప్‌లో మధ్యతరగతి కుటుంబం సైతం లగ్జరీ క్రూజ్ జర్నీ చేసేవిధంగా రకరకాల రూమ్‌లు, ఆఫర్లు, గ్రూప్ ప్యాకేజీలు ఉన్నాయి. ఉదాహరణకు చెన్నై–విశాఖ మధ్య ఇద్దరు పెద్దవాళ్లకు రెండు రాత్రులు, 3 పగళ్ల ప్యాకేజీ ధరలు (పన్నులన్నీ కలిపి) చూస్తే...

ఇంటీరియర్ స్టేట్‌రూమ్ స్టాండర్డ్ రూ.46,402/-	మినీ సూట్ రూ. 87,466/-
ఓషన్ వ్యూ స్టాండర్డ్ రూ.60,774/-	



అన్‌లిమిటెడ్ ఫుడ్, ఎంటర్‌టైన్‌మెంట్‌తో మూడు రోజులపాటు ఫైవ్ స్టార్ లగ్జరీ సముద్ర ప్రయాణ అనుభూతిని సొంతం చేసుకోవచ్చు. జర్నీ రూట్, ఎంత మంది, ఎన్ని రోజులు (3, 5 నైట్స్ ప్యాకేజీలు) అనేదాన్ని బట్టి రేట్లు మారతాయి. 12 ఏళ్ల లోపు పిల్లలకు షరతులకు లోబడి ఉచిత ప్రయాణ (పన్నులు కాకుండా) ఆఫర్ ఉంది. ధర ఎక్కువైనా మరింత లగ్జరీ, సౌకర్యాలు కోరుకునేవారికి సూట్, చైర్మన్ సూట్ కూడా ఉన్నాయి.

విదేశీ టూర్ల విషయానికొస్తే...

చెన్నై నుంచి శ్రీలంకకు (హంబన్‌టోట, ట్రింకోమలీ, జాఫ్నా), తిరిగి చెన్నై (5 నైట్స్, 6 డేస్ రౌండ్ ట్రిప్) జర్నీకి ఇద్దరు పెద్దవాళ్లకు చార్జీ దాదాపు రూ. లక్ష పడుతుంది. అలాగే చెన్నై నుంచి సింగపూర్ (ఫుకెట్, లంకావీ, కౌలాలంపూర్ మీదుగా వన్‌వే ట్రిప్ – 10 నైట్స్, 11 డేస్) ట్రిప్‌కి చార్జీ రూ.2,21,745 అవుతుంది. పన్నులతో కలిపి, ఇంటీరియర్ స్టేట్‌రూమ్ ప్యాకేజీలు ఇవి.



ఓషన్ వ్యూ స్టాండర్డ్ రూమ్


క్రూజ్ లెక్కలు ఇలా..

- **3 కోట్లు:** ప్రపంచవ్యాప్తంగా ఏటా క్రూజ్ జర్నీ చేస్తున్న పర్యాటకుల సంఖ్య (సుమారుగా)
- **30 బిలియన్ డాలర్లు:** క్రూజ్ జర్నీ మార్కెట్ విలువ
- **45 బిలియన్ డాలర్లు:** 2029 నాటికి క్రూజ్ జర్నీ మార్కెట్ విలువ అంచనా
- **4.5 లక్షలు:** దేశంలో ప్రస్తుతం క్రూజ్ ప్రయాణికుల సంఖ్య
- **5.3 లక్షలు:** ఇప్పటిదాకా కార్డీలియా ఎంప్రెస్‌లో విహరించిన పర్యాటకులు


'కనీస వేతనాల' తీర్పును

4 వారాల్లో అమలుచేయండి

సీఎస్, కార్మిక శాఖలకు హైకోర్టు ఆదేశం



సాక్షి, హైదరాబాద్: కనీస వేతనాలకు సంబంధించి గెజిట్ ప్రింట్ చేయాలని గతంలో తాము ఇచ్చిన ఆదేశాలను 4 వారాల్లో అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. లేనిపక్షంలో సంబంధిత అధికారులంతా హాజరై వివరణ ఇవ్వాల్సి ఉంటుందని హెచ్చరించింది. తదుపరి విచారణ ఏప్రిల్ 11కు వాయిదా వేసింది. ఐదేళ్లకోసారి కనీస వేతనాలను సవరిస్తూ గెజిట్ విడుదల చేయాల్సి ఉండగా, 2007 తర్వాత ఇప్పటివరకు మళ్లీ ఇవ్వలేదని పేర్కొంటూ తెలంగాణ రీజినల్ ట్రేడ్ యూనియన్ కౌన్సిల్ 2023లో పిల్ దాఖలు చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సంఘటిత, అసంఘటిత రంగ కార్మికులకు కనీస వేతనాల పెంపుపై వివిధ ప్రభుత్వ శాఖలు జీవోలు చేసి చేతులు దులుపుకున్నాయని పిటిషన్ తరఫు న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ వాదనలు వినిపించారు. కోటి మందికిపైగా కార్మికులు ప్రభుత్వ చర్యలతో నష్టపోతున్నారని చెప్పారు. వాదనలు విన్న సీజే ధర్మాసనం.. వెంటనే గెజిట్ ప్రింట్ చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, కార్మిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, కార్మిక శాఖ కమిషనర్, ప్రింటింగ్ అండ్ స్టేషనరీ కమిషనర్‌ను ఆదేశిస్తూ 2023లోనే ఉత్తర్వులు జారీచేసింది. 6 వారాలు సమయం ఇచ్చినా అమలు చేయలేదంటూ పిటిషనర్ మరోసారి కోర్టును ఆశ్రయించి.. ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ ఎన్వీ శ్రవణ్‌కుమార్ ధర్మాసనం విచారణ చేపట్టింది.



ట్రిలియన్ డాలర్ల శక్తి మహిళలే!

అదానీ, అంబానీలకు దీటుగా తెలంగాణ మహిళల వ్యాపారం

- పరేడ్ గ్రౌండ్స్‌లో 'ఇందిరా మహిళా శక్తి' కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి
- మహిళలను కోటీశ్వరులుగా మార్చితే బలమైన ఆర్థిక శక్తిగా తెలంగాణ
- మహిళా సంఘాల ఆధ్వర్యంలో సోలార్ పవర్ ప్లాంట్లు..
- ఇందిరా మహిళాశక్తి మిషన్–2025 పాలసీ ఆవిష్కరణ



ఎస్‌హెచ్‌జీలకు చెక్కును అందజేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు పొంగులేటి, సీతక్క, కొండా సురేఖ, ఉత్తమ్, పొన్నం, జూపల్లి తదితరులు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణను ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చగల శక్తి మహిళలేనని.. రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేయడమే ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వం లక్ష్యమని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. మహిళలను కోటీశ్వరులను చేస్తే ప్రపంచంలోనే తెలంగాణ రాష్ట్ర బలమైన ఆర్థిక శక్తిగా ఎదుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం నేపథ్యంలో శనివారం సికింద్రాబాద్ పరేడ్‌గ్రౌండ్స్‌లో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన 'ఇందిరా మహిళా శక్తి'కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. వివరాలు ఆయన మాటల్లోనే..

"తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంలో పదేళ్ల చంద్రగ్రహణంతో మహిళలు చీకటిలోకి నెట్టబడ్డారు. వారు కనీసం మండల కేంద్రంలోని సమాఖ్య కార్యాలయానికి వెళ్లే పరిస్థితి లేకుండా పోయింది. పదేళ్ల పాటు మహిళాభివృద్ధి జాడలేదు. ఇందిరమ్మ ప్రజాప్రభుత్వంతో మహిళలు మళ్లీ వెలుగులోకి వచ్చారు. రాష్ట్ర రాజధాని నగరానికి వచ్చి ఆత్మగౌరవాన్ని చాటే పరిస్థితికి వచ్చారు. జనాభాలో సగభాగం ఉన్న మహిళలకు వడ్డీలేకుండా రుణాలు ఇవ్వడం మొదలు వివిధ ఆర్థిక పురోగతి కార్యక్రమాలతో సరికొత్త ఆర్థిక వ్యవస్థ ఏర్పాటు కోసం రాష్ట్ర ప్రభుత్వం వ్యూహాత్మక ప్రణాళికతో ముందుకు సాగుతోంది. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ విద్యాసంస్థల్లోని విద్యార్థుల కోసం 1.30 కోట్ల యూనిఫారాలు కుట్టే బాధ్యతను మహిళలు విజయవంతం చేశారు. మహిళా సంఘాల ఉత్పత్తులకు అంతర్జాతీయ స్థాయి మార్కెటింగ్ కోసం హైటెక్ సిటీలో మహిళా బజార్ ఏర్పాటు చేశాం. సమావేశాలు ఏర్పాటు చేసుకునేందుకు రూ.25 కోట్లతో మహిళా శక్తి భవనాలు నిర్మిస్తున్నాం.

మహిళలను పారిశ్రామికవేత్తలను చేస్తున్నాం

అదానీ, అంబానీలే కాదు.. తెలంగాణ మహిళలు విద్యుత్ వ్యాపారాన్ని చేయగలరనే ధీమాతో వారికి వెయ్యి మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంట్లు ఏర్పాటు చేయిస్తున్నాం. వారిని పారిశ్రామికవేత్తలను చేస్తున్నాం. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణమే కాకుండా.. ఆర్టీసీకి బస్సులు అద్దెకు ఇచ్చే స్థాయికి తీసుకెళ్తున్నాం. వెయ్యి ఎలక్ట్రిక్ బస్సులను వారి ద్వారా ఆర్టీసీకి అద్దెకు ఇచ్చేలా ఎంఓయూ కుదిర్చాం. రాబోయే రోజుల్లో ప్రతీ మండలంలో మహిళలకు రైస్ మిల్లులు, గోడౌన్స్ నిర్మించే బాధ్యత తీసుకుంటా. మిల్లుల్లో ధాన్యాన్ని బొక్కుతున్న పందికొక్కులకు, దొంగలకు బుద్ధి చెబుతాం. ప్రభుత్వమే మహిళలకు స్థలం ఇస్తుంది, రుణాలు ఇస్తుంది, గోడౌన్స్ నిర్మించండి, వ్యాపారవేత్తలుగా మారండి. మీకు ప్రభుత్వం ఎల్లవేళలా అండగా ఉంటుంది. కార్పొరేట్ కంపెనీలతో పోటీపడేలా మహిళలు వ్యాపారాల్లో ముందుకెళ్లాలి.

మహిళా సంఘాల్లో వయసు సడలింపు..

రాష్ట్రంలోని మహిళా స్వయం సహాయక సంఘాల్లో (ఎస్‌హెచ్‌జీల్లో) 65 లక్షల మంది ఉన్నారు. మేం కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసేందుకు ఎస్‌హెచ్‌జీలలో చేరే నిబంధనలు సడలించాలని నిర్ణయించాం. ప్రస్తుతం 18 ఏళ్ల నుంచి 60 ఏళ్ల మధ్య మహిళలు మాత్రమే సభ్యులుగా ఉన్నారు. ఇకపై 15 ఏళ్ల నుంచి 65 ఏళ్ల మహిళలందరికీ అవకాశం కల్పించేలా నిబంధనలు తెస్తాం.." అని సీఎం రేవంత్ తెలిపారు.

> **బీఆర్‌ఎస్ నేతలది పైశాచిక ఆనందం**
>
> రాష్ట్రంలో ఎలాంటి ప్రమాదం జరిగినా నన్ను తిడుతూ ప్రతిపక్షాలు పైశాచిక ఆనందం పొందుతున్నాయి. టన్నెల్ కూలి కార్మికులు మరణిస్తే సంతోషపడుతున్నారు. రోడ్డు ప్రమాదం జరిగితే నవ్వుతున్నారు. పంటలు ఎండితే బీఆర్‌ఎస్ నేతలు పైశాచిక ఆనందం పొందుతున్నారు. వాళ్ల పైశాచిక ఆనందం కోసం నన్ను తిడుతున్నారు. ప్రజలకు కష్టం వస్తే ఆదుకోవడానికి ప్రయత్నించాలి. పదేళ్ల పాలన అనుభవంతో ప్రభుత్వానికి సూచనలు చేయాలి. కానీ పైశాచిక ఆనందం పొందడం మంచిది కాదు. అలాంటివారు బాగుపడరు.

వడ్డీ లేకుండా రూ.21 వేల కోట్ల రుణాలు: డిప్యూటీ సీఎం భట్టి

రాష్ట్రంలోని స్వయం సహాయక సంఘాల మహిళలకు వడ్డీలేకుండా రూ.21వేల కోట్ల రుణాలు ఇస్తున్నామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. పదేళ్ల పాటు మహిళా సంఘాలకు పైసా సాయం చేయని గత ప్రభుత్వ నేతలు.. ఈరోజు ఎస్‌హెచ్‌జీలకు వడ్డీలేని రుణాలంటే వెకిలిగా నవ్వుతున్నారని మండిపడ్డారు. మహిళా సంఘాల అభివృద్ధి కోసం ప్రభుత్వం సరికొత్త కార్యక్రమాలను తీసుకువస్తోందన్నారు. రాష్ట్రంలో మహిళలు తలెత్తుకుని మహాలక్ష్మిలా గౌరవంగా బతకాలన్నదే ప్రజాప్రభుత్వ ఉద్దేశమని పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో ఆర్థిక మంత్రిగా ఉన్న హరీశ్‌రావు బడితె మాదిరి పెరిగారే తప్ప మహిళలకు కనీసం రుణాలు ఇప్పించలేకపోయారని విమర్శించారు. ప్రజా ప్రభుత్వం ప్రతి రూపాయి పోగేసి ప్రజల సంపద పెరిగేందుకు కృషి చేస్తోందని.. దాన్ని చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు పిచ్చిమాటలు మాట్లాడుతున్నాయని మండిపడ్డారు. అనంతరం మంత్రి సీతక్క మాట్లాడుతూ.. ఇందిరా మహిళా శక్తి కింద ప్రజాప్రభుత్వం 20 రకాల అద్భుత కార్యక్రమాలను అమల్లోకి తీసుకురావడం ఎంతో సంతోషకరమని పేర్కొన్నారు.

'ఇందిరా మహిళా శక్తి' విశేషాలివీ..

- మహిళా సంఘాల ద్వారా ఆర్టీసీకి అద్దెకు ఇవ్వనున్న బస్సులను సీఎం రేవంత్ జెండా ఊపి ప్రారంభించారు.
- కార్యక్రమంలో 2,82,552 స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ)కు రూ.22,794.22 కోట్ల రుణాల చెక్కులను సీఎం అందించారు.
- ఎస్‌హెచ్‌జీ సభ్యులకు రుణబీమా, ప్రమాద బీమా పథకాల కింద రూ.44.80 కోట్ల చెక్కును అందించారు.
- మహిళా స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న సోలార్ ప్లాంట్లకు సీఎం వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు.
- ఇందిరా మహిళాశక్తి మిషన్–2025 పాలసీని సీఎం ఆవిష్కరించారు.
- సభకు ముందు సీఎం రేవంత్, మంత్రులు వివిధ మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కుటీర పరిశ్రమల స్టాళ్లను, మహిళా పెట్రోల్ బంకు నమూనాను పరిశీలించారు.



మహిళా సంఘాల ద్వారా ఆర్టీసీకి అద్దెకు ఇవ్వనున్న బస్సులను ప్రారంభిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్ తదితరులు

ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ పరిశ్రమలకు ప్రోత్సాహం

రైల్వే శాఖ మంత్రి అశ్వినీవైష్ణవ్

- దివిటిపల్లిలో 4 పరిశ్రమలకు శంకుస్థాపన



ఫ్యాక్టరీ శంకుస్థాపన కార్యక్రమంలో కేంద్రమంత్రి అశ్వినీవైష్ణవ్, రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు, ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్యే యెన్నం, గల్లా జయదేవ్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ పరిశ్రమలకు అన్ని విధాలా ప్రోత్సాహం అందిస్తున్నామని కేంద్ర రైల్వే, ఐటీ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి అశ్వినీవైష్ణవ్ అన్నారు. శనివారం మహబూబ్‌నగర్ నగర శివారులోని దివిటిపల్లి ఐటీ పార్కు ఆవరణలో అధునాతన టెక్నాలజీతో రూ.3,225 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు కానున్న నాలుగు పరిశ్రమలకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ.. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యుత్ వాహనాలకు ఎంతో డిమాండ్ ఉందన్నారు. వీటికి అవసరమయ్యే లిథియం అయాన్ గిగా బ్యాటరీలను తయారు చేసే అమరరాజా కంపెనీకి దివిటిపల్లిలో మహిళా దినోత్సవం రోజే శంకుస్థాపన చేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ పరిశ్రమలతో వేలాది మందికి ఉపాధి లభిస్తుందన్నారు. ఈసారి కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు రైల్వేశాఖ పరంగా రూ.5,337 కోట్లు కేటాయించామని, గత పదేళ్ల కంటే ఇది ఆరు రెట్లు ఎక్కువ అని తెలిపారు. అలాగే గత 11 సంవత్సరాల్లో మహిళలకు 10 కోట్ల వంటగ్యాస్ కనెక్షన్‌లు ఇచ్చామని, 14 కోట్ల తాగునీటి కుళాయి కనెక్షన్లు మంజూరు చేశామని, 54 కోట్ల బ్యాంకు ఖాతాలు తెరిపించామని వివరించారు. ఇక్కడి ప్రజల సౌకర్యాన్ని దృష్టిలో పెట్టుకుని దివిటిపల్లి రైల్వే స్టేషన్‌ను ఆధునీకరిస్తామని చెప్పారు. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు మాట్లాడుతూ, తెలంగాణ బ్రాండ్‌ను విశ్వవ్యాప్తం చేస్తామని పేర్కొన్నారు. పారిశ్రామికాభివృద్ధిలో మరింత ముందుకు వెళ్లేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. రాష్ట్రంలో సెమీ కండక్టర్స్, ఇతర పరిశ్రమల అభివృద్ధికి అన్ని విధాలా సహకరించాలని ఆయన అశ్వినీవైష్ణవ్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల, మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రి శంకుస్థాపన చేసిన పరిశ్రమలు ఇవే..

రూ.1,900 కోట్లతో నిర్మించే అమరరాజా గిగా ఫ్యాక్టరీ–1 మూడో దశ యూనిట్, రూ.800 కోట్లతో లిథియం ఫెర్రో ఫాస్ఫేట్ (ఎల్‌ఎఫ్‌పీ) టెక్నాలజీతో బ్యాటరీలు, ఇతర కీలకమైన పదార్థాలను రూపొందించే (అల్ట్‌మిన్ ప్రైవేట్ లిమిటెడ్) ఫ్యాక్టరీ, రూ.502 కోట్లతో చేపట్టే వ్యర్థాల ప్రాసెసింగ్ (లోహమ్ మెటీరియల్స్ ప్రైవేట్ లిమిటెడ్) కంపెనీ, రూ.23 కోట్లతో తలపెట్టిన ప్రత్యేక క్యాన్, క్యాప్‌లను తయారు చేసే (సెల్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్) పరిశ్రమలు ఉన్నాయి.

యాదాద్రి ఎంఎంటీఎస్‌కు

కిషన్‌రెడ్డి అడ్డంకి

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

- రైల్వేశాఖ మంత్రి అశ్వినీవైష్ణవ్‌కి ప్రాజెక్టులపై వినతిపత్రం



అశ్వినీ వైష్ణవ్‌కు వినతి పత్రం అందజేస్తున్న కోమటిరెడ్డి, సీతక్క, కావ్య, చామల కిరణ్

శంషాబాద్: 'నేను ఎంపీగా ఉన్నప్పుడు అనేకమార్లు రైల్వేమంత్రికి చేసిన విన్నపంతో యాదాద్రి వరకు ఎంఎంటీఎస్ మంజూరైంది. కానీ ఆ పనులు ప్రారంభం కాకుండా అడ్డుకుంటున్నది కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డియే. ప్రతి ఆదివారం యాదాద్రికి లక్ష మంది రాకపోకలు సాగిస్తున్నారు'అని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. శనివారం మహబూబ్‌నగర్ పర్యటనకు వచ్చిన రైల్వే మంత్రి అశ్వినీవైష్ణవ్‌ను మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సీతక్క, కొండా సురేఖ, ఎంపీలు కడియం కావ్య, చామల కిరణ్‌కుమార్‌రెడ్డిలు శంషాబాద్ ఎయిర్‌పోర్టులోని లాంజ్‌లో కలసి రైల్వే ప్రాజెక్టులపై వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడారు. వరంగల్ ఎయిర్‌పోర్టు మంజూరు కోసం జీఎంఆర్ సంస్థ అభ్యంతరాన్ని పరిష్కరించి.. వారిని ఒప్పించింది తామేనన్నారు. ఇప్పటికే భూసేకరణ కోసం రూ. 2 వేల కోట్లు కూడా ప్రభుత్వం కేటాయించిందన్నారు. మరో మూడు నెలల్లో కొత్తగూడెం విమానాశ్రయం కూడా మంజూరవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. వరంగల్‌లో రీజినల్ రింగురోడ్డుకు రైల్వేరింగు రోడ్డు కూడా ఏర్పాటు చేసుకునేందుకు రైల్వేమంత్రి అంగీకరించారన్నారు.

సానుకూలంగా స్పందించారు..

తాము చేసిన అన్ని వినతులకు రైల్వే మంత్రి సానుకూలంగా స్పందించారని మంత్రి కొండా సురేఖ తెలిపారు. బీఆర్‌ఎస్ హయాంలో వరంగల్ అభివృద్ధి ఉత్తి మాటలకే పరిమితమైందని మంత్రి సీతక్క విమర్శించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మంత్రులు సీతక్క, కొండా సురేఖ, ఎంపీ కడియం కావ్యను మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

క్లుప్తంగా...

ప్రకటనలు, ప్రసంగాలకే 'మహిళా శక్తి' పరిమితమా?

సర్కారుకు బండి సంజయ్ ప్రశ్న



సాక్షి, హైదరాబాద్ : 'మహిళా శక్తి' అంటే పెద్ద పెద్ద ప్రకటనలు, ప్రసంగాలకే పరిమితం కావడమా అని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మహిళా దినోత్సవం రోజు పత్రికల్లో, టీవీల్లో భారీగా ప్రకటనలివ్వడం కాకుండా దానిని ఆచరణలో చూపాలని, ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలన్నారు. 'అసెంబ్లీ ఎన్నికలపుడు మహిళలకు ప్రతినెలా రూ.2,500లు ఇస్తామన్నారు. తులం బంగారం, స్కూటీ ఇస్తామన్న హామీ నెరవేర్చలేదు. బడ్జెట్లో మహిళా సంక్షేమానికి తగిన నిధులు ఖర్చు చేయడం లేదు. మద్యంతో మహిళల జీవితాలు ఛిద్రమవుతున్నా పట్టించుకోవడం లేదు. అధికారంలోకి వస్తే బెల్టు షాపులు లేకుండా చేస్తామని ఇచ్చిన హామీని గాలికొదిలేశారు'అని మండిపడ్డారు. 'ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోకుండా మహిళా దినోత్సవం నాడు మాత్రమే 'మహిళలను శక్తి'గా మారుస్తామంటూ ఊకదంపుడు ఉపన్యాసాలు, సమావేశాలు పెడితే నమ్మేదెవరు'అని ఓ ప్రకటనలో ఆయన ప్రశ్నించారు. స్త్రీలను గౌరవిస్తూ అభ్యున్నతికి పాటుపడే ఏకైక పార్టీ, రాష్ట్రపతి, ఆర్థిక మంత్రిగా మహిళలకు బాధ్యతలు అప్పగించిన పార్టీ బీజేపీ అని బండి పేర్కొన్నారు.

కోతల రేవంత్.. చేతలు శూన్యం

- మహిళలను కోటీశ్వరులను కాదు.. అప్పులపాలు చేశారు: హరీశ్‌రావు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో మహిళలను కోటీశ్వరులను చేస్తామని చెప్పి కోతలు కోసిన సీఎం రేవంత్‌రెడ్డి, ఏడాదిన్నర పాలనలో చేసింది ఎడతెగని వంచనే అని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. ఇందిరమ్మ రాజ్యంలో మహిళలకు వేదనే మిగిలిందని అన్నారు. మహిళలను కోటీశ్వరులను కాదు కదా.. కనీసం లక్షాధికారులుగా కూడా చెయ్యని చేతగాని సర్కారు ఇది అని శనివారం ఒక ప్రకటనలో దుయ్యబట్టారు. ఏడాదిన్నర పాలనలో మహిళలకు ఏం చేశారని వేడుకలు నిర్వహిస్తున్నారని సీఎంను ప్రశ్నించారు. 'మహిళలకు ఏటా రూ.20 వేల కోట్ల చొప్పున ఐదేళ్లలో రూ.లక్ష కోట్ల వడ్డీ లేని రుణాలు ఇస్తామని ఎన్నికల సమయంలో ఊదరగొట్టారు. కానీ, చేసింది గోరంత, చెప్పుకునేది కొండంత అన్నట్లుగా ఉంది కాంగ్రెస్ ప్రభుత్వ తీరు'అని ఎద్దేవా చేశారు. రూ.5 వేల కోట్ల వడ్డీ లేని రుణ బకాయిలే ఇవ్వలేని ప్రభుత్వం, రూ.లక్ష కోట్ల రుణాలు ఎలా ఇస్తుందని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వ తీరు వల్ల మహిళలు కోటీశ్వరులు కాదు, అప్పుల పాలయ్యే పరిస్థితి వచ్చిందని విమర్శించారు. ప్రభుత్వం చేసిన మోసానికి మహిళలకు సీఎం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర అప్పు రూ.4.17 లక్షల కోట్లు మాత్రమేనని, అప్పుల పేరు చెప్పి ఇంకెన్నాళ్లు తప్పించుకు తిరుగుతారని నిలదీశారు.


సబితారెడ్డికి అస్వస్థత



ములుగు(గజ్వేల్): బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి సబితారెడ్డి అస్వస్థతకు గురయ్యారు. సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం ఎర్రవల్లిలోని ఫామ్‌హౌస్‌లో ఈ నెల 7న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్.. పార్టీ కీలక నేతలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో నిర్వహించిన సమావేశంలో సబితారెడ్డి కూడా పాల్గొన్నారు. భోజనం తర్వాత రాత్రి 11 గంటలకు ఉన్నట్టుండి ఆమె అస్వస్థతకు గురయ్యారు. వెంటనే బీఆర్ఎస్ శ్రేణులు ములుగు మండలం లక్ష్మక్కపల్లి ఆర్‌వీఎం ఆస్పత్రికి ఆమెను తరలించారు. వైద్య పరీక్షల తర్వాత సబిత జీర్ణ సంబంధిత సమస్యతో బాధపడుతున్నట్లు ఆస్పత్రి వైద్యులు గుర్తించి చికిత్స అందించారు. అనంతరం కోలుకున్న సబితను తెల్లవారుజామున 3 గంటలకు డిశ్చార్జ్ చేయడంతో.. ఆమె హైదరాబాద్‌కు వెళ్లిపోయారు. సబిత ఆరోగ్య పరిస్థితి గురించి కేసీఆర్ అడిగి తెలుసుకున్నట్లు సమాచారం.

నాపై నిరాధార ఆరోపణలు

- సోషల్‌మీడియా పోస్టులపై మహిళా కమిషన్‌కు కల్పన ఫిర్యాదు



బన్సీలాల్‌పేట్: ప్రముఖ గాయని కల్పన శనివారం తెలంగాణ మహిళా కమిషన్ చైర్మన్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. తనపై సోషల్ మీడియాలో వస్తున్న అసత్య ప్రసారాలని ఆపాలని కోరారు. సికింద్రాబాద్ బుద్ధభవన్‌లోని తెలంగాణ మహిళా కమిషన్ కార్యాలయానికి వచ్చిన ఆమె.. చైర్మన్ నేరెళ్ల శారదను కలిసి ఫిర్యాదు చేశారు. వాస్తవాలు తెలుసుకోకుండా నిరాధారమైన ఆరోపణలు చేస్తూ సోషల్ మీడియా వేదికగా పోస్టులు పెట్టకుండా చూడాలని విజ్ఞప్తిచేశారు. తాను ఆత్మహత్యకు పాల్పడలేదని నిద్రమాత్రల మోతాదు ఎక్కువ కావడంతో అపస్మారకస్థితిలోకి వెళ్లినట్లు చెప్పారు. కొన్ని యూట్యూబ్ చానల్స్ తాను ఆత్మహత్య చేసుకున్నానని వీడియోలతో అసత్య ప్రచారాలు చేస్తున్నాయని కల్పన అసహనం వ్యక్తంచేశారు. కాగా, కల్పనపై అసత్య ప్రచారాలు చేసిన వారిపై చర్యలు తీసుకుంటామని శారద హామీ ఇచ్చారు.

క్రమశిక్షణతో మెలగాలి.. ఉన్నత లక్ష్యంతో సాగాలి..

గురుకుల విద్యార్థినులకు వివిధ రంగాల ప్రముఖులు, నిపుణుల దిశానిర్దేశం

మహిళా దినోత్సవం సందర్భంగా ప్రముఖుల ప్రసంగాలను వింటున్న గురుకుల విద్యార్థినిలు



సమయాన్ని వృథా చేసుకోవద్దు..

మహిళా దినోత్సవం సందర్భంగా సాంఘిక సంక్షేమ గురుకులాల్లో ప్రత్యేక కార్యక్రమం

జూమ్ మీటింగ్ ద్వారా విద్యార్థినుల్లో స్ఫూర్తి నింపే ప్రయత్నం

సమాజంలో ఒత్తిడులను ఎదుర్కొని విజయవంతమైన మహిళగా ఎదగాలంటే ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలంటూ గురుకుల విద్యార్థినులకు పలు రంగాల నిపుణులు, ప్రముఖులు మనోనిబ్బరం నింపారు. నవ్వుతూ, సంతోషంగా ఉండే ప్రయత్నం చేయాలని.. సమయాన్ని వృథా చేయకుండా క్రమశిక్షణతో మెలగాలని దిశానిర్దేశం చేశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ (టీజీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్) కార్యదర్శి అలగు వర్షిణి ఆధ్వర్యంలో విద్యార్థినులకు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. జూమ్ మీటింగ్ ద్వారా పలువురు ప్రముఖులు సలహాలు, సూచనలు ఇచ్చారు. రాష్ట్రంలోని అన్ని గురుకుల బాలికల పాఠశాలలు, కళాశాలల విద్యార్థినులు ఇందులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నిపుణులు, ప్రముఖులు చెప్పిన అంశాలు, సూచనలివీ.. -సాక్షి, హైదరాబాద్

మంచి నిర్ణయం తీసుకోవాలంటే ఇబ్బందులు తప్పవు



ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సమయంలో ఇక్కడ ఒక ఈ-సిగరెట్ కంపెనీ స్థాపించడానికి ఎన్నో ప్రయత్నాలు జరిగాయి. పాలకులను, అధికార యంత్రాంగాన్ని సమన్వయపరచి ఆ కంపెనీ నెలకొల్పకుండా చేశాను. ఒకవేళ ఆ కంపెనీ నెలకొల్పి ఉంటే ఎంతోమంది అనారోగ్యాల బారినపడేవారు. ఒక మంచి నిర్ణయం తీసుకోవాలంటే ఎన్నో కష్టాలు, ఇబ్బందులు ఉంటాయి. 'బేటీ బచావో.. బేటీ పడావో, ఆయుష్మాన్ భవ'వంటి వినూత్న కార్యక్రమాలను దేశ ప్రజలకోసం ప్రవేశపెట్టే ఒక గొప్ప అవకాశం నాకు లభించింది. దేశం కోసం, ప్రజల కోసం, పేద ప్రజల కోసం ఉన్నతంగా ఆలోచిస్తే మన మదిలో ఇంకా ఎన్నో మంచి ఆలోచనలు, పథకాలు పుట్టుకొస్తాయి.

– ప్రీతి సుదాన్, యూపీఎస్సీ చైర్మన్

సంతోషంగా ఉండాలి, ఆరోగ్యాన్ని చక్కగా చూసుకోవాలి



మన ముఖంలో చిరునవ్వుతో, సంతోషంగా ఉండాలి. ఎప్పుడూ ఏదో కోల్పోయినట్టుగా ఉండొద్దు. మన ముఖంలో నవ్వు లేకపోతే ఇతరులు కూడా మనతో అలాగే ఉంటారు. సాధారణ ప్రభుత్వ స్కూళ్లతో పోల్చితే గురుకులాల్లో మెరుగైన సౌకర్యాలు ఉన్నాయి. సమయాన్ని వృథా చేసుకోకుండా ఉన్నతంగా రాణించేలా లక్ష్యాన్ని ఎంచుకోవాలి. దానిని చేరుకునేలా ముందుకు వెళ్లాలి.

– ఛాయా రతన్, రిటైర్డ్ ఐఏఎస్

సమయం వృథా చేసుకోవద్దు

ప్రస్తుతం మెడికల్ సీటు సాధించాలంటే చాలా కష్టపడాలి. నీట్ కోచింగ్‌కు లక్షల రూపాయలు వసూలు చేస్తున్నారు. అదే ప్రభుత్వం నెలకొల్పిన గురుకులాల్లో చక్కటి తర్ఫీదు ఇస్తున్నారు. నేను కూడా గౌలిదొడ్డి కళాశాలలో చదివాను. ఆ రోజుల్లో కేవలం సబ్జెక్టు పుస్తకాలను చదివి ర్యాంకు సాధించాను. ఇప్పుడు లైబ్రరీలు, డిజిటల్ రూపంలో పూర్తిస్థాయిలో మెటీరియల్ లభిస్తోంది. సమయాన్ని ఎట్టి పరిస్థితుల్లో వృథా చేయవద్దు. క్రమశిక్షణతో ఉండాలి. ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల పట్ల సత్ప్రవర్తనతో ఉండాలి.

– డాక్టర్ శిరీష, ఎండి (మెడిసిన్) స్విమ్స్, తిరుపతి

మన జీవితాన్ని మనమే తీర్చిదిద్దుకోవాలి



మన జీవితం ఒక తెల్ల కాగితం వంటిది. అందులో ఎంత చక్కగా చిత్రాన్ని గీస్తే అంత అద్భుతంగా, అందంగా ఉంటుంది. మన జీవితం కూడా అంతే. మన జీవితాన్ని మనమే తీర్చిదిద్దుకోవాలి. కోవిడ్ సమయంలో 21వేల కాల్ సెంటర్లు పెట్టి, వేల మంది ప్రజల జీవితాలను కాపాడేలా పనిచేయడం ఎంతో సంతృప్తినిచ్చింది.

– అలగు వర్షిణి, కార్యదర్శి, టీజీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్

భయం వదిలితేనే విజయం

చాలా మంది భయంతో ఏ పనిలోనూ ముందుకు వెళ్లలేరు. భయాన్ని వీడితే ఎన్నో విజయాలు సాధించవచ్చు. విద్యార్థుల్లో భయమే వారి చదువులో వెనుకబాటు తనానికి కారణం.'అన్నారు. భయాన్ని వీడేందుకు పలు చిత్రాలను ఆమె ప్రదర్శించారు. ఈ చిత్రాలను వీక్షించిన విద్యార్థులకు ఎంతో స్ఫూర్తిదాయకంగా నిలిచింది.

– డాక్టర్ గీతా చల్ల, చైల్డ్ అండ్ అడోలసెంట్ సైకాలజిస్ట్

శక్తి వంచన లేకుండా కృషి చేస్తే విజయం తథ్యం

చదువుతోపాటు క్రీడలు కూడా నాకు ఎంతో ఇష్టం. క్రీడాకారిణిగా అంతర్జాతీయ స్థాయికి చేరుకున్నా. ఇప్పటివరకు 42 పతకాలను సాధించాను. రానున్న ఏషియన్ గేమ్స్‌లో బంగారు పతకం సాధిస్తానన్న విశ్వాసం ఉంది. విద్యార్థులను ప్రోత్సహించే అధ్యాపకులకు, కోచ్‌లకు, తల్లిదండ్రులకు నా కృతజ్ఞతలు.

– అగసారా నందిని, అంతర్జాతీయ క్రీడాకారిణి, బుధేల్ టీజీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్ డిగ్రీ కళాశాల, సంగారెడ్డి జిల్లా

అసెంబ్లీలో మహిళలకు 33 శాతం సీట్లు వస్తాయి

- ఆ రోజు త్వరలోనే వస్తుంది: సీఎం రేవంత్
- చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీలో రూ.535 కోట్లతో నిర్మించనున్న భవనాలకు శంకుస్థాపన చేసిన ముఖ్యమంత్రి
- ఈ నిర్మాణాలను స్వయంగా తానే పర్యవేక్షిస్తానని వెల్లడి



భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో మంత్రి పొన్నం, జీహెచ్‌ఎంసీ మేయర్ విజయలక్ష్మి

సుల్తాన్‌బజార్ (హైదరాబాద్): అసెంబ్లీ ఎన్నికల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే రోజు త్వరలోనే వస్తుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. మహిళలు అంటే వంటింటి కుందేళ్లు కాదని, వారు వ్యాపారవేత్తలుగా రాణించేలా కృషి చేస్తామని తెలిపారు. రూ.535 కోట్లతో చేపడుతున్న వీరనారి చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీ భవనాల నిర్మాణానికి సీఎం రేవంత్‌రెడ్డి శనివారం శంకుస్థాపన చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో ప్రసంగించారు. విద్యార్థులకు, అధ్యాపకులకు మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

మహిళలను వ్యాపారవేత్తలను చేస్తాం..

"మీ అన్నగా ఆడబిడ్డలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం పథకాన్ని అమలు చేశాం. స్వయం సహాయక సంఘాలను ప్రోత్సహించి వారికి పాఠశాలల నిర్వహణ బాధ్యత అప్పగించాం. చట్టసభల్లో మహిళలు అడుగుపెడతారు. అసెంబ్లీలో 33శాతం సీట్లు మహిళలకు వచ్చే రోజు వస్తుంది. ఆడబిడ్డలు వంటింటి కుందేళ్లు కాదు. వారు వ్యాపారవేత్తలుగా రాణించేలా కృషి చేస్తాం. అదానీ, అంబానీలతో మహిళలు పోటీపడేలా కార్యాచరణ తీసుకుంటున్నాం.."అని సీఎం రేవంత్ తెలిపారు. మహిళా యూనివర్సిటీకి ఐలమ్మ పేరు పెట్టుకోవడం తెలంగాణకు గొప్పకీర్తి అని, అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో ఈ యూనివర్సిటీ భవనాలను నిర్మిస్తున్నామని వెల్లడించారు.

నిర్మాణాన్ని నేనే పర్యవేక్షిస్తా..

రెండున్నరేళ్లలో మహిళా యూనివర్సిటీ భవన నిర్మాణాలు పూర్తికావాలని అధికారులను సీఎం ఆదేశించారు. నిధులకు ఇబ్బంది లేకుండా చూసుకునే బాధ్యత తనదని, తాను స్వయంగా నిర్మాణ పర్యవేక్షణ చేస్తానని తెలిపారు. ఇక్కడి విద్యార్థులు చదువుల్లో రాణించి రాష్ట్రానికి, దేశానికి పేరు తీసుకురావాల్సిన బాధ్యత ఎంతైనా ఉందన్నారు. అంతర్జాతీయ స్థాయి యూనివర్సిటీలతో ఈ యూనివర్సిటీ పోటీపడాలని.. మహిళల కోసం రిజర్వేషన్లు తెచ్చిన మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ కలలను నిజం చేయాలని పిలుపునిచ్చారు.

అసిస్టెంట్ ప్రొఫెసర్లను క్రమబద్ధీకరించండి: అసదుద్దీన్

పాఠశాలలు, కాలేజీల్లో ముస్లిం విద్యార్థినులు తక్కువగా ఉన్నారని, వారి సంఖ్య పెరగాల్సి ఉందని హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ పేర్కొన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు యూనివర్సిటీలలో అసిస్టెంట్ ప్రొఫెసర్లను క్రమబద్ధీకరించాలని విజ్ఞప్తి చేశారు. రేవంత్‌రెడ్డి డైనమిక్ సీఎం అని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, హైదరాబాద్ మేయర్ గద్వాల విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతతోపాటు అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సీఐఐ వార్షిక సదస్సులో సైయంట్ చైర్మన్ బీవీ మోహన్‌రెడ్డి, ఆర్.శివప్రసాద్‌రెడ్డి, గౌతమ్‌రెడ్డి మీరెడ్డి తదితరులు

మానవ మేధనే అన్నిటికన్నా గొప్పది

- సైయంట్ చైర్మన్ బీవీ మోహన్‌రెడ్డి
- సీఐఐ తెలంగాణ చైర్మన్‌గా ఆర్.శివప్రసాద్‌రెడ్డి ఎన్నిక

సాక్షి, హైదరాబాద్: కృత్రిమ మేధ, జనరేటివ్ ఏఐ కంటే మానవ మేధనే గొప్పదని సైయంట్ చైర్మన్, సీఐఐ దక్షిణ ప్రాంత మాజీ చైర్మన్ బీవీ మోహన్‌రెడ్డి అన్నారు. ఒక ట్రిలియన్ ఎకానమీగా తెలంగాణ రాష్ట్రం ఎదగడానికి అన్నిపక్షాల భాగస్వాములు చురుకైన పాత్ర పోషించాల్సిన అవసరం ఉందని ఆయన పిలుపునిచ్చారు. శనివారం జరిగిన వార్షిక సదస్సులో సీఐఐ తెలంగాణ రాష్ట్ర నూతన చైర్మన్‌గా ఆర్.శివప్రసాద్‌రెడ్డి, వైస్ చైర్‌పర్సన్‌గా గౌతమ్‌రెడ్డి మీరెడ్డి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా 'తెలంగాణ సుస్థిర అభివృద్ధి–ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదిగేలా నిర్మించడం' అనే అంశంపై చర్చాగోష్టి నిర్వహించారు. ఇందులో బీవీ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. పరిశోధన, అభివృద్ధి కోసం పరిశ్రమలు, విద్యా వ్యవస్థతో కలసి చురుకుగా ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందని అన్నారు. నిర్ణయాలు తీసుకోవడంలో ఏఐ, జెన్ ఏఐ కంటే మానవ మేధస్సు కీలక భూమిక పోషిస్తుందని అని అన్నారు.

క్లీన్ ఎనర్జీనే కీలకం..

వినూత్న ఆవిష్కరణలకు గ్లోబల్ కేపబులిటీ సెంటర్‌లు కేంద్రంగా నిలుస్తున్నాయని ఎర్నెస్ట్ యంగ్ ఇండియా మేనేజింగ్ పార్టనర్ రోహన్ సచ్‌దేవ్ అన్నారు. సుస్థిర అభివృద్ధికి క్లీన్ ఎనర్జీ ఎంతో కీలకమని, ఆ దిశగా తెలంగాణ ప్రభుత్వం ముందడుగు వేస్తోందని తెలిపారు. సీఐఐ దక్షిణ ప్రాంత చైర్‌పర్సన్ డాక్టర్ ఆర్.నందిని మాట్లాడుతూ.. ఆర్థిక పురోగతికి మౌలిక సదుపాయాలు కీలకమని పేర్కొన్నారు. రాష్ట్రం వేగంగా అభివృద్ధి చెందడంలో ప్రపంచస్థాయి పారిశ్రామిక వాడలు, రోబస్ట్ అర్బన్ ప్లానింగ్, ఫార్మా సిటీ, మొబిలిటీ వ్యాలీ ఎంతో దోహదపడుతున్నాయని వ్యాఖ్యానించారు. సీఐఐ తెలంగాణ చైర్మన్ సాయి డి.ప్రసాద్ మాట్లాడుతూ తెలంగాణ ఒక ట్రిలియన్ ఎకానమీగా రూపాంతరం చెందడం అసాధ్యమేమీ కాదని అన్నారు. పెద్ద ఎత్తున దేశీయ, విదేశీ పారిశ్రామికవేత్తల నుంచి పెట్టుబడులు సాధించడమేకాక, ఎంతో విలువైన పరిశ్రమలు వస్తున్నాయని పేర్కొన్నారు. ఎలికో లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ వనితా దాట్ల మాట్లాడుతూ ఒక ట్రిలియన్ డాలర్ల ఎకానమీని సాధించడానికి అన్ని వర్గాలు సహకరిస్తే అసాధ్యం ఏమీ కాదని అన్నారు.

మహిళల త్యాగం మహోన్నతమైంది: కేసీఆర్



సాక్షి, హైదరాబాద్: కుటుంబ వ్యవస్థను ముందుకు నడపడంలో మహిళల త్యాగం మహోన్నతమైందని బీఆర్ఎస్ అధినేత కె.చంద్రశేఖర్‌రావు తెలిపారు. శనివారం ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర మహిళలకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా విడుదల చేసిన ప్రకటనలో స్త్రీశక్తిని కొనియాడారు. దేశ సంపదను సృష్టించడంలో మహిళల పాత్ర గొప్పదని, ఎన్నో కష్టాలను అధిగమిస్తూ పురుషుడితో సమానంగా నేటి సమాజంలో స్త్రీ పోషిస్తున్న పాత్ర అమోఘమని తెలిపారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్ర మహిళాభ్యున్నతి కోసం అమలు చేసిన పలు కార్యక్రమాలు వారి సాధికారతకు దోహదం చేశాయని కేసీఆర్ గుర్తు చేశారు. మహిళల ఆరోగ్యం, సంరక్షణ, సంక్షేమంతో పాటు మహిళలు కేంద్రంగానే పథకాలను అమలు చేశామని కేసీఆర్ తెలిపారు. తెలంగాణ ప్రగతిలో మహిళలను నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం భాగస్వామ్యం చేసిందన్నారు. అదే స్ఫూర్తిని కొనసాగిస్తూ మహిళా సాధికారతకు ప్రాధాన్యతనివ్వాలన్నారు. మహిళలను మరింత శక్తివంతంగా తీర్చిదిద్దడం ద్వారానే తెలంగాణ అభివృద్ధి ముందుకు సాగుతుందని కేసీఆర్ పేర్కొన్నారు.

'ఫిట్ ఇండియా' సైకిల్ ర్యాలీ



సైకిల్ ర్యాలీలో పాల్గొన్న కేంద్ర మంత్రి మన్‌సుఖ్ మాండవీయ

నందిగామ: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని కన్హా శాంతివనంలో శనివారం 'ఫిట్ ఇండియా'సైకిల్ ర్యాలీ నిర్వహించారు. కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ ర్యాలీని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని, నిత్యం సైక్లింగ్, ధ్యానం, వ్యాయామం చేయాలని సూచించారు. కార్యక్రమంలో పలు రాష్ట్రాలకు చెందిన క్రీడా శాఖ మంత్రులు, ప్రభుత్వ అధికారులు, ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు గోపీచంద్ తదితరులు పాల్గొన్నారు.

అప్పుల సాకుతో హామీలకు పాతర

- రాష్ట్ర అప్పులపై సీఎం పచ్చి అబద్ధాలు
- మీరు హామీలిచ్చి మమ్మల్ని అమలుచేయాలంటే ఎలా?
- డీలిమిటేషన్‌పై స్టాలిన్, రేవంత్‌లవి బోగస్ మాటలు
- కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి



మహిళా దినోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర అప్పులపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి విమర్శించారు. అప్పుల సాకు చూపి ఎన్నికల హామీలను ఎగ్గొట్టే పథకం వేశారని ఆరోపించారు. కిషన్‌రెడ్డి శనివారం మీడియాతో మాట్లాడారు. రాష్ట్రానికి రూ.7.50 లక్షల కోట్ల అప్పు ఉందని సీఎం గతంలో అనేకమార్లు చెప్పారు. ఇటీవల ఢిల్లీలో ఓ సమావేశంలో మాట్లాడిన ఆయన.. తాను సీఎం అయ్యాక కూడా రూ.3.5 లక్షల కోట్ల అప్పే ఉందని అనుకున్నట్లు చెప్పారు. ఇప్పుడు అప్పుల పేరు చెప్పి హామీల అమలుపై చేతులెత్తేశారు'అని ధ్వజమెత్తారు.

బీజేపీకి తెలంగాణ ప్రయోజనాలే ముఖ్యం

బీజేపీకి తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యమని కిషన్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి రాష్ట్ర ప్రయోజనాలు ప్రధానం కానందువల్లే గ్యారంటీలు అమలు చేయకుండా సాకులు వెతుకుతున్నారని ఆరోపించారు. ఇష్టారీతిన హామీలిచ్చి, పథకాలు ప్రకటించి.. వాటిని కేంద్రం పూర్తిచేయాలంటే ఎలా కుదురుతుందని ప్రశ్నించారు. 'తెలంగాణలో ప్రభుత్వ ఏర్పాటుపై మాకేమీ తొందరలేదు. వన్ నేషన్ వన్ ఎలక్షన్ ద్వారా వచ్చే ఎన్నికల్లోనే రాష్ట్రంలో అధికారంలోకి వస్తాం'అని ప్రకటించారు. కాజీపేట్ కోచ్ ఫ్యాక్టరీ వచ్చే ఏడాది నుంచి ఉత్పత్తి ప్రారంభిస్తుందని చెప్పారు.

జాతీయ రహదారిగా ట్రిపుల్‌ఆర్

ప్రతిపాదిత రీజినల్ రింగ్‌రోడ్డు (ట్రిపుల్‌ఆర్)ను జాతీయ రహదారిగా గుర్తించాలని కేంద్ర ఉపరితల రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీని కోరినట్లు కిషన్‌రెడ్డి తెలిపారు. 'తెలంగాణలో రూ.6,280 కోట్ల ఖర్చుతో 285 కి.మీ. మేర 10 జాతీయ రహదారుల నిర్మాణం పూర్తయింది. వీటిని పార్లమెంటు సమావేశాల తర్వాత గడ్కరీ ప్రారంభిస్తారు. రూ.961 కోట్లతో 51 కి.మీ. రోడ్డు పనులకు త్వరలోనే శంకుస్థాపన చేస్తారు. ట్రిపుల్ ఆర్ ఉత్తర భాగంపై గడ్కరీతో చర్చించాను. రూ.18,772 కోట్లతో ఈ రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేశాం. ఈ రోడ్డు విషయంలో ఇంకా మూడు పనులు జరగాల్సి ఉంది. పీపీపీ అప్రయిజల్ కమిటీ, కేంద్ర కేబినెట్ ఆమోదం కోసం నోట్, నిధులకు సంబంధించి త్రైపాక్షిక ఒప్పందం జరగాలి. దీనికి త్వరలోనే కేబినెట్ ఆమోదం తెలిపే అవకాశం ఉంది'అని కిషన్‌రెడ్డి వివరించారు. పెండింగ్ రహదారుల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం వెంటనే భూ సేకరణ జరిపి అప్పగించాలని కోరారు. వరంగల్ విమానాశ్రయానికి రాష్ట్ర ప్రభుత్వం ఇంకా మొత్తం భూమి ఇవ్వలేదని చెప్పారు. నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణపై రేవంత్‌రెడ్డి, తమిళనాడు సీఎం స్టాలిన్ తప్పుడు ప్రచారం చేస్తున్నారని కిషన్‌రెడ్డి ఆరోపించారు. జనాభా తగ్గినా తెలంగాణలో కానీ.. దక్షిణాదిలో ఏ రాష్ట్రంలో కానీ ఒక్క ఎంపీ సీటు కూడా తగ్గదని స్పష్టంచేశారు.

ఒక దేశం-ఒక ఎన్నిక దేశ భవిష్యత్ ఎజెండా

తెలంగాణలో 'వన్ నేషన్ – వన్ ఎలక్షన్'పై రాజకీయాలకు అతీతంగా చర్చలు నిర్వహించాలని బీజేపీ రాష్ట్ర నాయకత్వం నిర్ణయించింది. ఈ అంశంపై స్వచ్ఛంద సంస్థలు, విద్యార్థులు, యువత నుంచి సంతకాల సేకరణ నిర్వహించాలని తీర్మానించింది. త్వరలో జరగబోయే స్థానిక ఎన్నికలను పార్టీ యంత్రాంగం ప్రతిష్టాత్మకంగా తీసుకుని పనిచేయాలని శనివారం జరిగిన సమావేశంలో ముఖ్యనేతలు దిశానిర్దేశం చేశారు. ఒకదేశం–ఒక ఎన్నిక అనేది బీజేపీ ఎజెండా కాదని దేశ భవిష్యత్ ఎజెండా అని ఈ సందర్భంగా కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. వివిధ రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు ఒకసారి, పార్లమెంట్ ఎన్నికలు మరో సారి జరగడం వల్ల రాజకీయ పార్టీలు, అధికార యంత్రాంగం, ప్రజల సమయం వృథా అవుతోందని.. పాలన, అభివృద్ధి, సంక్షేమం వంటి అంశాలపై దృష్టి సారించడానికి వీలులేకుండా పోతోందని అన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో వన్‌నేషన్ – వన్ ఎలక్షన్‌పై నిర్వహించిన ఈ అవగాహన సమావేశంలో పార్టీ జాతీయ ప్రధానకార్యదర్శి, రాష్ట్ర ఇన్‌చార్జి సునీల్ బన్సల్, రాష్ట్ర సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ తివారీ, ఎంపీ ఈటల రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.



మహిళా దినోత్సవంలో విజయ సంకేతం చూపుతున్న ఎమ్మెల్సీ కవిత

మహిళలు ఐకమత్యంతో హక్కులు సాధించుకోవాలి

- మహిళలకు కులమతాలు లేవు
- అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో ఎమ్మెల్సీ కవిత

సాక్షి, హైదరాబాద్: మహిళలు ఐక్యంగా ఉండి తమ హక్కులు సాధించుకోవాలని, సమాజం ఎదుగుదలలో మహిళల పాత్ర కీలకమని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. శనివారం తెలంగాణ భవన్‌లో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కవిత మాట్లాడుతూ, మహిళా రిజర్వేషన్ల చట్టాన్ని అమలు చేయకపోవడంతో మహిళలు రాజకీయంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతీ మహిళకు రూ 2,500 ఇస్తామన్న హామీని అమలు చేసే వరకు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వెంటాడుతామని, మహిళా సంఘాల ద్వారా అద్దెకు తీసుకుంటున్న బస్సులకు ఆర్టీసీ సకాలంలో కిరాయి చెల్లిస్తుందా లేదా? అన్నదానిపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. మహిళల కోసం కేసీఆర్ అనేక పథకాలు, కార్యక్రమాలు చేపట్టారని, అయితే ఆయన తెచ్చిన పథకాలను తీసేసే కర్ణాటక ప్రభుత్వం రాష్ట్రంలో ఉందని ధ్వజమెత్తారు. చిట్యాల ఐలమ్మ, రాణి రుద్రమదేవి వంటి వీర మహిళలు తెలంగాణ గడ్డపై పుట్టడం మనకు గర్వకారణమన్నారు. మహిళలకు కులమతాలు లేవని, మహిళలది ఒకే కులమని అన్నారు. కాగా, అమెరికాలో 40 శాతం మంది మహిళలు ఉద్యోగాలు చేస్తుంటే భారత్‌లో మాత్రం అది 17 శాతంగానే ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. భూగర్భ గనుల్లో పనిచేయడం నుంచి అంతరిక్షంలోకి వెళ్లే వరకు మహిళలు ఎదగాలని కవిత ఆకాంక్షించారు.



నీకు హాని చేయనివానితో నిర్నిమిత్తముగా జగడ మాడవద్దు.
– క్రైస్తవ ధర్మం

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం,
ఉత్తరాయణం.శిశిర ఋతువు
ఫాల్గుణ మాసం, **తిథి:** శు.దశమి ఉ.10.46 వరకు తదుపరి ఏకాదశి, **నక్షత్రం:** పునర్వసు రా.2.16 వరకు, తదుపరి పుష్యమి,
వర్జ్యం: ప.2.28 నుండి 4.00 వరకు,
దుర్ముహూర్తం: సా.4.34 నుండి 5.22 వరకు, **అమృత ఘడియలు:** రా.12.01 నుండి 1.36 వరకు.

సూర్యోదయం : 6.17
సూర్యాస్తమయం : 6.04
రాహుకాలం : సా.4.30 నుంచి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుంచి 1.30 వరకు

మణిశంకర్ అయ్యర్ (కాంగ్రెస్)

రాయని డైరీ

మాధవ్ శింగరాజు

స్నేహంలో ఎదగాలి కానీ, స్నేహాలతో ఎదగకూడదు.

"ఎదగటానికి కాకపోతే ఇంకెందుకు స్నేహాలు?!" అనే వాళ్లకు నేను ఒకటే చెబుతాను. స్నేహాన్ని నిచ్చెనగా చేసుకొని ఎదగటమంత పతనం వేరే ఇంకేదీ ఉండదు.

రాజీవ్ నన్ను రాజకీయాల్లోకి ఆహ్వానించినప్పుడు మొదట నేను అదే ఆలోచించాను.

ఇద్దరం డూన్ స్కూల్లో స్నేహితులం. కేంబ్రిడ్జ్ యూనివర్సిటీలో స్నేహితులం. తను ఇంపీరియల్ కాలేజీకి మారిపోయాక కూడా స్నేహితులమే. నేను ఇండియన్ ఫారిన్ సర్వీసులో చేరినప్పుడు; శ్రీమతి గాంధీ గవర్నమెంట్‌లో, ఆ తర్వాత రాజీవ్ ప్రభుత్వంలో జాయింట్ సెక్రెటరీగా ఉన్నప్పుడు కూడా రాజకీయాలు అంటని స్నేహం మాత్రమే మా మధ్య ఉంది. రాజీవ్ రమ్మంటున్నారు కదా అని వెళితే, స్నేహాన్ని నిచ్చెనగా వేసుకోవటమే అవుతుంది. ఆ మాటే రాజీవ్‌తో అన్నాను.

"మీకు నిచ్చెన వేస్తానని అనటం లేదు మణీజీ. కేబినెట్‌కు మీరొక నిచ్చెన అయితే బాగుంటుందని మాత్రమే అడుగుతున్నాను" అన్నారు రాజీవ్.



రాజీవ్ అలా నాతో ఒక రాజనీతిజ్ఞుడిగా మాట్లాడటం అదే తొలిసారి!

నాకనిపించింది, శ్రీమతి గాంధీ చనిపోయిన రోజు సాయంత్రం కాదు రాజీవ్ ఈ దేశానికి ప్రధాని అయింది. ఇదిగో ఇలా ఒడుపుగా మాట్లాడటం నేర్చుకున్నాకేనని!

కేంబ్రిడ్జ్‌లో మార్క్సిస్ట్ సొసైటీ ఉండేది. అందులో నేను మెంబర్‌ని. నన్ను కలవటానికి రాజీవ్ అక్కడికి వస్తుండేవారు. తను నాకంటే రెండేళ్లు జూనియర్. స్టూడెంట్స్ యూనియన్‌కు నేను ప్రెసిడెంట్‌గా కంటెస్ట్ చేసినప్పుడు నాకు సపోర్ట్‌గా ఉన్నారు. ఆయన మాట... రాలు పూల తోటలా ఉండేది. కచ్చితంగా ఆయన వల్ల నాకు కొన్ని ఓట్లయితే పడి ఉంటాయి.

బహుశా నేను స్టూడెంట్స్ యూనియన్ ప్రెసిడెంట్‌గా గెలిచి ఉంటే ఆ హుషారుతో రాజీవ్ రాజకీయాల్లోకి ల్యాండ్ అయ్యేవారా?! లేదు. తల్లి మరణం ఆ పైలట్ తలపై పెట్టి వెళ్లిన కిరీటం ఈ రాజకీయం. కిరీటాన్ని దించ కూడదు. కిరీటానికి తలవంపులూ తేకూడదు.

ఆ సాయంత్రం – శ్రీమతి గాంధీ హత్యకు గురైన రోజు సాయంత్రం... కొత్త ప్రధాన మంత్రిగా జాతిని ఉద్దేశించి రాజీవ్ మాట్లాడవలసి వచ్చింది. కెమెరాలు ఆయన ముందు గుమికూడాయి. పది మాటలకు పన్నెండుసార్లు తడబడ్డారు రాజీవ్!

కానీ, కొద్దిరోజుల్లో ఆ తడబాటు!

రాజీవ్‌కు మాటలు, చేతలు వచ్చేశాయి! పడుతూ లేస్తూనే వెళ్లి దేశ ప్రజలకు దగ్గరయ్యారు. ఆఖరికి – శ్రీమతి గాంధీని నిరంతరం విమర్శిస్తూ ఉండటమే పనిగా పెట్టుకున్న అరుణ్ శౌరి కూడా రాజీవ్ మీద నుంచి చూపు మరల్చుకోలేక పోయారు!

రాజీవ్ వెళ్లిపోయి 34 ఏళ్లు. నేను కాంగ్రెస్‌లోనే ఉండి పోయి 36 ఏళ్లు. ఈ 83 ఏళ్ల వయసులో నా స్నేహితుడు రాజీవ్ గురించి నేను ఏం చెబుతాను? రాజకీయ ధురంధరుడు అనా? అలా చెబితే అది జ్ఞాపకం అవుతుందా? "కాలేజీలో రెండుసార్లు ఫెయిల్ అయ్యాడు" అని చెప్పక పోతేనే మా స్నేహం అపురూపం అవుతుందా?

"కాలేజీలో రాజీవ్ గాంధీ బాగా చదివేవారు కాదన్న సంగతిని ఇప్పుడెందుకు చెప్పటం! అయ్యర్ కి పిచ్చి పట్టింది" అంటున్నారు అశోక్ గెహ్లోత్, బీజేపీ వాళ్లు వైరల్ చేసిన నా జ్ఞాపకాల క్లిప్‌ను చూసి.

స్నేహంలో ఎదిగినవారు కాదు గెహ్లోత్. స్నేహాల నిచ్చెనలతో ఎదిగినవారు. కాంగ్రెస్ అధ్యక్ష బాధ్యతలను తీసుకుంటే, సీఎం పదవిని వదులుకోవలసి వస్తుందని సోనియాజీ ఆదేశాన్నే కాదన్న సకుటుంబ, సపరివార స్నేహశీలి ఆయన!

ఇలాంటి వాళ్లకు పదవులే జ్ఞాపకాలు. జ్ఞాపకాలనే పదవులుగా మిగిల్చుకున్న నాలాంటి వాళ్లు పిచ్చివాళ్లు!!

తెలంగాణ పునరాలోచన?



జనతంత్రం

వర్ధెల్లి మురళి

తెలంగాణలో కాంగ్రెస్ సర్కార్ ఏర్పాటై సరిగ్గా పదిహేను మాసాలైంది. అరవై మాసాల (ఐదేళ్ల) పాలన కోసం ప్రజలు ఎన్నుకున్నారనుకుంటే అందులో పావు భాగం ప్రయాణం పూర్తయిందన్నమాట. నిజానికి ఈపాటికే ప్రభుత్వం పూర్తిగా కుదురుకొని దాని ఎజెండాను పరుగెత్తించే క్రమంలో ఉండాలి. కానీ, ఎందుకనో ఇప్పటికీ పార్టీకి, ప్రభుత్వానికి మధ్య, ప్రభుత్వంలోని మంత్రుల మధ్య, మంత్రులకు అధికారులకు మధ్య సమన్వయ లోపం స్పష్టంగా కనిపిస్తున్నది. కాంగ్రెస్ పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యం ఎక్కువ గనుక ఇటువంటివన్నీ షరా మామూలేనని ఆ పార్టీ నేతలు సమర్థించుకోవచ్చు గాక. కానీ, ఈ వాదనను అంగీకరించడానికి జనం సిద్ధంగా లేరు.

శాసన మండలి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఆర్భాటంగా పోటీ చేసి, ముఖ్యమంత్రితో సహా యంత్రాంగమంతా రంగంలోకి దిగి కూడా ఓటమి పాలైంది. అది కూడా బీజేపీ చేతిలో! రాష్ట్ర వ్యాప్తంగా బలమైన పునాది, కార్యకర్తల బలం, నాయకత్వ ఇమేజ్ ఉన్న బీఆర్ఎస్ చేతిలో ఓడిపోయి ఉంటే కనీసం గుడ్డిలో మెల్ల అనుకోవచ్చు. జాతీయ స్థాయిలో కాంగ్రెస్ ప్రధాన శత్రువు, ఉత్తరాది పార్టీగా తాము విమర్శించే బీజేపీ చేతిలో భంగపడటం కచ్చితంగా కాంగ్రెస్ సర్కార్‌కు ఇబ్బందికరమైన విషయమే. బీఆర్ఎస్ ఈ ఎన్నికల్లో పోటీ చేయలేదు. పోటీ చేయకుండా బీజేపీకి సహకరించిందని కాంగ్రెస్ పార్టీ ఆరోపిస్తున్నది.

అయితే ఈ ఆరోపణకు సరైన ఆధారం కనిపించడం లేదు. బీఆర్ఎస్ గనుక లోపాయకారిగానైనా బీజేపీకి పూర్తిగా సహకరించి ఉంటే బీఎస్పీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణకు అంత భారీస్థాయిలో ఓట్లు పడేవి కావు. బీసీ నినాదం వల్లనే హరికృష్ణ పెద్దసంఖ్యలో ఓట్లు సంపాదించారనే వాదన కూడా ఉన్నది. కానీ తెలంగాణ బీసీ సమూహాల్లో సామాజిక విధేయత కన్నా రాజకీయ విధేయతే ఎక్కువ. బీఆర్ఎస్‌కు విధేయంగా ఉండే ఓటర్లలో బీసీలే ఎక్కువ సంఖ్యలో ఉంటారు. కనుక బీఆర్ఎస్ ఓట్లు పెద్దసంఖ్యలో హరికృష్ణకు బదిలీ అయుండవచ్చనే అభిప్రాయం ఉన్నది.

కేవలం వ్యక్తిగత సంబంధాల మీద ఆధారపడి పెద్దగా ఆర్థిక దన్ను లేకుండానే బీజేపీ, కాంగ్రెస్‌లకు హరికృష్ణ గట్టి పోటీ ఇవ్వగలిగినప్పుడు, బీఆర్ఎస్ రంగంలో ఉన్నట్లయితే గెలిచేది కాదా అనే చర్చ కూడా మొదలైంది. పోటీ చేయకపోవడానికి బీఆర్ఎస్‌కు ఉన్న కారణాలేమిటో అధికారికంగా తెలియదు. పార్టీ గుర్తుపై ఎన్నికై అధికార పార్టీలో చేరిన పదిమంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు పడి ఆ స్థానాల్లో ఉపఎన్నికలు రావాలని బీఆర్ఎస్ బలంగా కోరుకుంటున్నది. అందుకు కేంద్రంలో ఉన్న బీజేపీ సర్కార్ సహకారం అవసరమని కూడా ఆ పార్టీ భావిస్తుండవచ్చు. అందుకోసమే కౌన్సిల్ బరికి బీఆర్ఎస్ దూరం జరిగిందనే అభిప్రాయం కూడా ఉన్నది.

తెలంగాణలో తమ పార్టీ బాగా బలపడిందని బీజేపీ శ్రేణులు బలంగా నమ్ముతున్నాయి. నిజంగానే అర్బన్, సెమీ అర్బన్ ప్రాంతాల్లో కొంత హిందుత్వ ప్రభావం ఆ పార్టీకి ఉపకరిస్తున్న సూచనలు కన్పిస్తున్నాయి. ముఖ్యంగా బీసీ యువతలో వీరహిందుత్వ ప్రచారం బాగానే పనిచేస్తున్నది. బంజారా, ఇతర గిరిజన తెగల్లో ప్రాబల్యం సంపాదించడానికి కాషాయ పార్టీ వ్యూహాత్మకంగా పనిచేస్తున్నది. ఈ పరిణామాలు సహజంగానే బీఆర్ఎస్, కాంగ్రెస్‌లకు కలవరం కలిగిస్తాయి.

రాష్ట్రంలో రాజకీయ పరిస్థితి ఎలా ఉందో తెలుసుకోవాలంటే ఒక చిన్న లిట్మస్ టెస్ట్ అందుబాటులో ఉన్నది. పదిమంది ఫిరాయింపు ఎమ్మెల్యేల గుండెచప్పుడు వింటే చాలు. అనర్హత విషయంలో సుప్రీంకోర్టు పట్టుదలగా ఉండటంతో వారు తీవ్ర ఆందోళనకు గురయ్యారట. కాంగ్రెస్ టిక్కెట్‌పై ఉపఎన్నికల్లో గెలిచే ప్రసక్తే లేదని ఫిరాయింపుదారులు బలంగా నమ్ముతున్నారు. కొందరు బహిరంగంగా తాము పార్టీ మారలేదని చెబుతున్నారు. గోడ దూకినవారు మళ్లీ గోడెక్కి కూర్చుంటున్నారు. మరికొందరు అంతర్గతంగా మథనపడుతున్నారు. అంతే తేడా!

ప్రయాణంలో పాతిక శాతం కూడా పూర్తికాక ముందే కాంగ్రెస్ పార్టీ ఆత్మవిశ్వాసం కోల్పోయినట్టు కనిపిస్తున్నది. ధిక్కార స్వరాలు వినిపించడం మొదలైంది. ఈ పరిస్థితి రావడానికి ప్రభుత్వంలో సమన్వయ లోపం, అనుభవ రాహిత్యం కూడా ప్రధాన కారణాలే! రైతులకు రెండు లక్షల రుణమాఫీ కింద 20 వేల కోట్లు ఖర్చు పెట్టిన ప్రభుత్వం రైతాంగపు సానుభూతిని మాత్రం సంపాదించలేకపోయింది. రెండు లక్షల మీద ఐదువేలో పదివేలో వడ్డీ మిగిలిపోయిన వారికెవరికీ రుణమాఫీ జరగలేదు. సాంకేతిక కారణాల వల్ల 30 శాతం మందికి మాఫీ జరగలేదు. దానికితోడు రైతుబంధు నిలిచిపోవడం, గతంతో పోలిస్తే గిట్టుబాటు ధరలు దక్కకపోవడం, వేసంగి పంటకు నీళ్లివ్వలేకపోవడం, ఎప్పుడో మరిచిపోయిన కరెంటు కోతలు, మోటార్లు కాలిపోవడాలు మళ్లీ ప్రత్యక్షం కావడంతో రైతాంగంలో వ్యతిరేకత పెరుగుతున్నది.

ఆర్థిక మందగమనం అనే పరిణామం దేశవ్యాప్తంగా ఉన్నదే కావచ్చు. కానీ తెలంగాణలో స్వయంగా ప్రభుత్వమే పూనుకొని హైడ్రా అనే అసందర్భ శరభ నాట్యం చేయడం రియల్ ఎస్టేట్ రంగాన్ని కుదేలు చేసింది. ఇది రాష్ట్రమంతటా డబ్బు చలామణిపై తీవ్రమైన ప్రభావాన్ని చూపింది. దానికితోడు కేసీఆర్ హయాంలో రైతుబంధు, దళిత బంధు వగైరా స్కీముల ద్వారా ఏటా జనం చేతుల్లోకి చేరిన వేలకోట్ల రూపాయలు ఆగిపోయాయి. అవసరాలకు భూమిని అమ్ముకోవాలన్నా, కొనే నాథుడు దొరక్క రైతులు అవస్థలు పడ్డారు. ఆరోగ్యశ్రీ నిధులు సకాలానికి అందక, ఫీజు రియింబర్స్‌మెంట్ అమలు జరగక, రిటైర్‌మెంట్ బెనిఫిట్లు అందక వివిధ వర్గాల ప్రజలు సమస్యల్ని ఎదుర్కొంటున్నారు. అధికారంలోకి వచ్చిన కొత్తలో ఆర్భాటంగా ప్రారంభించిన ప్రజా దర్బార్ మూణ్ణాళ్ల ముచ్చటగా మిగిలిపోయింది.

గత ఎన్నికల్లో బీఆర్ఎస్ అధికారం కోల్పోవడానికి ఇటువంటి కారణాలేమీ లేవు. కేవలం నాయకత్వ అహంకారపూరిత ధోరణి ప్రజలకు దూరం చేసింది. నిరుద్యోగ యువత సమస్యలను విని వారిని సాంత్వన పరచడంలో చూపిన నిర్లక్ష్యం వల్ల భారీ మూల్యాన్ని చెల్లించవలసి వచ్చింది. దసరా సెలవుల్లో ఇళ్లకు చేరుకున్న ఈ యువత తల్లిదండ్రులను ప్రభుత్వానికి వ్యతిరేకంగా మార్చడంలో కృతకృత్యులయ్యారు. ప్రతిష్ఠాత్మకంగా భావించిన పథకాలు కొన్ని గురితప్పాయి. కొందరు ఎమ్మెల్యేల అహంకారం, అవినీతి కూడా జనంలో ఏహ్యాభావం ఏర్పడ్డానికి కారణమై ఆ పార్టీకి నష్టం చేకూర్చాయి. అంతే తప్ప విస్తార జనబాహుళ్యం బీఆర్ఎస్ హయాంలో ఇక్కట్లపాలైన దాఖలాలు లేవు.

చేసిన ఎన్నికల వాగ్దానాలను నెరవేర్చలేకపోగా కొన్ని సంక్షోభాలను పిలిచి మరీ అక్కున చేర్చుకుంటున్న కాంగ్రెస్ సర్కార్ పనితీరు మారకుంటే చేదు అనుభవాలను చవిచూడక తప్పక పోవచ్చు. ఈ వేసవి కష్టాలను, మంచినీటి కటకటను ప్రభుత్వం ఏ రకంగా ఎదుర్కోబోతున్నదో చూడవలసి ఉన్నది. మరో పక్కన గత కేసీఆర్ పాలనే ఈ పాలనకంటే బాగున్నదని బలపడుతున్న ప్రజాభిప్రాయాన్ని ఎలా మార్చగలరో కూడా చూడాలి. ఈ వేసవి పరీక్షలో గనుక కాంగ్రెస్ ఫెయిలయితే వచ్చే రజతోత్సవ సభలో కేసీఆర్ పాంచజన్యం పూరించడం ఖాయం!

దయ్యాల వేద పఠనం!

తెర వెనుక కత్తుల కోలాటమాడుతున్నవారు తెరముందుకొచ్చి శాంతి కపోతాలను వదులుతున్నారు. రోత చేష్టల రంగ మార్తాండులు శ్రీరంగనీతులు బోధిస్తున్నారు. అదిగో దొంగ ఇదిగో దొంగ అంటూ గజదొంగలే అరుస్తున్నారు. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో కంచె చేను మేస్తున్నది. పోలీసు వ్యవస్థను ప్రతిపక్షంపైకి పాలకులు ఉసిగొల్పుతున్నారు. ఇదే కదా, అసలు సిసలైన వ్యవస్థీకృత నేరం. అత్యున్నత స్థాయి పోలీసు అధికారి మంత్రివర్గం ముందు హాజరై ఓ గొప్ప వాగ్దానం చేశాడని వార్తలు వెలువడ్డాయి. ప్రతిపక్షాన్నీ, దాని అభిమానులనూ వేటాడే పనిలో మరింత వేగం పెంచుతారట. దీన్నేమంటాము? నేరమే అధికారమై కొలువు దీరడం కాదా? నేరమే అధికారమై కొరడా ఝుళిపించడం కాదా?

నేరమే అధికారమై ప్రజల్నే నేరస్థుల్ని చేస్తుంటే నోరుండీ ఊరక కూర్చున్న ప్రతి ఒక్కడూ నేరస్థుడేనంటారు విప్లవకవి వరవరరావు. ఈరోజు వేటాడుతున్నది ప్రతిపక్షాన్నే కావచ్చు. రక్తం రుచి మరిగిన పులికి పరిమితులూ, షరతులూ వర్తిస్తాయా? ఉపవాస దీక్షలేమైనా అడ్డొస్తాయా? పౌరహక్కులను పాదాల కింద తొక్కేయడానికి అలవాటుపడ్డ పోలీస్ రాజ్యం కూడా అంతే! ఈ రోజున వాడు తడుతున్నది నీ ఇంటి తలుపును కాకపోవచ్చు. నేడు కాకపోతే రేపు లేదా మరునాడు... నువ్వు నీ హక్కుల్ని గురించి ప్రశ్నించిన రోజున నీ ఇంటి ముంగిట కూడా ఆ బూట్ల చప్పుడు వినిపిస్తుంది.

నేరమే అధికారమై ప్రశ్నిస్తున్న ప్రతివాడి మీద నేరస్థుడనే ముద్ర వేసే ధోరణిని ఆదిలోనే ప్రతిఘటించకపోతే ప్రజాస్వామ్య మనుగడకే ప్రమాదమేర్పడుతుంది. అధికారంలోకి రావడానికి అసత్యాలకూ, అభూత కల్పనలకూ ఒడిగట్టారు గనుక ప్రభుత్వపక్ష స్వభావాన్ని నేరపూరితమైనదిగా భావించవలసి వస్తున్నది. అసత్యాలూ, అభూత కల్పనలన్నీ ఒక్కొక్కటిగా రుజువౌతూ వస్తున్నాయి గనుక నేరమే అధికారం రూపు దాల్చిందని అనుకోవలసి వస్తున్నది. గతకాలపు జగన్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల కుప్ప చేసిందనీ, 14 లక్షల కోట్ల అప్పు చేశారనీ కూటమి పక్షం ఊరూవాడా ఏకంచేసి ప్రచారం చేసింది. మొన్ననే రాష్ట్ర శాసనసభలో సాక్షాత్తూ ఆర్థికమంత్రి పాత ప్రచారానికి విరుద్ధమైన ప్రకటన చేశారు. జగన్ ప్రభుత్వం చేసిన మొత్తం అప్పు 3 లక్షల 39 వేల కోట్లేనని తేల్చారు. ఎంత గుండెలు తీసిన బంట్లు వీరు? ఈ ఒక్క ఉదాహరణ చాలదా, ప్రభుత్వ నేరపూరిత స్వభావాన్ని నిర్ధారణ చేయడానికి?

అప్పుల ప్రస్తావన మచ్చుకు మాత్రమే. ఇటువంటి బేషరమ్ ప్రచారాలు చాలా చేసింది కూటమి. సామాన్య ప్రజల ఆశల మీద, ఆకాంక్షల మీద కూటమి జూదమాడింది. వారి కలల అలల మీద ఆటలాడింది. ఏమార్చడానికి ఇచ్చిన ఎన్నికల మేనిఫెస్టోను డస్ట్‌బిన్‌లోకి గిరాటేసింది. కుర్చీ మీద కూర్చొని నవమాసాలు గడిచిపోయాయి. హామీల డెలివరీ ఆనవాళ్లే లేవు. ఉండకపోవచ్చు కూడా. బడ్జెట్‌లో కొన్ని హామీలకు మాత్రమే అరకొర కేటాయింపులు చూపారు. మిగతా వాటి ఊసే లేదు. నిరుద్యోగులకు నెలకు 3 వేల భృతి ఇస్తామన్నారు. మోసం చేశారు. ఆడబిడ్డలకు నెలకు పదిహేను వేలిస్తామన్నారు. మోసం చేశారు. స్కూలుకు వెళ్లే ప్రతి విద్యార్థికీ ఏటా 15 వేలిస్తామన్నారు. దానికి ఒక ఏడాది ఎగనామం పెట్టి, ఈసారి బడ్జెట్‌లో అవసరమైన సొమ్ములో సగం మాత్రమే కేటాయించారు. ఇంతవరకూ ఒక్క పైసా కూడా లబ్ధిదారులకు చేరలేదు. రైతుకు ఏటా 20 వేల ఆర్థిక సాయమన్నారు. రైతన్న ఎదురుచూస్తూనే ఉన్నాడు.

సాయం సంగతి దేవుడెరుగు. పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక రైతులు అల్లాడుతున్నారు. జగన్ హయాంలో ఇరవై నుంచి ఇరవై ఏడు వేల దాకా పలికిన క్వింటాల్ మిర్చి ధర ఇప్పుడు ఆరేడు నుంచి పదివేల దాకా పడిపోయింది. పెట్టుబడి ఖర్చులు కూడా రైతులకు రాలేదు. అన్ని పంటల కథలూ దాదాపు ఇంతే! కాల్వల కింద వేసుకున్న వరి పైర్లు కూడా నీటి తడులు లేక ఎండిపోతున్న వైనాన్ని ఐదేళ్ల తర్వాత ఇప్పుడే చూస్తున్నాము. మహిళలకు ఉచిత బస్సు ఇంకా డిపో దాటి రోడ్డెక్కలేదు. అప్పుడే దానిమీద మాట మార్చడం మొదలైంది. ఉచిత బస్సును ఒక్క జిల్లాకే పరిమితం చేస్తామని ఇప్పుడు చెబుతున్నారు.

ఈ రకంగా హామీల ఎగవేతతోపాటు పాలనా వైఫల్యాలతో ఆదిలోనే అప్రతిష్ఠ మూటగట్టుకున్న కూటమి సర్కార్ విమర్శకుల నోళ్లు మూయించి, అసత్యాలను ప్రచారంలో పెట్టి పబ్బం గడుపుకోవాలనే నిర్ణయానికి వచ్చింది. ఇప్పుడు ప్రధాన ప్రతిపక్షమైన వైసీపీపై దాడిని కేంద్రీకరించి, భారత న్యాయ సంహిత లోని 111వ సెక్షన్‌ను ఈ దాడికి ఆయుధంగా వాడటం మొదలుపెట్టారు. సోషల్ మీడియా వేదికగా విమర్శలు చేసే వారిపై ఈ సెక్షన్ వాడకూడదని ఏపీ హైకోర్టు చెప్పినా కూడా కూటమి సర్కార్ చెవికెక్కించుకోలేదు. కిడ్నాపులు, దోపిడీలు, భూకబ్జాలు, ఉగ్రవాద కార్యకలాపాలు, ఆర్థిక నేరాలు వగైరా ముఠాలుగా ఏర్పడి చేసే నేరాలు (వ్యవస్థీకృత నేరాలు) ఈ సెక్షన్ పరిధిలోకి వస్తాయి.

సోషల్ మీడియాలో చేసే విమర్శలను ఈ పరిధిలోకి తెచ్చి రాష్ట్ర సర్కార్ చట్టవిరుద్ధంగా వ్యవహరిస్తున్నది. ప్రత్యర్థుల పట్ల కక్షపూరిత వైఖరి కారణంగానే సర్కార్ ఈ కుట్రకు తెర తీసిందనుకోవాలి. సోషల్ మీడియాలో చేసే విమర్శల వెనుక ఎవరిదో ప్రోద్బలం ఉన్నదనీ, ఇదంతా వ్యవస్థీకృతంగా జరుగుతున్నదనీ ఓ స్క్రీన్‌ప్లేను తయారుచేసి, దానికి అనుగుణంగా కీలక వ్యక్తులను అరెస్ట్ చేయాలనీ, తద్వారా ఆ పార్టీని బలహీనపరచాలనే పన్నాగం స్పష్టంగానే కనిపిస్తున్నది. ఇందుకోసం వేలాదిమంది కార్యకర్తలు, అభిమానుల మీద కేసులు పెట్టాలనీ, వేధించాలనీ జిలాల్ల వారీగా టార్గెట్లు పెట్టుకున్నట్టు వార్తలు వస్తున్నాయి.

ఇటీవల పోలీసు ఉన్నతాధికారి నిర్వహించిన ఒక సమీక్షా సమావేశంలో కూడా ఈ టార్గెట్‌లను చేరుకునేలా సహకరించాలనే ఆదేశాలిచ్చినట్టు వచ్చిన వార్తలు నిజమైతే అంతకంటే దౌర్భాగ్యం మరొకటి ఉండదు. గత ప్రభుత్వ హయాంలో కూటమి అగ్రనాయకులంతా బరితెగించి మాట్లాడిన బూతుల ఆడియోలు, చెప్పులు చూపెట్టిన వీడియోలు కోకొల్లలు. వీరికి భిన్నంగా వైసీపీ అధినేత ఏనాడూ ఏ ఒక్క అసభ్యకర వ్యాఖ్యానం చేయలేదు. అయినా సరే, వీరి బూతులకు బదులిచ్చిన నేతలపై అక్రమ కేసులకు తెగబడుతున్నారు.

మొన్నటి మంత్రివర్గ సమావేశం ఎజెండా ముగిసిన తర్వాత ఒక పోలీస్ ఉన్నతాధికారి హాజరై ఒక వింత సందేశాన్ని వినిపించినట్టు యెల్లో మీడియా టాప్ న్యూస్‌గా ప్రచారం చేసింది. బహుశా కూటమి పెద్దల తాజా కుట్రలో భాగంగానే ఈ వింత కథను ప్రచారంలోకి తెచ్చి ఉంటారు. అనారోగ్యంతో చికిత్స పొందుతూ ఇటీవల చనిపోయిన రంగన్న అనే వివేకానందరెడ్డి ఇంటి వాచ్‌మన్ మరణం అనుమానాస్పదమేనని ఆ ఉన్నతాధికారి మంత్రులకు ఉపదేశించారట! అనారోగ్యంతో ఉన్న తన భర్తను పోలీసులు వేధించారనీ, అందువల్లనే ఆయన చనిపోయాడనీ రంగన్న భార్య మీడియాతో మాట్లాడిన మాటలను వారెందుకు పరిశీలనలోకి తీసుకోలేదో తెలియదు మరి!

అంతటితో ఆగలేదు. ఈమధ్యకాలంలో చనిపోయిన వ్యక్తులను వివేకానంద హత్య కేసుకు లింకు చేస్తూ అవన్నీ అనుమానాస్పద మరణాలేనని చెప్పడానికి పూనుకోవడం, మోకాలుకు, బోడిగుండుకు ముడిపెట్టినట్టు కథలు అల్లడం దిగ్భ్రాంతి కలిగిస్తున్నది. అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ చనిపోయిన అభిషేక్ రెడ్డి మరణంపై కూడా అనుమానాలున్నాయట! జగన్ కుటుంబ సభ్యుల ప్రేమాభిమానాలు చూరగొన్న డ్రైవర్ నారాయణ కేన్సర్ వ్యాధికి చికిత్స తీసుకుంటూ కొంతకాలం క్రితం చనిపోయాడు. అందులో కూడా అనుమానం ఉన్నదట! నీచమైన కుట్రలకు పరాకాష్ఠ డాక్టర్ గంగిరెడ్డి పేరును కూడా ఇందులోకి లాగడం. డాక్టర్ గంగిరెడ్డి భారతమ్మ తండ్రి. కరోనా సోకడంతో ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటూ చనిపోయారు. ఆయన మరణం కూడా అనుమానమేనట!

పోలీస్ అధికారి ఏం చెప్పాడో తెలియదుగానీ 'ఈనాడు' మాత్రం అరపేజీ ఫిక్షన్ రాసి పారేసింది. తాము చెప్పదలుచుకున్న కథలో ఆవగింజంత నిజమైనా ఉండాలన్న నియమం వారికేమాత్రం లేదు. చెప్పింది ప్రచారం చేసి పెట్టడానికి మోచేతి కింద వందిమాగధ మీడియా సిద్ధంగా ఉన్నది. చేతిలో అధికారం ఉన్నది. వ్యవస్థల మెడలకు బిగించిన ఇనుప గొలుసులు తమ చేతిలోనే ఉన్నాయి. ఉసిగొలిపితే చాలు. కేసులు పెట్టడం ఎంత పని? ఇప్పుడిదే కూటమి సర్కార్ సింగిల్ పాయింట్ ఎజెండా! దయ్యాలు వేదాలు వల్లించినట్టు, తోడేళ్లు – గుంటనక్కలూ శాకాహార ప్రతిజ్ఞలు చేసినట్టు ఈ పెద్దలంతా సభలు పెట్టుకొని ఒకరినొకరు పొగుడుకుంటూ, ప్రజా సంక్షేమం గురించి, ప్రజాస్వామ్యం గురించి, అభివృద్ధి గురించి మాట్లాడటం కంటే ఎబ్బెట్టు దృశ్యాలు ఇంకేముంటాయి? అటువంటి ఎబ్బెట్టు దృశ్యాన్ని ఈమధ్యనే విశాఖ తీరంలో చూడవలసి వచ్చింది.

vardhelli1959@gmail.com

> ప్రయాణంలో పాతిక శాతం పూర్తికాక ముందే కాంగ్రెస్ ఆత్మవిశ్వాసం కోల్పోయినట్టు కనిపిస్తున్నది. ధిక్కార స్వరాలు వినిపించడం మొదలైంది. ఈ పరిస్థితి రావడానికి ప్రభుత్వంలో సమన్వయ లోపం, అనుభవరాహిత్యం కూడా ప్రధాన కారణాలే! రైతులకు రెండు లక్షల రుణ మాఫీ కింద 20 వేల కోట్లు ఖర్చు పెట్టిన ప్రభుత్వం రైతాంగపు సానుభూతిని సంపాదించలేక పోయింది. రెండు లక్షల మీద ఐదువేలో పదివేలో వడ్డీ మిగిలి పోయిన వారికెవరికీ రుణమాఫీ జరగలేదు. సాంకేతిక కారణాల వల్ల 30 శాతం మందికి మాఫీ జరగలేదు. దానికితోడు రైతుబంధు నిలిచి పోవడం, గతంతో పోలిస్తే గిట్టుబాటు ధరలు దక్కక పోవడం, వేసంగి పంటకు నీళ్లివ్వలేకపోవడం, ఎప్పుడో మరిచిపోయిన కరెంటు కోతలు, మోటార్లు కాలిపోవడాలు మళ్లీ ప్రత్యక్షం కావడంతో రైతాంగంలో వ్యతిరేకత పెరుగుతున్నది.


నిలిచి గెలిచిన శాస్త్రవేత్తలు

సందర్భం




ప్రొ॥ కట్టా సత్యప్రసాద్

మానవజాతి ఉనికికి, పురోగమనానికి మహిళ పాత్ర కీలకం. ఆ మాటకొస్తే ఏ జాతి ప్రగతికైనా స్త్రీ పురుషుల భాగస్వామ్యం తప్పనిసరి. కానీ అనాదిగా స్త్రీ వివక్షను ఎదుర్కొంటూనే ఉంది. ఇది ఏ ఒక్క రంగానికో, ప్రాంతానికో, దేశానికో పరిమితం కాదు. అందుకు సైన్సు కూడా మినహాయింపు కాదు. అవధులు లేని అభివృద్ధిని సాధించామనుకుంటున్న నేటి పరిస్థితుల్లో కూడా మహిళ వివక్షను, ప్రతికూలతలను ఎదుర్కొంటూనే ఉంది. విజయాలందుకొంటూనే ఉంది. శాస్త్ర సాంకేతిక రంగాల ప్రగతిలో తనదైన ముద్రను కనబరుస్తూనే ఉంది. ఒక్క మాటలో చెప్పాలంటే ఆమె లేని సమాజాన్నెలా ఊహించుకోలేమో, ఆమె చేయూత లేని సైన్సు అభివృద్ధి కూడా ఊహాతీతం. నూరేళ్ల చరిత్ర కలిగిన నోబెల్ బహుమతులకు మహిళా శాస్త్రవేత్తలను ఎంపిక చేయటంలో కూడా ఈ వివక్ష ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. ఇన్నేళ్లయినా సైన్సులో నోబెల్ బహుమతి వచ్చిన మహిళలు రెండు పదులకు మించి లేరు. రెండుసార్లు నోబెల్ బహుమతిని గెలుచుకున్న ఏకైక మహిళా శాస్త్రవేత్త మేరీ క్యూరి సైతం ఈ ప్రతికూలతను ఎదుర్కొంది. 1903లో తొలుత పియరీ క్యూరీ, హెన్రీ బెక్‌రెల్‌ల పేర్లే ఎంపికయినాయి. పియరీ దాన్ని తిరస్కరించటంతో ఆ తర్వాత మేరీతో కలిసి వారు నోబెల్ బహుమతిని అందుకున్నారు. నేటి శాస్త్ర రంగాన్ని అత్యంత గణనీయంగా ప్రభావితం చేసినది వాట్సన్, క్రిక్‌ల డీఎన్ఏ నిర్మాణ డిస్కవరీ. ఇంత గొప్ప ఆవిష్కరణలో కీలక పరిశోధనలు అందించిన మహిళ రోజాలిండ్ ఫ్రాంక్లిన్‌కు నోబెల్ బహుమతి దక్కలేదు. డీఎన్ఏ నిర్మాణాన్ని కళ్లకు కట్టి చూపిన ఆమె ఎక్స్‌రే ఫొటో (ఫొటో నం. 51)నే ఆధారమన్న సంగతి మరచిపోలేని నిష్ఠుర సత్యం. ఈ డిస్కవరీ అనేకానేక విజ్ఞాన శాస్త్ర రంగాలకు ప్రాణం పోసింది. నేడది డార్విన్ జీవపరిణామ సిద్ధాంతాన్ని నిగ్గు తేల్చటమే కాకుండా, కోట్ల సంవత్సరాల క్రితం జీవించిన శిలాజాల నుండి సంగ్రహించిన డీఎన్ఏ నమూనాలతో సరికొత్త శిలాజ జీనోమిక్ శాస్త్ర విజ్ఞానానికి నాంది పలికింది. ఆ పరిశోధనలు చేసిన స్వాంటే పేబో వంటి శాస్త్రజ్ఞులకు నోబెల్ బహుమతిని అందించింది కూడా.



మేరీ క్యూరి



రోజాలిండ్ ఫ్రాంక్లిన్



బార్బరా మెక్లింటాక్



మేరీ యానింగ్

క్రోమోజోమ్‌లపై జన్యువులు ఒక స్థానం నుండి మరొక స్థానానికి దూకుతాయన్న 'దూకుడు జన్యువుల' డిస్కవరీ జన్యుశాస్త్రాన్ని గొప్ప మలుపు తిప్పింది. జెనెటిక్ ఇంజనీరింగ్‌లో కొత్త ప్రక్రియలకు పునాది వేసింది. దీనిని కనిపెట్టింది కూడా బార్బరా మెక్లింటాక్ అనే గొప్ప మహిళా శాస్త్రవేత్త. ఈ డిస్కవరీకి తానొక్కతే నోబెల్ బహుమతి మొత్తాన్ని గెలుచుకున్న తొలి మహిళ కూడా ఆమె. ఏ జన్యువు ఎప్పుడు పని చేయాలో, ఎక్కడ ఆగిపోవాలో అనేది పరిణామంలో ఒక పజిల్. ఈ డిస్కవరీలో పరిణామ జీవ శాస్త్రం కొత్త పుంతలు తొక్కింది. విద్యాధికులూ, శాస్త్రవేత్తలూ మాత్రమే గొప్ప ఆవిష్కరణలు చేస్తారని సాధారణంగా అనుకుంటాం. ఇందుకు భిన్నంగా ఒక నిరుపేద కుటుంబం నుండి వచ్చిన అమ్మాయి చదువు కూడా పెద్దగా లేని మహిళ మేరీ యానింగ్ శిలాజ విజ్ఞాన శాస్త్రవేత్తగా ఎదిగి జీవ పరిణామ సిద్ధాంతాన్ని పరిపుష్టం చేసింది. బ్రిటన్ లైమ్‌రెజిస్ ప్రాంతపు సముద్ర తీరంలో పర్యాటకులకు గవ్వలమ్ముకుని జీవించే సాదా సీదా అమ్మాయి యానింగ్. పన్నెండేళ్ల వయసులోనే ఇక్తియోసార్ పుర్రెను వెలికి తీయటంలో తండ్రికి తోడ్పడింది. ఒకప్పుడు నీళ్లలో నివసించిన సరీసృపాల జాతికి చెందిన శిలాజానికిది నిదర్శనం. ఆమె కృషి పట్టుదలతో వెలికి తీసిన అనేక శిలాజాలు జీవులు పరిణామం చెందుతాయన్న ఆలోచనలకు బలం చేకూర్చాయి. డార్విన్ పరిణామ సిద్ధాంతాన్ని ఆమె కనిపెట్టిన శిలాజాలు పరిపుష్టం చేశాయి. అందుకే ఆమె ప్రపంచంలో తొలి మహిళా శిలాజ శాస్త్రవేత్తగా ఖ్యాతి గడించింది. బ్రిటన్‌లో శాస్త్రవేత్తలకిచ్చే అత్యున్నత పురస్కారాలను సైతం ఈ సామాన్య యువతి అందుకుంది. అవాంతరాలు, ప్రతికూలతలు ఎన్ని ఉన్నా మహిళ సాధించలేనిది లేదని చెప్పడానికివి మచ్చుకు ఒకటి రెండు ఉదాహరణలే. సైన్సు ప్రయోజనాలు ప్రతి ఒక్కరికీ అందాలంటే పురుషులతో సమానంగా మహిళల భాగస్వామ్యాన్ని సాధించాలి.

శాస్త్ర రంగంలో భారతదేశపు పరిస్థితి, మహిళల ప్రాతినిధ్యం అంతంత మాత్రంగానే ఉంది. 2005లోనే సైన్స్‌రంగంలో మహిళలపై భారత ప్రభుత్వ (డీఎస్‌టీ) నియమించిన నిపుణుల కమిటీ కూడా మహిళలు అత్యల్ప సంఖ్యలో ఉన్నారని తేల్చింది. డాక్టరేట్లు చేసిన మహిళలు శాస్త్ర సంస్థలు, యూనివర్సిటీ సిబ్బందిలో అతి తక్కువగా ఉన్నారు. మరీ ముఖ్యంగా విధాన నిర్ణయాలు చేసే స్థాయిలో, సంస్థల డైరెక్టర్లు, విశ్వవిద్యాలయ వైస్ ఛాన్స్‌లర్లు, ఇతర పాలనాపరమైన ముఖ్య స్థానాల్లో పరిమితంగా ఉండటాన్ని ఎలా అర్థం చేసుకోవాలి? మహిళలకు సైన్సులో మరింత ప్రోత్సాహం ఇవ్వాలనీ, ఉద్యోగ నియామకాలను క్రమబద్ధంగా జరపాలనీ ఆ కమిటీ సూచించింది. అయినా పరిస్థితుల్లో పెద్దగా మార్పు లేదు. శాస్త్ర రంగంలో మహిళలు ముందడుగు వేయటానికి నిపుణుల సూచనలు అమలు చేయటం ఒక అవసరమైతే, ప్రభుత్వాల దృష్టి కోణంలో మార్పు రావటం అత్యవసరం.

వ్యాసకర్త జన విజ్ఞాన వేదిక ఉమ్మడి ఏపీ మాజీ అధ్యక్షులు

కల్యాణం.. కమనీయం

శ్రీలక్ష్మీనారసింహునికి ప్రభుత్వం తరఫున పట్టు వస్త్రాలు సమర్పించిన ప్రభుత్వ విప్ ఐలయ్య



విద్యుత్ కాంతుల్లో యాదాద్రి ఆలయ ప్రాంగణం.. కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు

సాక్షి, యాదాద్రి: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి తిరుకల్యాణోత్సవం శనివారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. ఉత్తర మాడ వీధిలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై.. యజ్ఞాచార్యులు, ప్రధానార్చకులు, అర్చక బృందం స్వామివారి తిరు కల్యాణ మహోత్సవాన్ని జరిపించారు. యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనర్సింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా కొండపైన రాత్రి 8.45 గంటలకు శ్రీస్వామి వారి గజవాహన సేవ ఆలయం నుంచి కల్యాణ వేదిక వద్దకు తీసుకువచ్చారు. అనంతరం 9 గంటలకు కల్యాణ వేదికపై శ్రీస్వామి అమ్మవార్ల కల్యాణ తంతు ప్రారంభించారు. ప్రధానార్చకులు నల్లంథీఘల్ లక్ష్మీనరసింహాచార్యులు, కాందూరి వెంకటచార్యులు, అర్చకులు సురేంద్రచార్యులు, లక్ష్మణ్, నర్సింహమూర్తి, కిరణకుమారాచార్యులు ఆధ్వర్యంలో విష్వక్సేన ఆరాధన పూజలు నిర్వహించిన అనంతరం స్వస్తి వాచనం చేశారు. కన్యాదానం అనంతరం వేద మంత్రోచ్ఛరణలతో రాత్రి 10:50 గంటలకు మాంగల్యధారణ జరిగింది. అనంతరం స్వామి, అమ్మవార్లకు ముత్యాల తలంబ్రాల కార్యక్రమాన్ని నిర్వహించి శ్రీస్వామి అమ్మవార్లను ఒకటోటికి చేర్చారు. స్వామి, అమ్మవార్ల కల్యాణాన్ని భక్తులు తిలకించి భక్తి పారవశ్యంలో మునిగి తేలారు. కల్యాణోత్సవం నందర్భంగా శ్రీస్వామి వారు గజవాహనంపై దర్శనమిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి సమర్పించారు. వేడుకల్లో దేవాదాయ, ధర్మాదాయ శాఖ కమిషనర్ శ్రీధర్, భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు, జిల్లా జడ్జి జయరాజు, ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి, ఈవో భాస్కర్‌రావు, జిల్లా అదనపు కలెక్టర్ వీరారెడ్డి, ఆర్డీవో కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

వ్యవసాయ మార్కెట్‌లలో ఇసుక అమ్మండి

- ఐటీడీఏలతో త్వరితగతిన ఒప్పందాలు చేసుకోండి
- నిధుల సమీకరణ సబ్‌కమిటీ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి. చిత్రంలో మంత్రులు ఉత్తమ్, జూపల్లి, శ్రీధర్‌బాబు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని సామాన్యులందరికీ ఇసుకను అందుబాటులోకి తేవాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశించారు. ప్రస్తుతం ఔటర్ రింగురోడ్డుకు సమీపంలో ప్రారంభించిన విధంగా రాష్ట్రంలోని అన్ని వ్యవసాయ మార్కెట్‌లలో ఇసుక అందుబాటులోకి తెచ్చి అమ్మాలని, ఇసుక సరఫరా కోసం ఐటీడీఏలతో ఒప్పందాలు త్వరితగతిన పూర్తి చేసుకోవాలని సూచించారు. శనివారం ప్రజాభవన్‌లో రెవెన్యూ సమీకరణ సబ్‌కమిటీ సమావేశం ఆయన అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి సబ్‌కమిటీ సభ్యులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, జూపల్లి కృష్ణారావులతో పాటు రాబడి శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన చర్చలో రాష్ట్రానికి ఆదాయం తెచ్చే మార్గాల్లో ఇసుక, గనులు ప్రధానమైనవని సబ్‌కమిటీ సభ్యులు అభిప్రాయపడ్డారు. 2025–26 ఆర్థిక సంవత్సరం లక్ష్యాలు వాస్తవానికి దగ్గరగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కాలుష్య కారక పరిశ్రమలను ఓఆర్ఆర్ అవతలకు పంపాలని గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాన్ని వేగవంతంగా అమలు చేసేలా చర్యలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావుతో పాటు ఆదాయ రాబడి శాఖల ఉన్నతాధికారులు శ్రీధర్, ఎస్ఎంఏ రిజ్వీ, సురేంద్రమోహన్, జ్యోతిబుద్ధప్రకాశ్, హరిత, విష్ణువర్ధన్, గౌతం తదితరులు పాల్గొన్నారు.

ఎకరం కూడా ఎండిపోరాదు

- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల. చిత్రంలో మంత్రి కోమటిరెడ్డి, శాసనమండలి చైర్మన్ గుత్తా

నల్లగొండ: నీరందక ఒక్క ఎకరం కూడా ఎండిపోకుండా కాపాడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు స్పష్టం చేశారు. వేసవిలో సాగు, తాగునీరు సమస్యలు ఉత్పన్నం కాకుండా చేపట్టాల్సిన చర్యలపై శనివారం నల్లగొండ జిల్లా కలెక్టరేట్‌లో రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో కలిసి ఉమ్మడి నల్లగొండ జిల్లా కలెక్టర్లు, ఎమ్మెల్యేలు, అధికారులతో మంత్రి తుమ్మల సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కాల్వల కింద పలుచోట్ల నీరు అందక వరి పొలాలు ఎండిపోతున్నాయని పలువురు ఎమ్మెల్యేలు మంత్రి దృష్టికి తెచ్చారు. కాల్వల్లో మోటార్లు వేసి కొందరు రైతులు కిలోమీటర్ల కొద్దీ తీసుకుపోతుండటం వల్ల.. కాల్వ చివరి రైతుల పంట పొలాలు ఎండిపోతున్నాయని పేర్కొన్నారు. దీనిపై మంత్రి తుమ్మల స్పందిస్తూ.. అధికారులు అలాంటి వాటికి అవకాశం లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. క్షేత్ర స్థాయికి అధికారులు వెళ్తే.. సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. వేసవిలో తాగునీటి తక్షణ సమస్య పరిష్కారానికి.. కలెక్టర్‌ల వద్ద కొంత నిధులు ఉంచేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఎమ్మెల్యేలకు నిధులు మంజూరు చేసే విషయమై.. ముఖ్యమంత్రితో మాట్లాడతానని హామీ ఇచ్చారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి పంచాయతీలో నిధులు అందుబాటులో ఉంచితే.. ఎక్కడ తాగునీటి సమస్య ఏర్పడినా వెంటనే పరిష్కరించవచ్చని సూచించారు. శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. కాల్వల విస్తరణతో పాటు లైనింగ్ పనులు చేస్తేనే చివరి భూములకు నీరందించగలుగుతామని అభిప్రాయపడ్డారు.

4 ఎకరాలు.. రోజుకు రూ. 4 వేలు

- డైనమో అద్దెకు తీసుకుని వరికి నీరు అందిస్తున్న రైతు



డైనమోతో వరికి నీరు అందిస్తున్న రైతు అశోక్

జనగామ రూరల్: పంటను కాపాడుకోవడానికి గంటకు రూ.వెయ్యి వెచ్చించి నీరందిస్తూ పడరాని పాట్లు పడుతున్నాడొక యువ రైతు. జనగామ మండలం వడ్లకొండ గ్రామానికి చెందిన కాసర్ల అశోక్ ఎంబీఏ పూర్తి చేసి.. ఇంటి వద్దే ఉంటూ వరి సాగు చేస్తున్నాడు. గత ఏడాది భూగర్భ జలాలు పుష్కలంగా ఉండడంతో తనకున్న ఆరు ఎకరాల్లో మూడు బోర్లతో పంట పండించాడు. ఈ యాసంగిలోనూ వరి వేశాడు. ఒక బోరు పూర్తిగా వట్టిపోయింది. మిగతా రెండింటిలో అంతంత మాత్రమే నీరు వస్తోంది. నీరు లేక రెండెకరాల పంట ఎండిపోవడంతో జీవాల మేతకు వదిలేశాడు. మిగిలిన నాలుగెకరాల్లో పంట ప్రస్తుతం పొట్ట దశలో ఉంది. వాగులోనూ నీరు ఇంకిపోయింది. ఎలాగైనా పంటను కాపాడుకోవాలనే తపనతో సొంత ట్రాక్టర్‌కు డైనమో ఏర్పాటు చేసి.. ఉన్న కొద్దిపాటి నీటి ఊటను అందించి పంటను కాపాడుకుంటున్నాడు. గంటకు రూ.వెయ్యి చొప్పున డైనమోను కిరాయికి తీసుకుని పంటకు నీరందిస్తున్నట్లు రైతు అశోక్ తెలిపాడు. నాలుగు ఎకరాలకు నీటి పారకానికి రోజుకు రూ.4 వేలు అవుతోందని తెలిపాడు.

మందుపాతర పేలి యువతికి తీవ్ర గాయాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పాండే

చర్ల: పోలీసు బలగాలే లక్ష్యంగా మావోయిస్టులు ఏర్పాటు చేసిన ప్రెజర్‌బాంబు పేలడంతో ఒక ఆదివాసీ యువతికి తీవ్ర గాయాలయ్యాయి. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా రాంపురంలో జరిగిన ఈ సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. రాంపురానికి చెందిన ఆదివాసీ యువతి కుంజా పాండే మూడు రోజుల క్రితం గ్రామ సమీపాన అటవీ ప్రాంతంలో కట్టెలు ఏరుకునేందుకు వెళ్లిన క్రమంలో మావోయిస్టులు ఏర్పాటు చేసిన ప్రెజర్‌బాంబును తొక్కింది. దీంతో బాంబు పేలి కుడికాలు నుజ్జునుజ్జయింది. బంధువులు ఆమెకు నాటు వైద్యం చేయించారు. అయితే, పరిస్థితి విషమించి.. శనివారం ఉదయం చర్లకు తరలిస్తుండగా చర్ల సీఐ రాజువర్మకు సమాచారం తెలిసింది. దీంతో ఆయన అంబులెన్స్‌ను చర్లకు పంపించి.. అక్కడి నుంచి భద్రాచలం ఏరియా ఆస్పత్రికి క్షతగాత్రురాలిని తీసుకొచ్చారు. ఆమె కాలు తొలగించాల్సి రావొచ్చని అంటున్నారు.

కారు నడుపుతుండగా గుండెపోటు..

- అదుపుతప్పి కాల్వలోకి దూసుకెళ్లిన కారు.. తండ్రి, ఇద్దరు పిల్లల మృతి.. భార్యను కాపాడిన స్థానికులు
- వరంగల్ జిల్లా పర్వతగిరి మండలంలో ఘటన

పర్వతగిరి/సంగెం/నెల్లికుదురు: కారు నడుపుతున్న వ్యక్తికి గుండెపోటు రావడంతో వాహనం అదుపుతప్పి కాల్వలోకి దూసుకెళ్లడంతో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతిచెందారు. పర్వతగిరి సీఐ రాజగోపాల్, ఎస్సై ప్రవీణ్ తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండలోని ఎల్ఐసీ కార్యాలయంలో డెవలప్‌మెంట్ అధికారిగా పనిచేస్తున్న సోమారపు ప్రవీణ్ (28) సొంతూరు మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి మండలం మేచరాజుపల్లి. రెండు రోజులు వరుస సెలవులు రావడంతో శనివారం భార్య కృష్ణవేణి, కుమార్తె చైత్రసాయి (5), కుమారుడు ఆర్యవర్ధన్ సాయి(2)లతో సొంత గ్రామానికి బయలుదేరాడు. మార్గమధ్యలోని కొంకపాక శివారు కేసీ కెనాల్ వద్దకు రాగానే గుండెనొప్పి వస్తోందని భార్యకు చెప్పాడు. 'కారు వెనక్కి తిప్పండి.. వరంగల్‌లో అయితే బాగుంటుంది'అని కృష్ణవేణి చెప్పడంతో ప్రవీణ్ కారును వెనక్కు తీస్తున్న క్రమంలో గుండెనొప్పి ఎక్కువైంది. దీంతో స్టీరింగ్ తిప్పే పరిస్థితి లేక వరంగల్ జిల్లా పర్వతగిరి మండలంలోని కొంకపాక గ్రామ శివారు ఎస్సారెస్పీ డీబీఎం–48 కాల్వలోకి కారు దూసుకెళ్లింది. దీంతో నలుగురూ కాల్వలో పడిపోయారు. నీటి ప్రవాహంలో మహిళ చేతులు ఆడిస్తున్న విషయాన్ని గమనించిన చౌటపల్లికి చెందిన నవీన్, సందీప్, రవిలు తాడు సహాయంతో కృష్ణవేణిని, నీటిపై తేలియాడుతున్న బాలుడిని బయటకు తీశారు. వారిని చికిత్స నిమిత్తం వరంగల్‌లోని ఆస్పత్రికి తరలించగా, కుమారుడు ఆర్యవర్ధన్ అప్పటికే మృతిచెందాడు. కూతురు చైత్రసాయి, తండ్రి ప్రవీణ్ కారులోనే ఉండిపోవడం.. నీటివేగం ఎక్కువగా ఉండటంతో కారు మునిగిపోయింది. అధికారులు ఎస్సారెస్పీ కాల్వ ద్వారా వచ్చే నీటిని తగ్గించి కారును బయటకు తీసి, అందులో ప్రవీణ్, చైత్రసాయి మృతదేహాలను గుర్తించారు. అప్పటికే అక్కడికి మేచరాజుపల్లి గ్రామస్తులు, ప్రవీణ్ బంధువులు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. ప్రవీణ్ సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



కెనాల్‌లో పడిన కారును బయటకు తీస్తున్న స్థానికులు



ప్రమాదానికి గంట ముందు కారులో భార్య కృష్ణవేణి, కూతురు చైత్రసాయితో ప్రవీణ్ దిగిన సెల్ఫీ

వరుసగా సెలవులు రావడంతో..

ప్రవీణ్ హనుమకొండలో పదేళ్లుగా నివాసం ఉంటున్నారు. స్వగ్రామానికి బయలుదేరిన అతను తల్లిదండ్రులకు ఫోన్ చేసి అరగంటలో వస్తున్నానని చెప్పాడు. అయితే, అంతలోనే కారు కాలువలో పడిందని సమాచారం అందిందని ప్రవీణ్ తల్లిదండ్రులు సారంగపాణి, పద్మలు గుండెలు పగిలేలా విలపించారు.



యూన్ సుక్ యోల్

జైలు నుంచి విడుదలైన దక్షిణ కొరియా అధ్యక్షుడు

సియోల్: అభిశంసనకు గురైన దక్షిణ కొరియా అధ్యక్షుడు యూన్ సుక్ యోల్ జైలు నుంచి విడుదలయ్యారు. జైలు నుంచి బయటకు రాగానే తన మద్దతుదారులకు పిడికిలి బిగించి అభివాదం చేశారు. అనంతరం నల్లటి వ్యాన్‌లో అధ్యక్ష నివాసానికి వెళ్లిపోయారు. ఆ తర్వాత ఆయన పేరుతో న్యాయవాదులు ఒక ప్రకటన విడుదల చేశారు. మద్దతుదారులందరికీ కృతజ్ఞత తెలిపిన ఆయన.. అభిశంసనకు వ్యతిరేకంగా నిరాహారదీక్ష చేస్తున్న వారు విరమించాలని కోరారు. అలాగే అక్రమాలను సరిదిద్దేందుకు సియోల్ సెంట్రల్ డిస్ట్రిక్ట్‌కోర్టు తనకు అవకాశమిచ్చిందని, కోర్టు నిర్ణయాన్ని అభినందిస్తున్నానని తెలిపారు. గతేడాది డిసెంబర్ 3న మార్షల్ లా విధించిన విషయంలో యూన్‌ను అరెస్టు చేశారు. మరోవైపు నేషనల్ అభిశంసన తీర్మానాన్ని మెజారిటీ సభ్యులు ఆమోదించడంతో ఆయనను పదవినుంచి తొలగించారు. తిరుగుబాటు ఆరోపణలతో తనపై దర్యాప్తు చేయడానికి దర్యాప్తు సంస్థలకు చట్టబద్ధత లేదన్న ఆయన.. జైలు నుంచి విడుదల చేయాలంటూ అభ్యర్థించారు. ఆయన అభ్యర్థనను అంగీకరించినట్లు సియోల్ సెంట్రల్ డిస్ట్రిక్ట్ కోర్టు శుక్రవారం తెలిపింది. దీంతో యూన్ శనివారం విడుదలయ్యారు.

'రంజాన్' వెసులుబాటుపై విచారణకు సుప్రీం నో

న్యూఢిల్లీ: ఈ నెల 2 నుంచి 30వ తేదీ వరకు రంజాన్ మాసంలో ముస్లిం ఉద్యోగులు విధుల నుంచి ఒక గంట ముందుగానే సెలవు తీసుకోవచ్చంటూ తెలంగాణ, ఏపీ ప్రభుత్వాలిచ్చిన వెసులుబాటును సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై విచారణకు సుప్రీంకోర్టు తిరస్కరించింది. శుక్రవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్‌ల ధర్మాసనం ఎదుట సీనియర్ లాయర్ గోపాల్ శంకరనారాయణన్ వాదనలు వినిపించారు. ముస్లిం ఉద్యోగులు రంజాన్ మాసంలో గంట ముందుగానే విధుల నుంచి వెళ్లిపోవచ్చునంటూ తెలంగాణ, ఏపీ ప్రభుత్వాలిచ్చిన సర్క్యులర్‌లను ప్రస్తావిస్తూ, తమ పిటిషన్‌ను పరిశీలించాలని కోరారు. ఆయన వినతిని ధర్మాసనం తిరస్కరించింది. ఈ అంశంపై సంబంధిత హైకోర్టులకు వెళ్లవచ్చని తెలిపింది. దీంతో, ధర్మాసనం అనుమతి మేరకు లాయర్ గోపాల్ శంకరనారాయణన్ పిటిషన్‌ను వెనక్కి తీసుకున్నారు. హైకోర్టులకు వెళతామని చెప్పారు.

స్మగ్లింగ్.. కోడి గుడ్డేం కాదు!

కెనడా, మెక్సికో నుంచి అమెరికాకు

కాసులు కురిపిస్తున్న గుడ్ల కొరత ● డ్రగ్స్‌ను మించి సాగుతున్న దందా

కెనడా, మెక్సికో నుంచి అమెరికాలోకి అక్రమంగా తరలిస్తూ సరిహద్దుల్లో భారీగా పట్టుబడుతున్న ఉత్పత్తుల సంఖ్య కొద్ది నెలలుగా భారీగా పెరిగిపోయింది. అయితే అవేమిటో తెలుసా? ఎప్పట్లా ఫెంటానిల్లో, ఇతరేతర డ్రగ్సో కాదు. పౌల్ట్రీ ఉత్పత్తులు! ఆశ్చర్యంగా ఉన్నా నిజమిది. పైగా వాటిలోనూ సింహ భాగం గుడ్లే కావడం విశేషం!! నానాకష్టాలూ పడి డ్రగ్స్‌ను దేశం దాటించేకంటే స్మగ్లింగ్ నెట్‌వర్కులకు ఇదే మాంచి లాభసాటి బేరంగా కన్పిస్తోందట. అమెరికాను అతలాకుతలం చేస్తున్న గుడ్ల కొరత తీవ్రతకు ఈ ఉదంతం అద్దం పడుతోంది. కెనడా, మెక్సికోల నుంచి అమెరికాలోకి ఫెంటానిల్ తదితర డ్రగ్స్ విచ్చలవిడిగా స్మగ్లింగ్ అవుతుండటం పరిపాటి. అధ్యక్ష ఎన్నికల సందర్భంగా ఇది డొనాల్డ్ ట్రంప్‌కు పెద్ద ప్రచారాస్త్రంగా మారింది కూడా. కెనడాపై టారిఫ్‌ల యుద్ధానికి ప్రధాన కారణాల్లో ఒకటిగా కూడా ఫెంటానిల్ నిలిచింది. కానీ కొద్ది నెలలుగా కెనడా నుంచి గుడ్లు తదితర పౌల్ట్రీ ఉత్పత్తుల స్మగ్లింగ్ డ్రగ్స్‌ను కూడా మించిపోయిందంటూ అమెరికా అధికారులే ముక్కున వేలేసుకుంటున్నారు. గుడ్లే అమెరికన్లకు ప్రధానమైన బ్రేక్‌ఫాస్ట్. ఉదయాన్నే ఆమ్లెట్లుగానో, మరో రూపంలో గుడ్లు తిన్నాకే వారికి రోజు మొదలవుతుంది. వారి బ్రేక్‌ఫాస్ట్ అవసరాలు కాస్తా బ్లాక్‌మార్కెటర్లకు కాసుల పంటగా మారుతుండటం విశేషం!



మెక్సికో సరిహద్దుల్లో స్మగ్లర్ల నుంచి కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ బృందాలు స్వాధీనం చేసుకున్న గుడ్లు

డ్రగ్స్ కంటే 10 రెట్లు!

2024 అక్టోబర్‌తో పోలిస్తే ప్రస్తుతం కెనడా నుంచి డెట్రాయిట్ గుండా అమెరికాలోకి అక్రమంగా గుడ్లు తరలిస్తున్న వారి సంఖ్య 36 శాతం పెరిగినట్టు అమెరికా కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ గణాంకాలు చెబుతున్నాయి. ఇక మెక్సికో సరిహద్దులకు అతి సమీపంలో ఉండే శాన్‌డీగో వద్ద ఈ ఉదంతాలు ఏకంగా 158 శాతం పెరిగిపోవడం విశేషం. 2024 అక్టోబర్ నుంచి అమెరికా సరిహద్దులను దాటించే ప్రయత్నంలో పౌల్ట్రీ ఉత్పత్తులు పట్టుబడ్డ ఉదంతాలు 3,768కి పైగా నమోదయ్యాయి. ఇదే సమయంలో ఫెంటానిల్ పట్టుబడ్డ ఉదంతాలు కేవలం 352 మాత్రమే కావడం విశేషం.

దొరికితే జరిమానాలు

అమెరికాలోకి గుడ్లు, ఇతర ప్రాసెస్ చేయని పౌల్ట్రీ ఉత్పత్తుల రవాణా చట్టవిరుద్ధం. ఫ్లూ తదితర ఆందోళనలే ఇందుకు కారణం. వీటిని దేశంలోకి తరలించే ప్రయత్నంలో పట్టుబడితే 300 డాలర్ల దాకా జరిమానా విధిస్తారు. ''ఇరు దేశాలకూ కొన్నేళ్లుగా నిద్ర లేకుండా చేస్తున్న ఫెంటానిల్ వంటి డ్రగ్స్ కంటే కూడా కెనడా నుంచి అమెరికాలోకి గుడ్ల అక్రమ రవాణాయే పెరిగిపోతోందంటే ఆశ్చర్యంగానే ఉంది. కానీ కళ్లెదుట కన్పిస్తున్న వాస్తవమిది'' అన్నారు కెనడా చాంబర్ ఆఫ్ కామర్స్ పాలసీ చీఫ్ మాథ్యూ హోమ్స్.

పెరుగుతున్న ఫ్లూ రిస్కు!

బర్డ్ ఫ్లూ దెబ్బకు కొన్నేళ్లుగా ఉత్తర అమెరికా ఖండమంతా అతలాకుతలమవుతోంది. కెనడాలో దీని తీవ్రత తక్కువగా ఉన్నా అమెరికా బాగా ప్రభావితమైంది. అక్కడ రెండు మూడేళ్లుగా కోట్లాది కోళ్లను హతమార్చాల్సి వచ్చింది. ఇది క్రమంగా దేశవ్యాప్తంగా తీవ్ర గుడ్ల కొరతకు దారితీసింది. దాంతో గుడ్ల ధరలు చుక్కలనంటుతున్నాయి. డజనుకు 5 డాలర్ల మార్కును దాటేసి ఆల్‌టైం రికార్డు సృష్టించాయి. షికాగో, శాన్‌ఫ్రాన్సిస్కో వంటి పలు ప్రధాన నగరాల్లోనైతే డజను గుడ్లు ఏకంగా 9 నుంచి 10 డాలర్ల దాకా పలుకుతున్న పరిస్థితి! గుడ్ల సంక్షోభం చేయి దాటిపోయిందని స్వయానా అధ్యక్షుడు ట్రంపే అంగీకరించారు! ఈ ఏడాది చివరకల్లా గుడ్ల ధరలు కనీసం మరో 50 శాతం దాకా పెరగవచ్చని అంచనా. దాంతో కొద్ది నెలలుగా స్మగ్లర్ల కన్ను గుడ్లపై పడింది. కెనడా నుంచి అమెరికాలోకి వాటి అక్రమ రవాణా ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోతోంది. అయితే దీనివల్ల బర్డ్ ఫ్లూతో పాటు ఇతరత్రా రోగాల రిస్కు పెరిగిపోతోందని అమెరికా ఆందోళన చెందుతోంది. కోళ్లు, గుడ్ల స్మగ్లింగ్‌పై ఉక్కుపాదం మోపేందుకు కెనడా, మెక్సికో సరిహద్దుల వద్ద నిఘాను మరింత కఠినతరం చేయాలంటూ ట్రంప్ సర్కారు తాజాగా ఆదేశాలు జారీచేసింది!



టెక్సాస్‌లోని ఎల్ పాసోలో స్వాధీనం చేసుకున్న గుడ్లు

అమెరికాలో అద్దెకు కోళ్లు

గుడ్ల సంక్షోభం పుణ్యమా అని అమెరికాలో ఇప్పుడు కోడి పెట్టలను అద్దెకిచ్చే సరికొత్త వ్యాపారం పుట్టుకొచ్చింది. అది ఇప్పుడక్కడ యమా జోరుగా సాగుతుండటం విశేషం. డజను గుడ్లకు 5 నుంచి 10 డాలర్ల దాకా పెట్టాల్సి రావడం అమెరికన్లను కలవరపరుస్తోంది. దీనికి బదులు ఇంటి పెరళ్లలో కోడిపెట్టలను సాకేందుకు వాళ్లు మొగ్గుచూపుతున్నారు. దాంతో దేశవ్యాప్తంగా కోడిపెట్టలకు చెప్పలేనంత డిమాండ్ ఏర్పడింది. దీన్ని సొమ్ము చేసుకునేందుకు రెంట్ ద చికెన్ వంటి పేర్లతో ఏకంగా కంపెనీలే పుట్టుకొచ్చాయి. ఆర్నెల్ల ప్రాతిపదికన కోడిపెట్టలను అద్దెకిస్తున్నాయి. కనీస అద్దె ప్యాకేజీలు 300 డాలర్ల నుంచి మొదలవుతున్నాయి. ఇందులో భాగంగా రెండు పెట్టలతో పాటు వాటికి ఆర్నెల్ల పాటు కావాల్సిన దాణాను కూడా కంపెనీలే ఇస్తాయి. కోళ్ల గూడు కూడా సమకూరుస్తాయి. ఆరోగ్యకరమైన పెట్ట వారానికి ఐదారు దాకా గుడ్లు పెడుతుంది. ఆ లెక్కన రెండు కోళ్లు ఆర్నెల్లకు కనీసం 250 గుడ్లు పెడతాయన్న మాట. వాటిని మార్కెట్లో కొనాలంటే ప్రస్తుత రేట్లను బట్టి కనీసం 80 నుంచి 160 డాలర్లకు పైనే పెట్టాల్సి ఉంటుంది. కోళ్లను సాకడం ద్వారా ఏ రోజుకు ఆ రోజు తాజా గుడ్లు దొరుకుతుండటం అమెరికన్లను బాగా ఆకర్షిస్తోంది. అంతేగాక గుడ్లను పొదిగించి కోళ్ల సంఖ్యను ఇబ్బడిముబ్బడిగా పెంచుకుంటున్నారు. కాంట్రాక్టు ముగిశాక అవి వారికే సొంతమవుతున్నాయి. వాటిని అద్దెకిస్తూ సైడ్ వ్యాపారం చేస్తున్న వారికి కూడా కొదవ లేదు.

- సాక్షి, నేషనల్ డెస్క్

ఇజ్రాయెలీ సహా ఇద్దరిపై గ్యాంగ్ రేప్

మరో ముగ్గురు టూరిస్టులపై దాడి..

- కాలువలోకి నెట్టివేయడంతో ఒకరు మృతి
- కర్ణాటకలోని హంపిలో దారుణం ● నిందితుల్లో నలుగురి అరెస్ట్

సాక్షి, బళ్లారి: కర్ణాటకలోని చారిత్రక హంపి పట్టణంలో దారుణం చోటుచేసుకుంది. ఇజ్రాయెల్‌కు చెందిన మహిళతోపాటు వారికి ఆతిథ్యమిస్తున్న స్థానిక మహిళపై దుండగులు దాడి చేసి తీవ్రంగా గాయపర్చడంతోపాటు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. అడ్డుకున్న ముగ్గురు పురుష పర్యాటకులపై దుండగులు దాడి చేసి, తీవ్రంగా కొట్టారు. తుంగభద్ర కాలువలోకి నెట్టివేయగా వీరిలో ఒకరు ప్రాణాలు కోల్పోయారు. ఘటనపై బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు నలుగురు నిందితులను పట్టుకున్నారు. పరారీలో ఉన్న మరొకరి కోసం గాలింపు చేపట్టారు. గురువారం రాత్రి 11 గంటల సమయంలో గంగావతి సమీపంలోని సన్నాపుర వద్ద ఉన్న తుంగభద్ర కాలువ ఒడ్డున ఈ దారుణం చోటుచేసుకుంది. ఒడిశాకు చెందిన బిదాష్, మహారాష్ట్ర వాసి పంకజ్, అమెరికా పౌరుడు డానియెల్‌తోపాటు, ఇజ్రాయెల్ పర్యాటకురాలు, వీరికి ఆతిథ్యమిచ్చిన 29 ఏళ్ల స్థానిక మహిళ..వీరంతా కలిసి తుంగభద్ర కాలువ ఒడ్డున గిటారు వాయిస్తూ సరదాగా కాలక్షేపం చేస్తున్నారు. అదే సమయంలో, కొందరు దుండగులు వీరి వద్దకు వచ్చి, పెట్రోల్ బంక్ ఎక్కడుందంటూ ప్రశ్నించారు. సనపూర్‌కు వెళ్లాలని బదులివ్వడంతో రూ.100 ఇవ్వాలంటూ బెదిరింపులకు దిగారు. తెలుగు, కన్నడలో వారిని దూషించడం మొదలుపెట్టారు. దుండగుల్లో ఇద్దరు ఇజ్రాయెల్ మహిళతోపాటు ఆతిథ్యమిచ్చిన స్థానిక మహిళపైనా అత్యాచారానికి పాల్పడ్డారు మూడో వ్యక్తి ముగ్గురు పురుషులను తుంగభద్ర కాలువలోకి నెట్టివేశాడు. దీంతో, వీరిలో డానియెల్, పంకజ్‌లు ప్రాణాలతో బయటపడగా గల్లంతైన బిదాష్ మృతదేహం శనివారం ఉదయం కాలువలో దొరికింది. దుండగులు అంతటితో ఆగక స్థానిక మహిళను తీవ్రంగా కొట్టారు. ఆమె బ్యాగులో ఉన్న రెండు సెల్‌ఫోన్లు, రూ.9,500 నగదును దోచుకున్నారు. అనంతరం దుండగులు బైక్‌పై అక్కడి నుంచి పరారయ్యారు. శుక్రవారం మధ్యాహ్నం బాధితుల ఫిర్యాదు మేరకు గంగావతి రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. బాధిత మహిళలిద్దరూ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని కొప్పాల్ ఎస్పీ రామ్ ఎల్ సిద్ధి చెప్పారు. బాధితులు తెలిపిన వివరాల మేరకు నిందితులను గంగావతి పట్టణానికి చెందిన మల్లేశ్, చేతన్ సాయి, మోహన్, చన్నదాసర అనే వారిని పట్టుకున్నామన్నారు. ఐదో వ్యక్తిని పట్టుకునేందుకు ప్రత్యేకంగా ఆరు పోలీస్ బృందాలను రంగంలోకి దించామని చెప్పారు.

మణిపూర్‌లో మళ్లీ ఘర్షణలు
ఒకరు మృతి, 40 మందికి గాయాలు

ఇంఫాల్: మణిపూర్ వ్యాప్తంగా శనివారం నుంచి అన్ని రకాల వాహనాలు స్వేచ్ఛగా రాకపోకలు సాగించవచ్చంటూ కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఇచ్చిన ఆదేశాలు ఉద్రిక్తతలకు దారి తీశాయి. భద్రతా సిబ్బంది, కుకీ వర్గం ప్రజల మధ్య జరిగిన ఘర్షణల్లో నిరసనకారుడొకరు చనిపోగా 40 మంది గాయపడ్డారు. వీరిలో 16 మంది స్థానికులు కాగా, 27 మంది భద్రతా సిబ్బంది ఉన్నారు. హోం మంత్రి అమిత్ షా ఆదేశాలను నిరసిస్తూ కంగ్‌పోక్పి వద్ద రెండో నంబర్ ఇంఫాల్-దిమాపూర్ జాతీయ రహదారిపై కుకీలు నిరసన చేపట్టారు. అడ్డుకునేందుకు యత్నించిన భద్రతా సిబ్బందితో ఘర్షణకు దిగారు. అదే సమయంలో ప్రైవేట్ వాహనాలకు నిరసనకారులు నిప్పుపెట్టారు. మండుతున్న టైర్లను రోడ్డుపై పడేశారు. ఇంఫాల్ నుంచి సేనాపతి జిల్లా వైపు వెళ్తున్న రాష్ట్ర రవాణా సంస్థకు చెందిన బస్సుకు నిప్పుపెట్టేందుకు ప్రయత్నించడంతో పరిస్థితి చేయి దాటింది. దీంతో, భద్రతా సిబ్బంది వారిని చెదరగొట్టేందుకు టియర్ గ్యాస్ ప్రయోగించారు. ఘర్షణల్లో ఓ వ్యక్తి తీవ్ర గాయాలతో చనిపోయినట్లు పోలీసులు తెలిపారు. అయితే, మైతేయి వర్గం చేపట్టిన శాంతి ర్యాలీని పోలీసులు కాంగ్‌పోక్పికి రాకముందే అడ్డుకున్నారు. ర్యాలీ ముందుకు సాగాలంటే ప్రభుత్వం ఏర్పాటు చేసిన బస్సుల్లోనే వెళ్లాలని వారికి షరతు విధించారు. చివరికి వారందరినీ 10 ప్రభుత్వ బస్సుల్లో తరలిస్తుండగా కుకీల మెజారిటీ ప్రాంతమైన కాంగ్‌పోక్పి వద్ద అడ్డుకుని, ఒక బస్సుకు నిప్పంటించేందుకు ప్రయత్నించారని పోలీసులు తెలిపారు. టియర్ గ్యాస్ ప్రయోగించి, నిరసన కారులను చెదరగొట్టాక మైతేయి శాంతి ర్యాలీ నిర్వాహకులున్న బస్సులు ముందుకు సాగాయని చెప్పారు. ఘటన అనంతరం ఆ ప్రాంతంలో కర్ఫ్యూ అమల్లోకి వచ్చిందని చెప్పారు.

నారీ శక్తికి సలాం

మహిళా దినోత్సవంలో ప్రధాని మోదీ

- స్త్రీల భద్రతే ప్రాథమ్యమని వెల్లడి

నవసారి (గుజరాత్): ఏ సమాజంలోనైనా, దేశంలోనైనా మహిళలను గౌరవించడమే ప్రగతి దిశగా తొలి అడుగని ప్రధాని నరేంద్ర మోదీ అభిప్రాయపడ్డారు. మహిళల సారథ్యంలో సమాజ ప్రగతి దిశగా భారత్ కొన్నేళ్లుగా ముందుకు సాగుతోందన్నారు. ''నారీ శక్తికి నా నమస్సులు. మహిళల ఆత్మగౌరవానికి, భద్రతకు, సాధికారతకు మా ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యమిస్తోంది. వారిపై నేరాలకు అడ్డుకట్ట వేసేందుకు నూతన చట్టాల్లో మరిన్ని కఠినమైన నిబంధనలు పొందుపరిచాం. వలస పాలన నాటి కాలం చెల్లిన చట్టాల స్థానంలో తెచ్చిన పూర్తి దేశీయ చట్టాల్లో అత్యాచారం వంటి దారుణ నేరాలకు మరణశిక్షకు వీలు కల్పించాం. ఫాస్ట్ ట్రాక్ కోర్టులు తదితరాల ద్వారా మహిళలకు సత్వర న్యాయం అందిస్తున్నాం. వారిపై తీవ్ర నేరాల్లో 45 నుంచి 60 రోజుల్లోపే తీర్పులు వచ్చేలా చర్యలు చేపట్టాం. విచారణ క్రమంలో బాధిత మహిళలకు ఎలాంటి ఇబ్బందులూ ఎదురవకుండా నిబంధనలు పొందుపరిచాం''అని వివరించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం గుజరాత్‌లో నవసారి జిల్లా వన్సీ బోర్సీ గ్రామంలో ప్రత్యేక కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. అనంతరం లక్షన్నర మందికి పైగా మహిళలు హాజరైన భారీ బహిరంగ సభను ఉద్దేశించి ప్రసంగించారు. ''ఆడపిల్ల ఆలస్యంగా ఇంటికొస్తే పెద్దవాళ్లు లక్ష ప్రశ్నలడుగుతారు. అదే మగపిల్లాడు ఆలస్యమైతే పట్టించుకోరు. కానీ అతన్ని కూడా కచ్చితంగా నిలదీయాలి''అని తల్లిదండ్రులకు సూచించారు.

ప్రపంచంలోకెల్లా సంపన్నుడిని నేనే

తాను ప్రపంచంలోకెల్లా సంపన్నుడిని అంటూ ఈ సందర్భంగా మోదీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ''ఇది విని కొందరికి ఆశ్చర్యంతో కనుబొమ్మలు ముడిపడవచ్చు. కానీ ఇది నిజం. కాకపోతే సంపదపరంగా కాదు. కోట్లాది మంది తల్లులు, సోదరీమణులు, కూతుళ్ల ఆశీస్సులు నాకున్నాయి. ఆ రకంగా నేను అందరి కంటే సంపన్నుడిని. వారి ఆశీస్సులే నాకు అతి పెద్ద బలం, నా పెట్టుబడి. అవే నాకు తిరుగులేని రక్షణ కవచం కూడా''అని వివరించారు.

ప్రధాని సోషల్ ఖాతాల్లో... మహిళల విజయగాథలు

పలు రంగాల్లో తమదైన ముద్ర వేసిన పలువురు మహిళా ప్రముఖులు శనివారం ప్రధాని మోదీ సోషల్ మీడియా హ్యాండిళ్లను ఒక రోజు పాటు తామే నిర్వహించారు. తమ విజయగాథలను పంచుకున్నారు. కలలను నిజం చేసుకునేందుకు అమ్మాయిలు ధైర్యంగా ముందడుగు వేయాలని పిలుపునిచ్చారు. చెస్ గ్రాండ్‌మాస్టర్ ఆర్ వైశాలి, పారిశ్రామికవేత్తగా మారిన రైతు అనితా దేవి, అణు శాస్త్రవేత్త ఎలినా మిశ్రా, అంతరిక్ష శాస్త్రవేత్త శిల్పి సోనీ తదితరులు వీరిలో ఉన్నారు. గ్రాండ్ మాస్టర్ ప్రజ్ఞానంద సోదరి అయిన వైశాలి ఆరేళ్ల వయసు నుంచే చెస్ ఆడుతున్నారు. రైతు ఉత్పత్తుల కంపెనీ ద్వారా తన గ్రామానికి చెందిన వందలాది మంది మహిళలకు ఉపాధి కల్పించినట్టు అనితాదేవి వివరించారు. ఇది వారికి సంపాదనతో పాటు ఆత్మగౌరవం, ఆత్మవిశ్వాసం కూడా కల్పించిందన్నారు. మహిళలకు ఆర్థిక సాధికారత అవసరాన్ని ఫ్రాంటియర్ మార్కెట్స్ సీఈఓ అజితా షా వివరించారు. అనంతరం వారి విజయగాథలను ప్రస్తుతిస్తూ మోదీ పలు పోస్టులు చేశారు. వికసిత భారత్ లక్ష్యసాధనలో మహిళలదే కీలక పాత్ర అని అభిప్రాయపడ్డారు.

మహిళా పోలీసుల రక్షణ

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నవసారి సభలో ప్రధాని మోదీకి పూర్తిగా మహిళలతో కూడిన అంగరక్షక దళం భద్రత కల్పించడం విశేషం. బహిరంగ సభతో పాటు ఆయన రక్షణ బాధ్యతలను కూడా 2,500 మందికి పైగా మహిళా పోలీసు సిబ్బందే చూసుకున్నారు. వీరిలో 2,145 మంది కానిస్టేబుళ్లు, 187 మంది ఎస్సైలు, 61 మంది ఇన్‌స్పెక్టర్లు, 19 మంది డీఎస్పీలు, ఐదుగురు ఎస్పీలు, ఒక డీఐజీ తదితరులున్నారు. హెలిప్యాడ్ వద్ద మోదీ రాక మొదలుకుని సభనుద్దేశించి ప్రసంగం, లఖ్‌పతీ దీదీ లబ్ధిదారులకు సన్మానం, అనంతరం ఆయన వెనుదిరిగేదాకా సర్వం వారి కనుసన్నల్లోనే సాగింది. మొత్తం ఏర్పాట్లను అదనపు డీజీపీ నిపుణా తోర్వానే పర్యవేక్షించారు. పురుష సిబ్బంది పార్కింగ్, ట్రాఫిక్ విధులకే పరిమితమయ్యారు. ఇంతటి భారీ కార్యక్రమ భద్రత ఏర్పాట్లను పూర్తిగా మహిళా పోలీసు సిబ్బందే చూసుకోవడం దేశంలో ఇదే తొలిసారి.



కన్ఫార్మ్ టికెట్ ఉంటేనే ప్లాట్‌ఫామ్‌పైకి ఎంట్రీ!

సాక్షి, న్యూఢిల్లీ: రైలులో ప్రయాణించాలనుకునే వారు ఇకపై కన్ఫార్మ్ టికెట్ ఉంటేనే ప్లాట్‌ఫామ్ పైకి వెళ్ల గలుగుతారు. పైలట్ ప్రాజెక్టు కింద న్యూఢిల్లీ, ఆనంద్ విహార్, సూరత్, వారణాసి, అయోధ్య, పాట్నా రైల్వే స్టేషన్లలో ఈ వ్యవస్థను తక్షణమే అమల్లోకి తెస్తున్నారు. తాజాగా కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ అధ్యక్షతన ఉన్నత స్థాయి సమావేశం జరిగింది. రైల్వే స్టేషన్లలో ప్రయాణికుల రద్దీ నియంత్రణపై చర్చించి పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. దేశవ్యాప్తంగా 60 ప్రధాన రైల్వే స్టేషన్లలోని అనధికార ఎంట్రీ పాయింట్లను మూసివేసి.. కన్ఫార్మ్ టికెట్లు ఉన్న ప్రయాణికులను మాత్రమే ప్లాట్‌ఫామ్‌లపైకి అనుమతించాలని నిర్ణయించారు. మహా కుంభమేళా సందర్భంగా దేశంలోని 60 రైల్వే స్టేషన్లలో తాత్కాలికంగా వెయింటింగ్ రూములు ఏర్పాటు చేశారు. న్యూఢిల్లీ, సూరత్, పాట్నాల్లో రద్దీని నియంత్రించడంలో ఇవి ఎంతో ఉపయోగపడ్డాయి. రైలు వచ్చిన తర్వాతే ప్రయాణికులను ప్లాట్‌ఫామ్‌పైకి అనుమతించారు. ఇదే పద్ధతిని ఇప్పుడు శాశ్వతంగా అమలు చేయాలని నిర్ణయించారు. 60 స్టేషన్లలో తాత్కాలికంగా నిర్మించిన వెయిటింగ్ రూములను శాశ్వతంగా ఉపయోగపడేలా మార్చబోతున్నారు. పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసిన రైల్వే స్టేషన్లలో రైళ్ల సామర్థ్యం మేరకే టికెట్లు విక్రయిస్తారు. ఈ స్టేషన్లలో రైల్వే సిబ్బందికి ప్రత్యేక డ్రెస్ కోడ్ కూడా ఉంటుంది. కుంభమేళా సందర్భంగా ఢిల్లీ స్టేషన్‌లో జరిగిన తొక్కిసలాట నేపథ్యంలో ప్రయాణికుల భద్రతపై రైల్వే శాఖ ఈ కీలక నిర్ణయాలు తీసుకుంది.



ఐఎస్ఎస్ కమాండ్ బాధ్యతలు..

రష్యా వ్యోమగామికి అప్పగించిన సునీత

వాషింగ్టన్: కేవలం పది రోజుల మిషన్ కోసం అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం(ఐఎస్ఎస్)కి వెళ్లి అనుకోని పరిస్థితుల్లో 9 నెలలపాటు అక్కడే ఉండిపోయిన భారత సంతతి అమెరికా వ్యోమగామి సునీతా విలియమ్స్ ఈ నెల 19న తిరుగు పయనం కానున్నారు. ఇందుకు సన్నాహకంగా ఆమె అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం(ఐఎస్ఎస్)కమాండ్ బాధ్యతలను శనివారం రష్యా వ్యోమగామి అలెక్సీ ఓవ్చినిన్‌కు అధికారికంగా అప్పగించారు. ఈ నెల 12 లేదా 13వ తేదీన ప్రయోగించే స్పేస్ ఎక్స్ క్రూ-10 మిషన్‌లో నాసా వ్యోమగాములు అన్నె మెక్ క్లయిన్, నికోల్ అయెర్స్‌తోపాటు జపాన్‌కు చెందిన టకుయా ఒనిషి, రష్యా వ్యోమగామి కిరిల్ పెస్కోవ్ ఉంటారు. ఐఎస్ఎస్‌లో కొత్త వారికి బాధ్యతలను అప్పగించే కార్యక్రమం మరో వారంపాటు కొనసాగనుంది. మార్చి 19వ తేదీన సునీతతోపాటు నాసాకే చెందిన బుచ్ విల్మోర్, నిక్ హేగ్, రష్యా వ్యోమగామి అలెగ్జాండర్ గొర్బునోవ్‌లు స్పేస్ ఎక్స్ క్రూ-10 మిషన్‌లో భూమికి తిరిగి రానున్నారు. నూతనంగా ఐఎస్ఎస్ కమాండ్ బాధ్యతలు చేపట్టిన ఓవ్చినిన్ ఏప్రిల్ వరకు అక్కడే ఉంటారు. గతేడాది జూన్‌లో బుచ్ విల్మోర్‌తో కలిసి సునీతా విలియమ్స్ బోయింగ్ స్టార్ లైనర్‌లో ఐఎస్ఎస్‌కు చేరుకోవడం, స్టార్ లైనర్‌లో సాంకేతిక సమస్యల కారణంగా అక్కడే ఇన్నాళ్లూ చిక్కుకుపోవడం తెలిసిందే.

సుంకాలపై ఇప్పుడే స్పందించలేం

ట్రంప్ ప్రకటనపై భారత్

న్యూఢిల్లీ/న్యూయార్క్/వాషింగ్టన్: అమెరికాపై సుంకాలను భారీగా తగ్గించేందుకు భారత్ ఒప్పుకుందన్న అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటనపై కేంద్రం ఆచితూచి స్పందించింది. ''ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం (బీటీఏ)పై భారత్, అమెరికా మధ్య చర్చలు ఇప్పుడిప్పుడే మొదలయ్యాయి. టారిఫ్‌ల కోత తదితరాలపై ఈ దశలో మాట్లాడటం తొందరపాటే కాగలదు''అని కేంద్ర ప్రభుత్వ వర్గాలు శనివారం స్పష్టం చేశాయి. ''చర్చల్లో భాగంగా ఇరు దేశాలూ తమ ప్రయోజనాల పరిరక్షణకు ప్రయత్నించడం, అందుకు మార్గాలను అన్వేషించడం సహజం. అయితే కూలంకషంగా చర్చించాకే వాటిపై నిర్ణయాలు జరుగుతాయి''అని పేర్కొన్నాయి. ఈ విషయమై శనివారం అడిగిన మీడియా ప్రశ్నలకు సూటిగా బదులిచ్చేందుకు విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రం మిస్రీ నిరాకరించారు. ఇంకా చర్చలు జరుగుతున్న అంశంపై మాట్లాడటం సరికాదన్నారు. అయితే, ఇటీవలి కాలంలో పలు దేశాలతో ద్వైపాక్షిక ఒప్పందాల్లో భాగంగా టారిఫ్‌లను భారత్ వీలైనంతగా సరళీకరిస్తూ వస్తోందని ఆయన గుర్తు చేశారు. భారత్ సుంకాలు మరీ ఎక్కువగా ఉన్నాయంటూ ట్రంప్ తరచూ అసంతృప్తి వెళ్లగక్కుతుండటం తెలిసిందే. భారత్‌ను టారిఫ్ కింగ్‌గా అభివర్ణించడమే గాక ఏప్రిల్ 2 నుంచి అదే మోతాదులో ప్రతీకార సుంకాలు తప్పవంటూ హెచ్చరించారు! తన హెచ్చరికల నేపథ్యంలో భారత్ దిగొచ్చి సుంకాలను భారీగా తగ్గించేందుకు అంగీకరించిందని శుక్రవారం ప్రకటించారు.

గాజాను ఖాళీ చేసేందుకు ఒప్పుకోం

ట్రంప్ ప్రతిపాదనపై ముస్లిం దేశాల ధ్వజం

డెయిర్ అల్ బలా (గాజా): పాలస్తీనావాసులందరినీ గాజా నుంచి ఖాళీ చేయించాలన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతిపాదనపై ముస్లిం దేశాలు తీవ్ర ఆగ్రహం వెలిబుచ్చాయి. దాన్ని ముక్తకంఠంతో తిరస్కరిస్తున్నట్టు శనివారం ప్రకటించాయి. గాజా పునర్నిర్మాణానికి దన్నుగా నిలవాలన్న ఈజిప్టు ప్రత్యామ్నాయ ప్రణాళికను పూర్తిగా సమర్థిస్తున్నట్టు స్పష్టం చేశాయి. ఆర్గనైజేషన్ ఆఫ్ ఇస్లామిక్ కోఆపరేషన్ (ఓఐసీ)లో భాగస్వాములైన పలు 57 ముస్లిం దేశాల విదేశాంగ మంత్రులు శనివారం సౌదీ అరేబియాలో అత్యవసరంగా భేటీ అయ్యారు. గాజా అంశంపైనే ప్రధానంగా చర్చించారు. ఈజిప్టు ప్రతిపాదించిన గాజా పునర్నిర్మాణ ప్రణాళికే ఏకైక పరిష్కారమని స్పష్టం చేశారు. పాలస్తీనావాసులను గాజా నుంచి ఖాళీ చేయించజూడటం అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధమే గాక మానవత్వానికే మాయని మచ్చ కాగలదని మంత్రులు దుయ్యబట్టారు. సిరియాను తిరిగి ఓఐసీ సభ్య దేశంగా చేర్చుకోవాలని భేటీ నిర్ణయించింది. మరోవైపు ఇజ్రాయెల్‌తో రెండో దశ కాల్పుల విరమణకు సంబంధించి ఈజిప్టు, ఖతార్ మధ్యవర్తుల నుంచి సానుకూల సంకేతాలు అందుతున్నట్టు పాలస్తీనా ఉగ్ర సంస్థ హమాస్ వెల్లడించింది.

యూదు వివక్షను అడ్డుకోరా?

- కొలంబియా వర్సిటీపై ట్రంప్ ఆగ్రహం
- నిధుల్లో 40 కోట్ల డాలర్ల మేరకు కోత

వాషింగ్టన్: డొనాల్డ్ ట్రంప్ షాకుల పరంపర తన, పర అనే తేడా లేకుండా కొనసాగుతోంది. క్యాంపస్‌లో యూదు వివక్షను, యూదు విద్యార్థులపై వేధింపులు, దాడులను అడ్డుకోవడంలో విఫలమైందంటూ న్యూయార్క్‌లోని ప్రఖ్యాత కొలంబియా యూనివర్సిటీపై అధ్యక్షుడు తాజాగా కన్నెర్రజేశారు. అందుకు శిక్షగా వర్సిటీకి అందుతున్న ప్రభుత్వ నిధుల్లో ఏకంగా 40 కోట్ల డాలర్ల మేరకు కోత పెడుతున్నట్టు ప్రకటించారు! గాజాపై యుద్ధంలో ఇజ్రాయెల్‌కు అమెరికా మద్దతు నేపథ్యంలో గతేడాది పాలస్తీనా అనుకూల నిరసనలు, ఆందోళనలతో వర్సిటీ అట్టుడికిపోవడం తెలిసిందే. ఇలాంటి చట్టవిరుద్ధ నిరసనలకు వేదికలుగా మారే విద్యా సంస్థలు, వర్సిటీలకు నిధులు నిలిపేస్తానని గత వారమే ట్రంప్ హెచ్చరించారు. క్యాంపస్‌లో యూదు విద్యార్థులు నిరంతర వేధింపులు, వివక్ష, హింస ఎదుర్కొంటున్నా వర్సిటీ పాలక వర్గం చేష్టలుడిగిందని అమెరికా విద్యా శాఖ మంత్రి లిండా మెక్‌మోహన్ ఆరోపించారు. ''దీన్ని సహించేది లేదు. కొలంబియాతో పాటు ఇతర వర్సిటీలకూ ఇదో హెచ్చరిక''అని ఆమె చెప్పారు. పరిశోధనలు తదితరాలను ఈ నిధుల కోత తీవ్రంగా ప్రభావితం చేస్తుందని వర్సిటీ తాత్కాలిక ప్రెసిడెంట్ కత్రీనా ఆర్మ్‌స్ట్రాంగ్ ఆందోళన వెలిబుచ్చారు.

ఉక్రెయిన్‌పై రష్యా బాంబుల వర్షం

20 మంది మృతి, ఐదుగురు చిన్నారులు సహా 50 మందికి గాయాలు

- భవనాలు, వాహనాలపై బాలిస్టిక్ క్షిపణులు, రాకెట్లు, డ్రోన్లతో దాడి

కీవ్: శాంతి చర్చలు కొనసాగుతుండగానే ఉక్రెయిన్‌పై రష్యా బాంబుల వర్షం కురిపించింది. తూర్పు నగరం డోబ్రోపిలియాపై రష్యా క్షిపణి, డ్రోన్ దాడుల్లో కనీసం 20 మంది మృతి చెందారు. 50మందికి పైగా గాయపడ్డారు. వారిలో ఐదుగురు చిన్నారులున్నారు. దాడుల్లో ఎనిమిది బహుళ అంతస్తుల భవనాలు, 30 వాహనాలు ధ్వంసమైనట్టు ఉక్రెయిన్ ఓ ప్రకటనలో తెలిపింది. పాక్షికంగా ధ్వంసమైన భవనాలు, శిథిలాలను తొలగిస్తున్న రెస్క్యూ సిబ్బంది ఫొటోలను విడుదల చేసింది. డోబ్రోపిలియా తూర్పు ఉక్రెయిన్‌లోని డోనెట్స్క్ ప్రాంతంలో ఉంది. యుద్ధానికి ముందు ఇక్కడ జనాభా 28,000. నగరంపై రష్యా కొన్ని వారాలుగా దాడి చేస్తోంది. ఖర్కీవ్ ప్రాంతంలో శుక్రవారం రాత్రి జరిగిన డ్రోన్ దాడిలో కనీసం ముగ్గురు మరణించారని, ఏడుగురు గాయపడ్డారని ఉక్రెయిన్ తెలిపింది. రెండు ఇస్కందర్-ఎం బాలిస్టిక్ క్షిపణులు, ఒక ఇస్కందర్-కె క్రూయిజ్ క్షిపణితో పాటు 145 డ్రోన్లతో రష్యా రాత్రికి రాత్రే ఉక్రెయిన్‌పై దాడి చేసింది. వైమానిక దళాలు ఒక క్రూయిజ్ క్షిపణిని, 79 డ్రోన్లను కూల్చివేశాయి. ఉక్రెయిన్‌కు నిఘా సమాచారాన్ని అమెరికా నిలిపేశాక రష్యా చేసిన పెద్ద క్షిపణి దాడి ఇదే. దాడుల్లో విద్యుత్, గ్యాస్ మౌలిక సదుపాయాలు దెబ్బతిన్నాయి.

సాక్షి హైదరాబాద్

ఆదివారం । 9 । మార్చి । 2025



మహిళల సంక్షేమానికి ప్రాధాన్యం

రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యమిస్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శనివారం ఆయన ఎంజీబీఎస్‌ను సందర్శించారు. -8లో




రెక్కలు తొడిగిన.. రెపరెపలు..

విద్యార్థులకు ఆమె గణితం నేర్పాలనుకున్నారు. కానీ విధి లిఖితం.. ఆమెకు కొత్త రెక్కలు తొడిగింది. పక్షుల ప్రేమలో వేల మైళ్లు ప్రయాణించేలా చేసింది. - సిటీప్లస్‌లో

గరిష్టం/కనిష్టం
37.0/19.0

వాతావరణం

నగరంలో ఆదివారం ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గరిష్టంగా 37, కనిష్టంగా 19 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది.



నిజాం కాలేజీకి యూజీసీ న్యాక్ 'ఎ' గ్రేడ్ గుర్తింపు



వీసీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నిజాం కాలేజీ ప్రిన్సిపాల్ రాజశేఖర్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ అనుబంధ నిజాం కాలేజీకి యూజీసీ న్యాక్ 'ఎ' గ్రేడ్ గుర్తింపు లభించింది. సహకరించిన ఓయూ వీసీ ప్రొ.కుమార్‌కు నిజాం కాలేజీ ప్రిన్సిపల్ ప్రొ.ఏవీ రాజశేఖర్, అధ్యాపకుల బృందం వీసీకి పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. స్వయం ప్రతిపత్తి గల నిజాం కాలేజీ అధ్యాపకులు, ఉద్యోగులు కలిసికట్టుగా పనిచేసి న్యాక్ 'ఎ' గ్రేడ్‌ను సాధించినందుకు వీసీ అభినందించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి దుర్మరణం

సనత్‌నగర్: నగరంలో శనివారం జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు దుర్మరణం పాలయ్యారు. వివరాలు ఇలా ఉన్నాయి.. అసోం రాష్ట్రం నాగోల్ జిల్లాకు చెందిన రాహుల్ సతానమి (24), రజినీ సతానమి (23), బాజీ సతానమి (19)లు బతుకుదెరువు కోసం నగరానికి వలస వచ్చి ఫతేనగర్ ప్రాంతంలోని దీన్‌దయాళ్‌నగర్‌లో ఉంటున్నారు. స్థానికంగా చిన్న చిన్న ఉద్యోగాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ ముగ్గురూ శుక్రవారం అర్ధరాత్రి అమీర్‌పేట వైపు నుంచి భరత్‌నగర్ వైపు బైక్‌పై వెళ్తున్నారు. ట్రిపుల్ రైడింగ్‌తో పాటు ర్యాష్‌గా వాహనాన్ని నడిపే క్రమంలో రాత్రి 1.10 గంటల సమయంలో ఎర్రగడ్డ పిల్లర్ నెంబర్ 943 వద్దకు రాగానే బైక్ అదుపు తప్పడంతో డివైడర్‌ను ఢీకొట్టారు. ఈ ఘటనలో వాహనం నడుపుతున్న రాహుల్ సతానమి తీవ్ర గాయాలకు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. గాయాలకు గురైన రజినీ సతానమి, బాజీ సతానమీలను చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సనత్‌నగర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు తెలిపారు.

బాచుపల్లిలో బీటెక్ విద్యార్థి..



కేతావత్ నాను (ఫైల్)

నిజాంపేట్: బాచుపల్లిలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బీటెక్ విద్యార్థి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా బాన్సువాడ నియోజకవర్గం నసూల్‌రాబాద్ మండలం బొప్పస్‌పల్లి గ్రామానికి చెందిన కేతావత్ శంకర్ నాయక్, పార్వతిల కుమారుడు కేతావత్ నాను (21) నగరంలోని వీఎన్‌ఆర్ విజ్ఞాన జ్యోతి ఇంజినీరింగ్ కాలేజీలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. కార్తీక్, విశ్వంత్, కేతావత్ నానులు హాస్టల్ నుంచి బయటికి వస్తూ ఇండియన్ పెట్రోల్ బంక్ ప్రగతినగర్ దగ్గర స్కూటీపై వెళ్తూ ప్రమాదానికి గురయ్యారు. గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో కేతావత్ నాను అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి.

భావి ఇంజినీర్ల పరిశోధనలు అదుర్స్



విద్యార్థులు తయారు చేసిన అత్యాధునిక వీల్ చైర్

రాయదుర్గం: గచ్చిబౌలిలోని ట్రిపుల్ ఐటీ హైదరాబాద్‌లో రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ షోకేస్ కార్యక్రమాన్ని ట్రిపుల్ ఐటీ హైదరాబాద్ డైరెక్టర్ ప్రొఫెసర్ పీజే నారాయణన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా 'టెక్ ఫర్ సస్టెయినబుల్ ఫ్యూచర్స్' అనే థీమ్‌తో పరిశోధన ప్రాజెక్టులను రెండు రోజుల పాటు ప్రదర్శించేందుకు ఏర్పాట్లు చేశారు. ఏడాది పొడవునా విద్యార్థులు ట్రిపుల్ ఐటీలోని 28 పరిశోధక కేంద్రాలలో తాము చేసిన పరిశోధనలను 300 పోస్టర్లు, డెమోస్, మోడల్స్ రూపంలో ప్రదర్శించి ఆకట్టుకున్నారు. విద్యార్థులు రూపొందించిన అటానమస్ వీల్‌చైర్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ముఖ్యంగా వ్యక్తి కంటి, వైకల్యాలున్న వ్యక్తుల కోసం ఈ వీల్‌చైర్‌ను రూపొందించారు. భారత పర్యావరణ పరిస్థితులలో డ్రైవర్ ప్రవర్తనను గుర్తించే డ్రైవింగ్ సిమ్యులేటర్ ప్లాట్‌ఫామ్‌ను విద్యార్థులు ప్రదర్శనలో ఉంచారు.



రన్‌లో పాల్గొన్న ఔత్సాహికులు

మహిళల్ని ఎదగనిద్దాం.. గౌరవిద్దాం

మంత్రి సీతక్క

- ఉత్సాహంగా 5కే రన్

మహిళల్ని ఎదగనిద్దాం.. మహిళల్ని గౌరవిద్దాం.. మహిళల్ని ఆత్మగౌరవంతో తలెత్తుకుని తిరగనిద్దామని మంత్రి సీతక్క అన్నారు. శనివారం ఉదయం నెక్లెస్ రోడ్డు పీపుల్స్ ప్లాజా వేదికగా ఉమెన్ సేఫ్టీ వింగ్, హైదరాబాద్ సిటీ పోలీసు శాఖ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన 5కే రన్‌ను ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్‌లతో కలిసి మంత్రి సీతక్క ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ.. 'మహిళలు ఫిజికల్ ఫిట్‌నెస్‌తో పాటు మానసిక స్థైర్యాన్ని పెంచుకోవాన్నారు. మహిళల రక్షణకు పోలీసులు ఎంతో కృషి చేస్తున్నారని కొనియాడారు. మత్తు నుంచి మన సమాజాన్ని కాపాడుకుని, వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించుకునేలా ముందడుగు వేయాలని మంత్రి సూచించారు. అనంతరం పీపుల్స్ ప్లాజా నుంచి ప్రారంభమైన 5కే రన్ సచివాలయం మీదుగా తిరిగి పీపుల్స్ ప్లాజా వరకు సాగింది. రన్‌లో పోలీసు ఉన్నతాధికారులు, హైదరాబాద్ సిటీ సెక్యూరిటీ సర్వీసెస్, ఉమెన్ సేఫ్టీ వింగ్ అధికారులు, మహిళలు, యువతీ యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. - ఖైరతాబాద్



పరుగును ప్రారంభిస్తున్న మంత్రి సీతక్క, సీపీ సీవీ ఆనంద్

సైన్ బోర్డే.. గైడ్!



చారిత్రక, పర్యాటక ప్రాంతాల్లో..

- తొలుత చార్మినార్ మార్గంలో
- ఏర్పాట్లకు సిద్ధమైన 'కుడా'
- 'బూస్ట్' పద్ధతిలో అమలుకు టెండర్

సాక్షి, సిటీబ్యూరో: పాతబస్తీ అనగానే గుర్తుకొచ్చేది చార్మినార్. అలాగే.. చార్మినార్ అనగానే గుర్తుకొచ్చేవి ముత్యాలు, గాజులు, చవక ధరలకే దుస్తులు. కానీ.. చార్మినార్ దగ్గరే ఉన్నా గాజులుండే లాడ్‌బజార్ ఎటువైపు ఉందో, వస్త్ర దుకాణాలుండే పత్తర్‌గట్టి ఎక్కడ ఉందో తెలియని వారు ఎందరో ఉంటారు. ముఖ్యంగా, ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వారు అందుకోసం రోడ్లపై ఉండేవారిని అడుగుతూ కనుక్కోవాల్సి ఉంటుంది. ప్రజలకు ఇలాంటి పరిస్థితి రాకుండా సులభంగానే వారు ఆ చోటుకు వెళ్లేందుకు సైనేజీ సిస్టమ్‌ను అందుబాటులోకి తెచ్చేందుకు కులీకుతుబ్‌షా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) పీపీపీ పద్ధతిలో ఆసక్తి వ్యక్తీకరణ టెండర్లను ఆహ్వానించింది.

- జీహెచ్‌ఎంసీ కమిషనరే 'కుడా'కు అడ్మినిస్ట్రేటర్‌గానూ వ్యవహరిస్తుండటంతో జీహెచ్‌ఎంసీ సమన్వయంతో పని చేయనుంది. తొలుత చార్మినార్ పరిసరాల్లో.. ముఖ్యంగా మదీనా సర్కిల్ నుంచి చార్మినార్ వరకు ఈ విధానాన్ని అందుబాటులోకి తెచ్చి, ఫలితాల్ని బట్టి నగరంలో చారిత్రక ప్రాముఖ్యత ఉన్న, పర్యాటక ప్రాంతాల్లో ఇలాంటి సైనేజీలు ఏర్పాటు చేయాలని అధికారులు భావిస్తున్నారు. టెండర్‌ను దక్కించుకునే ఏజెన్సీ బూస్ట్ (బిల్డ్, ఓన్, ఆపరేట్, షేర్, ట్రాన్స్‌ఫర్) పద్ధతిలో పని చేయాల్సి ఉంటుంది. సైనేజీల డిజైన్, ముఖ్య ప్రాంతాల్లో వాటిని ఏర్పాటు చేసే బాధ్యత ఏజెన్సీదే.

రెండు రకాలుగా..

ఇందుకుగాను రెండు రకాల ఏర్పాట్లు చేయాలి. అందులో ఒకటి మదీనా సర్కిల్ నుంచి చార్మినార్ వరకు ముఖ్య ప్రదేశాల్లో 50 సైనేజీలు ఏర్పాటు చేయాలి. వాటి గరిష్ఠ పరిమాణం 8 ॰ 4 ॰ 6. నాలుగు రకాల (మార్క్స్, స్లీక్, పోల్, కార్బెల్) సైనేజీలు ఏర్పాటు చేయవచ్చు. సైనేజీలో కొంత భాగాన్ని ప్రకటనలకు ఇవ్వడం ద్వారా ఆదాయం పొందవచ్చు.

- ఆ మార్గంలో ల్యాండ్ మార్క్స్, ఎంత దూరంలో ఉన్నాయి.. అనే వివరాలు సైనేజీలపై ఉండాలి. ఇంకో విధానం.. అనుబంధంగా యాప్/వెబ్‌సైట్ అభివృద్ధి చేయాలి. సైనేజీల మీద క్యూఆర్ కోడ్‌లను ఏర్పాటుచేసి, వాటిని ఫోన్‌తో స్కాన్ చేస్తే చార్మినార్ సందర్శకులకు అక్కడకు వెళ్లేందుకు తామున్న చోటు నుంచి మార్గం, దగ్గరలోని ల్యాండ్‌మార్క్స్, చారిత్రక ప్రదేశాలు, పర్యాటక ప్రాంతాలు, సదుపాయాలు, వ్యాపార ప్రదేశాలు ఎక్కడున్నాయో సులభంగా తెలిసేలా చేయడం వల్ల టూరిజంనూ అభివృద్ధి చేయవచ్చనేది ఆలోచన.

ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలి..

యాప్, వెబ్‌సైట్‌ను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేస్తుండాలి. వీటిలోనూ ప్రకటనలకు అవకాశం ఉండాలి. తద్వారా ఆదాయం పొందవచ్చు. ఈ సిస్టమ్‌లో మార్పులకు, రద్దు చేసేందుకు సైతం 'కుడా'కు అధికారం ఉందని టెండర్ నోటిఫికేషన్‌లో స్పష్టం చేశారు.

బిగ్ స్టోరీ

డబ్బా నీళ్లు శుద్ధమేనా.. క్యాన్ పరేషాన్!





పాపిరెడ్డి నగర్‌లో అపరిశుభ్రత మధ్య వాటర్ ప్లాంట్

బబుల్స్‌లో తెప్పించుకుంటున్న నీరు స్వచ్ఛమేనా?

పుట్ట గొడుగుల్లా ఆర్వో ప్లాంట్లు

ప్రమాణాలకు పాతర.. నాణ్యతకు తిలోదకాలు

మినరల్ పేరిట జనరల్ వాటర్ దందా

- మహా నగరంలో నిత్యం 5 లక్షల క్యాన్ల నీటి విక్రయాలు
- తాగిన జనాలు అనారోగ్యం పాలు
- పుణె నగరాన్ని వణికిస్తున్న 'జీబీఎస్' వ్యాధి
- అలాంటి ప్రమాదమే మనకూ పొంచి ఉందా?
- పట్టించుకోని అధికార యంత్రాంగం
- గ్రేటర్ వాసులను బెంబేలెత్తిస్తున్న పరిస్థితి

'మహారాష్ట్రలోని పుణె నగరాన్ని న్యూరోలాజికల్ డిజార్డర్ 'గులియన్ బారే సిండ్రోమ్' (జీబీఎస్) వ్యాధి వణికిస్తోంది. సింహగఢ్ రోడ్ ప్రాంతంలో గుల్లెయిన్ -బారే సిండ్రోమ్ కేసులు అత్యధికంగా నమోదు కావడంతో అక్కడి ఆర్వో ప్లాంట్లను తనిఖీ చేయగా.. నీళ్లలో పలు రకాల వైరస్‌లు ఉన్నట్లు బహిర్గతమైంది. దీంతో ఇప్పటికే వందలాది మంది వ్యాధి బారినపడగా.. కొందరు మృత్యువాతకు గురయ్యారు. ఈ నేపథ్యంలో కర్ణాటక బెంగళూరులో సైతం రివర్స్ ఓస్మోసిస్ (ఆర్వో) ప్లాంట్ల తనిఖీలకు ఆదేశించారు. తాజాగా మన నగరానికి 'జీబీఎస్' ముప్పు పొంచి ఉందా? అంటే ఆర్వో నీటి ప్లాంట నిర్వహణ తీరు పరిశీలిస్తే గానీ తెలియని ఆందోళనకర పరిస్థితి నెలకొంది'

మీ క్యాన్ వాటర్‌లో శుద్ధి ఎంతో ఎప్పుడైనా గమనించారా? తుప్పు పట్టిన యంత్రాలు.. నాచు, పాకురుతో నీటి నిల్వ ట్యాంకులు.. ఏళ్ల తరబడి వాడుతున్న క్యాన్లు.. ప్లాంట్ల పరిసరాల్లో పాటించని పరిశుభ్రత.. కనిపించని నీటి శుద్ధి ప్రక్రియ.. అనుమతుల మాటేమో గానీ.. ఆర్వో ప్లాంట్లు మాత్రం పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. మహా నగరంలో మినరల్ పేరిట జనరల్ వాటర్ దందా బాహాటంగానే కొనసాగుతోంది. ఆర్వో ప్లాంట్లకు లైసెన్స్ ఉందా? నిర్వాహకులు ప్రమాణాలు పాటిస్తున్నారా? నీటి పరీక్షలు చేస్తున్నారా? ట్యాంకులు, క్యాన్ల పరిశుభ్రత పరిస్థితేంటి? అనే వాటిపై కనీస పరిశీలన లేకుండా పోయింది. తనిఖీలు చేయాల్సిన అధికారులు కాసులకు కక్కుర్తిపడి పట్టించుకోకపోవడంతో.. సరిగ్గా శుద్ధి కాని జలం కొనుగోలు చేసి తాగుతున్న సిటీజనులు రోగాల బారిన పడుతున్నారు. - సాక్షి, సిటీబ్యూరో

మహా నగర జనాభా	1.50 కోట్లపైనే
నివాస సముదాయాలు	40 లక్షలు
కుటుంబాలు	65 లక్షలు
వాటర్ బోర్డు ద్వారా నల్లా కనెక్షన్లు	13.70 లక్షలు
నల్లా కనెక్షన్ లేని నివాసాలు	26.30 లక్షలు
బోరుబావులు	30 లక్షలు
ఆర్వో ప్లాంట్లు	12,300
బీఐఎస్ గుర్తింపు లేని ప్లాంట్లు	11,650
ప్రమాణాలు పాటిస్తున్న ప్లాంట్లు	650

ఒక్కో కుటుంబం క్యాన్ నీటి కోసం నెలవారీ వ్యయం రూ.600 నుంచి రూ.15,00

ప్రతి లీటర్ నీటిలో ఉండాల్సినవి ఇలా..

క్షార గుణ సాంద్రత	600 మిల్లీ గ్రాములు
సంపూర్ణ కఠినత్వం	200-600 మి. గ్రా.
క్యాల్షియం	75-200 మి.గ్రా
సల్ఫేట్	200-400 మి. గా.
మట్టి	2.5-10 మి గ్రా
కరిగిన వ్యర్థాలు	500-1600 మి గ్రా
ఉప్పు	200-1000 మి గ్రా
ఫ్లోరైడ్	0.6-1.5 మి గ్రా
ఐరన్	0.1-1.0 మి గ్రా
నత్రజని	45 మి గ్రా
హైడ్రోజన్ అయాన్ కాన్సంట్రేషన్	6.5-9.2 మి.గ్రా

మహా నగర పరిధిలో భారతీయ ప్రమాణాల సంస్థ (బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్) నాణ్యతా ప్రమాణాలున్న తాగునీటి ప్లాంట్లను వేళ్లపై లెక్కించవచ్చు. అనధికారికంగా వెలసినవి కోకొల్లలు. బీఐఎస్ సంస్థ నుంచి లైసెన్స్ తీసుకోవడం, ప్లాంట్, నాణ్యతా ప్రమాణాల పరీక్షల కోసం ల్యాబ్ నిర్మాణాలకు రూ.25 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు ఖర్చవుతుంది. అదే అనుమతి లేకుండా ఇంట్లోనే నాసిరకం ప్లాంటును ఏర్పాటు చేస్తే రూ.2 లక్షల వ్యయం మించదు. దీంతో కొందరు వీటినే ఏర్పాటు చేసి నాణ్యతను గాలికి వదిలేసి నీటి వ్యాపారం చేస్తుండడం గమనార్హం. రివర్స్ ఓస్మోసిస్ (ఆర్వో) ప్లాంట్ల ద్వారా విక్రయించే క్యాన్ వాటర్ మినరల్ నీరు అనుకుంటే పొరపాటే. సాధారణంగా నీళ్లలో సోడియం సల్ఫేట్, కాల్షియం, కార్బొనేట్, పొటాషియం, మెగ్నీషియం సల్ఫేట్ లాంటి కొన్ని ఖనిజాలను అదనంగా కలిపితే మినరల్ నీరు అవుతోంది. కానీ ఇవీ కేవలం కొన్ని కార్పొరేట్ కంపెనీలు మాత్రమే పాటిస్తున్నాయి. ఎక్కడ పడితే అక్కడ కాలనీలో ఏర్పాటైన ఆర్వో ప్లాంట్లలో మాత్రం మచ్చుకైనా కనిపించడం లేదు.

అందుకే ఆరోగ్యానికి ముప్పు..

నల్లా నీటి మాటేమో గానీ.. ఆర్వో ప్లాంట్ నీరు తాగితే ఆరోగ్యానికి హానికరమని శాస్త్రీయంగా నిరూపితమైంది. ఈ నీటిని తాగితే శరీరంలో నిల్వ ఉన్న నీటిలో కరిగిన ఎలక్ట్రోలైట్స్ నాశనం అవుతాయి. అవయవాలు శక్తిని కోల్పోతాయి. మొదట్లో అలసట, బలహీనత, తలనొప్పి ఆ తర్వాత క్రమంగా కండరాల తిమ్మిర్లు, క్యాల్షియం లోపం, అధిక రక్తపోటు, హార్ట్ డిసీజ్, గ్యాస్ట్రిక్ అల్సర్, పొట్టలో పుండ్లు, గర్భధారణ సమస్యలు, కామెర్లు, రక్తహీనత, పగుళ్లు, పెరుగుదలలో లోపాలు, గుండె బలహీన పడటం, గుండె సమస్యల వంటి దుష్ప్రభావాలకు దారి తీస్తుంది. ఆరోగ్యానికి క్యాన్ వాటర్ ముప్పు అని వైద్యులు అందుకే హెచ్చరిస్తుంటారు.

శుద్ధి చేయకుండానే..

భూగర్భ జలాలను మోటారు బోరు ద్వారా తోడి సరిగ్గా శుద్ధి చేయకుండా నీటిని క్యాన్లలో నింపి విక్రయిస్తున్నారు. నిబంధనల ప్రకారం నీటిని 12సార్లు శుద్ధి ప్రక్రియ జరపాలి. ఫిల్టరింగ్, ఎరేషన్, కార్బన్ ఫ్యాక్టరైజేషన్ లాంటి ప్రక్రియలు నిర్వహించాలి. ఆ తర్వాత నీటిని డబ్బాల్లో నింపే ముందు 48 గంటల పాటు నిల్వ ఉంచి ఆ తర్వాత కెమిస్ట్ పరీక్షలు జరపాలి. ఇందుకోసం నాణ్యత పరికరాలతో కూడిన మైక్రో బయోలాజికల్ ల్యాబ్ ఉండాలి. కెమిసిస్ట్ ద్వారా ఎప్పటికప్పుడు నీటిని పరీక్షలు నిర్వహించాలి. నీటిలో ఎలాంటి క్రిములున్నాయి? బ్యాక్టీరియా, వైరస్, ఫంగస్ ఉన్నాయా? అని నమూనాలు సేకరించి పరీక్షలు జరపాలి. తాగునీటిలో టీడీఎస్ 30 ఉండాలి. కానీ.. ఆయా ప్లాంట్లలో నమూనాలను పరీక్షించే ల్యాబ్, నిపుణులు, మైక్రోబయోలజిస్టులు లేరు. కేవలం ప్లాంట్లలో ఏదో ట్యాంకు పెట్టేసి లోపల యంత్రాన్ని అమర్చి నీటిని అందులోంచి రివర్స్ ఓస్మోసిస్ చేసి విక్రయిస్తున్నారు. ప్రమాణాలు పాటిస్తున్న దాఖలాలు మచ్చుకైనా కానరావడంలేదు. కొన్ని ప్లాంట్లలో అసలు పీహెచ్ మీటరే ఉపయోగించడం లేదనేది బహిరంగ రహస్యం.

ఖర్చు తగ్గించుకునేందుకు..

అనధికారిక ప్లాంట్లలో ప్రతి 20 లీటర్ల నీటి శుద్ధికి నిర్వాహకులు రూ.4 ఖర్చు చేస్తున్నారు. జనం నుంచి రూ.15 నుంచి రూ.30 వరకు దోచుకుంటున్నారు. ఐఎస్ఐ ప్రమాణాలున్న నీటికి రూ. 15 వ్యయమవుతోంది. వీటి ధర బహిరంగ మార్కెట్లో రూ.35 నుంచి రూ.80 వరకు ఉంది. ఐఎస్ ప్రమాణాల ప్రకారం నీటిని నింపే సీసాలు, క్యాన్లు పాలీ ఇథిలిన్, పాలివినైల్ క్లోరైడ్, పాలీప్రొపిలీన్లతో తయారైన వాటిని వినియోగించాలి. ఈ రసాయనాల ధర రూ.280 నుంచి రూ.500 (20 లీటర్ల డబ్బా) వరకు ఉంటుంది. ధర ఎక్కువన్న కారణంతో తక్కువ ధరకు దొరికే నాసిరకం బాటిళ్లను వినియోగిస్తున్నారు. వీటి ధర రూ.100 నుంచి రూ.120 లోపే ఉంటుంది. వీటిలో త్వరగా బ్యాక్టీరియా వృద్ధి చెందే అవకాశాలు ఉన్నాయి.

క్యాన్లలోనూ కానరాని పరిశుభ్రత..

వాటర్ క్యాన్లు సైతం శుభ్రత లేకుండా కనిపిస్తున్నాయి. వాటర్ క్యాన్లను ఆరునెలలకు ఒకసారి మార్చి కొత్తవి వినియోగించాలి. కానీ, ప్లాంట్ యజమానులు అలా చేయడం లేదు. ఏళ్ల తరబడి వాటినే వాడుతున్నారు. లోపల పాచిపట్టి ఉన్నా శుభ్రం చేయడం లేదు. మూడు అంచెల్లో వాటిని శుభ్రపరచాల్సిండగా జరగడం లేదు. మరోవైపు కొన్ని ఆర్వో ప్లాంట్లలో ప్లాస్టిక్ ట్యాంకులను వాడుతున్నారు. స్టీల్ ట్యాంకులనే వాడాలి. నిబంధన ప్రకారం 15 రోజులకోసారి ట్యాంకును శుభ్రపరిచి, ఎప్పుడు శుభ్రపరిచారో ట్యాంకుపై నమోదు చేయాలి. ఆచరణలో మాత్రం అమలు కావడం లేదన్నది బహిరంగ రాహస్యమే.

జోరుగా దందా

మహా నగరంలో మినిరల్ వాటర్ పేరిట నీటి దందా జోరుగా సాగుతోంది. హోటళ్లు, చిరు వ్యాపారులు, మధ్యతరగతి ప్రజలు వాటర్ క్యాన్ల వైపు మొగ్గు చూపుతుండటంతో ఈ వ్యాపారం భారీగా విస్తరించింది. నగర పరిధిలో రోజువారీగా ఐదు లక్షల నీటి క్యాన్లు (20 లీటర్లు) అమ్ముడవుతున్నాయన్నది అంచనా. వీటిలో ప్రముఖ బ్రాండ్లకు చెందినవి పది శాతం, గుర్తింపు పొందిన ఫిల్టర్ ప్లాంట్స్‌కు సంబంధించి 10 శాతం క్యాన్లు ఉంటాయి. మిగతా 80 శాతం క్యాన్లు అనధికారిక ప్లాంట్లలో తయారవుతున్నాయంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. ఇళ్లలో, ఖాళీ స్థలాల్లో బోర్లు వేసి వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకుని వ్యాపారాలు నిర్వహిస్తున్నారు.

రోగ నిరోధక శక్తి తగ్గుతుంది



మినరల్స్ లేని నీరు తాగడం వల్ల రోగ నిరోధక శక్తి తగ్గుతుంది. చెడు బ్యాక్టీరియా శరీరంలోకి చేరుతుంది. వాంతులు, విరేచనాలు, గ్యాస్ట్రిక్ సంబంధిత సమస్యలు తలెత్తుతాయి. మెగ్నీషియం, ఎలక్ట్రోలైట్స్ సమపాళ్లలో లేని నీటిని తాగితే కిడ్నీ, కండరాల సంబంధ సమస్యలు తలెత్తుతాయి.

- డాక్టర్ బీరప్ప, నిమ్స్ డైరెక్టర్

నల్లా నీటికి మూడంచెల శుద్ధి ప్రక్రియ

నగర దాహార్తి తీర్చేందుకు జలమండలి నీటిని మూడంచెల క్లోరిన్ ప్రక్రియ ద్వారా శుద్ధి చేసి సరఫరా చేస్తోంది. మొదటి దశలో నీటి శుద్ధి కేంద్రాల వద్ద, రెండో దశలో మెయిన్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ల వద్ద, చివరగా సర్వీస్ రిజర్వాయర్ల వద్ద బూస్టర్ క్లోరినేషన్ ప్రక్రియ నిర్వహిస్తోంది. సరఫరా అవుతున్న నీటిని సైతం జలమండలి క్వాలిటీ అస్యూరెన్స్ అండ్ టెస్టింగ్ వింగ్ (క్యూఏటీ), ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్ (ఐపీఎం), థర్డ్ పార్టీ లూసిడ్ సంస్థ ద్వారా నీటి నమూనాలను సేకరించి పరీక్షిస్తోంది. నీటిలో కచ్చితంగా 0.5 పీపీఎం క్లోరిన్ ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటోంది. సురక్షిత, శుద్ధమైన నీరు అందించేందుకు ఇండియన్ స్టాండర్డ్ ప్రమాణాల్ని పాటిస్తూ.. శాస్త్రీయంగా అన్ని జాగ్రత్తలనూ తీసుకుంటున్నట్లు జలమండలి పేర్కొంటోంది.

కిరాణా దుకాణాల్లోనూ..

కాలనీలో ఉండే కిరాణా దుకాణాల్లో సైతం క్యాన్ వాటర్ అమ్మకాలు సాగుతున్నాయి. కేవలం ఒక స్టీల్ ట్యాంక్ ఏర్పాటు చేసుకొని వాటర్ ట్యాంకర్ ద్వారా నీరు తెప్పించి నిల్వ చేసి క్యాన్‌లలో విక్రయిస్తున్నారు. నెలల తరబడి ట్యాంక్‌ను శుభ్రం చేయని కారణంగా కింది భాగంలో పాకురుమయమవుతోంది. ఈ నీటిని తాగిన వినియోగదారులు అస్వస్థతకు గురవుతున్నారు.



చింతల్‌లో ఓ ఇంట్లో ఏర్పాటు చేసిన అక్రమ వాటర్ ప్లాంట్

గ్యాస్ సిలిండర్ పేలి భారీ ప్రమాదం



పేలుడు ధాటికి ధ్వంసమైన నివాసం

రహమత్‌నగర్: బోరబండ పోలీస్ స్టేషన్‌లో పరిధిలోని సంజయ్‌నగర్‌లో గ్యాస్ సిలిండర్ పేలి భారీ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో అనేక ఇళ్లు దెబ్బతిన్నాయి. పలువురికి గాయాలయ్యాయి. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. ఎస్‌హెచ్‌ఓ సురేందర్ తెలిపిన వివరాల ప్రకారం..సంజయ్‌నగర్‌లో ప్రసాద్, భవాని నివసిస్తున్న ఇంట్లో శుక్రవారం అర్ధరాత్రి ఒక్కసారిగా గ్యాస్ లీకై భారీ శబ్దంతో ఇంట్లో పేలుడు సంభవించి మంటలు వ్యాపించాయి. ఈ ఘటనలో ప్రసాద్, భవానీలతో పాటు పొరుగున నివాసముంటున్న మహాలక్ష్మి, మహదేవ్‌లకు సైతం గాయాలయ్యాయి. ఇంట్లోని వస్తువులు కాలిపోయాయి. భారీ పేలుడుకు సమీపంలోని నివాసాలు సైతం దెబ్బతిన్నాయి. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు క్షతగాత్రులను చికిత్స కోసం గాంధీ ఆసుపత్రికి తరలించారు. భవాని, ప్రసాద్‌ల పరిస్థితి విషమంగా ఉందని తెలిసింది. సంఘటన స్థలానికి చేరుకున్న సంబంధిత అధికారులు సంఘటనపై దర్యాప్తు చేపట్టారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రేమ పేరుతో వేధింపులు.. యువతి ఆత్మహత్య

చైతన్యపురి: ప్రేమించాలంటూ ఓ యువకుడు వేధించడంతో యువతి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సూర్యాపేట జిల్లా పాతర్లపాడుకు చెందిన బీమగోని కృష్ణయ్య, మన్నెమ్మ దంపతుల చిన్న కుమార్తె గంగోత్రి (22) చైతన్యపురిలోని తన సోదరి నివాసంలో ఉంటోంది. పాతర్లపాడుకు చెందిన కేశబోయిన మహేష్ అనే వ్యక్తి తనను ప్రేమించాలంటూ గత ఆరునెలలుగా గంగోత్రిని వేధిస్తున్నాడు. ఇదే విషయాన్ని తండ్రికి చెప్పి తనకు భయంగా ఉందని వాపోయింది. తను ఎక్కడికి వెళ్లినా వెంబడించి వేధిస్తున్నాడని తెలిపింది. ఈ క్రమంలో శనివారం ఉదయం గంగోత్రి రూంలోకి వెళ్లి తలుపులు వేసుకుంది. కొద్దిసేపటికి కుటుంబ సభ్యులు పిలిచినా పలకకపోవడంతో చుట్టుపక్కల వారి సహాయంతో తలుపు గడియ పగలగొట్టి లోనికి వెళ్లి చూడగా ఫ్యాన్‌కు ఉరేసుకుని చనిపోయి కనిపించింది. మహేష్ వేధింపుల వల్లే గంగోత్రి ఆత్మహత్య చేసుకుందని తండ్రి కృష్ణయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పరీక్షల భయంతో ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య



ఆత్మహత్యకు పాల్పడిన ప్రీతి

హయత్‌నగర్: పరీక్షలు సరిగా రాయలేనన్న భయంతో ఇంటర్ ద్వితీయసంవత్సరం చదువుతున్న విద్యార్థిని ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..ఏపీలోని పల్నాడు జిల్లా సావల్యపురం మండలం గంటవారి పాలెంకు చెందిన కర్నా వెంకటసాయి ప్రీతి(17) హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని లెక్చరర్స్ కాలనీలో నివాసం ఉంటూ స్థానికంగా ఒక ప్రైవేటు జూనియర్ కళాశాలలో ఇంటర్ సెకండియర్ చదువుతుంది. పరీక్షలు పాసవుతానో లేదో అనే భయాందోళనకు గురైన ప్రీతి శనివారం సాయంత్రం నాలుగు గంటల ప్రాంతంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని ప్రీతి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మహిళల సంక్షేమానికి ప్రాధాన్యం

- మంత్రి పొన్నం ప్రభాకర్
- ఎంజీబీఎస్ సందర్శన.. మహిళా ప్రయాణికులకు శుభాకాంక్షలు



ఎంజీబీఎస్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్, కలెక్టర్ అనుదీప్ తదితరులు

అఫ్జల్‌గంజ్: రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తుందని రాష్ట్ర బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహాత్మాగాంధీ బస్‌స్టేషన్‌ను సందర్శించి..ప్లాట్‌ఫాంలలో ఉన్న మహిళా ప్రయాణికులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్నదే ప్రభుత్వ ముఖ్యోద్దేశమని, ఆ దిశగా మహిళలకు వారి అభిరుచి మేరకు సంక్షేమ పథకాలు రూపొందించి అమలు చేస్తున్నామన్నారు. తెలంగాణలో ఇప్పటివరకు 150 కోట్ల మంది మహిళలు..రూ.5 వేల కోట్ల విలువైన ప్రయాణాలు ఉచితంగా చేశారని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన బస్టాండ్‌లోని ప్రయాణికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మహిళా అధికారులు, సిబ్బందిని శాలువాలతో ఘనంగా సన్మానించారు. ప్రయాణికులకు గులాబీ పూలు, స్వీట్లు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మంత్రి పొన్నం ఎంజీబీఎస్ బస్‌స్టేషన్ నుండి ఫలక్‌నూమా వరకు సిటీ బస్సులో ప్రయాణించారు. మహిళా ప్రయాణికులు, ఆర్టీసీ మహిళా ఉద్యోగుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు 2.5 శాతం డీఏ ప్రకటించడం జరిగిందని, అదేవిధంగా ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, రాష్ట్ర ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్, ఆర్టీసీ ఈడీ రాజశేఖర్, ఆర్‌ఎం శ్రీలత, సీఆర్‌ఎం శ్రీనివాస్, ఆర్టీసీ ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



బస్సులో ప్రయాణించిన మంత్రి పొన్నం ప్రభాకర్

సాక్షి సండే క్లాసిఫైడ్స్

మహిళా సాధికారతే ప్రపంచ సాధికారత

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రవణ్‌కుమార్



జస్టిస్ శ్రవణ్‌కుమార్, ఐజీ సౌమ్య మిశ్రాతో సన్మాన గ్రహీతలు

చిక్కడపల్లి: మహిళా సాధికారతే ప్రపంచ సాధికారత అని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నచ్చరాజు శ్రవణ్‌కుమార్ అన్నారు. శ్రీ త్యాగరాయ గానసభ ప్రధాన వేదికపై సృజన సాంస్కృతిక సాహిత్య సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమెన్స్ డే వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. స్వచ్ఛంద సంస్థలు ఉమెన్స్ డేను నిర్వహించి మహిళలను సత్కరించడం సంతోషకరమన్నారు. ఈ ఏడాది అంతర్జాతీయ మహిళా దినోత్సవం నినాదం 'స్త్రీల సమానత్వ పరిరక్షణ' అని, దీనిని అందరూ పాటించాలని చెప్పారు. ఈ సందర్భంగా తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి, సీనియర్ జర్నలిస్ట్ స్వప్న, నటి ప్రీతి నిగమ్, మహిళా క్రికెట్ కమిటీ సభ్యులు ధనలక్ష్మి, సామాజిక సేవా కార్యకర్త అర్చనలకు సృజన ప్రతిభా పురస్కారాలు అందచేశారు. కార్యక్రమంలో డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (జైళ్ల శాఖ) సౌమ్య మిశ్రా, సంస్థ వ్యవస్థాపకురాలు అంజనా చౌదరి పాల్గొన్నారు.

800 బస్సులు.. 40 వేల మంది మహిళలు

సాక్షి, సిటీబ్యూరో: శనివారం పరేడ్‌గ్రౌండ్‌లో జరిగిన..సీఎం రేవంత్‌రెడ్డి హాజరైన అంతర్జాతీయ మహిళా దినోత్సవం కార్యక్రమానికి జీహెచ్‌ఎంసీ నుంచి 40 వేల మంది మహిళల్ని తరలించారు. సెల్ఫ్ హెల్ప్ గ్రూపుల నేతృత్వంలో ఆయా ప్రాంతాల నుంచి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 800 బస్సుల్లో వారిని అక్కడికి తరలించారు.

నవ వధువు ఆత్మహత్య



విజయ గౌరి (ఫైల్‌ఫోటో)

బాలానగర్: నవవధువు ఆత్మహత్య చేసుకున్న సంఘటన బాలానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విజయనగరం జిల్లా, తర్లా మండలం నందిగామకు చెందిన ఈశ్వరరావుతో గత ఫిబ్రవరి 6న గంటా విజయ గౌరీ (23)కి వివాహం జరిగింది. నూతన దంపతులు బాలానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బాల్‌రెడ్డి నగర్‌లో నివాసం ఉంటున్నారు. ఈశ్వరరావు ఉద్యోగం నిమిత్తం డ్యూటీకి వెళ్లాడు. తిరిగి ఇంటికి వచ్చేసరికి విజయగౌరి ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు బాలానగర్ ఇన్‌స్పెక్టర్ టి.నరసింహరాజు తెలిపారు.

కల్తీ ఐస్‌క్రీం కలకలం



మహేశ్వరం: ఎలాంటి అనుమతులు లేకుండా.. నాణ్యత పాటించకుండా కల్తీ ఐస్‌క్రీంలు తయారీ కేంద్రంపై మహేశ్వరం ఎస్‌ఓటీ పోలీసులు శుక్రవారం రాత్రి దాడులు చేశారు. మహేశ్వరం సీఐ తెలిపిన ప్రకారం.. మండల కేంద్రంలో గ్రామానికి చెందిన షేక్ అహ్మద్ కొంతకాలంగా పోచమ్మ బస్తీ సమీపంలో ఐస్‌క్రీం తయారీ కేంద్రం నిర్వహిస్తున్నాడు. నాణ్యత ప్రమాణాలు పాటించకుండా ఐస్ క్రీం ప్యాకెట్స్, డబ్బాలపై ఎక్స్‌పెయిరీ తేదీ లేకుండా కల్తీ వస్తువులు, రంగులు, రసాయనాలు వాడి తయారు చేస్తున్నట్లు మహేశ్వరం ఎస్‌ఓటీ పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. ఈ మేరకు ఎస్‌ఓటీ పోలీసులు తయారీ కేంద్రంపై దాడి చేసి నిర్వాహకుడిని అరెస్ట్ చేసి ఐస్‌క్రీం తయారీ సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. అహ్మద్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మధుసూదన్ తెలిపారు.

అంతటా.. ఆమెకు గౌరవం

అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు శనివారం ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలతో పాటు బస్తీలు, కాలనీల్లో అసోసియేషన్లు, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. పలుచోట్ల ఉమెన్స్ డే కేక్‌లను కట్ చేశారు. ప్రతిభ కనబర్చిన మహిళలను శాలువాలతో సత్కరించారు. వేడుకలను పండగ వాతావరణంలో నిర్వహించుకున్నారు. పలుచోట్ల రాజకీయ నాయకులు పార్టీలకతీతంగా పాల్గొని మహిళలకు పుష్పగుచ్ఛాలు అందజేసి వారి సేవలను కొనియాడారు. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, సోమాజీగూడ, ఖైరతాబాద్, హిమాయత్‌నగర్ డివిజన్ల పరిధిలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో కూడా ఈ వేడుకలను నిర్వహించారు.

కల్మషం లేకుండా ప్రేమ పంచేవారు మహిళలు

- విద్యాశాఖ డైరెక్టర్ రాధారెడ్డి



బహుమతులు పంపిణీ చేస్తున్న విద్యాశాఖ డైరెక్టర్ రాధారెడ్డి

వెంగళరావునగర్: సృష్టిలో కల్మషం లేకుండా ప్రేమను పంచేవారు మహిళలే అని రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టర్ పి.రాధారెడ్డి అన్నారు. వెంగళరావునగర్‌కాలనీలో శనివారం కన్జ్యూమర్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం జాతీయ కార్యదర్శి డాక్టర్ పి.వి.రవిశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన విద్యాశాఖ డైరెక్టర్ రాధారెడ్డి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో దూసుకుపోతున్నా ఇంకా అణచివేత కార్యక్రమాలు కనిపిస్తూనే ఉన్నాయని, ఇది చాలా దురదృష్టకరం అన్నారు. మహిళల శక్తి ఏంటో తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. తొలుత కేక్ కట్ చేసి మహిళలకు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో కాలనీకి చెందిన మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మహిళలు ఎవరిపై ఆధారపడొద్దు



కేక్ కట్ చేస్తున్న డిప్యూటీ కమిషనర్, ఎస్‌పిహెచ్‌ఓ, కార్పొరేటర్లు

వెంగళరావునగర్: నేటితరం మహిళలు ఎవరి మీద ఆధారపడి జీవించాల్సిన పరిస్థితులు లేవని, స్వశక్తిమీద స్వయంకృషితో ఎదగాలని జీహెచ్ఎంసీ సర్కిల్–19 ఉప కమిషనర్ జకియా సుల్తానా అన్నారు. వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని సిద్ధార్థనగర్‌కాలనీ కమ్యూనిటీహాల్‌లో శనివారం స్థానిక కార్పొరేటర్ దేదీప్య విజయ్ దంపతుల ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. కేక్ కట్ చేసిన ఆమె మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. శ్రీరామ్‌నగర్ ఎస్‌పీహెచ్‌ఓ డాక్టర్ రమాదేవి, బీఆర్ఎస్ సీనియర్ నేతలు విజయ్‌కుమార్, శ్యాంరావు, వేణు, శంకర్ ముదిరాజ్, పవన్ ముదిరాజ్, పూజారి బాల్‌రాజ్, కిట్టు, సమద్, బాలు, యాదగిరి పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



ఉచిత వైద్య శిబిరంలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

పంజగుట్ట: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని వెంకటరమణ కాలనీలోని డాక్టర్ ఎల్‌వీ ప్రసాద్ డయాగ్నోస్టిక్స్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. స్థానికులు పెద్దసంఖ్యలో హాజరై సద్వినియోగం చేసుకున్నారు. మధుమేహం, రక్తపోటుతో పాటు అన్ని సాధారణ వైద్య పరీక్షలు నిర్వహించారు. శిబిరం ఆదివారం కొనసాగుతుందని సంస్థ అధినేత డాక్టర్ ఎల్‌వీ ప్రసాద్ తెలిపారు. డాక్టర్ జి.సత్యనారాయణ, డాక్టర్ డి.దీప, డాక్టర్ ఎస్.రవీంద్రరెడ్డి, దంత వైద్య నిపుణులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా డిఫ్యూజన్ 2కె25



ట్రోఫీలు అందుకుంటున్న విద్యార్థులు

ఖైరతాబాద్: లక్డీకాపూల్‌లోని ఐఎంసీ కళాశాలలో డిఫ్యూజన్ 2కె25 పేరుతో 5 రోజుల పాటు నిర్వహించిన వివిధ రకాల పోటీలు శనివారంతో ముగిశాయి. పిల్లల్లో వివిధ రకాల నైపుణ్యాలను పెంపొందించడానికి 80వ దశకం నుంచి ప్రతి సంవత్సరం డిఫ్యూజన్ అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కూర రఘువీర్ తెలిపారు. ఈ సందర్భంగా డ్యాన్స్, పాటల పోటీలు, ఫ్లాష్ మాబ్ నిర్వహించి విద్యార్థుల్లో ఉత్సాహం నింపారు. విజేతలకు ప్రశంసా పత్రాలు, ట్రోఫీలను అందజేశారు.

పోలీస్ శాఖలో పెరుగుతున్న మహిళల సంఖ్య



బంజారాహిల్స్: ఒకప్పటితో పోలిస్తే ఇప్పుడు పోలీస్‌శాఖతో పాటు ఇతర శాఖల్లో మహిళల సంఖ్య పెరుగుతోందని, ఇది మంచి పరిణామమని ఐపీఎస్ అధికారిణి, మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి అన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా బంజారాహిల్స్‌లోని ఎమ్మెల్యే కాలనీ రిక్రియేషన్ సెంటర్‌లో జరిగిన వేడుకల్లో ఆమె డాక్టర్ సునీతతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల సమస్యలు పరిష్కరించడంలో పోలీస్ శాఖలో ఉన్న మహిళా అధికారిణులు సమర్థవంతంగా పని చేస్తున్నారని, వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నప్పుడే మహిళలకు గుర్తింపు లభిస్తుందని అన్నారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు వైవై.రెడ్డి, ఉదయ్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, ఉపాధ్యక్షురాలు జయప్రదరెడ్డి, కమిటీ మెంబర్ లక్ష్మీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేక్ కట్‌చేసి వేడుకలు



పంజగుట్ట: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమాజిగూడ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీదేవి ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, ఖైరతాబాద్ కార్పొరేటర్ పి.విజయారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేక్ కట్‌చేసి వేడుకలు చేసుకున్నారు.

ప్రోత్సహిస్తే అద్భుతాలు సృష్టిస్తారు



బంజారాహిల్స్: మహిళలను ప్రోత్సహిస్తే అద్భుతాలు సృష్టిస్తారని ఇప్పటికే పలు రంగాల్లో అగ్రస్థానంలో నిలుస్తున్న సందర్భాలు కూడా చూస్తున్నామని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. బంజారాహిల్స్ రోడ్ నెం.2లోని జవహర్‌నగర్ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో శనివారం ఆయన మహిళా దినోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు మహిళలను ఆయన సత్కరించారు. స్థానిక నేతలు దీపాదేవి, శారద, స్వప్న, దుర్గా భవానీ, హేమలత జ్యోతి, నందిని, నస్రీనా, ఫజియాన్ తదితరులు పాల్గొన్నారు.

వెంకటేశ్వరనగర్‌లో..



వెంకటేశ్వరకాలనీ: బంజారాహిల్స్ రోడ్ నంబర్–14లోని వెంకటేశ్వరనగర్ బస్తీలో మాజీ కార్పొరేటర్ భారతి నాయక్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆడపిల్లలను బాగా చదివించాలని, వారు బాగా చదువుకున్నప్పుడే సమాజం బాగుపడుతుందని, అందరికీ మంచి జరుగుతుందని ఆమె అన్నారు. ప్రతి కుటుంబం విజయం వెనుక ఓ మహిళ ఉంటుందని అన్నారు. అనంతరం బస్తీవాసులతో కలిసి ఆమె కేక్ కట్ చేశారు. అందరికీ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

విభిన్న రంగాల్లోని మహిళలకు సత్కారం



బంజారాహిల్స్: ఒక మహిళ తాను ఉన్నత స్థాయికి చేరుకొని ఇతర మహిళల అభ్యున్నతికి పాటుపడుతుంటే ఇదే మహిళా సాధికారత అని న్యాయమూర్తి తేలప్రోలు రజిని అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని విభిన్న రంగాల్లో కృషి చేసిన పలువురు మహిళలకు జూబ్లీహిల్స్‌లోని రూమ్ 9లో సెలబ్రిటీ సీక్రెట్స్‌లో సత్కారం నిర్వహించారు. న్యాయవాది రాధా దేవినేని, జమైకా రాయబారి సుజాత వింజమూరి, సర్జికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ గీతా నాగశ్రీ, మహిళా సాధికార మండలి జాతీయ అధ్యక్షురాలు అజులీ తులస్యాన్ వంటి 15 మంది మహిళలను సత్కరించారు.

కుటుంబ పెద్ద అమ్మే..



బంజారాహిల్స్: మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వశాఖ, యూజీసీ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న ఫిట్ ఇండియాలో మహిళల క్రీడా వారోత్సవాల్లో భాగంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో 'మానసిక ఆరోగ్యం' అనే అంశంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. హైదరాబాద్ జిల్లా అదనపు వైద్య, ఆరోగ్య మాజీ అధికారి డాక్టర్ నిర్మలా ప్రభావతి మాట్లాడారు. మహిళల భావోద్వేగ, మానసిక, అత్యవసర పరిస్థితుల్లో స్థిరంగా ఉండాలని అన్నారు. వర్సిటీ అకాడమిక్ డైరెక్టర్ పుష్పా చక్రపాణి, డాక్టర్ ఎస్.రజని, విశ్వవిద్యాలయ మహిళా విభాగ ఇన్‌చార్జి డైరెక్టర్ మేరీ సునంద, శ్రీదేవి, రజనీ, ప్రమీలా కేతావత్, విశ్వవిద్యాలయ మహిళా ఉద్యోగులు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్ కార్పొరేటర్ కార్యాలయంలో..



ఫిలింనగర్: ఫిలింనగర్‌లోని జూబ్లీహిల్స్ కార్పొరేటర్ క్యాంప్ కార్యాలయంలో శనివారం మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. డివిజన్‌లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన మహిళలతో కలిసి కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ కేక్ కట్ చేసిన అనంతరం మహిళలను సత్కరించారు.

మెపా ఆధ్వర్యంలో..

పంజగుట్ట: కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీ మేరకు ముదిరాజ్‌లను బీసీ డీ నుంచి ఏ లోకి మార్చాలని ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్(మెపా) అధ్యక్షుడు పులి దేవేందర్ డిమాండ్ చేశారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మెపా ఆధ్వర్యంలో ప్రపంచ మహిళా దినోత్సవ వేడుకలను శనివారం నిర్వహించారు. పలు రంగాల్లో విశేష సేవలు అందించిన ముదిరాజ్ మహిళలను సన్మానించారు. సమావేశంలో మెపా ప్రధాన కార్యదర్శి సంజీవన్ కుమార్, గౌరవాధ్యక్షుడు బి.జగన్‌మోహన్, కోట్ల పుష్పలత, చిరంజీవి, శీలం జ్యోతి, దాసరి శాంతకుమారి, స్వరూప, సుమలత, స్వాతి తదితరులు పాల్గొన్నారు.





చట్టాలను మరింత కఠినతరం చేయాలి

లక్డీకాపూల్: మహిళలపై లైంగికదాడులను అరికట్టేందుకు చట్టాలను కఠినతరం చేయాలని నిమ్స్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ మాజీ ప్రధాన కార్యదర్శి ఊర్మిల డిమాండ్ చేశారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని నిమ్స్‌లో యూనియన్ జనరల్ సెక్రటరీ నరసింహ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం జరిగింది. ఆమె మాట్లాడుతూ.. నిమ్స్‌లో విధులు నిర్వర్తిస్తున్న మహిళా ఉద్యోగినుల భద్రతకు యాజమాన్యం కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు.

ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో..



జూబ్లీహిల్స్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో సిబ్బందిని సత్కరిస్తున్న ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్

ఇందిరా సెల్ఫ్ హెల్ప్ గ్రూప్ ఆధ్వర్యంలో..

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డు నం–2లోని జవహర్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లో శనివారం మహిళా దినోత్సవ వేడుకలు జరిగాయి. ఇందిరా మహిళా సెల్ఫ్ హెల్ప్ గ్రూప్ ప్రెసిడెంట్ దీపాదేవి ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఫిలింనగర్ 18 బస్తీల సంక్షేమ సంఘం అధ్యక్షుడు మామిడి నర్సింగరావు ముఖ్యఅతిథిగా పాల్గొని మహిళా గ్రూపు సభ్యులను సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. మహిళా గ్రూపు నేతలు శారద, ప్రమీల, ఉమానాయుడు, నిర్మల తదితరులు పాల్గొన్నారు.



13న షిర్డీసాయి, లక్ష్మీ మహాయజ్ఞం



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

పంజగుట్ట: శ్రీసాయిభక్త్ లక్ష్మీబాయి షిండే ట్రస్ట్, షిర్డీ, నగరంలోని అన్ని సాయిబాబా మందిరాలు, సాయి భక్తుల ఆధ్వర్యంలో వచ్చేనెల 13న ఇందిరా పార్క్, ఎన్టీఆర్ గ్రౌండ్స్‌లో షిర్డీసాయి – లక్ష్మీ మహాయజ్ఞం మొదటిసారిగా నిర్వహిస్తున్నామని ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ అరుణ్‌రావు షిండే గైక్వాడ్ తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో కార్యక్రమ కరపత్రాన్ని ట్రస్ట్ ట్రస్టీ సంగీతా షిండే, టి.రామ్మోహన్‌రావు నాయుడు, డాక్టర్ కిషోర్ కుమార్‌తో కలిసి శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 26 సంవత్సరాలుగా షిరిడీలో ఈ మహా యజ్ఞాన్ని నిర్వహిస్తున్నట్లు, దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో నిర్వహించాలని సంకల్పించినట్లు తెలిపారు. మొదటిసారి 999 హోమగుండాలతో 999 జంటలతో యజ్ఞాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సాయిబాబా భక్తురాలు లక్ష్మీబాయికి స్వయంగా సాయిబాబా ఇచ్చిన 9 నాణేలను భక్తులకు చేతితో తాకే అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో వి.నాగేశ్వర్ రావు, బి.క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

చేనేతకు ప్రోత్సాహం అభినందనీయం



శ్రీనగర్‌కాలనీ: మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళల కోసం దేశంలోని ప్రముఖ నగరాలకు చెందిన చేనేతకారులను ఒకచోట చేర్చి వారి ఉత్పత్తులను నేరుగా వినియోగదారులకు అందించడం శుభపరిణామం అని మంత్రి కొండా సురేఖ అన్నారు. శ్రీనగర్‌కాలనీలోని సత్యసాయి నిగమాగమంలో ఇండియన్ సిల్క్ గ్యాలరీ పేరిట ఏర్పాటు చేసిన సిల్క్ ఎగ్జిబిషన్‌ను ఆమె శనివారం ప్రారంభించారు. చేనేతకళాకారుల ఉత్పత్తులను తిలకించి వారిని అభినందించారు. ఇక్కడి ఉత్పత్తులు చాలా అందంగా ఉన్నాయని, దేశంలోని అన్ని ప్రాంతాల చేనేతకారులను ప్రోత్సహిస్తున్న ఇండియన్ సిల్క్ గ్యాలరీ నిర్వాహకులు శ్రీనివాసరావు, వినయ్ కుమార్‌ను ప్రశంసించారు. సిల్క్ ఇండియా సీఈఓ వినయ్‌కుమార్, మినిస్ట్రీ ఆఫ్ టెక్స్‌టైల్స్ వీవర్స్ సర్వీస్ సెంటర్ హెడ్, డైరెక్టర్ డాక్టర్ అరుణ్‌కుమార్, డాక్టర్ ప్రవీణ్‌కుమార్, హ్యాపీ శ్రీదేవి, వైశైలజ, ఇందిరా గుమ్మల, సంధ్య జల్ల పాల్గొన్నారు.

అద్దె ఇల్లు ఇప్పిస్తామంటూ ఆన్‌లైన్ మోసం

- రూ.46,896లు కొల్లగొట్టిన వైనం
- పోలీసులను ఆశ్రయించిన బాధితురాలు

బంజారాహిల్స్: అద్దె ఇంటి కోసం ఆన్‌లైన్ సైట్‌ను సంప్రదించిన ఓ మహిళను ముగ్గురు వ్యక్తులు సైబర్ మోసానికి పాల్పడి రూ.46,896లను కాజేసిన ఘటన జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. గాయత్రీహిల్స్ రజ్వీ రెసిడెన్సీకి అయోనిజా అహల్యయాదవ్ ఈ నెల 4వ తేదీన అద్దె ఇంటికోసం హౌసింగ్.కామ్‌ను సంప్రదించింది. సైట్ ఆధారంగా విభాన్షు అగ్నిహోత్రి, రవిరాథోడ్‌ను వేర్వేరుగా సంప్రదించింది. ఇళ్లను చూపించాలంటే ఒకరు రూ.1,500, మరొకరు రూ.2 వేలను డిమాండ్ చేశారు. ఇందులో రవిరాథోడ్ పంపించిన క్యూఆర్ కోడ్‌తో అహల్యయాదవ్ యూపీఐ ద్వారా రూ.2 వేలను పంపించింది. డబ్బులు అందుకున్న అనంతరం రవిరాథోడ్ మరొకరు మిమ్మల్ని సంప్రదిస్తారని చెప్పాడు. రవి చెప్పిన ప్రకారం అమిత్‌భట్ అనే వ్యక్తి ఆమెకు ఫోన్ చేసి రూ.8,099లు పంపించాల్సిందిగా చెప్పడంతో ఆ మొత్తాన్ని పంపించింది. అయితే అమిత్‌భట్ ఆమెకు ఫోన్ చేసి రూ.8 వేలు, ఒకసారి, రూ.99లు ఒకసారి పంపించాలని, ముందు పంపించిన మొత్తాన్ని రీఫండ్ చేస్తానని నమ్మబలికాడు. దీంతో ఆమె మరోసారి ఆమె మొత్తాన్ని యూపీఐ పేమెంట్ చేసింది. ఆ తర్వాత ఆమె అకౌంట్ నుంచి 11 వేలు ఒకసారి, రూ.99లు ఒకసారి, రూ.16,196 బదిలీ అయ్యింది. దీంతో ఆమె మొత్తాన్ని తిరిగి పంపించాల్సిందిగా కోరగా ఆ డబ్బులను పంపించాలంటే మరోసారి రూ.22 వేలను చెల్లించాలని చెప్పాడు. తాను మోసపోయాయనని గ్రహించి జూబ్లీహిల్స్ పోలీసులను ఆశ్రయించింది.

వెల్‌నెస్‌కు అంకితం

సాక్షి, సిటీబ్యూరో: ప్రముఖ చెస్ క్రీడాకారుడు గ్రాండ్ మాస్టర్ అంకిత్ నగరంలోని జూబ్లీహిల్స్‌లో వెల్‌నెస్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మెగా ఇంజినీరింగ్ సంస్థ నిర్వాహకులు, సోషలైట్ సుధారెడ్డి ప్రారంభించారు. అంకిత్ మాట్లాడుతూ పిలాటిస్, యోగా, ధ్యానం మిళితం చేసి సమగ్రమైన హోలిస్టిక్ వెల్‌నెస్ పేరిట కొత్తగా డిజైన్ చేసి హైదరాబాద్‌కు పరిచయం చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో నగరానికి చెందిన పేజ్ త్రి ప్రముఖులు, వెల్ నెస్ నిపుణులు పాల్గొన్నారు.

ఎడ్యుకేషన్ ఫెయిర్‌కు స్పందన



బంజారాహిల్స్: బంజారాహిల్స్‌లోని తాజ్ డెక్కన్ హోటల్‌లో ఒరియంట్ స్పెక్ట్రా ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన అంతర్జాతీయ ఎడ్యుకేషన్ ఫెయిర్‌కు అపూర్వ స్పందన లభించినట్లు ఒరియెంట్ స్పెక్ట్రా మేనేజింగ్ డైరెక్టర్ ఎస్.శ్రీనివాస్ తెలిపారు. ఎడ్యుకేషన్ ఫెయిర్‌లో వివిధ దేశాల్లో ప్రసిద్ధిగాంచిన 50 యూనివర్సిటీలకు చెందిన ప్రతినిధులు హాజరై ఆయా దేశాల్లో లభిస్తున్న కోర్సులు, ఉపకార వేతనాలు, ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించారు.

స్వచ్ఛ కార్మికులతో కలిసి వేడుకలు



శ్రీనగర్‌కాలనీ: అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు శనివారం ఎల్లారెడ్డిగూడలో ఘనంగా నిర్వహించారు. సోమాజీగూడ కార్పొరేటర్ వనం సంగీత స్వచ్ఛ కార్మికులు, స్థానిక నేతలతో కలిసి వేడుకలను జరుపుకున్నారు. నేతలు వనం శ్రీనివాసయాదవ్, మనోజ్‌యాదవ్, చినబాబు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న హ్యాండ్ పెయింట్స్ చీరలు





బంజారాహిల్స్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం బంజారాహిల్స్ రోడ్ నం.12 ఎమ్మెల్యే కాలనీ కల్చరల్ సెంటర్ ఆవరణలో సద్గుణ ఆర్ట్ క్రియేషన్స్ ఆధ్వర్యంలో దుస్తుల ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంటుంది. 8, 9 తేదీల్లో రెండు రోజుల పాటు జరగనున్న ఈ ప్రదర్శనను కోమటిరెడ్డి సద్గుణ ఏర్పాటు చేశారు. హ్యాండ్ పెయింట్ ఫ్యాబ్రిక్స్, తంజావూరు పెయింటింగ్స్, చీరలపై జపనీస్ బొమ్మలు, మినీయేచర్స్, పిచాయి, తంజావూర్ స్టైల్ బొమ్మలతో చీరలు మహిళలను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఈ రంగంలో 30 ఏళ్ల అనుభవం ఉన్న సద్గుణ అరుదైన డిజైన్లతో ఆకట్టుకునే రంగులతో వీటిని రూపొందించి వీటిని తయారు చేయించారు. ఈ రంగంలో ఆమె విద్యార్థులకు శిక్షణ కూడా ఇస్తున్నారు. ఇక్కడ ఏర్పాటు చేసిన దుస్తుల ప్రదర్శనలో చీరలతో పాటు దుప్పట్టాలు, తంజావూరు పెయింటింగ్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

మైనర్ బాలికను నమ్మించి మోసం చేసిన వ్యక్తి అరెస్టు

ఫిలింనగర్: మైనర్ బాలికను ప్రేమించి పెళ్లి చేసుకుని లైంగిక దాడి చేసిన యువకుడిని ఫిలింనగర్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసుల వివరాల ప్రకారం.. స్థానికంగా నివాసం ఉండే 15 ఏళ్ల బాలికను కళ్యాణ్‌బాబు అనే యువకుడు ప్రేమించాడు. 2024లో ఆమెతో పారిపోయి వివాహం చేసుకున్నాడు. ఆమెపై అనేక సార్లు లైంగిక దోపిడీకి పాల్పడ్డాడు. ఇదిలా ఉండగా తన కూతురు తప్పిపోయినట్లు ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్‌లో బాలిక తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. ఆ తర్వాత బాలిక తిరిగి వచ్చి మళ్లీ సంక్రాంతి సెలవుల్లో వెళ్లిపోయింది. మళ్లీ ఇంటికి తిరిగి రావడానికి నిరాకరించింది. నిందితుడు కళ్యాణ్‌బాబుపై పోక్సో చట్టం, బాల్య వివాహ నిషేధ చట్టం, ఎస్సీ, ఎస్టీ చట్టం–1989 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి అరెస్టు చేసి కోర్టు ఎదుట హాజరుపరిచారు. నిందితుడిని జ్యుడిషియల్ కస్టడీకి అప్పగించాలని కోరారు. ఫిలింనగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

స్వాతంత్ర్య పోరాట యోధుల వర్ధంతిని ప్రభుత్వం నిర్వహించాలి

లిబర్టీ: స్వాతంత్ర్య పోరాట యోధులు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని లోక్‌దళ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, జాతీయ కార్యదర్శి పి.వి.రాజేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. స్వాతంత్ర్య పోరాటంలో బ్రిటిష్ సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా పోరాటం చేశారని గుర్తుచేశారు. ఆయన మాట్లాడుతూ భరత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల 94వ వర్ధంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని కోరారు.

బస్సులో బంగారు గొలుసు మాయం

పంజగుట్ట: ఆర్టీసీ బస్సులో చికిత్స కోసం నిమ్స్ ఆస్పత్రికి వస్తున్న వ్యక్తి మెడలో బంగారు గొలుసు మాయమైన ఘటన పంజగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. పాలకొల్లు నివాసి వసంతల సత్యనారాయణ 2011 సంవత్సరంలో గుండె బైపాస్ సర్జరీ నిమ్స్ ఆస్పత్రిలో చేయించుకున్నాడు. అప్పటి నుంచి తరచూ వైద్య పరీక్షల నిమిత్తం నిమ్స్‌కు వస్తుంటాడు. 6వ తేదీన వైద్య పరీక్షల నిమిత్తం పాలకొల్లు నుంచి నగరానికి వచ్చిన ఆయన కూకట్‌పల్లి, ఎల్లమ్మబండలోని బంధువుల ఇంటికి వెళ్లి అక్కడ ఉన్నాడు. శనివారం ఉదయం 9:30 గంటలకు కూకట్‌పల్లి నుంచి కోఠి వెళ్లే బస్సు ఎక్కి నిమ్స్ ఆస్పత్రి టిక్కెట్ కొన్నాడు. బస్సు నిమ్స్ ఆస్పత్రి వద్దకు రాగానే నలుగురు గుర్తుతెలియని వ్యక్తులు ఆయనను నెట్టారు. బస్సు దిగే తొందరలో గమనించని ఆయన బస్సు దిగిన తర్వాత చూసుకోగా మెడలోని 15 గ్రాముల గొలుసు కనిపించకుండా పోయింది. ఎర్రగడ్డలో ఎక్కిన గుర్తుతెలియని వ్యక్తులే గొలుసు కొట్టేసి ఉంటారని బాధితుడు పంజగుట్ట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ రంగంలో ఐవీఎఫ్ కేంద్రాలు

గచ్చిబౌలి: ప్రభుత్వ రంగంలోనూ ఐవీఎఫ్ కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. శనివారం కొండాపూర్‌లో ఓ ప్రైవేట్ ఫెర్టిలిటీ సెంటర్‌ను ఎమ్మెల్యే గాంధీతో కలిసి ఆయన ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ సంతానం కావాలనుకునే వారికి ఫెర్టిలిటీ సెంటర్లు ఆశాకిరణాలని అన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్, ఫెర్టిలిటీ సెంటర్ వ్యవస్థాపకురాలు డాక్టర్ స్ఫూర్తి తదితరులు పాల్గొన్నారు.

'వండని వంటలు' పరిచయం


సమావేశంలో మాట్లాడుతున్న రాణికుముదిని

నాంపల్లి: మారిన ఆహారపు అలవాట్లతో మన ఆరోగ్యాలు దెబ్బతింటున్నాయని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఐ.రాణీకుముదిని ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం రెడ్‌హిల్స్‌లోని ఫెడరేషన్ హౌస్‌లో రైతునేస్తం పబ్లికేషన్స్ ప్రచురించిన 'వండని వంటలు' పుస్తక పరిచయ కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ప్రకృతి సిద్ధంగా లభించే ఆహారాలను తీసుకుంటేనే మనం ఆరోగ్యంగా ఉంటామని చెప్పారు. పాకశాస్త్ర నిపుణులు మిల్లెట్ రాంబాబు, పద్మశ్రీ పురస్కార గ్రహీత యడ్లపల్లి వేంకటేశ్వరరావు తదితరులు మాట్లాడారు.

హింసను ఆపాలంటూ వాకథాన్


వాకథాన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి సీతక్క

ఖైరతాబాద్: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం ప్రసూతి అండ్ గైనకాలజికల్ సొసైటీ ఆఫ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో వాకథాన్ నిర్వహించారు. మహిళలపై హింస, ప్రాథమిక మానవ హక్కుల ఉల్లంఘనను ఆపడానికి 'ధీర' అనే ప్రచారాన్ని ముందుకు తీసుకువెళ్తూ నిర్వహించిన వాకథాన్‌ను ప్రసాద్ ఐమాక్స్ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం నుంచి నిర్వహించారు. ఈ వాకథాన్‌ను మంత్రి సీతక్క జెండా ఊపి ప్రారంభించారు. 'స్టాప్ వయలెన్స్ అగెనెస్ట్ ఉమెన్' అనే నినాదంతో సాగిన వాకథాన్‌లో మహిళలు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళలు బైక్ నడుపుతూ ఉత్సాహంగా వాకథాన్‌లో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, ధీర సంస్థ నిర్వాహకురాలు డాక్టర్ ఎస్.శాంత కుమారి, యశోద హాస్పిటల్ చైర్మన్ జీఎస్ రావు, సెంట్రల్ జోన్ డీసీపీ శిల్పవల్లి, డాక్టర్ సురేందర్, డాక్టర్ జమునాదేవి, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

గ్లోబల్ ఎడ్యుకేషన్ ఫెయిర్ ప్రారంభం



ఎడ్యుకేషన్ ఫెయిర్ ప్రారంభిస్తున్న బ్రిటీష్ డిప్యూటీ హైకమిషనర్ గ్యారెట్ విన్ ఓవెన్

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డు నెంబర్–1లోని హయత్ ప్లేస్ హోటల్‌లో శనివారం గ్లోబల్ ఎడ్యుకేషన్ ఫెయిర్–2025ను బ్రిటీష్ హైకమిషనర్ గ్యారెట్ విన్ ఓవెన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రపంచ ప్రఖ్యాత విశ్వవిద్యాలయాల ప్రతినిధులు అక్కడి అవకాశాల గురించి అడిగి తెలుసుకున్నారు. యూకే, ఆస్ట్రేలియా, జర్మనీ, ఫ్రాన్స్, ఐర్లాండ్, యూరప్ దేశాల్లో ప్రఖ్యాత యూనివర్సిటీలైన గిస్మా, ఎరియట్ వాట్ యూనివర్సిటీ, మాక్రో మీడియా యూనివర్సిటీ, యూనివర్సిటీ ఆఫ్ ఈస్ట్‌ల్యాండ్ యూనివర్సిటీ, ఆర్డన్ యూనివర్సిటీ, క్యూఏ గ్రూప్ విశ్వవిద్యాలయాల ప్రతినిధులు మాట్లాడుతూ కోర్సులు, పారితోషికం, వసతులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్లోబల్ ట్రీ ఫౌండర్ ఎండీ ఆలపాటి శ్రీకర్, కంట్రీ హెడ్ నమత్రా గోటి తదితరులు పాల్గొన్నారు.

10న గ్రేట్ తెలంగాణ మిలియన్ మార్చ్

పంజగుట్ట: ఈ నెల 10న గ్రేట్ తెలంగాణ మిలియన్ మార్చ్ డే నిర్వహిస్తున్నట్లు తెలంగాణ ఉద్యమకారుల జాయింట్ యాక్షన్ కమిటీ(టీయూ జేఏసీ) చైర్మన్ సుల్తాన్ యాదగిరి తెలిపారు. టీయూ జేఏసీ, తెలంగాణ ఉద్యమకారుల మహిళావేదిక, తెలంగాణ ఉద్యమ కళాకారుల వేదిక, తెలంగాణ విద్యార్థి ఉద్యమకారుల వేదిక, తెలంగాణ జర్నలిస్ట్ ఫ్రంట్‌ల సంయుక్త ఆధ్వర్యంలో సెక్రటేరియట్ ముందున్న అమరవీరుల జ్యోతి నుంచి గన్‌పార్క్ వరకు ఈ మార్చ్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో కార్యక్రమ కరపత్రాన్ని జేఏసీ సెక్రటరీ జనరల్ ప్రఫుల్ రాంరెడ్డి, జనరల్ సెక్రటరీ బత్తుల సోమయ్య, మోహన్ బైరాగిలతో కలిసి ఆవిష్కరించారు.

వివిధ రంగాల మహిళామణులకు సన్మానం


వివిధ రంగాల్లో ప్రసిద్ధి చెందిన మహిళలను సన్మానించిన దృశ్యం

రసూల్‌పురా: బొల్లారం రాష్ట్రపతి నిలయంలో మహిళా దినోత్సవాలు శనివారం ఘనంగా జరిగాయి. రాష్ట్రపతి పరిపాలనాధికారి రజనిప్రియా ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో నిష్ణాతులైన మహిళలను సన్మానించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎన్‌ఆర్‌ఎస్‌సీ డిప్యూటీ డైరెక్టర్ (విశ్రాంత) రాజశ్రీ వి. బోథలే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మానస స్కూల్ విద్యార్థులు నవదుర్గ నృత్యం, ఇతర పాఠశాల, కళాశాల విద్యార్థులు ఇచ్చిన వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు ఆహుతులను అలరించాయి. కార్యక్రమంలో ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ ఆలూరి విజయలక్ష్మి, తరుణి ఫౌండేషన్ వ్యవస్థాపకులు మమత రఘువీర్, ఐసీఎంఆర్–నిన్ సైంటిస్ట్ సిల్వియా ఫెర్నాండెజ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలనలో మహిళలకు పెద్దపీట

రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్


సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను సందర్శించిన మంత్రి పొన్నం ప్రభాకర్

చాంద్రాయణగుట్ట: కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజాపాలనలో మహిళల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నామని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఫలక్‌నుమా సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలను శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేసి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం వారితో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే ఉద్దేశంతో మహిళా సంఘాలతో ఆర్టీసీ బస్సుల నిర్వహణ చేపట్టినట్లు చెప్పారు. 65 లక్షల మంది మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు ఇచ్చి ఆర్థికంగా ఎదిగేందుకు ప్రోత్సాహం కల్పిస్తున్నామని వివరించారు. పోటీ ప్రపంచంలో మహిళలు అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా ఉండాలన్నారు. ప్రభుత్వం ఇస్తున్న అవకాశాలను బాలికలు అందిపుచ్చుకొని జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సూచించారు. స్థానిక సంస్థలలో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని స్పష్టం చేశారు. విద్యార్థినులు ఉన్నత విద్య అభ్యసించాలని సూచించారు. పాఠశాలల్లో అసౌకర్యాలు లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, బహదూర్‌పురా ఎమ్మెల్యే ముబీన్, రాష్ట్ర మత్స్య సహకార సంఘాల సమాఖ్య చైర్మన్ మెట్టు సాయి, బహదూర్‌పురా కాంగ్రెస్ ఇన్‌చార్జి పులిపాటి రాజేష్, ఫలక్‌నుమా కార్పొరేటర్ తారా బాయి మోతీలాల్ నాయక్ పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క


తెలంగాణ మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం డైరీని ఆవిష్కరిస్తున్న భట్టి విక్రమార్క

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: ఉద్యోగులకు నష్టం కలిగితే ప్రభుత్వానికి నష్టం జరిగినట్టేనని, వారి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క అన్నారు. శనివారం తెలంగాణ మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ తిప్పర్తి యాదయ్య ఆధ్వర్యంలో డైరీని భట్టి సచివాలయంలో ఆవిష్కరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి లోటు బడ్జెట్‌తోనే నడుస్తోందన్నారు. ఈ కార్యక్రమం వివరాలను తిప్పర్తి యాదయ్య బాగ్‌లింగంపల్లిలోని సంఘం కార్యాలయంలో వెల్లడించారు. కార్యక్రమంలో తెలంగాణ ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాస్‌రావు, యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగన్మోహన్, కమర్షియల్ ట్యాక్స్ ఉద్యోగుల సంఘం నేత శ్యామ్, మున్సిపల్ జేఏసీ కో చైర్మన్ వి.అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జైళ్ల శాఖ పనితీరు అభినందనీయం

జస్టిస్ రాధారాణి


చంచల్‌గూడ మహిళా జైల్లో జరిగిన మహిళా దినోత్సవంలో జస్టిస్ రాధారాణి

చంచల్‌గూడ: జైళ్లల్లో మగ్గుతున్న మహిళాఖైదీలను సంస్కరించి మళ్లీ సమాజంలోకి గౌరవంగా తిరిగి వచ్చేవిధంగా ప్రయత్నిస్తున్న జైళ్ల శాఖ పనితీరు అభినందనీయమని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాధారాణి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం చంచల్‌గూడలోని మహిళా జైలులో జరిగిన వేడుకలకు ఆమె ముఖ్యఅతిథిగా విచ్చేశారు. జైళ్ల శాఖ డీజీ డా.సౌమ్య మిశ్రా, డీఐజీ డా. శ్రీనివాస్‌తో కలిసి వేడుకలను ప్రారంభించారు. జస్టిస్ రాధారాణి మాట్లాడుతూ పశ్చాత్తాపం, పరివర్తన, హక్కులు, సంస్కరణలకు సంబంధించి హితబోధ చేశారు. ఈ సందర్భంగా పలువురు ఖైదీల నృత్యాలు, నాటకాలు అందరినీ అలరించాయి. అనంతరం వివిధ ఆటల పోటీల్లో గెలిచిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మహిళా జైలు సూపరింటెండెంట్ వెంకటలక్ష్మీ, అమరావతి, సిబ్బంది పాల్గొన్నారు.

మార్కెట్ కవులు మబ్బుల్లా చెదిరి.. మనసున్న కవులు చిరస్థాయిగా..


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ గోరటి వెంకన్న

గన్‌ఫౌండ్రీ: మార్కెట్ కవులు మబ్బుల్లా తేలిపోతారు మనసున్న కవులు చిరస్థాయిగా నిలిచి ఉంటారని ప్రజాకవి, శాసనమండలి సభ్యుడు గోరటి వెంకన్న అన్నారు. శనివారం రవీంద్ర భారతిలో విమల సాహితీ సమితి సంస్థ ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత్రి తురిమెళ్ల కల్యాణి రచించిన 'కలం నా గళం' పుస్తకావిష్కరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత కవుల సాహిత్యాన్ని నేటితరం కవులు చదవాలని సూచించారు. ప్రపంచంలోని దుఃఖం పోయేందుకు కవిత్వం రాయాలని కోరారు. ఈ సందర్భంగా నిర్వహించిన కవి సమ్మేళనం ఆకట్టుకుంది. కార్యక్రమంలో నవ్యాంధ్ర రచయితల సంఘం అధ్యక్షుడు బిక్కి కృష్ణ, విమల సాహితీ సమితి అధ్యక్షుడు విద్యాధర్, విశ్రాంత తెలుగు శాఖ అధ్యక్షుడు బీరం సుందరరావు, కవయిత్రి శైలజ మిత్ర తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలీలకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలి


అఖిల భారత పద్మశాలి మహాసభలో మాట్లాడుతున్న కందగట్ల స్వామి

కాచిగూడ: ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా అన్ని రంగాల్లో వెనుకబడిన పద్మశాలీలకు జనాభా ప్రాతిపదికన కాంగ్రెస్ పార్టీలో, ప్రభుత్వంలో ప్రాధాన్యం కల్పించాలని అఖిల భారత పద్మశాలీ సంఘం జాతీయ అధ్యక్షుడు కందగట్ల స్వామి సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. శనివారం నారాయణగూడలోని పద్మశాలి భవన్‌లో 17వ అఖిల భారత పద్మశాలి మహాసభలు కందగట్ల స్వామి అధ్యక్షతన జరిగాయి. దేశవ్యాప్తంగా ఉన్న పద్మశాలి ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పద్మశాలీలకు ఒక రాజ్యసభ, 4 ఎమ్మెల్సీలు, 4 కార్పొరేషన్ల చైర్మన్ పదవులు కేటాయించాలని కోరారు. 'జనాభాలో మేమెంతో.. మాకంతా వాటా ఇవ్వాలి' అనే నినాదంతో అఖిల భారత పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 9న నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో పద్మశాలీల భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. బహిరంగ సభకు సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరవుతారని తెలిపారు. పద్మశాలి సంఘం జాతీయ ప్రధానకార్యదర్శులు గడ్డం జగన్నాథం, వనం విశ్వనాథం, శ్రీధర్ ఎస్.సుంకుర్‌వార్, కొక్కుల దేవేందర్, వనం దుష్యంతల, డాక్టర్ పుట్ట పాండురంగయ్య పాల్గొన్నారు.

'నారీమణులకు నీరాజనం' పుస్తకావిష్కరణ


నారీమణులకు నీరాజనం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

మణికొండ: మహిళాలోకానికి ఎనలేని సేవలు చేసిన వారిని స్మరించుకునే క్రమంలో నారీమణులకు నీరాజనం కార్యక్రమంతోపాటు వారి ప్రసంగాల పుస్తకాన్ని శనివారం ఆవిష్కరించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని సుశీలా నారాయణరెడ్డి ట్రస్టు ఆధ్వర్యంలో మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని డాలర్స్‌హిల్స్‌లోని విశ్వంభర నిలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. ట్రస్టు అధ్యక్షురాలు సి.గంగ అధ్యక్షతన జరిగిన సదస్సులో స్వాతి శ్రీపాద మాట్లాడుతూ ప్రజాహిత, సాహిత్య రంగాల్లో శిఖర సమానురాలైన సరోజినీనాయుడు సేవల గురించి వివరించారు. ప్రముఖ భరతనాట్య విదూషీమణి రుక్మిణీ అరుండేల్ గురించి డాక్టర్ వేలూరి సుమిత్రా పార్థసారథి, సినీనటి కన్నాంబ గురించి గార్లపాటి పల్లవి, తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధురాలు ఆరుట్ల కమలాదేవి గురించి డాక్టర్ మారోజు దేవేంద్ర ప్రసంగించారు. కార్యక్రమంలో ట్రస్టు ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె.చెన్నయ్య, సినారె కుమార్తెలు గంగ, యమున, సరస్వతి, అల్లుళ్లు భాస్కర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

నగరంలో నేడు

- అస్త్ర పబ్లిషర్స్ ఆధ్వర్యంలో సోమాజిగూడలోని హైదరాబాద్ ప్రెస్ క్లబ్‌లో సాయంత్రం 5 గంటలకు కల్లూరి భాస్కరం తాజా రచన 'బహురూపులవాడు' పుస్తక పరిచయ కార్యక్రమం జరుగుతుంది.
- అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని సిరి ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెయింటింగ్స్ ఆధ్వర్యంలో మాసబ్‌ట్యాంక్‌లోని జేఎన్ఎఫ్ఏయూ కాలేజీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్‌లో సాయంత్రం 5 గంటలకు గ్రాండ్ పెయింటింగ్ ఎగ్జిబిషన్ కార్యక్రమం జరుగుతుంది.
- సద్గుణ ఆర్ట్ క్రియేషన్స్ ఆధ్వర్యంలో బంజారాహిల్స్ రోడ్ నెం.12 ఎమ్మెల్యే కాలనీ కల్చరల్ సెంటర్ ఆవరణలో ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు దుస్తుల ప్రదర్శన జరుగుతుంది.
- గచ్చిబౌలిలోని ట్రిపుల్ ఐటీ హైదరాబాద్ ప్రాంగణంలో టెక్ ఫర్ సస్టెనబుల్ ఫ్యూచర్స్ థీమ్‌తో రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ షో కేస్ కార్యక్రమం ఉదయం 11 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ప్రదర్శన జరుగుతుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

గ్రీన్ చానల్‌తో గుండె తరలింపు

- బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తి నుంచి అవయవాల సేకరణ
- అవయవాలను దానం చేసిన రైతు


జంగయ్య (ఫైల్)

మన్సూరాబాద్: బ్రెయిన్ డెడ్ అయిన ఓ రైతు నుంచి అవయవాలను జీవన్‌దాన్ సంస్థ సేకరించింది. ఎల్బీ నగర్ కామినేని హాస్పిటల్ నుంచి జూబ్లీహిల్స్ అపోలో హాస్పిటల్ వరకు గ్రీన్ చానల్ ఏర్పాటు చేసి గుండెను, అవయవాలను తరలించారు. వివరాల్లోకి వెళితే... నల్లగొండ జిల్లా పడమటిపల్లె గోకుల్‌నగర్‌కు చెందిన రైతు కడారి జంగయ్య(49) ఈ నెల 3న అకస్మాత్తుగా కింద పడిపోయాడు. కుటుంబసభ్యులు ఎల్బీనగర్ కామినేని హాస్పిటల్‌కు తరలించారు. చికిత్స అందించినా జంగయ్య శరీరం సహకరించకపోవడంతో బ్రెయిన్‌డెడ్ అయినట్లు వైద్యులు ప్రకటించారు. విషయం తెలుసుకున్న జీవన్‌దాన్ ప్రతినిధులు వచ్చి అవయవదానంపై జంగయ్య కుటుంబసభ్యులకు అవగాహన కల్పించడంతో అంగీకరించారు. గ్రీన్ చానల్ ఏర్పాటు చేసి అంబులెన్స్‌లో గుండెను, అవయవాలను రాత్రి 8.04 గంటలకు నాగోలు మెట్రోస్టేషన్‌కు చేర్చారు. అక్కడి నుంచి 8.35 గంటలకు జూబ్లీహిల్స్ మెట్రోస్టేషన్‌కు, ఆ తర్వాత రాత్రి 8.40 గంటలకు జూబ్లీహిల్స్‌లోని అపోలో హాస్పిటల్‌కు చేర్చారు.

మహిళాభివృద్ధే దేశాభివృద్ధి: కిషన్‌రెడ్డి


మహిళా దినోత్సవంలో మాట్లాడుతున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

కాచిగూడ: మహిళలు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా రాణించినప్పుడే దేశం అభివృద్ధిని సాధిస్తుందని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. శనివారం బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మహిళా దినోత్సవాలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కిషన్‌రెడ్డి మాట్లాడుతూ మహిళలు కూడా అభివృద్ధి చెందితేనే 2047 నాటికి మన దేశం అభివృద్ధి చెందిన దేశంగా, వికసిత్ భారత్‌గా మారుతుందన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ మహిళల ఆత్మగౌరవాన్ని నిలబెట్టేందుకు 12 కోట్ల ఇళ్లలో టాయిలెట్లు నిర్మించాలని నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. బస్తీల్లో పొదుపు సంఘాలను ప్రోత్సహించే దిశగా మహిళా మోర్చా కార్యకర్తలు కృషి చేయాలన్నారు. పొదుపు సంఘాలకు రూ.20 లక్షల వరకు రుణాలు ఇస్తూ కేంద్ర ప్రభుత్వం మహిళలను ప్రోత్సహిస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్, బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు లంకల దీపక్‌రెడ్డి, నాయకులు భరత్ గౌడ్, చంద్రశేఖర్, బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ శిల్పారెడ్డి, కార్పొరేటర్లు కన్నె ఉమా రమేష్ యాదవ్, వై.అమృత తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల జోలికొస్తే ఊరుకోం: ఈటల

హైడ్రా పేరిట నోటీసులివ్వడం విడ్డూరం


జగద్గిరిగుట్ట కొండపై ఉన్న ఆలయాలను పరిశీలిస్తున్న ఈటల

జగద్గిరిగుట్ట: హైడ్రా పేరిట ఆలయాలకు కూడా నోటీసులు ఇవ్వడం విడ్డూరమని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. హైటెక్ సిటీలో 50 ఎకరాలు కబ్జా చేసినవారిని వదిలేసి పేదలు కట్టుకున్న ఆలయాల జోలికి ఎందుకు వస్తున్నారని ప్రశ్నించారు. జగద్గిరిగుట్టలోని 17 ఆలయాలకు హైడ్రా కార్యాలయం నుంచి నోటీసులు జారీ చేశారని, ఆలయాలకు సంబంధించిన పత్రాలను సమర్పించాలని అందులో పేర్కొన్నారని తెలిపారు. ఈ మేరకు కొండపై ఉన్న పలు ఆలయాలను ఈటల శనివారం పరిశీలించారు. ఆంధ్రప్రదేశ్, బిహార్ మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ తదితర రాష్ట్రాల ప్రజలు ఉపాధి కోసం వచ్చి స్థానికులతో పాటు జగద్గిరిగుట్టలో నివసిస్తున్నారని, వారు చందాలు వేసుకుని కట్టుకున్న ఆలయాలను నిర్మించారే తప్ప కబ్జా చేయలేదని స్పష్టం చేశారు. హైడ్రా కారణంగా హైదరాబాద్ నగరానికి చెడ్డపేరు వస్తోందని, నల్లచెరువు వద్ద బుచ్చమ్మ అనే స్థానికురాలు హైడ్రా భయంతోనే ఆత్మహత్య చేసుకుందని అన్నారు. ఆలయాలకు ఇచ్చిన నోటీసులను వెనక్కు తీసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాస్తానని ఈటల పేర్కొన్నారు.

మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి


'సాక్షి' డైరెక్టర్ దివ్యారెడ్డిని సన్మానిస్తున్న ఎంఎల్‌ఆర్‌ఐటీ విద్యాసంస్థల అధినేత మర్రి లక్ష్మణ్‌రెడ్డి

దుండిగల్: మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణించాలని వెటరన్ అథ్లెట్, సాక్షి మీడియా గ్రూపు డైరెక్టర్ దివ్యారెడ్డి అన్నారు. మేడ్చల్ జిల్లా దుండిగల్‌లోని మర్రి లక్ష్మణ్‌రెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎంఎల్ఆర్ఐటీ) కళాశాలలో శనివారం నిర్వహించిన మహిళా దినోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దివ్యారెడ్డి మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఈ సందర్భంగా దివ్యారెడ్డి, లోకాయానాస్తక్ ఎన్జీవో ఫౌండర్ డాక్టర్ తులసి కుమారి, యోగా ట్రైనర్ త్రిపుర సుందరి, స్విమర్ క్వీన్ విక్టోరియాలను కళాశాల యాజమాన్యం ఘనంగా సత్కరించింది. కార్యక్రమంలో ఎంఎల్ఆర్ఐటీ కళాశాల చైర్మన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్‌రావు, డీన్ డాక్టర్ రాధికాదేవి, సీఎస్ఐటీ విభాగ అధిపతి డాక్టర్ సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

నీరా కేఫ్‌ను గౌడలకు అప్పగించాలి

లేదంటే ఉద్యమాలకు సిద్ధం

ఖైరతాబాద్: మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాలను లెక్కచేయని టూరిజం శాఖ ఎండీని సస్పెండ్ చేయాలని గౌడ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శనివారం నెక్లెస్ రోడ్డులోని నీరా కేఫ్‌లో గౌడ జన హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఎలికట్ట విజయ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ నీరా కేఫ్‌ను తిరిగి గౌడలకు అప్పగించాలన్నారు. టూరిజం ఎండీ తన బినామీ శంకర్‌రెడ్డికి మేలు జరిగేలా ఒప్పందం కుదుర్చుకున్నారని ఆరోపించారు. గౌడ కులస్తుల ఆత్మగౌరవ ప్రతీక నీరా కేఫ్ భవనాన్ని గీత కార్పొరేషన్ సంస్థకు దక్కకుండా కుట్ర చేస్తూ శంకర్‌రెడ్డిని ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. నీరా కేఫ్ భవనంలో గౌడ ప్రతిమలను తీసేశారని, చెట్లు నరికేశారని, బాధ్యులైన శంకర్ రెడ్డిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని అన్నారు. సమావేశంలో గౌడ సంఘాల నాయకులు బండి సాయన్న గౌడ్, చీకటి ప్రభాకర్ గౌడ్, చెక్కిళ్ల మధుసూదన్ గౌడ్, వంగా సదానందం గౌడ్, మల్లేశం గౌడ్, శ్రీకాంత్ గౌడ్, మహేష్‌గౌడ్, భవాని గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

'లయన్స్' డిస్ట్రిక్ట్ గవర్నర్‌గా మహేంద్రకుమార్‌రెడ్డి

రసూల్‌పురా: లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 320 ఏ 9వ వార్షిక సమావేశం కంటోన్మెంట్ క్లాసిక్ గార్డెన్‌లో శనివారం జరిగింది. ఇంటర్నేషనల్ డైరెక్టర్ జి.బాబురావు ముఖ్యఅతిథిగా హాజరైన ఈ సమావేశంలో డిస్ట్రిక్ట్ గవర్నర్‌గా డాక్టర్ జి.మహేంద్రకుమార్ రెడ్డి, మొదటి వైస్ గవర్నర్‌గా సురేష్ జాగ్ని, రెండో వైస్ గవర్నర్‌గా డా. కె.శశికాంత్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పూర్వ ఇంటర్నేషనల్ డైరెక్టర్ లయన్ ఆర్ సునీల్‌కుమార్, మల్టీపుల్ చైర్మన్ రాజిరెడ్డి, జిల్లా గవర్నర్ డి.కోటేశ్వర్‌రావు, ఇతర లయన్ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేంద్రకుమార్ రెడ్డి మాట్లాడుతూ ఈ పదవితో తనపై మరింత బాధ్యత పెరిగిందని, అందరి సహకారంతో సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని చెప్పారు. కార్యక్రమంలో రీజియన్ చైర్‌పర్సన్, జోన్ చైర్‌పర్సన్, వివిధ క్లబ్‌ల అధ్యక్ష కార్యదర్శులు, కోశాధికారులు పాల్గొన్నారు.

నిమ్స్‌లో 'గుండె' మార్పిడి సక్సెస్

రూ.40 లక్షల ఖర్చు అయ్యే చికిత్స ఉచితంగా.. ● వైద్యులకు ఆరోగ్య శాఖ మంత్రి రాజనర్సింహ ప్రశంసలు


గుండె మార్పిడి ఆపరేషన్ చేసిన నిమ్స్ వైద్యులు


గుండె మార్పిడి చేయించుకున్న అనిల్

లక్డీకాపూల్: మరో అరుదైన శస్త్ర చికిత్సను నిమ్స్ వైద్యులు విజయవంతంగా పూర్తి చేశారు. బ్రెయిన్ డెడ్ అయిన 24 ఏళ్ల వ్యక్తి నుంచి సేకరించిన గుండెను విజయవంతంగా మరో వ్యక్తికి అమర్చారు. వివరాల్లోకి వెళితే... హైదరాబాద్‌లోని రసూల్‌పూరాకు చెందిన పూజారి అనిల్ కుమార్(19) కొంత కాలంగా గుండెజబ్బుతో బాధపడుతున్నాడు. వైద్యుల సూచనల మేరకు అవయవ దాత కోసం జీవన్‌దాన్‌లో పేరు నమోదు చేసుకున్నాడు. రెండు రోజుల క్రితం ఓ యువకుడు రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం బ్రెయిన్ డెడ్ అయ్యాడు. అతడి రక్త నమూనాలు అనిల్ కుమార్‌కు సరిపోయాయి. దీంతో కార్డియోథొరాసిక్ హెచ్ఓడీ మాలెంపాటి అమరేశ్వరరావు, వైద్యులు గోపాల్, కళాధర్, నర్మదల బృందం అనిల్‌కుమార్‌కు గుండె మార్పిడి చేశారు. ఇప్పుడు అనిల్ ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. ఇదే తరహా గుండె మార్పిడి శస్త్రచికిత్సను కార్పొరేట్ ఆసుపత్రిలో చేయించుకుంటే సుమారు రూ.40 లక్షల ఖర్చు అవుతుందని, నిమ్స్‌లో రోగికి ఆరోగ్యశ్రీ పథకం, ముఖ్యమంత్రి సహాయ నిధి సాయంతో ఉచితంగా చికిత్స నిర్వహించామని ఆసుపత్రి డైరెక్టర్ నగరి బీరప్ప చెప్పారు.

నిమ్స్ వైద్యులకు ఆరోగ్యమంత్రి ప్రశంసలు...

నిమ్స్‌లో గుండె మార్పిడి శస్త్ర చికిత్స విజయవంతమైన సందర్భంగా ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ స్పందిస్తూ.. అవయవదాత కుటుంబ సభ్యులకు, ఆసుపత్రి కార్డియోథొరాసిక్ వైద్యులకు కృతజ్ఞతలు, అభినందనలు తెలిపారు. నిమ్స్‌లో ట్రాన్స్‌ప్లాంటేషన్ సేవలను మరింత విస్తరించాలని, అవసరమైన అన్ని వసతులు కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.

అవయవ మార్పిడులు ఇలా..

నిమ్స్ ఆసుపత్రిలో ఇప్పటి వరకు 15 గుండె, 2 ఊపిరితిత్తుల మార్పిడులు, మరో కంబైన్డ్ హార్ట్, లంగ్ ట్రాన్స్‌ప్లాంటేషన్ చేశారు. దేశంలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఏకకాలంలో హార్ట్, లంగ్ ట్రాన్స్‌ప్లాంటేషన్ చేయడం ఒక్క నిమ్స్‌లోనే జరిగిందని వైద్యులు పేర్కొంటున్నారు. నిమ్స్‌లో 2024–2025లో ఇప్పటివరకు మొత్తం 87 రకాల ట్రాన్స్‌ప్లాంటేషన్లు చేశారు.

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్, ఆదివారం, 9, మార్చి, 2025



విద్యార్థులకు ఆమె గణితం నేర్పాలనుకున్నారు. కానీ విధి లిఖితం ఆమెకు కొత్త రెక్కలు తొడిగింది. పక్షుల ప్రేమలో వేలమైళ్లు ప్రయాణించేలా చేసింది. ఐదేళ్లుగా విభిన్న రకాల పక్షులను గుర్తించారు. కాగా ఇప్పటి వరకూ 550కు పైగా జాతులను కెమెరాలో బంధించి రికార్డు సృష్టించారు. ఆమే నగరంలోని అమీన్‌పూర్ సమీపంలోని హెచ్‌ఎమ్‌టీ కాలనీలో నివసించే శ్యామల రూపాకుల.. పక్షి ప్రేమలో మునిగి తేలుతున్నారు. ఆ ప్రేమ ఆమెకు అనారోగ్యాలను దూరం చేయడం మాత్రమే కాదు.. కొత్త రికార్డులకు దగ్గర చేస్తోంది.

- సాక్షి, సిటీబ్యూరో

రెక్కలు తొడిగిన.. రెపరెపలు

పక్షులపై ప్రేమతో వేల మైళ్ల ప్రయాణం

- ఐదేళ్లుగా విభిన్న రకాల పక్షుల గుర్తింపు
- ఇప్పటి వరకూ 550పైగా జాతుల గుర్తింపుతో రికార్డ్
- ఇంటికి గెస్ట్‌గా పొన్నంకి పిట్ట రావడం విశేషం
- పక్షుల ప్రపంచంలో విహరిస్తున్న గృహిణి శ్యామల

‘ఆన్‌లైన్‌లో మ్యాథ్స్ ట్యూటర్‌గా పనిచేసేదాన్ని. కొన్ని ఆరోగ్య సమస్యలు నన్ను బాధించాయి. దీంతో ఆ పని వదిలేయాల్సి వచ్చింది. అనుకోకుండా బర్డ్ వాచర్‌గా మారాను’ అంటూ ఏడేళ్ల నాటి గతం గుర్తు చేసుకున్నారు శ్యామల. దాదాపు రికార్డు స్థాయిలో 550 పక్షులను గుర్తించి నగర బర్డ్ వాచర్స్ ప్రపంచంలో తనదైన ముద్రను వేసుకున్నారు. ఐటీ ఉద్యోగి అయిన భర్త బాలసుబ్రహ్మణ్యకుమార్ సహకారంతోనే తన హాబీని ఇంతగా ఆస్వాదించగలిగానని చెబుతున్నారు. ఆమె ప్రయాణానికి సంబంధించిన మరిన్ని విశేషాలు ఆమె మాటల్లోనే..



బీజం పడింది అక్కడే..

తొలుత జంతువుల పట్ల ఆసక్తితో వన్యప్రాణుల సంరక్షణా కేంద్రాలకు (వైల్డ్‌లైఫ్ శాంక్చురీ) వెళ్లేదాన్ని. బర్డ్ వాచింగ్ చేసినా మా ఇంటి దగ్గర్లో ఉన్న అమీన్‌పూర్ లేక్ వరకు మాత్రమే పరిమితమయ్యేదాన్ని. అయితే పక్షులపై వీరాభిమానానికి తొలిసారి బీజం పడింది మంజీరా వన్య ప్రాణుల సంరక్షణా కేంద్రానికి వెళ్లినప్పుడు. అక్కడ నాకు పరిచయమైన షివాస్ మాధురి దంపతులు.. నా బర్డ్ వాచింగ్ ఆసక్తిని గమనించి హైదరాబాద్ పాల్స్ గ్రూప్ గురించి చెప్పి నన్ను కూడా జాయిన్ చేశారు. అక్కడి నుంచి బర్డింగ్ కమ్యూనిటీలో స్నేహితుల మార్గదర్శకత్వంలో సీరియస్ బర్డ్ వాచింగ్ ప్రయాణం ప్రారంభమైంది. తమిళనాడు వెళ్లా. నవంబరు నుంచి ఫిబ్రవరి మధ్యలో నెలకు ఒకటైనా సరే కాస్త దూరంగా ఉండే ప్రాంతాలకు వెళ్తా. కేరళ రెండు సార్లు, ఉత్తరాఖండ్ మూడు సార్లు, కర్ణాటకకు ప్రతి యేటా వెళుతుంటాను. ఇక వారాంతాల్లో నరసాపూర్, క్రిష్టారెడ్డి లేక్, అనంతగిరి హిల్స్, ఉమామహేశ్వరం.. ఇలా ఎక్కడో ఒక ప్రాంతానికి వెళతాం. మన దేశంలో 1300లకు పైగా జాతులు ఉన్నాయి. ఇప్పటి వరకూ 550కి పైగా పక్షులను గుర్తించాను. మొత్తం అన్నీ గుర్తించాలనే లక్ష్యంగా పెట్టుకున్నాను.

రావోయీ అభిమాన అతిథీ..

మా ఇంట్లోనే ఒక చిన్న తోట పెంచుతున్నాం. పక్షుల రాక కోసమే ఇంట్లో డ్రిప్ సిస్టమ్ ఉంది. నీళ్ల కోసం దాదాపు 12 రకాల పక్షులు వస్తాయి. రోజూ పొద్దున్న, సాయంత్రం వాటిని చూస్తుంటే మనసు నిండిపోతుంది. గత సీజన్‌లో బర్డర్స్ ఫేవరెట్‌గా పేర్కొనే పొన్నంకి పిట్ట (ఇండియన్ పిట్ట) మా ఇంటికి వచ్చి ఏకంగా 4 రోజుల పాటు ఉండడం మరచిపోలేని, మధుర జ్ఞాపకం. ఇవి సాధారణంగా హిమాలయాల నుంచి వస్తాయని చెబుతారు. యేటా అక్టోబరు, నవంబర్ నెల్లో వచ్చి ఎండలు ముదిరినప్పుడు వెళ్లిపోతాయి. అలాంటి పక్షి.. మా ఇంటి పెరట్లో కొన్ని రోజుల పాటు ఉండడం గొప్ప జ్ఞాపకం. ప్రతి పక్షికీ ఓ పేరుంటుంది. ఒక్క జాతిలోనే అరడజను రకాలు ఉంటాయి. వాటి రెక్కల రంగు, పరిమాణం.. వంటి వాటిని బట్టి మనం గుర్తు పెట్టుకోవాల్సి ఉంటుంది. అలా గుర్తు పెట్టుకోవడం మొదట్లో చాలా కష్టం అనిపించేది. ఇప్పుడు అలవాటైంది.











ఎంతో సంతృప్తినిస్తోంది..

ప్రస్తుతం నగరంలో చాలా మంది బర్డ్ వాచర్స్‌గా మారుతున్నారు. పలువురు నాకు కాల్ చేసి పక్షుల రాకపోకల గురించి సమాచారం అడుగుతుంటే.. వాళ్లకి సమాధానం ఇస్తుండడం నాకెంత సంతృప్తిని అందిస్తుందో.. అభిరుచులను పంచుకోడాన్ని మించిన ఆనందం ఏముంటుంది? పైగా పక్షులను ప్రేమించడం అంటే ప్రకృతిని ప్రేమించడమే.. నీటి నుంచి నింగి వరకూ ప్రతి చోటా ప్రత్యక్షమయ్యే పక్షుల ద్వారా.. ప్రకృతిలోని అనువణువూ బర్డ్ వాచింగ్ మనకు పరిచయం చేస్తుంది. మరచిపోలేని జ్ఞాపకాలను అందిస్తుంది.

మూడేళ్ల మోక్ష్ ప్రపంచ రికార్డు

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్‌లోని భారతీయ విద్యాభవన్స్ ఆత్మకూరి రామారావు స్కూల్లో నర్సరీ చదువుతున్న మోక్ష్ అయాన్ సేవల ప్రపంచ రికార్డు సృష్టించాడు. మూడేళ్ల ఐదు నెలల వయసున్న ఈ చిన్నారి ఇటీవల జరిగిన వరల్డ్ వైడ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ టైటిట్‌లో భాగంగా అత్యంత వేగంగా పజిల్ సాల్వింగ్‌తో పాటు కలర్ మ్యాచింగ్‌లో అందరి కంటే ముందు నిలిచాడు. 3–5 ఏళ్ల కేటగిరీలో పాల్గొన్న మోక్ష్ కేవలం 11 సెకన్లలోనే ఈ పజిల్‌ను సాల్వ్ చేసి రికార్డ్ బ్రేక్ చేశాడు. పాఠశాలకు చెందిన ప్రీ ప్రైమరీ కో–ఆరినేటర్ విశాల్ అమిన్ మాట్లాడుతూ ఇంత చిన్న వయసులో ఈ ఘనత సాధించడం అద్భుతమన్నారు. విద్యార్థి ఘనతను స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీలతానాయర్ ప్రశంసించారు. ఈ ఘనత తమ స్కూలుకే గర్వకారణమని, భవిష్యత్తులో ఇలాంటి రికార్డులు మరిన్ని సాధించాలని ఆకాంక్షించారు. బాలుడికి పాఠశాల నుంచి సంపూర్ణ సహకారం, ప్రోత్సాహం లభిస్తుందన్నారు. ఇలాంటి విద్యార్థులు మిగతా వారికి స్ఫూర్తిగా నిలుస్తారన్నారు.



రెట్రో స్టైల్..

హార్లేస్ ఫైన్ బేకింగ్‌లో మహిళల సందడి





బండ్లగూడ: ట్రెండీ ఫ్యాషన్‌తో కనిపించే యువత రెట్రో స్టైల్ ఔట్ ఫిట్స్‌లో వావ్ అనిపించారు. అలనాటి ఫ్యాషన్, హెయిర్ స్టైల్స్.. కరోకె పాటలు.. వినోదభరితమైన ఆట పాటలకు హార్లేస్ రెట్రో రాయల్ వేదికైంది. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని హార్లేస్ ఇండియా టీఎస్‌పీఏ అప్పా జంక్షన్‌లోని హార్లేస్ ఫైన్ బేకింగ్‌లో శనివారం నిర్వహించారు. సాధారణ వేడుకకు భిన్నంగా సాగిన ఈ రెట్రో థీమ్ ప్రత్యేకంగా నిలిచింది. మహిళలు రెట్రో–శైలి దుస్తుల్లో స్వర్ణ యుగానికి తిరిగి జీవం పోసేలా అదరగొట్టారు. ఉల్లాసమైన వాతావరణంలో వినోదవంతంగా నిర్వహించిన ఈవెంట్‌లో మహిళలు, యువతులు పారోట్ టారో కార్డ్ రీడింగ్‌లు, నెయిల్ ఆర్ట్, వంటి ఆకర్షణీయమైన కార్యక్రమాలు నిర్వహించారు. మహిళల సాధికారత, స్ఫూర్తిని మరింత ప్రొత్సహించేందుకు ఇటువంటివి ఉపయోగపడతాయని సీఈవో సురేష్ నాయక్ తెలిపారు.

కొండల్లో.. గుట్టల్లో..

జీఎంఆర్ ఎరీనా శంషాబాద్ వేదికగా క్యాంప్ జీప్ రైడింగ్



సాక్షి, సిటీ బ్యూరో: నగరంలోని జీప్ ట్రావెల్ లవర్స్‌కు జీఎంఆర్ ఎరీనా శంషాబాద్ వేదికగా ఏర్పాటు చేసిన వినూత్న రైడింగ్ కార్యక్రమం అలరించింది. హైదరాబాద్ సిద్ధంగా ఉండు అంటూ క్యాంప్ జీప్ హైదరాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సాహసోపేత జీప్ డ్రైవ్‌లో పలువురు ఔత్సాహికులు పాల్గొన్నారు. ఈ డ్రైవ్ ఆదివారం కూడా కొనసాగనుంది. ఈ క్యాంప్ జీప్ డ్రైవ్ కొండలు గుట్టలు, జలపాతాల మధ్యలో నుంచి ఉల్లాసభరితంగా సాగుతుంది. జీప్ రైడింగ్ ప్రియులకు ఇదొక అద్భుత అనుభూతి. ఈ అవకాశాన్ని ఔత్సాహికులు వినియోగించుకోవాలని జీప్ ఇండియా బ్రాండ్ డైరెక్టర్ కుమార్ ప్రియేష్ తెలిపారు. లెజెండరీ రాంగ్లర్, మెరీడియన్, గ్రాండ్ చెరోకీ, కంపాస్ చక్రాలతో రయ్ రయ్ అంటూ జీపులు దూసుకెళ్ళాయి. యువ సాహసికుల కోసం ఏర్పాటు చేసిన రైడింగ్, ఫొటో బూత్ విశేషంగా ఆకట్టుకున్నాయి.

‘అంగడి’లో ఆదివాసీల ఉత్పత్తులు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డు నెంబర్–12లోని ఎమ్మెల్యే కాలనీ రోడ్డులో క్రాఫ్ట్ కౌన్సిల్ ఆఫ్ తెలంగాణలో అంగడి ది క్రాఫ్ట్ బజార్ నగరవాసులను విశేషంగా ఆకట్టుకుంటోంది. చేతి వృత్తులు, హస్త కళాకారులను ప్రోత్సహించేందుకు ఈ ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ నెల 8 నుంచి 10 వరకూ మూడు రోజుల పాటు ఉదయం 10 నుంచి రాత్రి 7 గంటల వరకూ అందుబాటులో ఉంటుంది. తెలంగాణ, కర్ణాటక, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర తదితర ప్రాంతాల ఆదివాసీ గిరిజన మహిళలు తమ చేతి వృత్తులతో, వివిధ రకాల డిజైన్లతో సందర్శకులను ఆకట్టుకుంటున్నారు. ఇందులో ముగ్గురు పద్మశ్రీ అవార్డు గ్రహీతలు తమ ఉత్పత్తులను ప్రదర్శించడం విశేషం. టెర్రకోట బొమ్మలు మరో ఆకర్షణగా నిలిచాయి. దేశ నలుమూలల నుంచి వచ్చిన ఆదివాసీలు మూడు రోజుల పాటు అంగడిలో తమ ఉత్పత్తులను ప్రదర్శించనున్నారు.







నగరంలో రెడ్ లారీ ఫిల్మ్ ఫెస్టివల్

సాక్షి, సిటీబ్యూరో: రెడ్ లారీ ఫిల్మ్ ఫెస్టివల్ 2025 హైదరాబాద్ ఎడిషన్‌కు ప్రసాద్ మల్టీప్లెక్స్ వేదికగా మారుతోంది. ఈ నెల 21 నుంచి 23 వరకూ మూడు రోజుల పాటు సినిమాల ప్రదర్శన ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. తెలుగు, ఇంగ్లిష్, ఫ్రెంచ్, జర్మన్, ఇటాలియన్, రష్యన్, స్పానిష్, తుర్కిష్, డానిష్, ఇస్లాండిక్, నార్వేజియన్, స్వీడిష్, వంటి 70 భాషల చిత్రాలను ప్రదర్శించనున్నారు. హ్యాపీ డేస్, వెన్ ద లైట్ బ్రేక్, ఫిల్మ్ లవర్స్, అయామ్ లెవెన్ వంటి ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన చిత్రాలను ప్రదర్శించనున్నారు. సినిమాటిక్ ఎక్సలెన్స్ కళాత్మక వ్యక్తీకరణ మిళితమై ఉంటుంది. రెడ్ లారీ ఫిల్మ్ ఫెస్టివల్ 2025లో తమ చిత్రాలను ప్రదర్శించడానికి ఆసక్తి ఉన్నవారు రిజిస్టర్ చేసుకోడానికి అవకాశం కల్పిస్తున్నారు. వివరాలకు అధికారిక వెబ్‌సైట్ https:// redlorryfilmfestival. com/ సందర్శించవచ్చు.

కాన్వాస్‌పై విజయ దరహాసం


సాధించాలనే తపన, పట్టుదల ముందు ఏ వైకల్యమూ అడ్డుకారాదని.. ప్రతిభ ఉండాలే కానీ అవార్డులు.. రివార్డులు.. వాటంతట అవే వస్తాయని నిరూపించింది.. ఆ యువతి. దివ్యాంగురాలన్న భావన లేకుండా పట్టుదలతో కాన్వాస్‌పై చిత్రలేఖనం నేర్చుకుని విమర్శకుల ప్రశంసలు పొందుతూ.. శభాష్ అనిపించుకుంటోంది.. ఆమే మేడ్చల్ జిల్లా శామీర్ పేట మండలం తుర్కపల్లికి చెందిన విజయలక్ష్మి. చిత్రకళతో పాటు సంగీతంలోనూ రాణిస్తూ.. ప్రముఖుల ప్రశంసలు పొందుతూ పలువురికి స్ఫూర్తిగా నిలుస్తోంది.

– శామీర్‌పేట్

- చిత్రలేఖనంలో దివ్యాంగురాలి ప్రతిభ
- పలు, అవార్డులు, రివార్డులతో గుర్తింపు
- గిన్నిస్ బుక్‌లో స్థానం దక్కించుకున్న విజయలక్ష్మి



తుర్కపల్లికి చెందిన విజయలక్ష్మి మూడేళ్ల వయసులో పోలియో వచ్చి రెండు కాళ్లు, కుడి చెయ్యి పనిచేయకుండా పోయాయి. తల్లిదండ్రులు నర్సింహులు, ప్రమీళ, అన్నా వదిన అనంద్, శ్రవంతి విజయలక్ష్మికి అండగా నిలిచారు. ఆమెలో ఆత్మస్థైర్యాన్ని, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించారు. దివ్యాంగురాలనే భావన కలుగకుండా చిత్రలేఖనంపై పట్టు సాధించేలా ప్రోత్సహించారు. మొదట్లో దినపత్రికలు, ఆదివారం ప్రచురణలలోని బొమ్మలను చూసి చిత్రలేఖనం నేర్చుకుంది. కష్టపడి డిగ్రీ పూర్తి చేసింది. పాఠశాల దశలోనే వివిధ చిత్రలేఖన పోటీల్లో బహుమతులు అందుకుంది.



చిన్ననాటి నుండే..

చిత్రలేఖనం అంటే చిన్ననాటి నుండే ఇష్టం. మా కుటుంబంలో ఆర్థిక సమస్యలు ఉన్నా ఎన్నడూ నిరాశపడకుండా కుటుంబ సభ్యుల పోత్సాహంతో ప్రాక్టీస్ చేశా. గిన్నిస్ వరల్డ్ రికార్డు నుంచి గోల్డ్ మెడల్ సాధించడం ఆనందాన్నిచ్చింది. అనేక మంది ప్రముఖుల ప్రశంసలు పొందాను.

– విజయలక్ష్మి, తుర్కపల్లి

అవార్డులు.. ప్రశంసలు..

విజయలక్ష్మి ప్రతిభను గుర్తించిన రాష్ట్ర వికలాంగుల సంఘం సహకారంతో రవీంద్ర భారతిలో పలుమార్లు చిత్రలేఖన ప్రదర్శనలు నిర్వహించి లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డును అందుకుంది. త్యాగరాయ గానసభలో ప్రతిభా పురస్కారాలను అందుకుంది. గిన్నిస్ వరల్డ్ రికార్డు సంస్థ చేపట్టిన ఆన్‌లైన్ కాంపిటేషన్‌లో వరుసగా మూడేళ్లు వరల్డ్ రికార్డ్ సర్టిఫికెట్‌తో పాటు అవార్డులను గెలుచుకుంది. తెలంగాణ ఐకాన్ 2024, బుల్లితెర అవార్డు, తెలంగాణ సేవారత్న–2025 వంటి అవార్డులనూ అందుకుంది. ఇప్పటివరకూ సుమారు వందకు పైగా రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ అవార్డులను అందుకుంది.

అకాన్‌లో నేడు బేకింగ్ వర్క్‌షాప్



సాక్షి, సిటీ బ్యూరో: రుచికరమైన కప్ కేకులను తయారు చేయడం నేర్చుకోవాలనుకుంటున్నారా..? ఐతే ఈ ఈవెంట్ మీ కోసమే. ఆదివారం మధ్యాహ్నం 1 గంటకు అకాన్‌లో బేకింగ్ వర్క్‌షాప్ నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా పిండి కలపడం నుంచి ఫ్రోస్టింగ్ పూర్తి చేయడం వరకూ స్వహస్తాలతో తయారు చేయవచ్చు. అంతేకాదు.. ఆయా రుచులను ఆస్వాదించవచ్చు. టికెట్ కొనుగోలు చేసుకున్న వారికి కప్‌కేక్ తయారీకి అవసరమైన ముడి పదార్థాలను సమకూరుస్తారు.

క్లుప్తంగా...

జనగణనలోనే కులగణన చేపట్టాలి: శ్రీనివాస్‌గౌడ్



సాక్షి, హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వం జనగణన సమయంలోనే కులగణన చేపట్టాలని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. దేశంలో ఏ కులంలో ఎంత మంది జనాభా ఉన్నారో అన్న ప్రామాణిక లెక్కలేవీ లేవన్నారు. రాజకీయ ప్రక్రియతోనే కులాల అభివృద్ధి సాధ్యమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. బెంగళూరులోని ప్యాలెస్ గ్రౌండ్‌లో నారాయణ గురు ట్రస్ట్, ఓబీసీ ఆర్గనైజేషన్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఓబీసీ సమావేశానికి ఓబీసీ జాతీయ సమాఖ్య ప్రధాన సలహాదారు వి.శ్రీనివాస్‌గౌడ్ పాల్గొని ప్రసంగించారు. దేశంలో 80 కోట్ల మంది కులవృత్తిదారులకు సరైన లెక్క లేదని, ఏ కుల వృత్తిపై ఎంతమంది ఆధారపడి జీవిస్తున్నారో తెలిస్తే వారి స్థితిగతులు జీవన విధానాలు మార్చడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. నారాయణ గురు, మహాత్మా జ్యోతిబా పూలే, పెరియార్ లాంటి మహనీయులు కులగణన కోసం ప్రయత్నం చేసినా.. ఇప్పటికీ కులగణనను సాధించలేకపోయామని శ్రీనివాస్‌గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ బీకే హరిప్రసాద్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే సునీల్ కుమార్, మాజీ ఎమ్మెల్యే సురేశ్ గుత్తేదార్, ప్రణవానంద స్వామి, విక్యానంద స్వామి, లక్ష్మీ నర్సయ్య, బాలరాజు గుత్తేదార్, చిన్నెగౌడ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ రాక కోసం ఎదురుచూస్తున్నాం

ఎంపీ చామల



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీని ఎండగట్టేందుకు అసెంబ్లీకి వస్తానని మాజీ సీఎం కేసీఆర్ చెబుతున్నారని, ఆయన రాక కోసమే తాము ఎదురు చూస్తున్నామని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి వ్యాఖ్యానించారు. శనివారం గాంధీభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేసీఆర్ పదేళ్ల దౌర్భాగ్య పాలన ఫలితంగానే రాష్ట్రం దివాళా తీసిందని మండిపడ్డారు. వారు చేసిన తప్పులను మాఫీ చేసే అక్షయ పాత్ర కాంగ్రెస్ ప్రభుత్వం వద్ద లేదన్నారు. ఊహాగానాలతో ప్రభుత్వం మీద తప్పుడు ప్రచారం చేస్తున్నారని, ప్రజా పాలనలో ప్రజలు మంత్రులను స్వేచ్ఛగా కలిసే అవకాశం ఉందని చామల తెలిపారు. గతంలో మాదిరి తాము ఎవరినీ అడ్డుకోబోమని స్పష్టం చేశారు.

భావజాల రంగంలో వాస్తవాలు ప్రజల దృష్టికి తీసుకెళ్లాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ



సాక్షి, హైదరాబాద్: భావజాల రంగంలో ముంచుకొస్తున్న ప్రమాదాన్ని ప్రజలకు వివరించేందుకు పార్టీ కార్యకర్తలు కృషి చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ పిలుపునిచ్చారు. సీనియర్ నేత జి.రాములు అధ్యక్షతన హైదరాబాద్ (ఆర్టీసీ క్రాస్‌రోడ్)లోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు ప్రభుత్వ రంగ సంస్థలన్నింటినీ కట్టబెట్టేందుకు పూనుకుంటోందని, కార్పొరేట్ దోపిడీ ప్రజలకు అర్థం కాకుండా ఉండేందుకు భావోద్వేగాలను రెచ్చగొట్టి ప్రజల మధ్య చీలికలు తీసుకొచ్చేందుకు యత్నిస్తోందని ఆరోపించారు. వాస్తవాలను, కార్పొరేట్ దోపిడీని ప్రజలకర్థమయ్యేలా విస్తృతంగా ప్రచారం నిర్వహించాలన్నారు. సీనియర్ నేత ఎంవీఎస్ శర్మ మాట్లాడుతూ మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా ప్రజానీకంలో పెద్ద ఎత్తున ప్రచారం చేపట్టి, లౌకిక శక్తులను విశాల ప్రాతిపదికన సమీకరించాలని పిలుపునిచ్చారు. దళితులు, మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు సిద్ధం కావాలన్నారు. లౌకిక, అభ్యుదయ తాత్విక భావాలను సంస్కరణ ఉద్యమ నేతల జీవితాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సాగర్, ఎండీ అబ్బాస్, ఎండీ జహంగీర్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీల బంధం కొనసాగుతోంది

బీఆర్ఎస్ నేత రావుల శ్రీధర్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీల బంధం కొనసాగుతోందని, మోదీ, రేవంత్‌లు బడే భాయ్ చోటే భాయ్ లాగా వ్యవహరిస్తూ బీఆర్ఎస్‌ను అఖిలపక్ష సమావేశానికి పిలిస్తే ఎలా? అని బీఆర్ఎస్ నేత రావుల శ్రీధర్‌రెడ్డి ప్రశ్నించారు. శనివారం తెలంగాణ భవన్‌లో విలేకరులతో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ ఎంపీలకు తెలంగాణ సమస్యలపై పార్లమెంట్‌లో పోరాడే సత్తా ఉందన్నారు. సీఎం, మంత్రుల మధ్య సమన్వయం లేదని ఆరోపించారు. ఆరు గ్యారంటీలు, 420 హామీలిచ్చినపుడు తమకు ఆర్థిక పరిస్థితి గురించి తెలుసు అన్నారని పేర్కొన్నారు. ఇప్పుడు నెలకు రూ.500 కోట్ల పెట్టుబడి వ్యయం చేసే స్థితిలో లేమంటూ సీఎం రాష్ట్రం పరువు తీస్తున్నారని రావుల మండిపడ్డారు. కాంట్రాక్టర్ల బిల్లులు చెల్లించాలని భట్టి చాంబర్ దగ్గర ధర్నా చేస్తుంటే మొహం చూపించలేక ఆయన వెనక గేటు నుంచి పారిపోయారని విమర్శించారు. కాంట్రాక్టర్లకు, సర్పంచులకు, ఉద్యోగులకు బిల్లులు చెల్లించని అసమర్థ ప్రభుత్వం ఇదని రావుల ధ్వజమెత్తారు.

పార్టీలకతీతంగా ఏకమవుదాం

కేంద్రం నుంచి నిధులు, ప్రాజెక్టులు, సహాయ సహకారాలు సాధించుకుందాం

రాష్ట్ర ఎంపీల ప్రత్యేక సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పిలుపు

సాక్షి, హైదరాబాద్: ''కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్ర అభివృద్ధి కోసం నిధులు, ప్రాజెక్టులు, సహాయ సహకారాలు కావాలి. ఇందుకోసం రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న లోక్‌సభ, రాజ్యసభ సభ్యులు పార్టీలకు అతీతంగా ఏకమవ్వాలి. రాష్ట్ర అవసరాలను, సమస్యలను పార్లమెంటులో లేవనెత్తాలి..''అని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్న రాష్ట్ర ప్రాజెక్టులు, నిధుల సాధన కోసం పార్లమెంటు బడ్జెట్ సమావేశాల్లో ఒత్తిడి తెచ్చేందుకు వీలుగా.. రాష్ట్ర ఎంపీలకు సమాచారం అందించేందుకు శనివారం ప్రజాభవన్‌లో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడారు.

సమాచారమంతా అందుబాటులో పెట్టాం

రాజకీయాలకు అతీతంగా ఈ సమావేశం ఏర్పాటు చేశామని, రాష్ట్రానికి చెందిన అందరు ఎంపీలకు సమాచారం ఇచ్చామని చెప్పారు. సమావేశానికి రావాలని కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్, ఎంఐఎం లోక్‌సభ, రాజ్యసభ ఎంపీలను తాను ప్రత్యేకంగా ఆహ్వానించానని.. అయినా బీజేపీ, బీఆర్ఎస్ సభ్యులు రాలేదని భట్టి తెలిపారు. వారు సమావేశానికి రాకపోయినప్పటికీ ఆయా పార్టీల ఎంపీలకు సమాచారం అందుబాటులో ఉండే విధంగా ఢిల్లీలోని రెసిడెంట్ కమిషనర్ కార్యాలయంతోపాటు ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి నివాసంలో సెక్రటేరియట్ ఏర్పాటు చేశామని వెల్లడించారు. ఆ సెక్రటేరియట్‌లో రాష్ట్రానికి రావాల్సిన నిధులు, ప్రాజెక్టుల వివరాలతోపాటు ఇతర రాష్ట్రాలకు కేంద్రం నుంచి అందుతున్న సాయం వివరాలను కూడా అందుబాటులో ఉంచుతామని తెలిపారు. పార్లమెంటు సభ్యులు వీలును బట్టి ప్రశ్నోత్తరాలు, జీరో అవర్ వంటి అవకాశాలను ఉపయోగించుకుని రాష్ట్ర అంశాలపై కేంద్రాన్ని ప్రశ్నించాలని కోరారు. రాష్ట్రానికి రావాల్సిన ప్రాజెక్టులు, నిధుల కోసం పార్లమెంటులో వాయిదా తీర్మానం ఇచ్చే అంశాన్ని కూడా పరిశీలిస్తున్నామని చెప్పారు. పునర్విభజన ద్వారా రాష్ట్రానికి రావాల్సిన హక్కులు, రీజనల్ రింగ్ రోడ్డు, మూసీ ప్రక్షాళన, టెక్స్‌టైల్ పార్కు, మెట్రో రైలు విస్తరణ, నవోదయ విద్యాలయాలు, నదుల అనుసంధానం వంటి ప్రాజెక్టులకు నిధుల మంజూరుపై రాష్ట్ర ఎంపీలు కేంద్రంపై ఒత్తిడి తేవాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న భట్టి విక్రమార్క. చిత్రంలో జితేందర్ రెడ్డి, అసదుద్దీన్ ఒవైసీ

త్వరలో మరో సమావేశం నిర్వహిస్తాం

ఈ సమావేశానికి హాజరుకావాలని బీజేపీ ఎంపీలు, కేంద్ర మంత్రులకు తాను స్వయంగా ఫోన్లు చేసి ఆహ్వానించానని.. కానీ తమకు సమయం లేదని, ఇతర కార్యక్రమాలు ఉన్నాయంటూ బీజేపీ సభ్యులు రాలేదని భట్టి చెప్పారు. బీజేపీ సభ్యులు కోరిన విధంగా ప్రభుత్వం వారం తర్వాత మరో సమావేశం ఏర్పాటు చేస్తుందని.. ఆ సమావేశానికైనా బీజేపీ, బీఆర్ఎస్ ఎంపీలు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు. సమావేశానికి రావాలని ఆయా పార్టీల ఎంపీలను తాను స్వయంగా కలిసి ఆహ్వానిస్తానని చెప్పారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం బీజేపీ, బీఆర్ఎస్ కలిసివస్తాయని ఆశిస్తున్నామన్నారు.

ప్రభుత్వ ప్రయత్నాన్ని స్వాగతిస్తున్నాం: అసదుద్దీన్

రాష్ట్రానికి కేంద్రం నుంచి రావాల్సిన నిధుల సమాచారాన్ని ఇచ్చేందుకు ఎంపీలతో ప్రభుత్వం సమావేశం ఏర్పాటు చేయడాన్ని స్వాగతిస్తున్నామని ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ చెప్పారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణ ప్రజల పట్ల నిష్పక్షపాతంగా వ్యవహరించడం లేదని.. ఆ పార్టీ నుంచి 8 మంది ఎంపీలు, ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్నా రాష్ట్రానికి న్యాయం జరగడం లేదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ఇతర రాష్ట్రాలకు అందిస్తున్న సాయాన్ని తెలంగాణకు కూడా ఇవ్వాలని కోరారు. రాష్ట్రానికి రావాల్సిన నిధుల కోసం ఎంఐఎం పక్షాన పార్లమెంటు లోపల, బయట పోరాటం చేస్తామన్నారు.

'రీజనల్' రోడ్డు నుంచి నవోదయ విద్యాలయాల వరకు..

ఎంపీల ప్రత్యేక సమావేశంలో ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కేంద్రం నుంచి రాష్ట్రానికి అవసరమైన, రావాల్సిన ప్రాజెక్టులు, నిధుల గురించి వివరించారు. మొత్తం 28 అంశాలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనలు, కేంద్ర ప్రభుత్వ స్పందన, ప్రస్తుత స్థితి ఏమిటన్నది తెలిపారు. అందులో రీజనల్ రింగ్‌రోడ్డు, ఓఆర్ఆర్ నుంచి రీజనల్ వరకు రేడియల్ రోడ్లు, మెట్రో రైలు విస్తరణ, మూసీ ప్రక్షాళన, గోదావరి–మూసీ లింకు ప్రాజెక్టు, హైదరాబాద్‌కు సీవరేజీ మాస్టర్ ప్లాన్, వరంగల్ అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, గ్రీన్‌ఫీల్డ్ హైవే, సింగరేణికి బొగ్గుబ్లాకుల కేటాయింపు, సెమీకండక్టర్ మిషన్, ఐపీఎస్‌ల సంఖ్య పెంపు, పవర్ సిస్టమ్ డెవలప్‌మెంట్ ఫండ్ కింద పథకాలు, పీఎం కుసుమ్–ఏ, బీ, సీల కింద సోలార్ ప్లాంట్లు, తాడిచర్ల బ్లాకు బొగ్గు తవ్వకాల లీజు, రుణాల రీస్ట్రక్చరింగ్, ఏపీ నుంచి రావాల్సిన నిధులు, రాష్ట్ర పునర్విభజన చట్టం ఆధారంగా రావాల్సిన నిధులు, 2014–15లో పొరపాటున ఏపీకి జమ అయిన సీసీఎఫ్ పథకాల నిధులు, లేబర్ వెల్ఫేర్ ఫండ్, ఏపీ పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ నుంచి రావాల్సిన నిధులు, ఎయిర్‌పోర్టుల అభివృద్ధి, 8 రైల్వే లైన్ల కనెక్టివిటీ, బయ్యారంలో స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు, రాష్ట్రంలోని వెనుకబడిన ప్రాంతాలకు రోడ్డు కనెక్టివిటీ, కాకతీయ మెగాటెక్స్‌టైల్ పార్కు ఏర్పాటు, 12 జిల్లాలకు జవహర్ నవోదయ విద్యాలయాల మంజూరు అంశాలను ప్రజెంటేషన్‌లో వివరించారు.

చాలాసార్లు కలిసినా ప్రయోజనం లేదు: ఎంపీ చామల

రాష్ట్ర అభివృద్ధి కోసం అవసరమైన నిధులు, ప్రాజెక్టులను మంజూరు చేయాలని కోరుతూ ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, కాంగ్రెస్ పార్టీ ఎంపీలు ఎన్ని సార్లు ప్రధానిని, సంబంధిత మంత్రులను కలిసినా ప్రయోజనం లేకుండా పోయిందని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధికి అవసరమైన నిధులు, ప్రాజెక్టుల గురించి వచ్చే బడ్జెట్ సమావేశాల్లో లేవనెత్తుతామని.. సభ లోపల మాట్లాడటంతోపాటు కేంద్ర మంత్రులను కలిసి వినతిపత్రాలు అందజేస్తామని చెప్పారు.

అన్ని రాష్ట్రాలకు సమన్యాయం జరగాలి

- లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనపై వక్తల డిమాండ్
- సీపీఐ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం

సాక్షి, హైదరాబాద్: లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనలో అన్ని రాష్ట్రాలకు సమన్యాయం జరిగే విధంగా సీట్ల సంఖ్య ఉండాలని, ఇందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. రాజ్యసభకు లోక్ సభతో సమాన అధికారాలు కల్పించాలని సూచించారు. 2026లో పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజన ఖాయమంటూ కేంద్ర ప్రభుత్వం ప్రకటనలు వెలువరిస్తున్న నేపథ్యంలో జనాభా ప్రాతిపదికన పునర్విభజన జరిగితే దక్షిణాది రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అలా కాకుండా తగిన రక్షణలు కల్పించాలని కోరారు. సీపీఐ రాష్ట్ర కార్యాలయంలో శనివారం 'లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన– దక్షిణాది రాష్ట్రాలపై ప్రభావం'అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ప్రొఫెసర్ జి.హరగోపాల్, జస్టిస్ చంద్రకుమార్, సీనియర్ సంపాదకుడు కె.శ్రీనివాస్, సీపీఐ సీనియర్ నేతలు కె.నారాయణ, సయ్యద్ అజీజ్, చాడ వెంకట్‌రెడ్డి, ఐఎఎల్ జాతీయ అధ్యక్షుడు బొమ్మగాని ప్రభాకర్, ఆర్థిక నిపుణుడు కె.పాపారావు మాట్లాడారు.

సమాఖ్య స్ఫూర్తికి అనుగుణంగా ఉండాలి: హరగోపాల్

ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజనను రాజ్యాంగంలోనే పొందుపర్చినప్పటికీ భారత సమాఖ్య స్ఫూర్తిని సైతం దృష్టిలో పెట్టుకోవాల్సిన అవసరముందన్నారు. దక్షిణాది రాష్ట్రాల్లో కుటుంబ నియంత్రణను గట్టిగా పాటించగా, ఉత్తరాది రాష్ట్రాల్లో వెనుకబాటుతనం, ఇతర కారణాల వల్ల నియంత్రణ పాటించకపోవడంతో జనాభా బాగా పెరిగిందని చెప్పారు. ఈ దృష్ట్యా బీజేపీ తన అధికారాన్ని శాశ్వతం చేసుకోవాలనే ఉద్దేశంతో జనాభా ప్రాతిపదికన పునర్విభజన పేరుతో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం చేస్తుందనే భయం సహజంగానే ఇక్కడి నేతల్లో నెలకొందని చెప్పారు. సీనియర్ సంపాదకుడు కె.శ్రీనివాస్ మాట్లాడుతూ నియోజకవర్గాల పునర్విభజన చేపడితే పార్లమెంట్‌లో దక్షిణాది, ఈశాన్య రాష్ట్రాల ప్రాధాన్యత తగ్గి, ఉత్తరాదిలో 4 రాష్ట్రాల ప్రాబల్యం బాగా పెరుగుతుందని అన్నారు. కాగా, అన్ని రంగాల్లో దక్షిణాది రాష్ట్రాలు వివక్షకు గురవుతున్నాయని ఈ ప్రాంత వాసుల్లో ఇప్పటికే ఓ భావన ఏర్పడిన తరుణంలో.. లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనను దేశ సమాఖ్య స్ఫూర్తికి ఏమాత్రం విఘాతం కలగకుండా చేపట్టాలని కూనంనేని సాంబశివరావు అన్నారు. కె.నారాయణ మాట్లాడుతూ.. నియోజకవర్గాల పునర్విభజనపై జాతీయ స్థాయిలో చర్చించి తమ పార్టీ కార్యాచరణను ప్రకటిస్తుందని చెప్పారు.



సమావేశంలో మాట్లాడుతున్న హరగోపాల్. చిత్రంలో కె.శ్రీనివాస్, కూనంనేని సాంబశివరావు

సోదరుల మధ్య గొడవ

మనస్తాపంతో ఉరేసుకున్న తొమ్మిదేళ్ల బాలుడు



రిషి

వెల్దండ: అన్నదమ్ముల మధ్య జరిగిన ఓ చిన్నపాటి గొడవలో అన్నల మీద అలిగిన తమ్ముడు ఇంట్లోకెళ్లి తాడుతో ఉరేసుకున్నాడు. ఈ ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలం అల్లంతోటబావి తండాలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, ఎస్ఐ కురుమూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా మాడ్గుల మండలం శనగలగట్టు తండాకు చెందిన రిషి (9) తన ఇద్దరు అన్నలతో కలిసి ఏడాది క్రితం అమ్మమ్మ గ్రామమైన అల్లంతోటబావి తండాకు వచ్చారు. ఈ పిల్లల తండ్రి దేన్యానాయక్ హైదరాబాద్‌లో ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. పిల్లల చదువుకు ఇబ్బంది కలుగుతుందని గతేడాది అమ్మమ్మ వద్దకు పంపించారు. తండాలోని ప్రభుత్వ పాఠశాలలో రిషి రెండో తరగతి, ఓ అన్న నాలుగో తరగతి చదువుతుండగా, మరో అన్న వెల్దండలోని జెడ్పీహెచ్ఎస్‌లో విద్యాభ్యాసం చేస్తున్నాడు. శనివారం తాత మేకల కాపలాకు వెళ్లగా, అమ్మమ్మ కూలీ పనులకు వెళ్లింది. అన్నదమ్ములు ఆడుకుంటుండగా జరిగిన చిన్నపాటి గొడవతో రిషి అలిగి ఇంట్లోకి వెళ్లాడు. ఇంట్లో బట్టలకోసం ఏర్పాటు చేసిన తాడుకు స్టూల్ ఎక్కి ఉరేసుకున్నాడు. తమ్ముడు ఇంట్లో నుంచి ఎంతకీ రాకపోవడంతో అన్నదమ్ములు వెళ్లి చూసేసరికి తాడుకు వేలాడుతూ కనిపించాడు. వెంటనే ఇంటి పక్కనే ఉన్న మహిళ సహాయంతో వెల్దండలోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే రిషి మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుని తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

చంద్రబాబు క్షుద్ర రాజకీయం

వైఎస్ వివేకా హత్య కేసు దర్యాప్తును పక్కదారి పట్టించే కుతంత్రం



రంగన్న (ఫైల్‌ఫొటో)

సాక్షి, అమరావతి: మాజీ ఎంపీ వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసు దర్యాప్తును పక్కదారి పట్టించి, తమ రాజకీయ ప్రయోజనాల కోసం దుష్ప్రచార కుట్రకు టీడీపీ కూటమి ప్రభుత్వం మరోమారు తెరతీసింది. ఈ కేసులో సాక్షిగా ఉన్న వాచ్‌మేన్ రంగన్న అనారోగ్యంతో మరణిస్తే, ఆ ఉదంతాన్ని వక్రీకరిస్తూ కుతంత్రం పన్నుతోంది. సీబీఐ దర్యాప్తు చేస్తున్న కేసు పరిధిలోకి రాష్ట్ర పోలీసులను జొప్పించడం ద్వారా చంద్రబాబు తన కుయుక్తులను చాటుకున్నారు. ఇందుకోసం ఏకంగా రాష్ట్ర మంత్రి మండలి సమావేశాన్ని వేదికగా చేసుకోవడం కూటమి ప్రభుత్వ పన్నాగానికి నిదర్శనం. నాడు చంద్రబాబు ప్రభుత్వ హయాంలోనే 2019 మార్చి 14న వైఎస్ వివేకా హత్యకు గురవ్వగా, ప్రస్తుతం అదే చంద్రబాబు ప్రభుత్వంలో రంగన్న మరణించారన్న వాస్తవాలను కప్పిపుచ్చుతూ తిమ్మిని బమ్మి చేసేందుకు బరి తెగిస్తున్నారు. వాస్తవంగా ఇందుకు బాధ్యత వహించాల్సింది టీడీపీ ప్రభుత్వం. కానీ అందుకు విరుద్ధంగా వివేకా హత్య వెనుక ఉన్న కుట్రను కప్పి పుచ్చేందుకే ఇలా చేస్తున్నారని తెలుస్తోంది. దీర్ఘకాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్న రంగన్నను తొలుత పులివెందుల ఆసుపత్రికి, అనంతరం కడపలోని రిమ్స్ ఆసుపత్రికి కుటుంబ సభ్యులు తీసుకెళ్లి చికిత్స చేయించినా ఫలితం లేకపోయింది. ఈ సహజ మరణానికి రాజకీయ రంగు పులమాలన్న ఆలోచన రావడం ఒక్క చంద్రబాబు ముఠాకే సాధ్యమైంది. ఎవరికైనా, ఏమైనా సందేహాలు ఉంటే ఈ కేసును విచారిస్తున్న సీబీఐకి నివేదించాలి. ఇంకోవైపు న్యాయస్థానంలో విచారణ ప్రక్రియ కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో రంగన్నతోపాటు గత ఐదేళ్లలో సంభవించిన మరికొన్ని సహజ మరణాలపై దర్యాప్తునకు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) నియమించారు. తద్వారా వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు దర్యాప్తును పరోక్షంగానైనా సరే రాష్ట్ర పోలీసులకు అప్పగించాలన్నది చంద్రబాబు కుతంత్రమని స్పష్టమవుతోంది. తద్వారా తన రాజకీయ ప్రయోజనాలకు అనుగుణంగా వైఎస్సార్‌సీపీపై దుష్ప్రచారం చేసే కుట్రను అమలు చేయాలన్నది అసలు ఉద్దేశం. అందుకే కుట్ర పూరితంగా గురువారం బీజేపీ ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డితో అసెంబ్లీలో మాట్లాడించి, ఆ రాత్రికే సిట్‌ను నియమిస్తున్నట్టు ప్రకటించారు. రెడ్‌బుక్ కుట్రలను అమలు చేసేందుకే ప్రత్యేకంగా వైఎస్సార్ జిల్లా ఎస్పీగా నియమించిన ఈ.జి.అశోక్ కుమార్‌తోనూ అదే రాత్రి హడావుడిగా మాట్లాడించారు.

మంత్రివర్గ సమావేశం వేదికగా కుట్ర

వెలగపూడిలోని సచివాలయంలో శుక్రవారం మంత్రి మండలి సమావేశంలో అజెండా అంశాలపై చర్చ అనంతరం.. ముందస్తు పన్నాగం ప్రకారం వాచ్‌మేన్ రంగన్న మృతిపై చర్చకు తెరతీశారు. ఏకంగా డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తాను మంత్రి మండలి సమావేశ మందిరంలోకి పిలిపించి రంగన్న మృతిపై ఆరా తీసినట్లు హైడ్రామా నడిపారు. ముందు ఇచ్చిన స్క్రిప్టు ప్రకారమే డీజీపీ గుప్తా తన పాత్రలో నటించారు. రంగన్నది అనుమానాస్పద మృతేనని ఆయన ఏకపక్షంగా ప్రకటించడం విడ్డూరం. కనీసం ప్రాథమిక దర్యాప్తు కూడా పూర్తి కాకుండానే... పోస్టుమార్టం నివేదిక కూడా రాకుండానే డీజీపీ స్థాయి అధికారి ఇలా ఏకపక్షంగా ప్రకటించడం గమనార్హం. తద్వారా రంగన్న మృతి ఉదంతాన్ని తాము ఎలా వక్రీకరించాలనుకుంటున్నారో మంత్రి మండలి సమావేశం వేదికగానే ప్రకటించారు.

బాబు గూటిలో చిలుకే దస్తగిరి

వైఎస్ వివేకా హత్య కేసు దర్యాప్తును పక్కదారి పట్టించేందుకు చంద్రబాబు కుట్రకు పరాకాష్ట దస్తగిరి అప్రూవర్‌గా మారడం. స్వయంగా వివేకానందరెడ్డిని దారుణంగా హత్య చేశానని అంగీకరించిన అతన్ని అప్రూవర్‌గా మార్చడం న్యాయ నిపుణులను విభ్రాంతికి గురి చేసింది. దస్తగిరిని అప్రూవర్‌గా మార్చడం ద్వారా తాము లక్ష్యంగా చేసుకున్న వారి పేర్లను అతనితో వాంగ్మూలం ద్వారా చెప్పించడం అన్నది టీడీపీ పకడ్బందీ కుట్రకు తార్కాణం. అప్రూవర్‌గా మారక ముందు అతను ఇచ్చిన వాంగ్మూలం, అప్రూవర్‌గా మారిన తర్వాత ఇచ్చిన వాంగ్మూలం పూర్తి పరస్పర విరుద్ధంగా ఉన్నాయి. అత్యంత నేర చరిత్ర కలిగిన దస్తగిరి వైఎస్ వివేకా హత్యకు కొన్ని రోజుల ముందు వరకు రూ.500 కోసం కూడా అప్పులు చేసే దయనీయ స్థితిలో ఉండేవాడు. స్నేహితుడు సునీల్ యాదవ్‌తో అతని వాట్సాప్ చాటింగులే ఆ విషయాన్ని నిర్ధారించాయి. అటువంటి దస్తగిరి అప్రూవర్‌గా మారిపోగానే... అతని వద్దకు కోట్లాది రూపాయలు ఎలా వచ్చాయన్నది ఈ కేసులో అత్యంత కీలకం. ఇతను బహిరంగంగా సాగిస్తున్న దందాగిరీ అంతా ఇంతా కాదు. ఇలాంటి కిరాయి రౌడీకి సిద్ధార్థ లూథ్రా వంటి ఢిల్లీ స్థాయి లాయర్లు కేసు వాదిస్తుండటం గమనార్హం. గురువారం ఢిల్లీ వెళ్లిన చంద్రబాబు లూథ్రాతో రహస్యంగా సమావేశం కావడం గమనార్హం. అనంతరమే రాష్ట్ర ప్రభుత్వం సిట్‌ను నియమించింది.

వివేకా రెండో భార్య వాంగ్మూలాన్ని పట్టించుకోరా?

వైఎస్ వివేకానందరెడ్డి రెండో భార్య షమీమ్ ఆవేదనతో ఇచ్చిన వాంగ్మూలాన్ని అటు సీబీఐ, ఇటు చంద్రబాబు ప్రభుత్వం ఉద్దేశ పూర్వకంగా విస్మరిస్తున్నాయి. ఆమెతో రెండో వివాహంతోనే వివేకా కుటుంబంలో విభేదాలు ఏర్పడ్డాయి. షమీమ్‌కు ఆస్తిలో వాటా ఇస్తానని చెప్పడంతోపాటు ఆమె కుమారుడిని తన రాజకీయ వారసుడిగా ప్రకటిస్తానని వివేకా చెప్పడాన్ని ఆయన మొదటి భార్య సౌభాగ్యమ్మ, కుమార్తె సునీత, అల్లుడు నర్రెడ్డి రాజశేఖర్‌రెడ్డి తీవ్రంగా వ్యతిరేకించారు. షమీమ్‌ను సునీత తీవ్రంగా దూషిస్తూ అవమానించారు. వారిద్దరి మధ్య వాట్సాప్ చాటింగ్‌లు ఆ విషయాన్ని బయట పెట్టాయి. వివేకా హత్య వెనుక ఆయన సొంత కుటుంబ సభ్యులు అంటే కుమార్తె సునీత, అల్లుడు నర్రెడ్డి రాజశేఖర్ రెడ్డి, పెద్ద బావమరిది నర్రెడ్డి శివ ప్రకాశ్ రెడ్డి పాత్ర ఉందని షమీమ్ వాంగ్మూలం ఇచ్చారు. మరి ఆ అంశానికి చంద్రబాబు ప్రభుత్వం ప్రాధాన్యం ఇవ్వడం లేదన్నది ప్రశ్నార్థకంగా మారింది. తద్వారా వైఎస్ వివేకా హత్య వెనుక కారణాలను కప్పిపుచ్చి, తమ రాజకీయ ప్రయోజనాలే లక్ష్యంగా ముందుకెళ్లాలని టీడీపీ కూటమి ప్రభుత్వం భావిస్తోందనని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

ముక్కంటి సేవలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి



శ్రీకాళహస్తి ఆలయంలో కుటుంబ సభ్యులు, అధికారులతో న్యాయమూర్తి జస్టిస్ మన్మోహన్

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని శనివారం సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మన్మోహన్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. దక్షిణ గోపురం వద్ద ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికారు. ముందుగా జస్టిస్ మన్మోహన్ కుటుంబ సభ్యులు ప్రత్యేక రాహుకేతు సర్పదోష నివారణ పూజలను చేయించుకున్నారు. అనంతరం స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. మృత్యుంజయస్వామి సన్నిధిలో వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

మీ ఆహ్వానం ఆలస్యంగా అందింది

డిప్యూటీ సీఎం భట్టికి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి లేఖ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రానికి సంబంధించిన ప్రాధాన్యత అంశాల సమావేశంపై తమ పార్టీ ఎంపీలకు ఆలస్యంగా సమాచారం అందిందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి తెలిపారు. 'ఈ భేటీకి ఆహ్వానిస్తూ మీరు పంపిన లేఖ అందినా, కీలకమైన అంశాలపై అర్థవంతమైన చర్చ జరిగేందుకు కనీస సమయం అవసరమనే విషయం మీకు తెలిసిందే'అని భట్టికి రాసిన లేఖలో పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి ఆలస్యంగా బీజేపీ ఎంపీలకు ఈ భేటీకి సంబంధించిన సమాచారం చేరిందన్నారు. భవిష్యత్తులో ఎప్పుడైనా ఇలాంటి సమావేశాలు నిర్వహించాలని భావిస్తే కాస్త ముందుగానే తెలియజేస్తారని ఆశిస్తున్నామన్నారు. దీంతో పాటు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ముందుగా నిర్ణయించిన అధికార, అనధికార కార్యక్రమాల కారణంగా శనివారం నాటి సమావేశానికి బీజేపీ ఎంపీలు హాజరుకావడం లేదని తెలిపారు. బీజేపీ ఎంపీలు వారివారి నియోజకవర్గాల్లో ముందస్తుగా నిర్ణయించిన కార్యక్రమాల్లో పాల్గొనాల్సి ఉందన్నారు. 'ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం తెలంగాణ అభివృద్ధికి కట్టుబడి ఉంది'అని లేఖలో కిషన్‌రెడ్డి తెలియజేశారు.

ఏఐతో పాఠశాల విద్యార్థులకు స్కిల్ డెవలప్‌మెంట్‌లో శిక్షణ

ఐటీ, పరిశ్రమల మంత్రి శ్రీధర్‌బాబు



కే-స్కిల్ యాప్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు. చిత్రంలో దిల్ రాజు తదితరులు

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు కృత్రిమ మేధస్సు (ఏఐ) సాయంతో 'స్కిల్ డెవలప్‌మెంట్'లో శిక్షణ ఇవ్వనున్నట్లు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా తమ బోధనా సామర్థ్యాలను మరింత పెంపొందించుకునేందుకు ప్రభుత్వ ఉపాధ్యాయులను ప్రోత్సహిస్తామన్నారు. సచివాలయంలో శనివారం తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్ దిల్ రాజు ఆధ్వర్యంలో కోణం ఫౌండేషన్ నిర్వాహకులు సందీప్ కుమార్ మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు మాట్లాడుతూ, అన్ని రంగాల్లో ఎమర్జింగ్ టెక్నాలజీని సమర్థవంతంగా వినియోగించుకునేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని వివరించారు. ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్య (పీపీపీ) విధానంలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా 'ఏఐ సిటీ'ని ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఇక్కడే అంతర్జాతీయ ప్రమాణాలతో ఏఐ యూనివర్సిటీని కూడా ప్రారంభించబోతున్నామన్నారు. నల్లగొండ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఏఐ సాయంతో ఉచితంగా స్కిల్ డెవలప్‌మెంట్‌లో శిక్షణ ఇస్తున్న ఫౌండేషన్ సేవలను అభినందించారు. విదేశాల్లో ఉన్నత స్థాయిలో స్థిరపడిన సందీప్ కుమార్.. పుట్టిన ఊరిని మర్చిపోకుండా ఫౌండేషన్ తరఫున అనేక సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తున్నారని మంత్రి ప్రశంసించారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఐటీ సలహాదారు సాయికృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కే-స్కిల్ యాప్‌ను ఆవిష్కరించారు.

అడుగు ముందుకు పడని 'హైటెక్ ఎలక్ట్రానిక్స్ పార్కు'

- ఏడాది కాలంగా కేంద్రం అనుమతి కోసం ఎదురుచూపు
- ముచ్చర్ల ఫార్మాసిటీ భూముల్లో ప్రతిపాదన
- 623.47 ఎకరాలు కేటాయించిన రాష్ట్ర ప్రభుత్వం
- గత ఏడాది మార్చిలో కేంద్రానికి డీపీఆర్
- యక్ష ప్రశ్నలతో కొర్రీలు పెడుతున్న ఢిల్లీ అధికారులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఎలక్ట్రానిక్ పరిశ్రమ విస్తరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన 'హైటెక్ ఎలక్ట్రానిక్స్ పార్కు'ఏర్పాటు ఒక్క అడుగు కూడా ముందుకు పడటంలేదు. రంగారెడ్డి జిల్లా ముచ్చర్లలో గతంలో ఫార్మాసిటీ ఏర్పాటు కోసం ప్రతిపాదించిన భూముల్లో ఎలక్ట్రానిక్స్ తయారీ క్లస్టర్ల విస్తరణలో భాగంగా ఈ పార్కును ప్రభుత్వం ప్రతిపాదించింది. ఇందుకోసం 623.42 ఎకరాల భూమిని కేటాయించింది. కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖ నిబంధనలకు అనుగుణంగా గ్రీన్‌ఫీల్డ్ ఇంటిగ్రేటెడ్ ఇండస్ట్రియల్ పార్కులో భాగంగా ఈ హైటెక్ పార్కును ఏర్పాటు చేయనున్నారు. ఇందుకోసం గత ఏడాది మార్చిలోనే తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పన సంస్థ (టీజీఐఐసీ) ద్వారా కేంద్రానికి సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)ను ప్రభుత్వం పంపింది.

సందేహాలు నివృత్తి చేసినా..

కేంద్ర ప్రభుత్వ సహాయ నిరాకరణతో ఏడాది కాలంగా 'హైటెక్ ఎలక్ట్రానిక్స్ పార్కు'ఏర్పాటు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా మారిందని రాష్ట్ర ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. ఈ ప్రాజెక్టు కోసం ప్రతిపాదించిన భూమి ఎలాంటి న్యాయ వివాదాల్లో లేదని ధ్రువీకరించాలని, సేల్‌డీడ్‌లు ఇవ్వాలని, సర్వే నంబర్లతో సహా భూమి పూర్తి వివరాలను ఈఎంసీ వెబ్‌సైట్‌లో నమోదు చేయాలని, హైటెక్ ఎలక్ట్రానిక్స్ పార్కుకు అవసరమైన నీరు, విద్యుత్ సౌకర్యాలను కల్పిస్తామంటూ ప్రభుత్వం ప్రత్యేక అనుమతులివ్వాలని, ఇందుకు సంబంధించిన డాక్యుమెంట్లన్నింటినీ తమకు పంపాలని కేంద్రం కోరింది. కేంద్రం అడిగిన అన్ని ప్రశ్నలకు జవాబులిస్తూ సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్స్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ జనరల్ అరవింద్ కుమార్‌కు గత నెలలో పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్‌రంజన్ లేఖ రాశారు. హైటెక్ పార్కు కోసం ప్రతిపాదించిన భూములకు సంబంధించిన డాక్యుమెంట్లను గ్రీన్‌ఫీల్డ్ ఇంటిగ్రేటెడ్ ఇండస్ట్రియల్ పార్కు ప్రతిపాదనలో భాగంగానే పంపామని, ప్రత్యేకంగా డాక్యుమెంట్లు, అనుమతులు ఈ పార్కుకు అవసరం లేదని ఆ లేఖలో పేర్కొన్నారు. అయినా, కేంద్రం నుంచి ఇప్పటివరకు స్పందన లేదని రాష్ట్ర ప్రభుత్వ అధికారులు తెలిపారు.

సాక్షి పెళ్ళిచూపులు

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

వధువు కావలెను



Govt రిటైర్డ్ ఇంజనీర్‌కు ఏ బాదరా బందీలేని బిసి, ఓసి వధువు కావలెను. ఇతర వివరాలకు సంప్రదించండి. ఫోన్ :8179713792. [H-783663]

యాదవ/ కట్న ప్రసక్తి లేదు / B.Tech / C. Govt. బ్యాంక్ మేనేజర్ / SBI/ 80,000/-PM/ 5'10"ఎత్తు/28 సం॥ల అందమైన వరుడికి తగిన వధువు కావలెను. Ph: 7075953400 [HA-15481]

మాదిగ / M.Tech (IIT) / C.Govt. సైంటిస్ట్ / DRDL/1 Lakh PM/ 5'10" ఎత్తు/28 సం॥ల వరుడికి తగిన వధువు కావలెను. Ph: 7780299703 [HA-15481]

క్రిస్టియన్ మాదిగ / M.Tech / C.Govt. స్టేషన్ మాస్టర్/రైల్వే/80,000/-PM/ 6'ఎత్తు /29 సం॥ల అందమైన వరుడికి వధువు కావలెను. Ph: 9618008271 [HA-15481]

గౌడ/ B.Tech / C.Govt. SSA / EPF/ 85000/-PM / 5'11"ఎతు / 28 సం॥ల అందమైన వరుడికి తగిన వధువు కావలెను. Ph: 9618008271 [HA-15481]

క్రిస్టియన్ మాల/M.Tech, IIT/C.Govt. Asst. ఇంజనీర్/IOCL/1,30,000/-PM/ 6' ఎత్తు/29 సం॥ల అందమైన వరుడికి వధువు కావలెను. Ph: 9908222406 [HA-15481]

SC మాల & క్రిస్టియన్/కట్న ప్రసక్తి లేదు/ B.Tech(సివిల్)/C.Govt. కస్టమ్స్ ఆఫీసర్/ 80,000/-PM/5'8"ఎత్తు/28 సం॥ల అందమైన వరుడికి వధువు కావలెను. Ph: 9676995093 [HA-15485]

SC మాదిగ & క్రిస్టియన్/ B.Tech(EEE) / C. Govt.బ్యాంక్ మేనేజర్/యూనియన్ బ్యాంక్/ 85000/-PM/5'8"ఎత్తు/28 సం॥ల కట్నప్రసక్తి లేని వరుడికి వధువు కావలెను. Ph: 9676995093, 9491555252 [HA-15485]

యాదవ/B.Tech / కట్న ప్రసక్తి లేదు / C. Govt. డిప్యూటీ మేనేజర్/SBI/ 80,000/-PM / 5'8"ఎత్తు/28 సం॥ల వరునికి వధువు కావలెను. Ph: 9515755529 [HA-15485]

విశ్వబ్రాహ్మణ/ B.Tech / C.Govt.Asst. మేనేజర్/యూనియన్ బ్యాంక్/82000/-PM/5'10"ఎత్తు/28 సం॥ల వరుడికి వధువు కావలెను. Ph: 9515942275 [HA-15485]

గౌడ్స్/30y / 5'8" / Diploma Civil మిడిల్ క్లాస్ అబ్బాయి ప్రైవేట్/డ్రైవర్/40,000/-PM హైదరాబాద్ లో సొంత ఇల్లు ఊర్లో ఎకరం పొలం గల వరునికి తగిన అమ్మాయి కావలెను. డైరెక్ట్ 9398886108 [H-783526]

Cast No Bar, No Dowry Age 34, H: 5'8", HYD JOB, B.Sc కంప్యూటర్స్ అందమైన వరుడికి అందమైన వధువు కావలెను. సంప్ర॥ 8332996699 [B-752866]

★

మున్నూరు కాపు / 32yrs, H:5'8", MSCFSQM ఫ్యాకల్టీ, Hyd, 70K pm, 2 Cr, ఆస్తి వరునికి any BC/జాబ్ ఉన్న వధువు కావలెను. నో బ్రోకర్స్. Ph: 9440122661 [HA-34098]

★★

కుల, కట్న ప్రసక్తి లేదు. 40 సం: / B.Tech. / సాఫ్ట్ వేర్ ఇంజనీర్ / Good Salary వరునికి, తగిన వధువు కావలెను. Direct Contact : 7337586682 [A-1531]

వరుడు కావలెను



రెడ్డి/2nd విడో/కుల, ఆస్తి ప్రసక్తి లేదు/డిగ్రీ, 32y/సొంత బిజినెస్ గల అందమైన వధువుకి వరుడు కావలెను (ఇల్లరికం ఐనా OK) 1st, 2nd అన్ని వయస్సుల వారికి సంబంధాలు కలవు. Ph: 9515673252 [H-783616]

రెడ్డి/2nd మ్యారేజ్(కుల/ఆస్తి)పట్టింపు లేదు/ 33 Y/ Q:B.Pharm/Own Business & Lands/ వధువుకి వరుడు కావలెను (ఇల్లరికం OK) అన్ని వయస్సుల వారికి 1వ/2వ సంబంధాలు కలవు. Ph: 9515579827 [H-783616]

మాల/24 / 5'3" / ఫెయిర్ / B.Tech ELECTRICAL, SWE / Hyd / వెల్ సెటిల్డ్ వధువుకు SWE Working in Hyd MNC Lead / Head గల సెటిల్డ్ వరుడు కావలెను. డైరెక్ట్. Ph : 9948516705 [H-783072]

డైవర్సీ/రెండవ పెళ్ళి / 37 yrs / Govt. ఎంప్లాయ్/MBA 2,30,000/- కుల ప్రసక్తి లేని వెల్ సెటిల్డ్ అందమైన వధువుకి తగిన వరుడు కావలెను. సంప్రదించండి : 9133715309 [H-783663]

CNB/Govt. టీచర్ /45yrs 2) 80K PM, * బ్యాంక్ జాబ్ 42yr 70K PM *Govt. H.M. 47yr డైవర్సీ 1 లక్ష Pm. 3ఎ. ల్యాండ్/1వ, 2వ, లేట్ సెటిల్డ్ వధువులకు వరులు కావలెను (ఫీజు 1000/-) సంప్ర : 7286031653 [H-783663]

కమ్మ/ కుల పట్టింపు లేదు / ఏజ్ : 50yrs/ 2nd Mach/5'5"/ ఫెయిర్ / Govt. జాబ్ 95K / 1 Dauther Married /ఇల్లరికం వరుడు కావలెను. #9581120134 [H-783663]

రెడ్డి/విడో/50y/పిల్లలు లేరు/Vizagలో సొంత ప్లాట్లు/ Hydలో సొంత బిజినెస్, రెంట్స్/మంచి ఆస్తి గల వధువుకి కుల, ఆస్తి ప్రసక్తి లేని వరుడు కావలెను. (అర్జెంట్) (ఇల్లరికం OK)(నో బ్రోకర్స్) 7799083500, 7386660643 [H-783663]

వడ్డెర/B.Tech/C.Govt. బ్యాంక్ / P.O/ SBI / 35,000/-PM / 5'4" ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 8341650195 [HA-15481]

మాల/B.Tech / C.Govt. Jr.Asst. / పంచాయతీరాజ్ Dept/42000/-PM/ 5'4" ఎత్తు/24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. 7416584304 [HA-15481]

రజక/B.Sc / Govt. AEO / అగ్రికల్చర్ Dept/ 40,000/-PM/5'4" ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 7075953400 [HA-15481]

SC హిందూ మాల/B.Tech/C.Govt. ట్యాక్స్ Asst./ ఇన్‌కమ్‌ట్యాక్స్ Dept/ 60,000/-PM/5'5" ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9908222406 [HA-15481]

SC హిందూ మాదిగ/50 లక్షల ఆస్తి/ B.Tech/Govt.Asst.ఇంజనీర్/ఇరిగేషన్ Dept/9 Lakhs. PA/5'4" ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9618008271 [HA-15481]

రెడ్డి/విడో/కుల, ఆస్తి ప్రసక్తి లేదు/Age: 35/ B.Com. Pvt Job గల అందమైన వధువుకి వరుడు కావలెను (ఇల్లరికం అయినా OK) అన్ని కులాల వారికి Intercast వివాహాలు చూడబడును. Ph: 7207510801 [H-783616]

రెండో పెళ్లి/డైవర్సీ/43/Dept of HMFW Dept/2L PM/సొంత విల్లా & 18 acr ల్యాండ్/కోట్ల ప్రాపర్టీ గల ఆర్థికంగా స్థిరపడిన అందమైన వెల్ సెటిల్, వధువుకు కుల ప్రసక్తి లేని వరుడు కావలెను. Ph: 9949875211 [H-783616]

2వ పెళ్ళి/4,00,000 PM బాగా స్థిరపడిన కోట్ల ప్రాపర్టీ కల్గిన అమ్మాయికి అందమైన వరుడు కావలెను. వృత్తి, కులంతో సంబంధం లేదు, ఇల్లరికం పిల్లలు ఉన్నా OK, Business చూసుకోవాలి. Ph: 9381696641 [H-783616]

SC మాల/ 25 / 5'5" / B.Tech (ECE)/ SWE/Accenture, 50,000/-PM Well Settled అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9346675639 [HA-15485]

బ్రాహ్మణ/ 6000 నియోగి / 45 / 5'4"/ గవర్న మెంట్ స్కూల్ హెడ్ మాస్టర్/ విడో/పిల్లలు లేని రిచ్ ఫ్యామిలీ వధువుకి వరుడు కావలెను. 9550412920 [HA-15485]

వెలమ/48/విడో/పెన్షన్/90K pm/సొంత ఇల్లు, బిజినెస్/రెంట్స్/మెడికల్ షాపు/30 ఎ. పొలము తోటలు గల/4L.pm/ 40 కోట్ల ప్రాపర్టీ కలిగిన అమ్మాయికి వరుడు కావలెను. ఇల్లరికం పిల్లలున్నా ఓకే. 9642589295 [HA-15485]

రెండో పెళ్ళి/24y & 25y & 27y&28y&30y& 32y&33y&35y&37y&38y&40y&41y&43y& 44y& 46y & 47y&49y&50y / "మా సేవ" (Since 1998) : PH/WA: 9291503949 [HA-15485]

వైశ్య/50/విడో/5'3"/రైస్ బిజినెస్ /1L PM/2 సొంత ఇల్లు/ఆంధ్రాలో పొలాలు పిల్లలు లేని వధువుకి వరుడు కావలెను. కుల ప్రసక్తి లేదు. 8978556696 [H-783526]

కమ్మ/విడో/Govt. Rtd పెన్షనర్/ రైల్వే/30 ఎకరాల పొలం/సొంత అపార్ట్‌మెంట్స్/రైస్ మిల్ బిజినెస్ /4L/-pmసాంప్రదాయ వధువుకు వరుడు కావలెను. కుల ప్రసక్తి లేదు. 9492718486 [H-783526]

ఆస్తి, కుల పట్టింపు లేని వధువుకి వరుడు కావలెను/ఫ్యామిలీ పెన్షన్/50K PM/ విడో/5'4"సొంత ఇల్లు & రెంట్స్/1L PM/ పిల్లలు లేరు. 9573060401 [H-783526]

వైశ్య / విడో / 50 /VRS / డిగ్రీ/ బెంగుళూరు / సొంత ఇల్లు/5 ఎకరాలు ల్యాండ్ గల వధువుకి వరుడు కావలెను. 9705499686 [H-783526]

కుల పట్టింపు లేదు. విడో, గవర్నమెంట్ Doctor, సొంత ఇల్లు, రెంట్స్, లాండ్స్ మంచి ఆస్తి గల వధువుకి వరుడు కావలెను. సంప్ర : ✆ 63010 70543 [B-917]

★

బ్రాహ్మణ/BA/5'3"/Fair వధువుకు 60 సం॥ల బ్రాహ్మణ వరుడు కావలెను. హైదరాబాద్‌లో సెటిల్ అయిన వారు సంప్రదించండి. Ph: 9441134138 [HA-5154]

★★

మాల క్రిస్టియన్స్, వయస్సు 36 5'3H, B.Tech., గవర్నమెంట్ బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ వధువుకి వరుడు ఎంప్లాయి కావలెను. ✆ : 77949 11019 [R-1206921]

వేదికలు



Brahmin పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Madhavi Sharma Ph: 7032018248 / Blue Trend Matrimonial (P) Ltd. [HA-15482]

Kamma, Kapu, Reddy పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profiles తో నమ్మకమైన సంస్థ. Ph: 7032018248 / Blue Trend Matrimonial (P) Ltd. [HA-15482]

Padmashali పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Shyam, Ph: 8500688938/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-15482]

Christian పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Shyam, Ph: 9000487865 /Blue Trend Matrimonial (P) Ltd. [HA-15482]

Madiga - Mala పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Srinivas, Ph: 7093969457/Blue Trend Matrimonial (P) Ltd. [HA-15482]

పూజిత రెడ్డి మ్యారేజ్ లింక్స్, తెలంగాణ మరియు హైదరాబాద్ చుట్టుపక్కల ఉన్న వెల్ సెటిల్, గూడాటి, మోటాటి, ఇతర రెడ్లు, ఇంకా విదేశీ రెడ్డి వధూవరుల కోసం (రెడ్లకు మాత్రమే) సంప్ర : పూజిత రెడ్డి. 6303781073 [HA-15485]

మాల, మాదిగ స్పెషల్ IAS, IPS, IFS, IRS, గ్రూప్-I, II, PG, డాక్టర్స్, బ్యాంక్ PO, Govt. ఆఫీసర్స్, USA, UK. Ph: 7396915712 [HA-15110]

పెళ్లి సంబంధాలు & ప్రయత్నిస్తున్న వారందరికి 'ఓం నమో వెంకటేశాయ'. All Caste సాఫ్ట్ వేర్స్, డాక్టర్స్, NRI, Group 1, 2 వారికి చూడబడును. పూర్ణ మ్యాట్రిమోని, తిరుపతి, ✆ 7093722724. [T-3255]

India/abroad decent matches for Kamma/Reddy/Kapu/Velama & Raju top calss matches available amaravathi matrimony vijayawada. 9100324999 [HA-15485]

★

Free Registration బ్రాహ్మణ మరియు అన్ని కులాల SWE, Govt, Doctors, MNC, Matches, Late & 2nd Matches కై సంప్రదించండి. 9704656103, 9533608887 (Watsapp) [HA-1365]

Free Registration బ్రాహ్మణ మరియు అన్ని కులాల SWE, Govt., Doctors, MNC, Matches, Late & 2nd Matches కై సంప్రదించండి. 9704656103, 9533608887 (Whatsapp) [HA-1326]

ఎస్టీపీపీకి 'ఎఫీషియెంట్ మేనేజ్‌మెంట్ ఆఫ్ ఫ్లై యాష్' అవార్డు




అవార్డు అందుకుంటున్న ఈడీ ప్రభాకర్‌రావు

జైపూర్: మంచిర్యాల జిల్లా జైపూర్‌లోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ (ఎస్టీపీపీ) విద్యుత్ రంగంలో విశేషమైన సేవలందిస్తూ జాతీయ స్థాయిలో అనేక అవార్డులతో రికార్డులు నెలకొల్పుతోంది. విద్యుత్ ఉత్పత్తి, నిర్వహణలో వరుసగా అవార్డులు అందుకున్న ఎస్టీపీపీ.. యాష్ వినియోగంలో ప్రతిష్టాత్మక 'ఎఫీషియెంట్ మేనేజ్‌మెంట్ ఆఫ్ ఫ్లై యాష్'అవార్డు పొందింది. సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్‌లో ఉత్పత్తి అయ్యే బాటమ్ యాష్, ఫ్లై యాష్‌ను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకుంటూ పర్యావరణానికి దోహదపడుతోంది. దీనికి గుర్తింపుగా మిషన్ ఎనర్జీ ఫౌండేషన్ సంస్థ నిర్వహించిన 14వ ఫ్లైయాష్ యుటిలైజేషన్ అవార్డ్స్-2025లో ఎస్టీపీపీకి చోటు దక్కింది. ఈ మేరకు శనివారం గోవాలో నిర్వహించిన వేడుకల్లో కేంద్ర మాజీ మంత్రి ప్రకాశ్ జవదేకర్ చేతుల మీదుగా ఎస్టీపీపీ ఎస్‌వోటు ఈడీ ప్రభాకర్‌రావు అవార్డు అందుకున్నారు. ఈ స్ఫూర్తితో సింగరేణి సంస్థ పర్యావరణ చర్యలను మరింత సమర్థవంతంగా నిర్వహిస్తూ ముందుకెళ్తుందని సంస్థ సీఎండీ ఎన్.బలరాం చెప్పారు.

సింగరేణి ఉన్నతికి సమష్టిగా కృషి చేయాలి

- సింగరేణి సీఎండీ బలరాం



సాక్షి, హైదరాబాద్: సింగరేణి సంస్థను అగ్రపథంలో నిలపడానికి యాజమాన్యంతోపాటు కార్మికులు, అధికారులు, సంఘ నేతలు సమష్టిగా పనిచేయాలని సంస్థ సీఎండీ ఎన్. బలరాం అన్నారు. శనివారం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో గుర్తింపు, ప్రాతినిధ్య కార్మిక సంఘాలు, అధికారుల సంఘం ప్రతినిధులతో నిర్వహించిన 37వ సంయుక్త సంప్రదింపుల కమిటీ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా బలరాం మాట్లాడుతూ సింగరేణి అనతి కాలంలో జాతీయస్థాయి కంపెనీగా ఎదగనుందని, విదేశాల్లో కీలక ఖనిజాల ఉత్పత్తి రంగంలోకి అడుగుపెట్టనుందని చెప్పారు. కీలక ఖనిజాల ఉత్పత్తి కోసం ప్రముఖ దేశీయ కంపెనీల ఉమ్మడి భాగస్వామ్యంతో లాభదాయక ప్రాజెక్టులను చేపట్టే అవకాశం ఉందన్నారు. సమావేశంలో పాల్గొన్న గుర్తింపు కార్మిక సంఘం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, జనరల్ సెక్రటరీ రాజ్‌కుమార్, ప్రాతినిధ్య సంఘం ఐఎన్టీయూసీ సెక్రటరీ జనరల్ కనీస వేతనాల అమలు కమిటీ చైర్మన్ జనక్‌ప్రసాద్, నర్సింహా అధికారుల సంఘం అధ్యక్షుడు లక్ష్మీపతిగౌడ్, కార్యదర్శి నరసింహులు సమస్యలపై సూచనలిచ్చారు.

రోబోలతో రెస్క్యూ

ఎస్ఎల్‌బీసీ సొరంగంలో 11న రంగంలోకి దింపే అవకాశం

- ఇందుకోసం రూ. 4 కోట్లు కేటాయించిన రాష్ట్ర ప్రభుత్వం
- ముమ్మరంగా కొనసాగుతున్న సహాయక చర్యలు
- సొరంగం వద్దకు చేరుకొని పరిస్థితిని సమీక్షించిన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



రెండు మినీ బాబ్ కాట్ మెషీన్లు, ఎస్కలేటర్ సాయంతో మట్టిని తొలగిస్తున్న రెస్క్యూ బృందాలు , సొరంగం వద్ద సహాయక చర్యల గురించి తెలుసుకుంటున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

సాక్షి, నాగర్‌కర్నూల్: ఎస్ఎల్‌బీసీ సొరంగంలో మట్టి, బురదలో కూరుకుపోయిన కార్మికులను వెలికితీసేందుకు రాష్ట్ర ప్రభుత్వం రోబోలను రంగంలోకి దింపనుంది. టన్నెల్ చివరి భాగంలో కాంక్రీట్ సెగ్మెంట్లు వంగిపోయి ఉండటం, అక్కడ పనిచేసే సహాయ సిబ్బందికి సైతం ప్రమాదం పొంచి ఉండటంతో ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా రోబోలను వినియోగిస్తూ సహాయక చర్యలను కొనసాగించాలని సర్కారు నిర్ణయించింది. ఇందుకోసం హైదరాబాద్‌కు చెందిన అన్వి రోబోటిక్స్ సంస్థ ద్వారా సహాయక చర్యలు చేపట్టనుంది. ఇందుకు రూ. 4 కోట్లను వెచ్చించనుంది. ఈ నెల 11 నుంచి సొరంగంలో రోబోలను రంగంలోకి దింపే అవకాశం ఉంది.

మూడు మోడళ్లలో రోబోలు..

సొరంగంలోని ప్రమాదస్థలంలో 18 అడుగుల మేర మట్టి, బురద పేరుకుపోయాయి. 130 మీటర్ల పొడవు, సుమారు 1,500 టన్నుల బరువు ఉండే టన్నెల్ బోరింగ్ మెషీన్ (టీబీఎం) మధ్యలో మట్టి, బురదలో కార్మికులు కూరుకుపోయి ఉండొచ్చని సహాయక బృందాలు భావిస్తున్నాయి. కేరళ నుంచి వచ్చిన కడావర్ డాగ్స్ ప్రమాదస్థలంలో సుమారు 10 మీటర్ల వ్యవధిలో రెండు స్పాట్లను గుర్తించాయి. ఆయా చోట్ల తవ్వకాలు జరిపేందుకు టీబీఎం భాగాలను తొలగించాల్సి రావడం, నిమిషానికి 5 వేల లీటర్ల చొప్పున ఊటనీరు వస్తుండటం, మట్టి తొలగిస్తే మళ్లీ కుంగే అవకాశం ఉండటంతో అక్కడ ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో అన్వి రోబోటిక్స్‌కు చెందిన నిపుణులు తమ వద్ద మూడు రకాల రోబోలు అందుబాటులో ఉన్నట్లు చెబుతున్నారు. పెద్దపెద్ద రాళ్లు తొలగించే రోబో, చిన్న రాళ్లు, మట్టిని తొలగించే రోబో, బురదనీటిని తొలగించేలా రోబో సాంకేతికత తమ వద్ద ఉందన్నారు.

40 మీటర్ల వ్యవధిలోనే కార్మికుల ఆనవాళ్లు..

సొరంగంలోని 13.900 కి.మీ. పాయింట్‌ను ప్రమాదస్థలంగా చెబుతుండగా చివరి 40 మీటర్ల ప్రాంతంలోనే కార్మికుల ఆనవాళ్లు లభించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. టీబీఎం కట్టర్ హెడ్ 12 మీటర్ల పొడవు ఉండగా కట్టర్ వెనుక భాగంలోనే కాంక్రీట్ సెగ్మెంట్ ఎరెక్టర్ ఉన్నచోట ఆపరేటర్లు, కార్మికులు చిక్కుకొని ఉండే అవకాశం ఉంది. ఆ తర్వాత మరో 20 మీటర్ల దూరంలో టీబీఎం వెనక భాగంలో ఉన్న ఏసీ క్యాబిన్‌లో మెషీన్ ఇంజనీర్లు, కార్మికులు ఉండే అవకాశం ఉందని చెబుతున్నారు. ఆయా ప్రాంతాలు ఉన్న చోట పూర్తిస్థాయిలో టీబీఎం భాగాలను తొలగిస్తూ అడుగు భాగం వరకు తవ్వకాలు జరిపితేనే వారి జాడ తెలిసే అవకాశం ఉందని సహాయక బృందాలు చెబుతున్నాయి. శనివారం టన్నెల్ వద్దకు చేరుకున్న నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సహాయక బృందాల నిపుణులతో సమీక్షించారు. ఆర్మీ కల్నల్ పరీక్షిత్ మెహ్రా, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ప్రత్యేక కార్యదర్శి అరవింద్ కుమార్, సింగరేణి రెస్క్యూ నిపుణుడు డీ బైద్యతో కలసి సహాయక చర్యల పురోగతిపై చర్చించారు.

ఇలాంటి క్లిష్టపరిస్థితి ఎక్కడా రాలేదు: ఉత్తమ్

దేశ, విదేశాల్లో ఇలాంటి క్లిష్టమైన, ప్రమాదకర పరిస్థితి మరెక్కడా తలెత్తలేదు. అంతర్జాతీయ, జాతీయస్థాయిలో అన్ని రకాల రెస్క్యూ నిపుణులను సంప్రదిస్తున్నాం. ఇప్పటికే 12 జాతీయ స్థాయి రెస్క్యూ సంస్థలు, 525 మంది నిపుణులు పనిచేస్తున్నారు. కేరళ నుంచి వచ్చిన కడావర్ డాగ్స్ మూడు చోట్ల కార్మికుల జాడ గుర్తించాయి. ఆయా చోట్ల తవ్వకాలు కొనసాగుతున్నాయి. రెస్క్యూ బృందాలకు ప్రమాదం తలెత్తకుండా రోబోలను వినియోగించనున్నాం. దీనిపై సీఎం సమక్షంలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహిస్తాం. ఈ నెల 11న మరోసారి టన్నెల్ వద్దకు వచ్చి పరిస్థితిని సమీక్షిస్తా.

'ఫాల్కన్' స్కామ్ సూత్రధారి విమానం సీజ్

- గతేడాది రూ.14 కోట్లతో 8 సీట్ల బిజినెస్ జెట్‌ను అమర్‌దీప్ కొన్నట్టు ఈడీ గుర్తింపు
- అందులోనే గత నెల దుబాయ్ పరారైనట్టు దర్యాప్తులో నిర్ధారణ
- గంటకు రూ. 2–3 లక్షల అద్దెకు ఎయిర్ అంబులెన్స్‌గానూ వ్యాపారం చేసిన వైనం
- ఎయిర్ అంబులెన్స్‌గా 5న దుబాయ్ వెళ్లి 7న తిరిగి రావడంతో జప్తు చేసిన ఈడీ



శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో జెట్ విమానాన్ని సీజ్ చేసిన ఈడీ అధికారులు

సాక్షి, హైదరాబాద్: పెట్టుబడుల ఇన్వాయిస్ డిస్కౌంటింగ్ పేరుతో జనాన్ని నిండాముంచి రూ. 850 కోట్ల స్కామ్‌కు పాల్పడిన కేసులో కీలక సూత్రధారి, ఫాల్కన్ గ్రూప్ సీఎండీ అమర్‌దీప్ కుమార్‌కు సొంతంగా 8 సీట్ల బిజినెస్ జెట్ విమానం (ఎన్935హెచ్ హాకర్ 800ఏ) ఉన్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) గుర్తించింది. అమర్, అతని సన్నిహితుడు వివేక్ సేఠ్‌తో కలిసి జనవరి 22న ఈ విమానంలోనే దుబాయ్‌కు పారిపోయినట్లు తేల్చింది. కొట్టేసిన సొమ్మును నిందితులు విదేశాల్లోని 14 షెల్ కంపెనీలకు మళ్లించడంతో మనీలాండరింగ్ అభియోగాలపై దర్యాప్తు కోసం ఈడీ ఈ కేసులో రంగంలోకి దిగింది. అమెరికాలోని డెలావేర్‌కు చెందిన ప్రెస్టీజ్ జెట్స్ పేరిట గతేడాది ఫిబ్రవరిలో రూ. 14 కోట్లతో ఈ విమానాన్ని కొన్న అమర్‌దీప్ దాన్ని ఎయిర్ అంబులెన్స్‌గా గంటకు రూ. 2–3 లక్షలకు అద్దె ప్రాతిపదికన సైతం తిప్పుతూ వ్యాపారం చేసేవాడని దర్యాప్తులో తేలింది. ఈ నెల 5న విమానం ఎయిర్ అంబులెన్స్ రూపంలో దుబాయ్ వెళ్లి తిరిగి 7న రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో ల్యాండ్ అయిందని కస్టమ్స్ అధికారులు సమాచారం ఇవ్వడంతో ఈడీ అధికారులు వెంటనే ఎయిర్‌పోర్ట్‌కు చేరుకొని విమానంలో సోదాలు నిర్వహించారు. విమాన సిబ్బంది, అమర్‌దీప్ సన్నిహితులను విచారించి వారి వాంగ్మూలాన్ని నమోదు చేసి విమానాన్ని సీజ్ చేశారు. పలు కీలక పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. విమానం ఇంటీరియర్ కోసం అమర్ రూ.3 కోట్లు వెచ్చించినట్టు అధికారులు గుర్తించారు. సైబరాబాద్ కమిషనరేట్‌లో కేసులు నమోదు కాకముందు అమర్ ప్రతి నెలా దుబాయ్‌కు ఈ జెట్‌లోనే వెళ్లేవాడని కస్టమ్స్ క్లియరెన్స్‌లో తేలింది.

ఇదీ ఫాల్కన్ కథ..

ఫాల్కన్ గ్రూప్ సీఎండీ అమర్‌దీప్.. ఆర్యన్ సింగ్, యోగేందర్ సింగ్‌లతో కలిసి ఇన్వాయిస్ డిస్కౌంటింగ్ ప్లాట్‌ఫామ్‌ను ఏర్పాటు చేశాడు. ఈ ప్లాట్‌ఫామ్‌లో పెట్టుబడులు పెడితే తక్కువ సమయంలో ఎక్కువ లాభాలు ఆర్జించవచ్చని సామాన్యులకు ఆశ పెట్టాడు. జనాల నుంచి సేకరించిన డిపాజిట్లను బ్రిటానియా, అమెజాన్, గోద్రెజ్ వంటి ప్రముఖ కంపెనీలతో అనుసంధానిస్తున్నామని మాయమాటలతో నమ్మించాడు. రూ. 25 వేల నుంచి రూ. 9 లక్షల మధ్య డిపాజిట్ చేస్తే 45 నుంచి 180 రోజుల మెచ్యూరిటీ వ్యవధిలో 11 శాతం నుంచి 22 శాతం వరకు రాబడిని అందిస్తామని ఊదరగొట్టాడు. దీంతో తెలుగు రాష్ట్రాలకు చెందిన సుమారు 7 వేల మంది కష్టమర్ల నుంచి సుమారు రూ. 1,700 కోట్లు సేకరించారు. అయితే అందులో సుమారు రూ. 850 కోట్ల డిపాజిట్లను తిరిగి ఇవ్వగా మిగతా సొమ్మును ఎగ్గొట్టాడు. ఈ మేరకు సైబరాబాద్ ఆర్థిక నేరాల నియంత్రణ విభాగం (ఈఓడబ్ల్యూ) ఠాణాలో మూడు కేసులు నమోదయ్యాయి. గత నెల 15న ఫాల్కన్ గ్రూప్ డైరెక్టర్ కావ్య నల్లూరి, బిజినెస్ హెడ్ పవన్‌కుమార్ ఓదెలను అరెస్టు చేశారు. అమర్‌తో పాటు ఆర్యన్ సింగ్, యోగేందర్ సింగ్ పరారీలో ఉన్నారు. గతంలోనూ నిందితులు ఇదే తరహా మోసాలకు పాల్పడ్డారు. బ్లూలైఫ్ ఇంటర్నేషనల్ మల్టీ లెవల్ మార్కెటింగ్ కంపెనీ ద్వారా మోసాలు చేశారు. ఈ మేరకు 2022లో చేవెళ్ల పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది.

మత్స్యరంగ అభివృద్ధిలో స్టార్టప్‌లే కీలకం

- 'ఫిషరీస్ స్టార్టప్ గ్రాండ్ చాలెంజ్ 2.0'ను ఆవిష్కరించిన కేంద్ర మత్స్య శాఖ మంత్రి రాజీవ్‌రంజన్ సింగ్



సాక్షి, హైదరాబాద్: మత్స్యరంగం అభివృద్ధి, భారత ఆర్థిక వ్యవస్థలో స్టార్టప్‌ల పాత్ర ముఖ్యమైందని కేంద్ర పశుసంవర్ధక, మత్స్య, డెయిరీ డెవలప్‌మెంట్ శాఖల మంత్రి రాజీవ్‌రంజన్ సింగ్ అన్నారు. శనివారం హైదరాబాద్‌లో 'ఫిషరీస్ స్టార్టప్ కాన్‌క్లేవ్ 2.0 నిర్వహించారు. ఈ సందర్భంగా నేషనల్ ఫిషరీస్ డిజిటల్ ప్లాట్‌ఫాం మొబైల్ యాప్‌తో పాటు 'ఫిషరీస్ స్టార్టప్ గ్రాండ్ చాలెంజ్ 2.0'ను కేంద్ర మంత్రి రాజీవ్‌రంజన్ సింగ్, సహాయ మంత్రులు ఎస్పీ సింగ్ బఘేల్, జార్జ్ కురియన్ ఆవిష్కరించారు. సమావేశంలో స్టార్టప్‌లు, వ్యవస్థాపకులు, విధాన రూపకర్తలు, పరిశ్రమల ప్రముఖులను కలిసి మత్స్య రంగంలో సవాళ్లు, ఆవిష్కరణల గురించి చర్చించారు. ఈ సందర్భంగా రూ. 33.46 కోట్లతో ఎంపిక చేసిన 8 ఫిషరీస్ స్టార్టప్‌లు/ఎంటర్‌ప్రెన్యూర్/ఎఫ్ఎఫ్‌పీవోలకు ప్రధాన మంత్రి మత్స్య కిసాన్ సమృద్ధి యోజన కింద మోడల్ అనుమతులను కేంద్ర మంత్రి పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఫిషరీస్ స్టార్టప్ గ్రాండ్ చాలెంజ్ 2.0లో విజేతలుగా నిలిచే 10 అంకుర సంస్థలకు రూ. కోటి నిధులను సమకూర్చి మద్దతునందించనున్నట్టు చెప్పారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుకోవాలి..

చేపల చెరువుల ఉత్పాదకతను పెంపొందించేందుకు అభివృద్ధి చేసిన అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుకోవాలని కేంద్ర మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ సూచించారు. శనివారం తెలంగాణ మత్స్యశాఖ కార్యకలాపాలపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి 100 సంచార వెటర్నరీ క్లినిక్‌ల మంజూరును పరిశీలించాలని కేంద్రమంత్రికి ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సవ్యసాచి ఘోష్ విజ్ఞప్తి చేశారు.

SAKSHI EXCELLENCE AWARDS
10th Edition

"సమాజంలో ఉన్నటువంటి అనేక మంది సేవకు గుర్తింపు రావడం అంటే సామాన్య విషయం కాదు. వారు ఆయా రంగాల్లో చేసిన సేవను గౌరవించడానికి ఈ అవార్డులు ఇస్తున్నారు. సమాజానికి సేవ చేసిన వారికి ఇలాంటి గౌరవం ఇవ్వడం అభినందనీయం. సాక్షి గ్రూప్‌నకు, ముఖ్యంగా భారతీరెడ్డి గారికి అభినందనలు."
- బండారు దత్తాత్రేయ, హరియాణా గవర్నర్


జ్యోతి ప్రజ్వలన


పురస్కార గ్రహీత చంద్రకాంత్‌తో భారతీరెడ్డి


'సాక్షి' మీడియా గ్రూప్ ప్రతినిధులతో ముఖ్య అతిథి బండారు దత్తాత్రేయ


డొక్కరి రాజేష్ తల్లిదండ్రులకు పురస్కారం అందిస్తూ...

సామాజిక స్ఫూర్తికి సెల్యూట్

సమాజం ఆర్థిక సూత్రాల పై ఆధారపడి నడుస్తున్నట్టు కనిపించినా దానికి హృదయం, స్పందన ఇచ్చేది మాత్రం సామాజిక, సాంస్కృతిక అంశాలే. 'ఇలా మారాలి' అని సామాజిక సేనానులు బోధ చేస్తే, 'ఇలా వికాసం పొందాలి' అని సాంస్కృతిక సారథులు దారి చూపుతారు. సామాజిక చైతన్యం, సాంస్కృతిక వికాసం లేని సమాజంలో సంపద కేవలం పటాటోపం మాత్రమే. అందుకే అర్థవంతమైన సమాజం కోసం గత పది సంవత్సరాలుగా సాక్షి మీడియా గ్రూప్ 'సాక్షి ఎక్సలెన్స్ అవార్డ్స్' నిర్వహిస్తోంది. సామాజిక రంగంలో, కళారంగంలో విశిష్ట రీతిలో పని చేస్తున్న వారికి అవార్డ్స్ ఇచ్చి గౌరవిస్తోంది. ఈ పరంపరలో 2023కు గాను ఫిబ్రవరి 28 శుక్రవారం హైదరాబాద్‌లో ఘనమైన వేడుక నిర్వహించింది. హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ ముఖ్య అతిథిగా పాల్గొన్న ఈ వేడుకలో వై.ఎస్.భారతి రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేశారు. సాక్షి మీడియా గ్రూప్ డైరెక్టర్లు, ఎడిటర్, విశిష్ట అతిథులు పాల్గొన్న వేడుక అవార్డు గ్రహీతలకు జీవితకాల అనుభూతిగా మారింది.


మావురం మల్లికార్జున్ రెడ్డి, సేంద్రియ వ్యవసాయం

మట్టిని పట్టుకున్నా బంగారమే అవుతుందని నిరూపించాడు కరీంనగర్ జిల్లా చొప్పదండికి చెందిన మావురం మల్లికార్జున్ రెడ్డి. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేసిన తరువాత వ్యవసాయం మీదున్న ఆసక్తితో తన 12 ఎకరాల భూమికి తోడు మరో 5 ఎకరాలు కౌలుకు తీసుకుని సేంద్రియ వ్యవసాయం ప్రారంభించారు. వరి, అల్లం, మిర్చి సాగు చేస్తూ మరోవైపు దేశీ ఆవులు, కోళ్లు పెంచుతూ సమీకృత వ్యవసాయానికి ప్రాచుర్యం కల్పిస్తున్నారు. ఆయనను 'ఎక్సలెన్స్ ఇన్ ఫార్మింగ్ అవార్డు'తో సత్కరించింది సాక్షి మీడియా గ్రూప్.


హర్షవర్ధన్, ఆరోగ్య సంరక్షణ

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు ప్రభుత్వ ఆసుపత్రిలో ఆర్థోపెడిక్ సర్జన్‌గా పని చేస్తున్న హర్షవర్ధన్ ఒక డాక్టర్‌గా విధులు నిర్వహిస్తూనే తన ప్రజా వైద్యశాలలో కేవలం ఒక్క రూపాయి ఫీజుతో కార్పొరేట్ హాస్పిటల్ స్థాయి ట్రీట్‌మెంట్ అందిస్తున్నారు. ఏజెన్సీ ప్రాంత నిరుపేదలకు ఆయనొక ఆపద్బాంధవుడు. అవసరమైనవారికి ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా సర్జరీలు చేస్తుంటారు. ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతున్న డాక్టర్ హర్షవర్ధన్‌ను 'ఎక్సలెన్స్ ఇన్ హెల్త్ కేర్ అవార్డు'తో సత్కరించింది సాక్షి మీడియా గ్రూప్.


జ్యూరీ సభ్యులతో 'సాక్షి' ప్రతినిధులు



సాక్షి ఎక్సలెన్స్ అవార్డుల కార్యక్రమంలో భాగస్వామి కావడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నాను. ఈ అవార్డుల కార్యక్రమంతో నాకు 10 ఏళ్ల అనుబంధం ఉంది. జ్యూరీలో నన్ను భాగస్వామిని చేసినందుకు కృతజ్ఞతలు. అసామాన్య ప్రతిభ చూపే వారిలో ఉత్తములను ఎంపిక చేయడం కత్తిమీద సాములాంటిది. ఇందుకోసం సాక్షి టీమ్ ఎంతో కష్టపడ్డారు. ఎవరిని ఎంపిక చేయాలనే అంశంపై రీసెర్చ్ చేసి పెద్ద నోట్స్ సిద్ధం చేశారు. మేం ఎలా ముందుకు సాగాలో తెలియజెప్పేందుకు వారు పడిన కష్టం ఎంతో గొప్పది. ఎలాంటి పక్షపాతం లేకుండా అవార్డులకు ఎంపిక చేసే విధానం సాక్షిలో నాకు కనిపించిన గొప్పదనం. అవార్డులు తీసుకున్న వారందరికీ నా అభినందనలు.

- శాంతా సిన్హా, జ్యూరీ చైర్‌పర్సన్




పవన్ చందన, నాగ భరత్, స్టార్టప్

ఇస్రో మాజీ శాస్త్రవేత్తలైన పవన్ కుమార్ చందన, నాగభరత్ కలిసి 2018లో స్కైరూట్ ఏరోస్పేస్‌ను ప్రారంభించారు. ఇది భారతదేశపు మొట్టమొదటి ప్రైవేట్ అంతరిక్ష ప్రయోగాల స్టార్టప్ కంపెనీ. అంతరిక్షాన్ని అందరికీ చేరువ చేయాలనే లక్ష్యంతో విక్రమ్-సిరీస్ ప్రయోగ వాహనాలను అభివృద్ధి చేస్తోంది స్కైరూట్. ఈ కంపెనీలో 350కు పైగా ప్రతిభావంతమైన అంతరిక్ష నిపుణులు పని చేస్తున్నారు. అంతరిక్ష పరిశోధనలను సరళతరం చేస్తున్న స్కైరూట్ ఏరోస్పేస్ కంపెనీని 'ఎక్సలెన్స్ ఇన్ స్టార్టప్ అవార్డు'తో సత్కరిస్తోంది సాక్షి మీడియా గ్రూప్.


అనిత ప్రొద్దుటూరి, సామాజిక సేవ

తలసేమియా... చిన్నారుల పాలిట శాపమైన ఈ వ్యాధికి వైద్యం చేయించలేక తల్లడిల్లుతున్న తల్లిదండ్రులకు అండగా నిలిచారు పొద్దుటూరి అనిత. ఖమ్మంలో ఆర్టీసీలో కండక్టర్‌గా పనిచేస్తూనే తలసేమియాతో బాధపడుతున్న చిన్నారుల కోసం సంకల్ప పేరిట ఒక ఫౌండేషన్ ఏర్పాటు చేశారు. విరివిగా రక్తదాన శిబిరాలు నిర్వహిస్తూ తలసేమియా గురించి... రక్త దానం ఆవశ్యకత గురించి అవగాహన కల్పిస్తున్నారు. పొద్దుటూరి అనితను 'ఎక్సలెన్స్ ఇన్ సోషల్ డెవలప్‌మెంట్ అవార్డు'తో సత్కరించింది సాక్షి మీడియా గ్రూప్.


కె. అనురాధ, విద్యారంగం

వీధి బాలలను చేరదీసి ఆశ్రయం కల్పించి తగిన పౌష్టికాహారం అందించి బాధ్యత గల పౌరులుగా తీర్చిదిద్దాలనే సమున్నత ఆశయంతో పని చేస్తోంది రెయిన్‌బో హోమ్స్ ప్రోగ్రాం సంస్థ. దేశవ్యాప్తంగా పది నగరాల్లో ఇప్పటివరకు 14,996 మంది వీధి బాలలు, 5,557 మంది చిన్నారులు, యువతీ, యువకులకు ఆశ్రయం కల్పించింది. రెయిన్‌బో హోమ్స్ ప్రోగ్రామ్ సంస్థను 'ఎక్సలెన్స్ ఇన్ ఎడ్యుకేషన్ అవార్డు'తో సత్కరించింది సాక్షి మీడియా గ్రూప్.


సుహాస్ బి శెట్టి, చిన్న/మధ్య తరహా వాణిజ్యం

చెక్కుచెదరని సంకల్పం ఉంటే సాధ్యం కానిదేమీ లేదు అని నిరూపించారు నెల్లూరుకు చెందిన సుహాస్. ఫార్మసీలో పీహెచ్‌డీ చేసి 3 లక్షల రూపాయల పెట్టుబడితో చిన్న ఐస్‌క్రీమ్ స్టోర్ ప్రారంభించిన సుహాస్ ఇప్పుడు ఏడు రాష్ట్రాల్లో 120కి పైగా స్టోర్లకు విస్తరించారు. 14 కోట్ల రూపాయల టర్నోవర్ సాధించారు. ఆర్గానిక్ ఐస్‌క్రీమ్ తయారు చేస్తూ ఆదరణ పొందారు. సుహాస్ బి షెట్టిని 'బిజినెస్ పర్సన్ ఆఫ్ ద ఇయర్ – స్మాల్ అండ్ మీడియం అవార్డు'తో సత్కరించింది సాక్షి మీడియా గ్రూప్.


దుశర్ల సత్యనారాయణ, పర్యావరణం

అడవులు అంతరించి పర్యావరణ సంక్షోభం ఏర్పడుతున్న ఈ కాలంలో అడవినే సృష్టించడానికి ముందుకు వచ్చిన వ్యక్తి దుశర్ల సత్యనారాయణ. సూర్యాపేట జిల్లా రాఘవపురంలో 70 ఎకరాల వ్యవసాయ భూమిని అడవిగా మార్చేశారాయన. ఆయన కృషి ఫలితంగా లక్షల చెట్లు ఊపిరి తీసుకుంటూ ఉండగా వాటితో పాటు నెమళ్లు, జింకలు, నక్కలు, అడవి పందులు... నీడ పొందుతున్నాయి. పక్షులు, జంతువుల కోసం ఆ అడవిలోనే ఏడు చెరువులు తవ్వించిన సత్యనారాయణను 'ఎక్సలెన్స్ ఇన్ ఎన్విరాన్మెంట్ అవార్డు'తో సత్కరించింది సాక్షి మీడియా గ్రూప్.


మద్దెబోయిన మానస, విద్యారంగం

ఖమ్మం జిల్లా కారేపల్లికి చెందిన మద్దెబోయిన మానస పుట్టుకతోనే అంధురాలు. ఇరుగు పొరుగువారి మాటలకు మానసగాని ఆమె తల్లిదండ్రులుగాని కొంచెం కూడా వెరవలేదు. డిగ్రీ వరకు చదివిన మానస తానెవరికీ తక్కువ కాదు అని పోటీ పరీక్షలపై దృష్టి సారించారు.ఇంటి వద్దనే సొంతంగా ప్రిపరేషన్ మొదలు పెట్టి గ్రూప్–4 ఉద్యోగానికి ఎంపికై తన కలను నెరవేర్చుకున్నారు. ఎందరికో ఆదర్శంగా నిలిచిన మానసను ' యంగ్ అచీవర్ ఆఫ్ ద ఇయర్ ఎడ్యుకేషన్ అవార్డు'తో సత్కరించింది సాక్షి మీడియా గ్రూప్.


పెద్ది శంకర్, సామాజిక సేవ

పెద్ది శంకర్ గౌడ్ 'రెడీ టు సర్వ్ ఫౌండేషన్' పేరుతో ఒక సంస్థను ఏర్పాటు చేసి 2011లో వనస్థలిపురంలో ఒక ఓల్డేజ్ హోమ్ ప్రారంభించారు. ఏ ఆసరా లేని వృద్ధులకు ఆశ్రయం కల్పించి ఉచిత భోజన, వైద్య సేవలు అందచేస్తోంది ఈ సంస్థ. ప్రముఖ హాస్పిటల్స్ యాజమాన్యాలను ఒప్పించి అక్కడి వైద్యుల చేత వృద్ధులకు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు నిర్వహిస్తూ అవసరమైన మెడిసిన్స్ ఉచితంగా ఇస్తున్నారు. పెద్ది శంకర్ గౌడ్‌ను 'యంగ్ అచీవర్ ఆఫ్ ద ఇయర్ సోషల్ సర్వీస్' అవార్డుతో సత్కరించింది సాక్షి మీడియా గ్రూప్.


చంద్రకాంత్ సాగర్, చిన్న/మధ్య తరహా వాణిజ్యం

చంద్రకాంత్ సాగర్ పుట్టుకతోనే 90 శాతం శారీరక లోపంతో జన్మించారు. అయినా ఏనాడూ కుమిలిపోలేదు. వీల్‌చైర్ నుంచే 2019లో ప్రణవ్ ఎంటర్‌ప్రైజెస్ పేరుతో పరిశ్రమ ఏర్పాటు చేసి పర్యావరణహిత సంచులు, సర్జికల్ మాస్కులు, పెన్నులు, పెన్సిళ్లు తయారు చేస్తూ పది మంది దివ్యాంగులకు ఉపాధి కల్పిస్తున్నారు. ప్రస్తుతం వారి టర్నోవర్ 25 లక్షలు. చంద్రకాంత్ సాగర్‌ని 'బిజినెస్ పర్సన్ ఆఫ్ ద ఇయర్ కేటగిరీ'లో స్పెషల్ జ్యూరీ రికగ్నేషన్ అవార్డుతో సత్కరించింది సాక్షి మీడియా గ్రూప్.


అర్జున్ ఎరిగైసి, క్రీడలు

చదరంగంలో ఎత్తుకు పై ఎత్తు వేసి...ప్రత్యర్థిని చిత్తు చేయాలి.. అలాంటి టాలెంట్ పుష్కలంగా ఉన్న అర్జున్ చెస్‌లో అంతర్జాతీయ వేదికలపై సత్తా చాటుతున్నారు. హన్మకొండకు చెందిన అర్జున్ గుజరాత్‌లో జరిగిన జాతీయ చాంపియన్ షిప్‌లో అండర్ 13 విభాగంలో గోల్డ్ మెడల్ గెలుచుకుని తన విజయయాత్రను ప్రారంభించారు. 2015 ఏషియన్ యూత్ చాంపియన్ షిప్‌లో రజతం గెలిచి తొలి అంతర్జాతీయ పతకం సొంతం చేసుకున్నారు. 2018లో 14 ఏళ్ల వయసులో గ్రాండ్ మాస్టర్ టైటిల్ సాధించి తెలంగాణ నుంచి జీఎం హోదా పొందిన మొదటి ఆటగాడిగా చరిత్ర సృష్టించారు. అర్జున్‌ను 'యంగ్ అచీవర్ ఆఫ్ ద ఇయర్-స్పోర్ట్స్ అవార్డు'తో సత్కరించింది సాక్షి మీడియా గ్రూప్.


త్రిష, క్రీడలు

భద్రాచలంకు చెందిన గొంగడి త్రిష క్రికెట్‌లో కొత్త తారగా అవతరించింది. ఎనిమిదేళ్ల వయసులో జిల్లా స్థాయి అండర్ 16 జట్టుకు ఆడి 'ప్లేయర్ ఆఫ్ ద సీరిస్'గా నిలిచింది. పన్నెండేళ్ల వయసులో హైదరాబాద్ మహిళల క్రికెట్ జట్టుకు ఎంపికైన త్రిష బీసీసీఐ 'ప్లేయర్ ఆఫ్ ద ఇయర్ అవార్డు'ను గెలుచుకుంది. ఆల్ రౌండర్‌గా పేరు తెచ్చుకున్న ఈ లెగ్ స్పిన్నర్ ఐసీసీ అండర్-19 మహిళల టి 20 వరల్డ్ కప్–2025లో సెంచరీ చేసి రికార్డులు బ్రేక్ చేసింది. గొంగడి త్రిషను 'యంగ్ అచీవర్ ఆఫ్ ద ఇయర్- స్పోర్ట్స్ అవార్డు'తో సత్కరించింది సాక్షి.


జీవాంజి దీప్తి, క్రీడలు

వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం కల్లెడ గ్రామానికి చెందిన దీప్తికి పుట్టుకతో జన్యుపరమైన బలహీనత ఉంది. అయినా స్కూల్లో తోటి విద్యార్థులతో సమానంగా ఆటల్లో పాల్గొనేది. ఆమె ప్రతిభను గుర్తించిన కోచ్ రమేశ్ పారా అథ్లెట్‌గా ట్రెయినింగ్ ఇచ్చారు. ఇక ఆ తరువాత మొదలైంది పతకాల వేట. 2024 లో జపాన్‌లో జరిగిన పారా అథ్లెటిక్స్ ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో 400 మీటర్ల టి20 విభాగంలో స్వర్ణ పతకం గెలుచుకోవడమే కాకుండా ప్రపంచ రికార్డును నెలకొల్పారు దీప్తి. దీప్తి జీవాంజిని స్పోర్ట్స్ కేటగిరిలో 'యంగ్ అచీవర్ ఆఫ్ ది ఇయర్ అవార్డు'తో సత్కరించింది సాక్షి మీడియా గ్రూప్.


మద్దినేని ఉమా మహేష్, క్రీడలు

మద్దినేని ఉమామహేష్...అంతర్జాతీయ స్థాయిలో పతకాలు కొల్లగొడుతున్న ఇరవయ్యేళ్ల షూటర్. స్వస్థలం విజయవాడ. బెంగుళూరులో జరిగిన ఖేలో ఇండియా యూనివర్సిటీ గేమ్స్‌లో గోల్డు మెడల్ సాధించాడు. 2022లో జర్మనీలో జరిగిన ISSF జూనియర్ వరల్డ్ కప్‌లో, 2024లో ఢిల్లీలో జరిగిన FISU వాల్డ్ యూనివర్సిటీ ఛాంపియన్‌షిప్ మెన్స్ టీమ్ ఈవెంట్‌లో స్వర్ణ పతకాలు సాధించాడు. ఉమా మహేష్‌ను 'స్పోర్ట్స్ కేటగిరిలో యంగ్ అచీవర్ ఆఫ్ ద ఇయర్ అవార్డు'తో సత్కరించింది సాక్షి.


డొక్కరి రాజేష్ తల్లిదండ్రులు, అమర సైనికుడు

డొక్కరి రాజేష్ గుండె ధైర్యం, త్యాగం దేశాన్నే కాదు తెలుగు వారిని కూడా గర్వపడేలా చేసింది. శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి మండలం చెట్లతాండ్ర గ్రామానికి చెందిన డొక్కరి రాజేశ్ 2018లో ఆర్మీలో చేరి తండ్రి కలను నిజం చేశారు. మూడేళ్లలోనే నాయక్ స్థాయికి ఎదిగారు. సెలవుపై స్వగ్రామానికి వచ్చినప్పుడల్లా పేద విద్యార్థుల చదువు కోసం ఖర్చుపెట్టేవారు. 2024 జూలై 15న జమ్ము కాశ్మీర్‌లోని దోడా జిల్లాలో ఉగ్రవాదులను ఎదుర్కొంటూ వీరమరణం పొందారు. వీర జవాన్ డొక్కరి రాజేశ్‌కు సాక్షి ఎక్సలెన్స్ – పోస్తమస్ అవార్డును ఆయన కుటుంబ సభ్యులకు అందించింది సాక్షి మీడియా గ్రూప్.

2023 - 2024
SAKSHI EXCELLENCE AWARDS
10th Edition



● అవార్డ్స్ వేడుకలో డ్రగ్స్‌ను వ్యతిరేకిస్తూ చేసిన డాన్స్ షో


● 'తెలుగు పర్సన్ ఆఫ్ ది ఇయర్' అవార్డుతో సుకుమార్


● ప్రముఖుల సమక్షంలో సీనియర్ నటి రమాప్రభకు లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డును ప్రదానం చేసిన వైఎస్ భారతీ రెడ్డి


● సీనియర్ నటుడు చంద్రమోహన్ తరఫున పురస్కారం అందుకుంటున్న శివలెంక కృష్ణప్రసాద్

సినీ ప్రతిభకు క్లాప్స్

తెలుగు ప్రజల ప్రాథమిక వినోదం సినిమా. ప్రతి శుక్రవారం కొత్త రిలీజుకై ఎదురు చూసే ప్రేక్షకులు తమ ఇష్టాఇష్టాలతో జాతకాలు మారుస్తుంటారు. వీరిని మెప్పించేందుకు హీరో, హీరోయిన్లు, నిర్మాత-దర్శకులు అనుక్షణం కొత్త ఆలోచనలు చేస్తుంటారు. 2023 ఎన్నో ఘనవిజయాలను చూసింది. అలాగే 2024లోనూ తెలుగు సినిమా ఘన విజయాలు చూసింది... ఘనతలు సాధించింది. చంద్రమోహన్ వంటి గొప్ప నటుణ్ణి కోల్పోయింది. అందుకే చంద్రమోహన్‌కు నివాళి అర్పిస్తూ ఈ వేడుకను నిర్వహించింది 'సాక్షి'. వేయి చిత్రాల్లో నటించిన గొప్ప నటి రమాప్రభకు 'లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు' బహూకరించడం తనను తాను గౌరవించుకోవడంగా భావిస్తోంది 'సాక్షి'. మాతో పాటు మీరూ క్లాప్స్ కొడుతూ వేడుకలోకి రండి.

'సాక్షి' టీమ్‌కి ధన్యవాదాలు. యాక్చువల్లీ... ఇది నాకు సర్‌ప్రైజ్. ఈ అవార్డుని అసలు ఊహించలేదు. నేను కాలేజీలో లెక్చరర్‌గా చేస్తూ... జాబ్ వదిలేసి సినిమాల్లోకి వద్దామనుకున్నప్పుడు ... నన్ను వెన్నుతట్టి ప్రోత్సహించిన నా గురువు రామ్మోహన్ రావుగారికి ఈ అవార్డు అంకితం ఇస్తున్నాను. థ్యాంక్యూ... సార్. మీ లవ్ అండ్ సపోర్ట్‌కి.

- 2024 'తెలుగు పర్సన్ ఆఫ్ ది ఇయర్' అవార్డు అందుకున్న సందర్భంగా దర్శకుడు సుకుమార్



నా సినిమా ప్రయాణం చాలా పెద్దది. నేను ఇండస్ట్రీకి వచ్చి 63 సంవత్సరాలు అయింది. ఈ పెద్ద ప్రయాణంలో ఐదు తరాలతో కలిసి నటించాను. అలాంటి నాకు ఈ జీవిత సాఫల్య పురస్కారం ఇచ్చినందుకు 'సాక్షి' యాజమాన్యానికి, భారతీగారికి ధన్యవాదాలు. సరైన సమయంలో... సరైన వయసులో నాకు ఈ అవార్డు ఇవ్వడం చాలా సంతోషంగా ఉంది. థ్యాంక్యూ భారతమ్మా.

- నటి రమాప్రభ

మా హీరో బన్నీ (అల్లు అర్జున్), నిర్మాతలు నవీన్, రవిగార్లు, దేవిశ్రీ ప్రసాద్‌లతో పాటు నటీనటులు, సాంకేతిక నిపుణులందరికీ ఎంతో సపోర్ట్ చేసినందుకు థ్యాంక్స్. 'పుష్ప 2' థ్యాంక్స్ మీట్‌లో నేను కొందరికి థ్యాంక్స్ చెప్పలేకపోయాను. సెట్స్‌లో నాతోపాటు ఏకధాటిగా పని చేసిన పాండు, ఆర్ట్ అసిస్టెంట్ మధు, నాతోపాటు ఐదేళ్లు వేరే సినిమా చేయకుండా పని చేసిన కూలీ గ్యాంగ్‌కి ప్రత్యేక కృతజ్ఞతలు. సహ నిర్మాతలు ప్రవీణ్, సతీష్‌గార్లు, ప్రశాంతిగారికి థ్యాంక్స్.

- 'పుష్ప 2'కి పాపులర్ డైరెక్టర్ అవార్డు అందుకున్న సందర్భంగా సుకుమార్


● అవార్డు అందుకుంటున్న సుకుమార్


● అవార్డు అందుకుంటున్న శౌర్యువ్

'హాయ్ నాన్న' విడుదలై చాలా రోజులు గడిచిపోయాయి. కానీ, ఆ సినిమా గెలుచు కుంటున్న ప్రేమ, అవార్డులు, రివార్డులు... ఇలా కొనసాగుతూనే ఉన్నాయి. మరోసారి ఈ మూవీని సెలబ్రేట్ చేస్తున్నందుకు 'సాక్షి'కి, జ్యూరీ మెంబర్లకు కృతజ్ఞతలు. మా సినిమాని వివిధ విభాగాల్లో ఎంపిక చేసినందుకు, అలాగే నన్ను బెస్ట్ యాక్టర్‌గా ఎంపిక చేసినందుకు ధన్యవాదాలు. నేను వేరే దేశంలో ఉండటం వల్ల అవార్డు ఫంక్షన్‌కి రాలేకపోయాను. **- హీరో నాని**


● అవార్డుతో హన్షిత, హర్షిత్, వేణు

'హాయ్ నాన్న' విడుదలై ఏడాదికి పైగా అయినప్పటికీ ఇప్పటికీ ప్రేక్షకులు అదే అభిమానం చూపిస్తుండటం అపురూపమైనది. బెస్ట్ యాక్ట్రెస్‌గా ఈ అవార్డు ఇచ్చినందుకు 'సాక్షి'కి కృతజ్ఞతలు. నేను ఫంక్షన్‌కి రానందుకు క్షమించాలి. నాని, శౌర్యువ్, బేబి కియారా, నిర్మాతలు, సంగీత దర్శకుడు... ఇలా వీరందరూ లేకుంటే ఈ సినిమా ఉండేది కాదు.

- హీరోయిన్ మృణాల్ ఠాకూర్


● అవార్డు అందుకుంటూ సాయి రాజేశ్, ఎస్‌కేఎన్

'హాయ్ నాన్న'కి ఈ అవార్డు ఇచ్చిన 'సాక్షి'కి, భారతీగారికి ధన్యవాదాలు. ఎన్నో అవార్డులు గెలుచుకున్నాం. ఫిల్మ్‌ఫేర్, ఐఫా, సైమా అవార్డులొచ్చాయి. వీటన్నిటికన్నా ఒక తెలుగు అవార్డు (సాక్షి ఎక్సలెన్స్) అందుకున్నందుకు చాలా సంతోషంగా ఉంది. ఈ అవార్డుని నా నిర్మాతలకి, నటీనటులకి, సాంకేతిక నిపుణులకు అంకితం ఇస్తున్నా... ప్రత్యేకించి నానీగారికి. ఎందుకంటే ఒక కొత్త డైరెక్టర్‌ని నమ్మి ఇలాంటి ఒక సున్నితమైన కథ, అందులోనూ 'దసరా' లాంటి సినిమా తర్వాత ఆయన 'హాయ్ నాన్న'ని ఒప్పుకుని చేసినందుకు రుణపడి ఉంటాను. **- డైరెక్టర్ శౌర్యువ్**


● అవార్డు అందుకుంటున్న వైష్ణవీ చైతన్య

మా సినిమాకి అవార్డు ఇచ్చిన సాక్షి యాజమాన్యానికి, జ్యూరీ మెంబర్లకు థ్యాంక్స్. 'బలగం' అనేది పీపుల్స్ ఛాయిస్ మూవీ. ఈ సినిమా క్రెడిట్ వేణుకి దక్కుతుంది. **- నిర్మాత హన్షితా రెడ్డి**

'బలగం' చిత్రానికి పీపుల్స్ ఛాయిస్ విభాగంలో అవార్డు అందించిన 'సాక్షి'వారికి థ్యాంక్స్. వైఎస్ రాజశేఖర రెడ్డిగారు మా నాన్నకి చాలా క్లోజ్. మా ఆటోమొబైల్ బిజినెస్‌లో ఓ షాప్ ఓపెనింగ్‌ని రాజశేఖర రెడ్డిగారి చేతుల మీదుగా చేయించాలని మా నాన్న మూడు నెలలు వేచి ఉండి, ఆయన చేతుల మీదుగానే ప్రారంభింపజేశారు. ఇప్పుడు మేం నిర్మించిన 'బలగం'కి వాళ్ల సంస్థ (సాక్షి) నుంచి మాకు అవార్డు రావడం, అది కూడా మా ఫస్ట్ మూవీ కావడం హ్యాపీగా ఉంది. **- నిర్మాత హర్షిత్ రెడ్డి**


● అవార్డు అందుకుంటున్న కల్యాణ్ శంకర్

'సాక్షి ఎక్సలెన్స్ అవార్డ్స్' టెన్త్ ఎడిషన్‌లో అవార్డు తీసుకోవడం చాలా సంతోషంగా ఉంది. ఈ అవార్డు మాకో మధురమైన అనుభూతి. 'బేబీ' సక్సెస్‌కు కారణమైన నా స్నేహితుడు సాయి రాజేశ్‌కు మరోసారి కృతజ్ఞతలు. **- నిర్మాత ఎస్‌కేఎన్**

'సాక్షి ఎక్సలెన్స్' అవార్డు తీసుకోవడం, పైగా బెస్ట్ క్రిటికల్లీ ఎక్లైమ్డ్ ఫిల్మ్‌కు తీసుకోవడం అనేది ఇంకా సంతోషం. **- దర్శకుడు సాయి రాజేశ్**

2023 నా లైఫ్‌లో స్పెషల్ ఇయర్. మా 'బేబీ' ద్వారా మాకు చాలా లవ్, ఎంకరేజ్‌మెంట్ దొరికింది. 'బేబీ' సినిమా నా లైఫ్‌లో ఎప్పటికీ గుర్తుండిపోతుంది. 'బెస్ట్ డెబ్యూ యాక్ట్రెస్' అవార్డు ఇచ్చిన 'సాక్షి'కి ధన్యవాదాలు. ఈ అవార్డు తీసుకోవడం చాలా ఎంకరేజింగ్‌గా, మోటివేటివింగ్‌గా ఉంది.

- హీరోయిన్ వైష్ణవీ చైతన్య

'బలగం' వంటి ఒక మించి కథని నమ్మి నాకు అన్ని రకాలుగా సహకారం అందించి, నన్ను ముందుకు నడిపించిన 'దిల్' రాజు, హన్షిత, హర్షిత్, శిరీష్‌గార్లకు ధన్యవాదాలు. జీవితాంతం వీళ్లందరికీ రుణపడి ఉంటాను. జీవితాంతం గుర్తుంచుకునే మరపురాని అనుభూతిని ఇచ్చిన ప్రేక్షకులకు థ్యాంక్స్... అలాగే వారికి జన్మ జన్మలు రుణపడి ఉంటాను. మా 'బలగం' విజయం కానీ, ఏ అవార్డు అయినా కానీ మా యూనిట్ అందరికీ దక్కుతుంది.

- దర్శకుడు వేణు యెల్దండి

నన్ను నమ్మిన నిర్మాత నాగవంశీగారికి ఈ అవార్డు (బెస్ట్ డెబ్యూ డైరెక్టర్)ని అంకితం ఇస్తున్నాను. అలాగే మా 'మ్యాడ్' ముగ్గురు హీరోలకి, నిర్మాత చిన బాబుగారికి, ఎడిటర్ నవీన్ నూలిగార్లకు థ్యాంక్స్. 'మ్యాడ్ 2' కూడా రాబోతోంది. టీజర్ కూడా విడుదలైంది. ఈ చిత్రం కూడా తొలి భాగం అంత క్రేజీగా ఉంటుంది. దయచేసి అందరూ చూడండి. ఇది నా మొదటి అవార్డు.. చాలా ప్రత్యేకం. 'సాక్షి'కి ప్రత్యేక కృతజ్ఞతలు. **- డైరెక్టర్ కల్యాణ్ శంకర్**

'సాక్షి ఎక్సలెన్స్ అవార్డ్స్' సందర్భంగా దివంగత చంద్రమోహన్‌గారికి నివాళి అర్పిస్తూ, మా కుటుంబాన్ని ఆహ్వానించినందుకు 'సాక్షి' మీడియా గ్రూప్‌కి కృతజ్ఞతలు. నేను, మా పెద్దమ్మాయి మీనా మోహన్, మా చిన్నమ్మాయి డాక్టర్ మాధవి హైదరాబాద్‌లో లేకపోవడం వల్ల వ్యక్తిగతంగా ఈ వేడుకకి హాజరు కాలేకపోయాం. మా తరఫున మా మేనల్లుడు శివలెంక కృష్ణప్రసాద్ ఈ వేడుకలో పాల్గొని, మా అందరి తరఫున కృతజ్ఞతలు చెబుతారు.

- జలంధర, చంద్రమోహన్ సతీమణి

చంద్రమోహన్‌గారి రెండో అక్క కొడుకుని నేను. 1978లో 'సీతామాలక్ష్మి' సినిమా సమయంలో ఆయన వద్దకు నేను ఉద్యోగం కోసం వెళ్లాను. అప్పుడు ఆయన నా వ్యక్తిగత విషయాలు చూసుకో అన్నారు. అలా మావయ్య వద్ద చేరాను. 'నిర్మాత కావొద్దు... టెక్నీషియన్‌గా అయినా పర్వాలేదు' అని కూడా ఆయన అన్నారు. కానీ, నేను మాత్రం నిర్మాతగా నా తొలి సినిమానే మావయ్య, రాజేంద్రప్రసాద్‌లతో 'చిన్నోడు పెద్దోడు' తీశా. ఆ తర్వాత బాలకృష్ణగారితో 'ఆదిత్య 369'తో పాటు నాలుగు సినిమాలు చేశాను. ఈ మధ్య కాలంలో 'యశోద' మూవీ తీశాను. చంద్రమోహన్‌గారు 1965లో ఇండస్ట్రీకి రాగా 1966లో మొదటి మూవీ చేశారు. మన తెలుగు వాళ్లే కాకుండా మిగతా భాషల్లో కూడా ఆయనకి అప్రిషియేషన్ ఉండేది. శివాజీ గణేశన్, ఎంజీఆర్‌గార్లతో పాటు అందరూ ఆయన్ని అభినందించేవారు. 1977-78 నుంచి ఆయన పూర్తి స్థాయిలో హీరోగా మారి దాదాపు 160 సినిమాలు చేశారు. దాదాపు 54 ఏళ్ల సినీ ప్రస్థానంలో ఆయన క్యారెక్టర్ ఆర్టిస్టుగానూ ఎన్నో పాత్రలు వేశారు. మావయ్యగారి 'సుఖ దుఃఖాలు' మూవీ చూసి, మహానటుడు ఎస్వీ రంగారావుగారు మావయ్యతో 'బాంధవ్యాలు' అనే సినిమా నిర్మించారు. చంద్రమోహన్‌గారిలాంటి మంచి నటుడికి, మంచి వ్యక్తికి మేనల్లుడు కావడం నా అదృష్టం. మావయ్య నటనని, చిత్రసీమకు ఆయన చేసిన సేవలను పురస్కరించుకుని గుర్తింపు ఇచ్చినందుకు 'సాక్షి' మేనేజ్‌మెంట్‌కి మా కుటుంబం తరఫున కృతజ్ఞతలు. **- నిర్మాత శివలెంక కృష్ణప్రసాద్**

'పుష్ప 2' చిత్రానికి ఇది తొలి అవార్డు. 'సాక్షి' అవార్డుతో ప్రారంభం అయింది. ఇక్కడి నుంచి ఇంకా చాలా అవార్డులు రావాలని, వస్తాయని నమ్ముతున్నాను. పదేళ్ల క్రితం 'శ్రీమంతుడు' చిత్రానికి ఇదే వేదికపై ఇదే 'సాక్షి' అవార్డుని భారతీగారు తన గోల్డెన్ హ్యాండ్స్‌తో ఇచ్చారు. అప్పటి నుంచి మా ప్రయాణం సినిమా సినిమాకి పెరుగుతూ వస్తోంది. 'సాక్షి' మొదటి అవార్డుతో మొదలైన మా ప్రయాణంలో ఇప్పటికి మా మైత్రీ మూవీ మేకర్స్‌కి దాదాపు 50 నుంచి 100 అవార్డులు వివిధ సంస్థల నుంచి వచ్చాయి. అందులో జాతీయ అవార్డు కూడా ఉండటం గొప్పగా భావించే అంశం. థ్యాంక్యూ వెరీ మచ్ టు 'సాక్షి'. 'పుష్ప 2'ని బెస్ట్ ఫిల్మ్‌గా ఎంపిక చేసిన జ్యూరీకి కృతజ్ఞతలు. మా హీరో అల్లు అర్జున్‌కి బెస్ట్ యాక్టర్‌గా 'సాక్షి' అవార్డు రావడం హ్యాపీగా ఉంది. అల్లు అర్జున్‌గారు ఇక్కడ ఉండి ఉంటే తప్పకుండా వచ్చి అవార్డు తీసుకునేవారు. ఆయన తర్వాతి సినిమా ట్రాన్స్‌ఫర్మేషన్ కోసం సిద్ధం అవుతుండటం వల్ల రాలేకపోయారు.

- నిర్మాత యలమంచిలి రవిశంకర్


● డ్యాన్స్ చేస్తున్న రష్మిక, మీనాక్షీ చౌదరి

'లక్కీ భాస్కర్'లో నా నటనని గుర్తించి 'సాక్షి ఎక్సలెన్స్ అవార్డు' ఇచ్చినందుకు థ్యాంక్స్. ఈ అవార్డు అందుకోవడం గౌరవంగా ఉంది. ఇది నాకు తొలి అవార్డు కావడంతో ఎక్స్‌ట్రా స్పెషల్. మా నిర్మాతలు చినబాబు, నాగవంశీగార్లకు, సుమతి వంటి మంచి పాత్ర ఇచ్చిన డైరెక్టర్ వెంకీ అట్లూరిగారికి థ్యాంక్స్. ఈ అవార్డు నా జీవితంలో ఓ భాగం.

- హీరోయిన్ మీనాక్షీ చౌదరి

నాకు ఇది తొలి అవార్డు. 'క' సినిమాని నిర్మించిన చింతా గోపాలకృష్ణా రెడ్డిగారికి, నాకు ఇంత మంచి సినిమా ఇచ్చిన దర్శకులు సుజీత్, సందీప్‌లకు ధన్యవాదాలు. 'క'కి పని చేసిన నటీనటులు, సాంకేతిక నిపుణులందరికీ థ్యాంక్స్. పీపుల్స్ ఛాయిస్ అవార్డు రావడం ఆనందంగా ఉంది. నన్ను ఆదరించి, సపోర్ట్ చేసిన ప్రేక్షకులందరికీ ఈ అవార్డుని అంకితం ఇస్తున్నాను. నన్ను గుర్తించి అవార్డు ఇచ్చిన 'సాక్షి'కి కృతజ్ఞతలు.

- హీరో కిరణ్ అబ్బవరం

మా 'హను-మాన్' సినిమాని ప్రోత్సహించిన ఆడియన్స్‌కు, ఎఫర్ట్స్ పెట్టిన దర్శకుడు ప్రశాంత్, మమ్మల్ని నమ్మిన నిర్మాత నిరంజన్ రెడ్డిగారికి థ్యాంక్స్. ఇలా అవార్డ్స్‌తో ప్రతిభను ప్రోత్సహిస్తున్నందుకు 'సాక్షి' యాజమాన్యానికి థ్యాంక్స్. సుకుమార్‌గారి చేతుల మీదుగా అవార్డు అందుకోవడం హ్యాపీ. నేపాల్, చైనా-టిబెట్ బోర్డర్ లొకేషన్స్‌లో మా సినిమా షూటింగ్ జరిపినప్పుడు అక్కడి వారు... ఇది ఏ సినిమా అంటే.. తెలుగు సినిమా అన్నాం. వెంటనే వాళ్లు 'హో పుష్ప' అన్నారు. మేం 'పుష్ప' టీమ్ కాదు కానీ 'పుష్ప' సినిమా తీసిన ల్యాండ్ నుంచి వచ్చాం అని చెప్పాం.

- హీరో తేజ సజ్జా

'క' సినిమాకు మాకు అవకాశం ఇచ్చిన నిర్మాత గోపాలకృష్ణా రెడ్డిగారు, మమ్మల్ని నమ్మిన కిరణ్ అబ్బవరంగారికి థ్యాంక్స్. 'సాక్షి'కి చాలా థ్యాంక్స్. ఇది మా ఫస్ట్ అవార్డు. మాకెంతో ప్రత్యేకం. కంటెంట్‌ను నమ్మి సినిమా తీద్దామనుకున్నాం. స్ట్రాంగ్ కంటెంట్ చెబుదామనుకున్నాం... కంటెంట్‌ను నమ్మి చేసినందుకు మమ్మల్ని ఇక్కడివరకు తీసుకొచ్చిన తెలుగు ఆడియన్స్‌కు ధన్యవాదాలు. ఈ అవార్డును వారికి అంకితం ఇద్దామనుకుంటున్నాం.

- దర్శకులు సుజిత్ అండ్ సందీప్

ఈ ప్రతిష్ఠాత్మక అవార్డును ఇచ్చిన 'సాక్షి'కి థ్యాంక్స్. మా అమ్మానాన్నలకు, యూ ట్యూబ్ ద్వారా ఎంతో నేర్పించిన షార్ట్ ఫిల్మ్ మేకర్స్‌కి, ఎలా సినిమా తీయాలో నేర్పించిన ప్రతి దర్శకుడికి ధన్యవాదాలు. ప్రతి డెబ్యూ డైరెక్టర్ పడే కష్టాలన్నీ పడ్డాను. రైట్ స్క్రిప్ట్‌కి, రైట్ ప్రొడ్యూసర్ అవసరం అంటారు. నిహారిక కొణిదెల, ఫణి ఎడపాకగార్ల ద్వారా ఆ అవకాశం దక్కింది. 'ఇది చిన్న సినిమా ('కమిటీ కుర్రోళ్లు) కాదు.. ఎంత బడ్జెట్ కావాలో అంత పెడతాం' అన్నారు. అందుకే ఈ అవార్డు నిహారిక, ఫణిగార్లకు అంకితం. **- దర్శకుడు యదు వంశీ**

'నాకు ఫస్ట్ క్లాస్‌లో సాంస్కృతిక విభాగంలో బహుమతి ఇచ్చారు. నాకు ఊహ తెలిశాక అది ఫస్ట్ అవార్డు కావడంతో ఇప్పటికీ గుర్తు. ఇప్పుడు నా సినిమా ('డ్రింకర్ సాయి')కి హీరోగా 'సాక్షి' అవార్డు రావడం హ్యాపీగా ఉంది. 'సాక్షి'కి థ్యాంక్స్. ఈ అవార్డు జీవితాంతం గుర్తుండిపోతుంది. 2025లో నా తొలి హ్యాపియెస్ట్ మూమెంట్ ఇది. **- హీరో ధర్మ**

ఇలాంటి అవార్డులు ఇచ్చినప్పుడు సరికొత్త కథలు రావడానికి ప్రోత్సాహకంగా ఉంటుంది. దర్శకుడిగా నాకిది ('అంబాజీపేట మ్యారేజీ బ్యాండు') తొలి సినిమా అయినప్పటికీ చాన్స్ ఇచ్చిన గీతా ఆర్ట్స్ లాంటి పెద్ద బ్యానర్‌కి థ్యాంక్స్.

- డైరెక్టర్ దుష్యంత్

ఈ అవార్డు ఇచ్చినందుకు 'సాక్షి'కి థ్యాంక్స్. 'అంబాజీపేట మ్యారేజీ బ్యాండు'ని ఆదరించిన ప్రేక్షకులకూ మరోసారి ధన్యవాదాలు.

- నిర్మాత ధీరజ్ మొగిలినేని

మా సినిమాకి అవార్డు ఇచ్చినందుకు 'సాక్షి'కి, భారతీ మేడమ్‌కి ధన్యవాదాలు. **- హీరో సుహాస్**

మా దర్శక-నిర్మాతలకు, గీతా ఆర్ట్స్‌కి, 'అంబాజీపేట మ్యారేజీ బ్యాండు'ని సపోర్ట్ చేసిన ఆడియన్స్‌కి థ్యాంక్స్ **- హీరోయిన్ ఎన్. శివాని**


● అవార్డు అందుకుంటున్న రష్మిక


● అవార్డు అందుకుంటున్న వై. రవిశంకర్


● అవార్డు అందుకుంటున్న మీనాక్షీ చౌదరి


● అవార్డు అందుకుంటున్న తేజ సజ్జా


● అవార్డు అందుకుంటున్న కిరణ్ అబ్బవరం


● అవార్డు అందుకుంటున్న ధర్మ


● అవార్డు అందుకుంటున్న 'అంబాజీపేట...' టీమ్


● అవార్డు అందుకుంటున్న యదు వంశీ


● అవార్డు అందుకున్న సందీప్-సుజీత్

చాంపియన్ నువ్వా.. నేనా



నేడు చాంపియన్స్ ట్రోఫీ ఫైనల్

భారత్‌తో న్యూజిలాండ్ ఢీ	జోరు మీదున్న ఇరు జట్లు	మ.గం.2:30నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లలో ప్రత్యక్ష ప్రసారం

పుష్కర కాలం క్రితం భారత జట్టు ఐదు మ్యాచ్‌లలో వరుసగా విజయాలు సాధించి అజేయంగా చాంపియన్స్ ట్రోఫీ టైటిల్‌ను సొంతం చేసుకుంది. నాటి జట్టులో ఆడిన రోహిత్, కోహ్లి, జడేజా ప్రస్తుత టీమ్‌లోనూ భాగంగా ఉన్నారు. ఇప్పుడు కూడా టీమిండియా దాదాపు అదే తరహా ఫామ్‌తో ప్రత్యర్థులపై పైచేయి సాధిస్తూ వచ్చింది. మరో మ్యాచ్‌లో ఇదే జోరు కొనసాగిస్తే ఏడాది వ్యవధిలో రెండో ఐసీసీ టైటిల్ భారత్ ఖాతాలో చేరుతుంది.

భారత్ మూడో చాంపియన్స్ ట్రోఫీ టైటిల్ వేటలో ఇప్పుడు న్యూజిలాండ్ అడ్డుగా ఉంది. లీగ్ స్థాయిల్లో ఎలా ఆడినా మన టీమ్‌పై ఐసీసీ నాకౌట్ మ్యాచ్‌లలో కివీస్‌దే పైచేయిగా ఉంది. పట్టుదలతో చివరి వరకు పోరాడటం, అంచనాలకు మించి రాణించడంలో ఆ జట్టుకు ఎంతో పేరుంది. వారం రోజుల క్రితం భారత్ చేతిలో ఓడినా ఆ మ్యాచ్‌తో దీనికి పోలిక లేదు. ఆ మ్యాచ్ పరాజయం నుంచి పాఠాలు నేర్చుకుంటూ అసలు పోరులో సత్తా చాటగలదు.

గెలుపోటములతో పాటు మరో కీలకాంశం ఈ మ్యాచ్‌కు సంబంధించి చర్చకు వస్తోంది. సుదీర్ఘ కాలంగా భారత జట్టు మూల స్తంభాలుగా అద్భుత విజయాలు అందించిన రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి ఈమ్యాచ్‌తో తమ వన్డే కెరీర్‌ను ముగిస్తారా...టి20 వరల్డ్ కప్ తరహాలో ఘనంగా ఆటను ముగిస్తారా అనేది చూడాలి. మరో వైపు కివీస్ కూడా తమ స్టార్ విలియమ్సన్‌కు ఒక్క ఐసీసీ వన్డే టోర్నీతోనైనా వీడ్కోలు పలకాలని పట్టుదలగా ఉంది.

దుబాయ్: చాంపియన్స్ ట్రోఫీలో పలు ఆసక్తికర సమరాల తర్వాత అసలైన ఆఖరి పోరుకు రంగం సిద్ధమైంది. టోర్నీలో ఆద్యంతం ఆధిపత్యం కనబర్చిన టీమిండియా ఒక వైపు... నిలకడగా రాణించిన కివీస్ మరో వైపు తుది సమరం కోసం రంగంలో నిలిచాయి. ప్రపంచ క్రికెట్ అభిమానులంతా ఎదురు చూస్తున్న ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ ఫైనల్ మ్యాచ్‌లో నేడు న్యూజిలాండ్‌తో భారత్ తలపడుతుంది. 2017లో చివరిసారిగా జరిగిన ఈ టోర్నీలో రన్నరప్‌గా నిలిచిన భారత్ అంతకు ముందు రెండు సార్లు టైటిల్ సాధించింది. 2000లో చాంపియన్స్ ట్రోఫీని గెలిచిన కివీస్ ఖాతాలో వన్డేల్లో ఏకైక ఐసీసీ టోర్నీ ఉంది. భారత్ తమ బలమైన బ్యాటింగ్‌తో పాటు స్పిన్‌పై ఆధారపడుతుండగా...పరిస్థితులకు తగినట్లు స్పందించే తమ ఆల్‌రౌండ్ నైపుణ్యాన్ని కివీస్ నమ్ముకుంది. చివరకు ఎవరిది పైచేయి అవుతుందో ఆసక్తికరం.

మార్పుల్లేకుండా...

టోర్నీలో భారత్ ప్రదర్శన చూస్తే తుది జట్టులో ఎలాంటి మార్పులకు అవకాశమే లేదు. ఆటగాళ్లంతా చక్కటి ఫామ్‌లో ఉన్నారు. ఓపెనర్‌గా గిల్ కీలకం కానుండగా... మిడిలార్డర్‌లో అయ్యర్, రాహుల్ జట్టు భారం మోస్తారు. రాహుల్ బ్యాటింగ్ దూకుడు సెమీఫైనల్లో కనిపించింది కాబట్టి అతని ఫామ్‌పై కూడా ఆందోళన పోయింది. వన్డే వరల్డ్ కప్ సెమీస్‌లో కివీస్‌పై సెంచరీ చేసినప్పటినుంచి ఆ జట్టుపై అయ్యర్ మన బెస్ట్ బ్యాటర్. వరుసగా అన్ని మ్యాచ్‌లలో అతను చెలరేగిపోయాడు. స్టార్ బ్యాటర్ కోహ్లి గురించి కొత్తగా చెప్పాల్సిన అవసరం లేదు. ఈ టోర్నీలో కోహ్లి నాలుగు ఇన్నింగ్స్‌లలో కలిపి 217 పరుగులు సాధించాడు. అతని స్థాయి ఇన్నింగ్స్ మరొకటి వస్తే చాలు భారత్‌కు తిరుగుండదు. అన్ని ఫార్మాట్‌లలో కలిపి తాను ఆడిన ఐసీసీ టోర్నీ ఫైనల్స్‌లో 10 ఇన్నింగ్స్‌లలో కోహ్లి 3 అర్ధసెంచరీలు చేశాడు. దీనిని మరింత మెరుగుపర్చుకునే అవకాశం అతని ముందుంది. అయితే ఇప్పుడు భారత జట్టుకు సంబంధించి రోహిత్ బ్యాటింగే కాస్త ఆందోళన కలిగిస్తోంది. ఈ టోర్నీలో ఆడిన అన్ని మ్యాచ్‌లలో అతను విఫలమయ్యాడు. దూకుడుగా 20-30 పరుగులు చేసి పవర్‌ప్లేలోనే నిష్క్రమిస్తుండటం జట్టుకు ఇబ్బందిగా మారుతోంది. దీనిని అధిగమించి రోహిత్ భారీ స్కోరు చేయాలని అభిమానులు ఆశిస్తున్నారు. 10 ఐసీసీ టోర్నీ ఫైనల్ ఇన్నింగ్స్‌లలో రోహిత్ ఒక్క అర్ధ సెంచరీ కూడా చేయలేదు! ఇప్పుడు తన స్థాయిని చూపించేందుకు ఇది సరైన వేదిక. మరో వైపు భారత స్పిన్నర్లు ప్రత్యర్థిపై చెలరేగిపోయేందుకు సిద్ధంగా ఉన్నారు. లీగ్ దశలో ఐదు వికెట్లతో కివీస్‌ను దెబ్బ తీసిన వరుణ్ చక్రవర్తి జట్టు ప్రధానాస్త్రం కాగా, లెఫ్టార్మ్ మణికట్టు బౌలర్ కుల్దీప్ యాదవ్ కూడా ప్రత్యర్థిపై ఆధిపత్యం ప్రదర్శించగలడు. జడేజా, అక్షర్ కూడా రాణిస్తే కివీస్‌కు కష్టాలు ఖాయం. మన నలుగురు స్పిన్నర్లు కలిపి టోర్నీలో 21 వికెట్లు తీశారు. పేస్‌తో షమీ ఆకట్టుకోగా, పాండ్యా కూడా అండగా నిలుస్తున్నాడు.

హెన్రీ ఆడతాడా!

లీగ్ దశలో భారత్ చేతిలో ఓడినా న్యూజిలాండ్‌పై ఆ మ్యాచ్ ఫలితం పెద్దగా పడలేదు. ఆ మ్యాచ్‌లో జరిగిన లోపాలను సవరించుకొని బరిలోకి దిగుతున్నామని టీమ్ మేనేజ్‌మెంట్ ఆత్మవిశ్వాసం ప్రదర్శిస్తోంది. టీమ్ బ్యాటింగ్ విషయంలో కివీస్ బలంగా కనిపిస్తోంది. రచిన్ రవీంద్ర సెంచరీలతో చెలరేగిపోతుండగా... విలియమ్సన్ కూడా అదే స్థాయి ఆటను ప్రదర్శించాడు. ఐదు ఐసీసీ టోర్నీ ఫైనల్స్ ఇన్నింగ్స్ ఆడిన విలియమ్సన్ ఒకే ఒక అర్ధ సెంచరీ చేసినా... అతను ఈ టోర్నీలో రాణిస్తున్న తీరు జట్టుకు అదనపు బలంగా మారింది. యంగ్, మిచెల్ కూడా ఆకట్టుకోగా... ఫిలిప్స్ తన ఫీల్డింగ్‌తో హైలైట్‌గా నిలిచాడు. ధాటిగా ఆడగల సత్తా ఉన్న ఫిలిప్స్ కూడా చెలరేగితే కివీస్ కూడా భారీ స్కోరు సాధించగలదు. జట్టు స్పిన్ కూడా మెరుగ్గానే ఉంది. కెప్టెన్ సాంట్నర్, బ్రేస్‌వెల్‌లతో పాటు ఫిలిప్స్ కూడా బంతిని బాగా టర్న్ చేయగల సమర్థుడు. పేసర్లు జేమీసన్, రూర్కేలు కీలకం కానుండగా అసలు మ్యాచ్‌కు ముందు హెన్రీ గాయం ఆందోళన రేపుతోంది. భారత్‌తో మ్యాచ్‌లో ఐదు వికెట్లు తీసిన హెన్రీ జట్టు ప్రధానాయుధం. అతను కోలుకొని బరిలోకి దిగితే కివీస్‌కు ఊరట.

పిచ్, వాతావరణం

ఫైనల్‌కు కూడా నెమ్మదైన పిచ్ అందుబాటులో ఉంది. ఆట సాగుతున్న కొద్దీ స్పిన్నర్ల ప్రభావం పెరుగుతుంది. టాస్ గెలిచిన జట్టు బ్యాటింగ్ ఎంచుకోవడం ఖాయం. వర్ష సూచన లేదు.

తుది జట్ల వివరాలు (అంచనా)

భారత్: రోహిత్ (కెప్టెన్), గిల్, కోహ్లి, అయ్యర్, రాహుల్, పాండ్యా, జడేజా, అక్షర్, షమీ, కుల్దీప్, వరుణ్.

న్యూజిలాండ్: సాంట్నర్ (కెప్టెన్), యంగ్, రచిన్, విలియమ్సన్, మిచెల్, లాథమ్, ఫిలిప్స్, బ్రేస్‌వెల్, జేమీసన్, రూర్కే, హెన్రీ/ డఫీ.

వన్డే టోర్నీ గెలిపిస్తాడా!

భారత కెప్టెన్‌గా రోహిత్ శర్మ జట్టును నాలుగు ఐసీసీ ఈవెంట్లలోనూ ఫైనల్ చేర్చాడు. వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్, వన్డే వరల్డ్ కప్, టి20 వరల్డ్ కప్, ఇప్పుడు చాంపియన్స్ ట్రోఫీలో టీమిండియా ఆఖరి పోరుకు అర్హత సాధించింది. ఇందులో రెండు ఫైనల్స్‌లో పరాజయం పాలైన జట్టు టి20ల్లో విశ్వ విజేతగా నిలిచింది. ఇప్పుడు ధోని తర్వాత రెండు ఐసీసీ టైటిల్స్ సాధించిన భారత సారథిగా నిలిచేందుకు అతను అడుగు దూరంలో ఉన్నాడు. దీనిని అతను అందుకుంటాడా అనేది నేడు జరిగే ఫైనల్ పోరులో తేలుతుంది. 2013లో చాంపియన్స్ ట్రోఫీలో ఓపెనర్‌గా బరిలోకి దిగిన రోహిత్ తన బ్యాటింగ్‌తో జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు.

ఆఖరి మ్యాచా!

కోహ్లి, రోహిత్‌ల భవిష్యత్తు ఈ మ్యాచ్‌తో తేలుతుందని అంతటా చర్చ వినిపిస్తోంది. 2027 వన్డే వరల్డ్ కప్ సన్నాహకాల్లో భాగంగా జట్టును సిద్ధం చేసేందుకు వీరు తప్పుకుంటారని అనుకుంటున్నా దీనిపై ఇప్పుడు స్పష్టత రాకపోవచ్చు. నిజానికి వీరి స్థాయి, ఆటను బట్టి చూస్తే ఇప్పటికిప్పుడు తప్పుకోవాల్సిన అవసరం లేదు. ముఖ్యంగా కోహ్లి అయితే చెలరేగిపోతున్నాడు. అతని ఫిట్‌నెస్‌కు కూడా ఢోకా లేదు. అయితే స్టీవ్ స్మిత్ తరహాలోనే తానే స్వయంగా దూరమవుతాడా అనేది చెప్పలేం. మరో వైపు రోహిత్‌పైనే అందరి దృష్టి ఉంది. ఇప్పటికి టి20లనుంచి తప్పుకున్న రోహిత్ సిడ్నీ టెస్టుకు దూరమైన దానిపై కూడా సందేహాలు రేపాడు. ఇక మిగిలిన ఫార్మాట్ వన్డేలు మాత్రమే. అయితే నిజంగా కొనసాగే ఆలోచన లేకపోయినా ఈ మ్యాచ్ ముగియగానే అధికారికంగా రిటైర్మెంట్‌పై ఎలాంటి ప్రకటన రాకపోవచ్చని వినిపిస్తోంది.

భారీగా బెట్టింగ్‌లు...

ఫైనల్‌పై జోరుగా బెట్టింగ్ సాగుతోంది. ఈ మొత్తం సుమారు రూ.5 వేల కోట్ల వరకు ఉండవచ్చని తెలుస్తోంది. దీని వెనక పెద్ద మాఫియా సామ్రాజ్యం కూడా ఉన్నట్లు పోలీసులు చెబుతున్నారు. ఆసీస్‌తో సెమీస్ మ్యాచ్‌పై పెద్ద స్థాయిలో బెట్టింగ్‌లు చేసిన ఐదుగురిని పోలీసులు అరెస్టు చేశారు.

2000 భారత్, న్యూజిలాండ్ మధ్యే 2000 ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ ఫైనల్ జరిగింది. ఈ మ్యాచ్‌లో కివీస్ 4 వికెట్ల తేడాతో నెగ్గి టైటిల్ సొంతం చేసుకుంది.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

రౌండప్



ఆలయ మాడవీధుల్లో స్వర్ణ రథోత్సవం

'స్వర్ణరథం'పై ఆది దంపతులు

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని శనివారం శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామి వార్లకు స్వర్ణ రథోత్సవం నిర్వహించారు. వేకువజామున స్వామివారికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అన్నాభిషేకం, విశేషపూజలు అర్చకస్వాములు జరిపించారు. ఉదయం 7.30గంటలకు మొదలైన స్వర్ణ రథోత్సవం గంగాధర మండపం వరకు కొనసాగింది. రథోత్సవంలో శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు, అర్చకస్వాములు, వేదపండితులు పాల్గొన్నారు.

ఫుడ్ ప్రాసెసింగ్.. 6 రెట్లు

మనదేశ ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమ విలువ వచ్చే 20 ఏళ్లలో దాదాపు 6 రెట్లు పెరగనుంది. 2023-24లో మనదేశంలో ఉత్పత్తి అయిన మొత్తం ఆహార ధాన్యాలు 3,289 లక్షల టన్నులు. ఎగుమతి అయిన వ్యవసాయ ఉత్పత్తుల విలువ 48.2 లక్షల టన్నులు 2030 నాటికి వ్యవసాయం, ఆహార ఉత్పత్తుల ఎగుమతుల విలువ 125 బిలియన్ డాలర్లకు, 2035 నాటికి 250 బిలియన్ డాలర్లకు పెరుగుతుంది.

సంవత్సరం	ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమ (బిలియన్ డాలర్లలో)
2023	307
2030	700
2035	1100
2040	1500
2045	1900

ఆధారం: పీహెచ్‌డీ చాంబర్ ఆఫ్ కామర్స్, ఇండస్ట్రీ




పెనుగొండ లక్ష్మీనారాయణకు అవార్డు అందిస్తున్న మాధవ్ కౌశిక్

'పెనుగొండ'కు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు ప్రదానం

మరో 21 మందికి కూడా..

సాక్షి, న్యూఢిల్లీ: ప్రముఖ తెలుగు రచయిత, న్యాయవాది పెనుగొండ లక్ష్మీనారాయణ కేంద్ర సాహిత్య అకాడమీ–2024 అవార్డు అందుకున్నారు. ఆయన రాసిన 'దీపిక' అభ్యుదయ వ్యాస సంపుటిని ఈ పురస్కారం వరించింది. సాహిత్య అకాడమీలోని కమానీ ఆడిటోరియంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో 'పెనుగొండ'తో పాటు.. 21 భాషలకు చెందిన రచయితలకు అధ్యక్షుడు మాధవ్ కౌశిక్ పురస్కారాలను ప్రదానం చేశారు. అవార్డు కింద రూ.లక్ష, రజత పతకం అందజేసి శాలువాతో సత్కరించారు. కాగా.. లక్ష్మీ నారాయణ గుంటూరులో న్యాయవాదిగా పనిచేస్తున్నారు. దాదాపు 46 ఏళ్లుగా ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘంలో వివిధ హోదాల్లో పనిచేస్తున్నారు. ప్రస్తుతం ఆయన అఖిల భారత అభ్యుదయ రచయితల సంఘం జాతీయ అధ్యక్షునిగా కొనసాగుతున్నారు.

దేశంలోనే తొలి ఐకానిక్ కేబుల్ బ్రిడ్జికి ఓకే!



సోమశిల వారధిని నేషనల్ హైవేస్-ఒరిజినల్ జాబితాలో చేర్చిన కేంద్రం

- గతంలో 'భారత్‌మాల'లో రద్దయి తాజా నిర్ణయంతో ఊపిరిపోసుకున్న ప్రాజెక్టు
- తెలంగాణలోని మల్లేశ్వరం-ఏపీలోని సంగమేశ్వరంతో నేరుగా అనుసంధానం
- తెలంగాణ-తిరుపతి మధ్య కొల్లాపూర్ మీదుగా తగ్గనున్న 90 కి.మీ. దూరం

సాక్షి, హైదరాబాద్: కృష్ణా నదిపై సోమశిల వద్ద ప్రతిపాదిత రెండు వరుసల కేబుల్ సస్పెన్షన్ బ్రిడ్జి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం ఎట్టకేలకు ఆమోదం తెలిపింది. మూడేళ్ల క్రితమే దీన్ని చేపట్టాల్సి ఉండగా దాదాపు రూ. వెయ్యి కోట్లకుపైగా వ్యయం చేయాల్సి రావడంతో నీతిఆయోగ్ అప్పట్లో అభ్యంతరం వ్యక్తం చేసింది. దీంతో కొంత జాప్యం జరగడంతోపాటు ఈలోగా అంచనా వ్యయం కూడా పెరిగింది. ఫలితంగా భారత్‌మాల పరియోజన జాబితాలో ఉండి అనుమతి లభించని ప్రాజెక్టులను కేంద్రం రద్దు చేసింది. ఈ ప్రాజెక్టు కూడా అదే జాబితాలో ఉండటంతో దీని కథ కూడా కంచికి చేరింది. ఇంతకాలానికి దాన్ని నేషనల్ హైవేస్ ఒరిజినల్ (ఎన్‌హెచ్-ఓ) జాబితాలోకి మార్చడంతో ప్రాజెక్టు మళ్లీ తెరపైకి వచ్చింది. గతంలో పిలిచిన టెండర్లను కొనసాగిస్తూ మార్చి 17 వరకు జాతీయ రహదారుల విభాగం కొత్త తేదీని ప్రకటించింది. త్వరలోనే నిర్మాణ సంస్థను గుర్తించి పనులు చేపట్టేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. దేశంలోనే ఇప్పటివరకు లేని తరహాలో కొత్త డిజైన్‌తో ఈ కేబుల్ వంతెన రూపుదిద్దుకోనుంది. కృష్ణా నదికి ఈవల తెలంగాణలోని మల్లేశ్వరం నుంచి నదికి ఆవల ఏపీలోని సంగమేశ్వరం పుణ్యక్షేత్రాలను జోడించడం ద్వారా తెలంగాణ-ఏపీ మధ్య మరో అనుసంధానం ఏర్పడనుంది. తెలంగాణ-తిరుపతి మధ్య దూరం దాదాపు 90 కి.మీ. మేర తగ్గేలా కొత్తదారి ఏర్పడుతుంది.

800 మీటర్లు నిడివి | అంచనా వ్యయం రూ. **1,062** కోట్లు

దేశంలో తొలి నమూనా..

దేశంలో రెండు వరుసల వంతెనలు అరుదు. అందులోనూ కేబుల్ కమ్ సస్పెన్షన్ వంతెనతో పర్యాటకులు అక్కడి ప్రకృతి అందాలను వీక్షించేందుకు గాజుతో కూడిన నడకదారి డిజైన్‌తో అనుసంధానించడం ఇప్పటివరకు ఎక్కడా లేదు. తొలిసారి సోమశిల వద్ద ఇది రూపుదిద్దుకోనుంది.

ఎందుకు ప్రతిపాదించారంటే..

తెలంగాణ నుంచి ప్రస్తుతం నంద్యాల, తిరుపతికి వెళ్లాలంటే కర్నూలు మీదుగా చుట్టూ తిరిగి వెళ్లక తప్పని పరిస్థితి నెలకొంది. అదే కొల్లాపూర్ మీదుగా కృష్ణా నదిని దాటేలా దారిని ఏర్పాటు చేస్తే తిరుపతి దూరాభారం దాదాపు 90 కి.మీ. మేర తగ్గనుంది.

నడుస్తూ.. గాజు ప్యానెల్ నుంచి చూస్తూ..

కృష్ణా తీరంలోని సోమశిల ప్రకృతి రమణీయతకు నిలయం. అక్కడికి వచ్చే పర్యాటకులను మరింత ఆకట్టుకునేలా, ప్రకృతి సోయగాన్ని చూస్తూ గాజు డెక్ నుంచి కృష్ణా హొయలను ఆస్వాదిస్తూ వారు వంతెన దాటేలా ప్రత్యేక డిజైన్‌ను సిద్ధం చేశారు. వంతెనకు ఇరువైపులా రెండు భారీ పైలాన్‌లుంటాయి. వాటి మధ్య 460 మీటర్ల దూరం ఉంటుంది. ఒక్కో పైలాన్‌కు రెండు వైపులా 15+15 చొప్పున 30 జతల భారీ కేబుల్స్ ఏర్పాటు చేసి వాటి ఆసరాతో వంతెన నిలిచేలా నిర్మిస్తారు. దీనికి పైభాగంలో నాలుగు వరుసల రోడ్డు ఉంటుంది. దాని మీదుగా వాహనాలు నదిని దాటుతాయి. దిగువన రెండో వరుసలో పర్యాటకులు నడుచుకుంటూ వెళ్లేలా గాజు ప్యానెల్స్‌తో కూడిన డెక్ ఉంటుంది.

60 మందిని బలితీసుకున్న ప్రమాదంతో ప్రతిపాదన..

కర్నూలు సమీపంలోని పలు గ్రామాలకు చెందిన భక్తులు 2007 జనవరిలో కొల్లాపూర్ సమీపంలోని సింగోటం లక్ష్మీనర్సింహస్వామి ఆలయ జాతరకు వస్తుండగా పడవ బోల్తాపడింది. ప్రమాద సమయంలో పడవలో 72 మంది ఉండగా వారిలో 60 మంది మృతిచెందారు. ఈ దుర్ఘటనకు చలించిన నాటి ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్.రాజశేఖర రెడ్డి అక్కడ వంతెన నిర్మాణానికి నిర్ణయించి నిధులు మంజూరు చేశారు. కానీ ఆయన మరణంతో ఆ ప్రతిపాదన ఆగిపోయింది. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం తర్వాత అప్పటి ప్రభుత్వం వంతెన నిర్మాణానికి సిద్ధమైనా నాటి ఏపీ ప్రభుత్వం ఆసక్తి చూపలేదు. చివరకు తెలంగాణ ప్రభుత్వం విషయాన్ని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ దృష్టికి తీసుకెళ్లి జాతీయ రహదారిగా దాన్ని చేపట్టాలని కోరగా ఆయన అంగీకరించారు.

ఒకే రోజు రూ. 911 కోట్ల పరిహారం పంపిణీ

జాతీయ లోక్ అదాలత్‌లో రాష్ట్రం రికార్డు



శనివారం జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా కక్షిదారులకు పరిహారం చెక్కును అందిస్తున్న ఏసీజే జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ కె.లక్ష్మణ్ తదితరులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌కు కక్షిదారుల నుంచి భారీ స్పందన వచ్చింది. ఒకేరోజు 14,18,637 కేసులను పరిష్కరించారు. వీటిలో ప్రీలిటిగేషన్ కేసులు 7,03,847, వివిధ కేటగిరీల్లోని పెండింగ్ కేసులు 7,14,790 ఉన్నాయి. లబ్ధిదారులకు రూ.911 కోట్ల రికార్డు స్థాయి పరిహారం చెల్లింపులకు ఉత్తర్వులు జారీచేశారు. హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్ మార్గదర్శకాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించారు. హైకోర్టులో లోక్ అదాలత్‌ను జస్టిస్ అభినంద్‌కుమార్ షావిలీ పర్యవేక్షించారు. వరంగల్, హనుమకొండ లోక్‌అదాలత్‌ను జస్టిస్ మౌషుమి భట్టాచార్య (వర్చువల్), జస్టిస్ కె.లక్ష్మణ్ (ఫిజికల్) సమక్షంలో ఏసీజే ప్రారంభించారు. అనంతరం జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ కె.లక్ష్మణ్ కక్షిదారులకు పరిహారం చెక్కులను పంపిణీ చేశారు. ఈ మేరకు కేసుల పరిష్కార వివరాలను సాయంత్రం రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ సభ్య కార్యదర్శి సీహెచ్ పంచాక్షరి మీడియాకు విడుదల చేశారు. రాష్ట్రంలో ఏర్పాటు చేసిన లోక్ అదాలత్ బెంచ్‌ల ద్వారా కేసులను పరిష్కరించుకుని సత్వర న్యాయం పొందిన కక్షిదారులకు అభినందనలు తెలిపారు.

మధ్యవర్తిత్వంతోనే వైరుధ్యాల పరిష్కారం

హనుమకొండ అర్బన్: సామాజిక వర్గ మధ్యవర్తిత్వం ద్వారా సమూహాల మధ్య ఏర్పడిన విభేదాలు, వైరుధ్యాలు ప్రారంభ దశలోనే పరిష్కరించుకోవచ్చని హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్ హనుమకొండలో అన్నారు. చిన్న చిన్న తగాదాలకు ప్రస్తుత రోజుల్లో కోర్టులు, పోలీస్ స్టేషన్లు ఆశ్రయించాల్సి రావడం దురదృష్టకరమన్నారు. ప్రస్తుతం ప్రారంభిస్తున్న సామాజిక మధ్యవర్తిత్వ కేంద్రంలో ఉండే కులపెద్దలు న్యాయపరమైన శిక్షణ పొందిన వారై ఉంటారు కాబట్టి ఇరు పక్షాలకు పరస్పర ఆమోదయోగ్య రీతిలో వివాదాలు పరిష్కరించే అవకాశం ఉంటుందని తెలిపారు.



అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండల కేంద్రంలో.. పని ప్రదేశం వద్ద కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకొంటున్న ఉపాధి హామీ కూలీలు

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

చెదల కాటు.. చెట్లకు చేటు



'ఇసంత రమ్మంటే ఇల్లంతా నాదే'అన్నట్లు చెద చెట్టంతా చుట్టేస్తోంది. మొదలు నుంచి కొమ్మల దాకా పాకుతోంది. పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం కన్నాల వెళ్లే దారిలో హరితహారంలో నాటిన మొక్కలు ఇలా చెదలతో కనిపించాయి.

- సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి





చెట్టంతా పాకుతున్న చెదలు

రాజస్తాన్‌లో సింగరేణి పాగా

3,100 మెగావాట్ల విద్యుదుత్పత్తికి ఒప్పందం

- **మరో 1,600 మెగావాట్ల థర్మల్, 1,500 మెగావాట్ల సౌర విద్యుత్‌కు అవకాశం**
- సింగరేణికి 74 శాతం, రాజస్తాన్‌కు 26 శాతం వాటాలు
- విద్యుదుత్పత్తి, వ్యాపార విస్తరణే లక్ష్యంగా..
- ఇప్పటికే ఒడిశాలోని నైనీబ్లాక్‌లో బొగ్గు ఉత్పత్తికి ఒప్పందం



సింగరేణి సంస్థ థర్మల్ ప్లాంట్

గోదావరిఖని:

విద్యుదుత్పత్తి.. వ్యాపార విస్తరణ కోసం సింగరేణి కీలక ఒప్పందాలు కుదుర్చుకుంటోంది. బొగ్గు ఉత్పత్తితోపాటు విద్యుత్ రంగంలో ముందుకు సాగుతోంది. 3,100 మెగావాట్ల విద్యుదుత్పత్తి కోసం రాజస్తాన్ రాష్ట్రంతో ఒప్పందం చేసుకుంది. ఇప్పటికే ఒడిశా రాష్ట్రంలోని నైనీబ్లాక్‌లో బొగ్గు ఉత్పత్తికి నడుం బిగించింది. తాజాగా రాజస్తాన్‌లో విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు ఒప్పందం చేసుకుంది. సింగరేణి ప్రస్తుతం 1,200 మెగావాట్ల థర్మల్, 245.5 మెగావాట్ల సౌర విద్యుదుత్పత్తి చేస్తోంది. తాజా ఒప్పందంతో మరో 1,600 మెగావాట్ల థర్మల్, 1,500 మెగావాట్ల సౌర విద్యుత్ అందుబాటులోకి వస్తుంది.

మరో మైలురాయి

పెరుగుతున్న దేశ విద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని వ్యాపార విస్తరణపై సింగరేణి దృష్టి పెట్టింది. రాజస్తాన్ విద్యుత్ సంస్థతో కలిసి సింగరేణి 74 శాతం, రాజస్తాన్ 26 శాతం పెట్టుబడితో ఒప్పందం చేసుకుంది. లాభాల్లో కూడా ఇవే వాటాలు ఉంటాయి. 136 ఏళ్ల సింగరేణి చరిత్రలో వ్యాపార విస్తరణకు ఇది ఎంతో దోహదం చేస్తుంది. తెలంగాణ రాష్ట్రం అపార బొగ్గు నిల్వలతో థర్మల్ విద్యుత్‌కు కేంద్రంగా నిలిచింది. ఒప్పందం ప్రకారం 1,600 మెగావాట్ల థర్మల్ విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుతోపాటు 1,500 మెగావాట్ల సౌర విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేస్తారు. పెట్టుబడిలో సింగరేణి 74 శాతం, రాజస్తాన్ విద్యుత్ ఉత్పాదన్ నిగం లిమిటెడ్ 26 శాతం వాటాను చెల్లించనున్నాయి. రాజస్తాన్ ప్రభుత్వం తన వాటా కింద చెల్లించాల్సిన 26 శాతం సొమ్మును సౌర, థర్మల్ విద్యుత్ ప్లాంట్లకు అవసరమైన స్థలాలు, మౌలిక సదుపాయాల రూపంలో అందించనుంది. సింగరేణి తన వాటాగా అంగీకరించిన 74 శాతాన్ని ధన రూపంలో చెల్లించనుంది. ప్లాంట్లు ఏర్పాటు చేసేందుకు అవసరమైన స్థలాన్ని అన్ని రకాల అనుమతులతో సింగరేణికి ఆ రాష్ట్ర ప్రభుత్వం అప్పగించనుంది. ఈ ప్లాంట్ల ద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్తు కొనుగోలుకు డిస్కంలతో ఒప్పందాలు (పీపీఏ) తదితర అంశాలను రాజస్తాన్ ప్రభుత్వ విద్యుత్ శాఖ ద్వారా చేపట్టేలా అంగీకరించారు.

మారిపోనున్న సింగరేణి ముఖచిత్రం

సింగరేణి ఇప్పటివరకు కేవలం తెలంగాణ రాష్ట్రం వరకే పరిమితమై తన బొగ్గు ఉత్పత్తి, థర్మల్, సౌర విద్యుత్ రంగాల్లో అడుగుపెట్టి విద్యుదుత్పత్తి చేస్తోంది. ప్రస్తుతం 1,200 మెగావాట్ల థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని మంచిర్యాల జిల్లా జైపూర్ వద్ద ఏర్పాటు చేయగా.. అదే ప్రదేశంలో మరో 800 మెగావాట్ల థర్మల్ ప్లాంట్ ఏర్పాటు పనులు త్వరలోనే ప్రారంభం కానున్నాయి. ప్రస్తుతం 245.5 మెగావాట్ల సౌర విద్యుదుత్పత్తి చేస్తున్న సింగరేణి.. 2026 నాటికి 450 మెగావాట్లకు పైగా సౌర విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేసి బొగ్గు సంస్థల్లో నెట్ జీరో కంపెనీగా నిలవాలని ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతోంది. వ్యాపార విస్తరణలో భాగంగా.. ఒడిశా రాష్ట్రంలోని నైనీ వద్ద ఏటా కోటి టన్నుల బొగ్గు ఉత్పత్తి చేసే ప్రాజెక్టును చేపట్టింది. ఇది మరో 30 రోజుల్లో బొగ్గు ఉత్పత్తిని ప్రారంభించనుంది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సూచన మేరకు ఇదే ప్రాంతంలో 1,600 మెగావాట్ల థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కూడా నిర్ణయించింది. ఈ మేరకు ఆ రాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదింపులు కొనసాగుతున్నాయి.

200 ఏళ్ల భవిష్యత్ దిశగా..



సింగరేణి సంస్థకు మరో 200 ఏళ్ల భవిష్యత్ దిశగా దీర్ఘకాలిక ప్రణాళికలతో ముందుకు వెళ్తున్నాం. 2070 నాటి జీరోనెట్ దిశగా ప్రపంచం ప్రణాళికలు రచిస్తోంది. ఈ క్రమంలో ఇతర వ్యాపారాలపై దృష్టి సారిస్తున్నాం. రాబోయే రోజుల్లో బొగ్గు బ్లాకులు, థర్మల్ విద్యుదుత్పత్తి కనుమరుగయ్యే అవకాశాలున్నాయి. ఈ క్రమంలో కొత్తవ్యాపారాల దిశగా సంస్థ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. రాబోయే రోజుల్లో గ్రీన్ ఎనర్జీ లక్ష్యంగా ముందుకు సాగుతాం.

– ఎన్.బలరాం, సీఎండీ, సింగరేణి



మహిళా దినోత్సవం అయినా తమ పని తమదే అన్నట్లుగా చెత్త తరలింపులో నిమగ్నమైన ఓ మహిళ. శనివారం మాసాబ్‌ట్యాంకు వద్ద ఈ దృశ్యం కనిపించింది





హైదరాబాద్‌లో ఎండలు పెరగడంతో ఆ వేడి నుంచి తమను రక్షించుకోవడానికి యువత ఇలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు



చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీ భవనాల నిర్మాణానికి శంకుస్థాపన చేసిన సందర్భంగా ఐలమ్మ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి



కార్యక్రమానికి హాజరైన విద్యార్థినులు

● తీగలు కావవి.. ఉరితాళ్లు



విద్యుత్ స్తంభాలను దట్టంగా అల్లుకున్న తీగలతో ప్రమాదం పొంచి ఉంది. రాత్రి, పగలు పశువులు, వాహనచోదకుల రాకపోకలు సాగే దారిలో.. అకాల వర్షాలు కురిస్తే విద్యుదాఘాతం సంభవిస్తుందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. విద్యుత్ స్తంభాలకు అల్లుకున్న ఈ తీగలు పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్ మండలం రొంపికుంట వెళ్లే దారిలో కనిపించాయి.

- సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

మావోలకు లొంగుబాటే శరణ్యమా ?

ఓవైపు అగ్రనేతల వృద్ధాప్యం.. మరోవైపు అత్యాధునిక సాంకేతికతతో భద్రతా బలగాల వేట

- ఆపరేషన్ కగార్ దెబ్బకు మావోయిస్టుల్లో అంతర్మథనం.... ఇటీవల పెరిగిన లొంగుబాట్లు
- ఇటీవల ములుగు ఎస్పీ ఎదుట లొంగిపోయిన మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు కటకం సుదర్శన్ భార్య పద్మ

సాక్షి, హైదరాబాద్: భద్రతా బలగాల భారీ వేట.. వృద్ధాప్యానికి చేరిన మావోయిస్టు అగ్ర నాయకులు.. తరుముకొస్తున్న ఆపరేషన్ కగార్ డెడ్‌లైన్...వెరసి అన్నల్లో అంతర్మథనం మొదలైందనే చర్చ జరుగుతోంది. దశాబ్దాల ఉద్యమ చరిత్ర కలిగిన మావోయిస్టులకు గత మూడేళ్లుగా కోలుకోలేని ఎదురు దెబ్బలు తగులుతూనే ఉన్నాయి. ఒక్కో ఎన్‌కౌంటర్‌లో పదుల సంఖ్యలో మావోయిస్టులు ప్రాణాలు కోల్పోతున్నారు. ఛత్తీస్‌గఢ్‌లో పూర్తి పట్టున్న ప్రాంతాలు సైతం సాయుధ పోలీసు బలగాల చేతిలోకి వెళ్లిపోతున్నాయి. దీంతో కొందరు మావోయిస్టులు లొంగుబాట పట్టారు. గత నెలన్నరరోజుల్లో తెలంగాణ పోలీసుల ఎదుట కొందరు కీలక నాయకులు లొంగిపోయిన విషయం తెలిసిందే. ఇటీవల మావోయిస్టు పార్టీ డీవీసీఎం పుల్సం పద్మ అలియాస్ ఊరే అలియాస్ గంగక్క ములుగు ఎస్పీ శబరీష్ ఎదుట లొంగిపోయారు. ఈమె దివంగత మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు కటకం సుదర్శన్ భార్య. పద్మ 27 ఏళ్ల తన అజ్ఞాత జీవితాన్ని విడిచి 52 ఏళ్ల వయసులో జనజీవన స్రవంతిలో కలిశారు. అలాగే మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు కడారి సత్యనారాయణరెడ్డి అలియాస్ కొసా ప్రొటెక్షన్ గ్రూప్ కమాండర్ వంజెం కేషా అలియాస్ జిన్ని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా ఎదుట లొంగిపోయింది. లొంగిపోయిన మావోయిస్టులకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పునరావాస పథకాలకు కొందరు ఆకర్షితులవుతున్నారు. మరోవైపు మావోయిస్టు పార్టీపై ప్రజల్లో వ్యతిరేకత రావడం, ఆరోగ్యం కూడా సహకరించకపోవడంతో కేషా లొంగిపోయిందని...ఆమె లొంగుబాటు సందర్భంగా అంబర్ కిశోర్ ఝా వెల్లడించారు. ఈ వ్యాఖ్యలు కేషాతోపాటు ఇటీవల కొందరు మావోయిస్టుల లొంగుబాట్ల వెనుకున్న పరిస్థితికి అద్దం పడుతున్నాయని పలువురు విశ్లేషిస్తున్నారు. ఇలా పలు కీలక స్థానాల్లో పనిచేసిన మావోయిస్టు సీనియర్ నాయకులు వరుస లొంగుబాట్లపై సర్వత్రా చర్చ జరుగుతోంది.

తెలంగాణలో గతేడాది 41 మంది సరెండర్

2024లో తెలంగాణ పోలీసుల ఎదుట 41 మంది మావోయిస్టులు లొంగిపోయారు. వీరిలో ఒకరు స్పెషల్ జోనల్ కమిటీ, ఒకరు స్టేట్ కమిటీ సభ్యుడు, 16 మంది ఏరియా కమిటీ సభ్యులు, మిగిలినవారు పలు కేడర్లకు చెందినవారు. 85 మంది మావోయిస్టులను తెలంగాణ పోలీసులు అరెస్టు చేశారు.

మరికొన్ని ప్రధాన లొంగుబాట్లు ఇలా...

- → ఈ ఏడాది ఫిబ్రవరి 12న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్‌రాజ్ ఎదుట ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన 19 మంది మావోయిస్టులు లొంగిపోయారు.
- → ఈ ఏడాది జనవరి 18న చర్ల పోలీస్‌స్టేషన్‌లో కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్‌రాజ్ ఎదుట ఛత్తీస్‌గఢ్‌కు చెందిన 21 మంది మావోయిస్టులు లొంగిపోయారు.
- → ఈ ఏడాది జనవరి 11న జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్‌ఖేర్ ఎదుట ఒక మావోయిస్టు లొంగిపోయాడు.
- → ఈ ఏడాది జనవరి 2న మావోయిస్టు అగ్రనేత మల్లోజుల వేణుగోపాల్ భార్య విమల చంద్ర సీదం అలియాస్ తారక్క గడ్చిరోలిలో మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ ఎదుట లొంగిపోయారు.
- → మావోయిస్టు పార్టీ నేషనల్ పార్క్ ఏరియా కమిటీ సభ్యురాలు అలువ స్వర్ణ 2024 డిసెంబర్ 25న ములుగు ఎస్పీ శబరీష్ ఎదుట లొంగిపోయారు.
- → అక్టోబర్ 2, 2024లో పెదబయలు ఏరియా కమిటీకి చెందిన 17 మంది మావోయిస్టులు పాడేరు జిల్లా ఎస్పీ అమిత్‌బర్దర్ ఎదుట లొంగిపోయారు.
- → డిసెంబర్ 10 2023న ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లాల్లో 20 మంది మావోయిస్టులు స్థానిక ఎస్పీ ఎదుట లొంగిపోయారు.
- → జనవరి 1, 2022న సుక్మా జిల్లా పోలీసుల ఎదుట 44 మంది లొంగిపోయారు.
- → జనవరి 28, 2022న విశాఖపట్నం పోలీసుల ఎదుట 60 మంది మావోయిస్టులు లొంగిపోయారు.

నాయకుల వయో'భారం'

మావోయిస్టు పార్టీకి గుండెకాయ వంటి సెంట్రల్ కమిటీ సభ్యుల్లో దాదాపు అంతా ఐదు పదుల వయసు దాటినవారే ఉన్నారు. మావోయిస్టులను ముందుండి నడిపించాల్సిన అగ్రనాయకత్వం వయోభారంతోపాటు తీవ్ర అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నట్టు సమాచారం. పైగా తెలంగాణ రాష్ట్ర కమిటీలోనూ స్థానికులకంటే ఇతర రాష్ట్రాలవారే ఎక్కువగా ఉన్నారు. వీరిలోనూ కీలక నేతలు కూడా వయసులో పెద్దవారే. వీరంతా ప్రస్తుతం సాయుధ పోలీసు బలగాల నుంచి ఎదురవుతున్న ప్రతిఘటనను సమర్థంగా ఎదుర్కోలేని పరిస్థితి. ఇలా ప్రతి అంశంలోనూ మావోయిస్టులకు ప్రతికూల పరిస్థితులు ఎదురవుతున్నాయి. దీంతో కిందిస్థాయి నాయకత్వానికి భరోసా ఇచ్చి నడిపించేవారు లేకుండాపోయారు.

బతుకు బండి



బిడ్డలు ప్రయోజకులు కావాలని ప్రతి తల్లీ కోరుకుంటుంది. అందుకోసం ఎంత కష్టమైనా భరించడానికి సిద్ధపడుతుంది. చిత్రంలో కనిపిస్తున్న మహిళ పేరు రేణకమ్మ. 15 సంవత్సరాల కిందట భర్త మరణించడంతో కొడుకుని పెంచి ప్రయోజకుడిని చేయడం కోసం అప్పటి నుంచి ఇలా హోటళ్లకు ట్రాలీ బండిపై నీళ్ల సరఫరాచేస్తూ జీవనం సాగిస్తోంది. కొడుకు విజయ్‌కుమార్‌ను ప్రస్తుతం డిప్లమో చదువుతున్నాడు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం

పక్షుల గుంపు కనువిందు



నగరాల్లో పక్షులు కనిపించడమే తక్కువైపోయిన ఈ రోజుల్లో గుంపులు గుంపులుగా ఎగురుతూ వస్తున్న ఈ రోజ్ పీటర్ పక్షులను స్థానికులు ఆసక్తిగా తిలకిస్తున్నారు. విజయవాడ మొగల్రాజపురంలోని సిద్దార్థ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో ప్రతిరోజూ సాయంత్రం పూట ఇలా ఈ పక్షులు గుంపులు గుంపులుగా కనిపిస్తాయి. ఈ సుందర దృశ్యాన్ని సాక్షి కెమెరా క్లిక్‌మనిపించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

కూలి కోసం కిలోమీటర్లు...



రెక్కాడితేకాని డొక్కాడని కూలీలు.. సొంత ఊర్లో పని దొరక్కపోతే కూలి పని కోసం ఇలా కిలోమీటర్ల దూరం వెళ్తూ ఉంటారు. పదుల సంఖ్యలో ఇలా ట్రాక్టర్లపై వెళ్లడం ప్రమాదకరం అయినప్పటికీ తప్పని పరిస్థితి. మినప కోతల కోసం గుంటూరు జిల్లా నుంచి కృష్ణా జిల్లాకు కూలీలు ట్రాక్టర్‌పై వస్తున్న దృశ్యాన్ని సాక్షి కెమెరా క్లిక్‌మనిపించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

చౌక బియ్యం బొక్కేస్తున్న అద్దంకి ముఠా

ప్రతి నెల లక్ష క్వింటాళ్ల దందాలో కీలక పాత్ర



- పర్చూరు, బాపట్ల, దర్శి, వినుకొండ, ఒంగోలులో సేకరణ
- పాలిషింగ్ చేసేందుకు ప్రత్యేకంగా ఓ రైస్ మిల్లు లీజుకు
- పచ్చనేతలకు నెలకు రూ.కోట్లలో ఆదాయం-మంత్రి పేరు చెప్పి నేరుగా బెదిరింపులు
- ప్రకాశం, బాపట్ల, పల్నాడు జిల్లాల నుంచి తరలింపు
- తొలుత కృష్ణపట్నం పోర్టుకు.. అపై దక్షిణాఫ్రికాకు చేరవేత

సాక్షి ప్రతినిధి, బాపట్ల : పేదలకు అందాల్సిన చౌక బియ్యం... పచ్చ నేతలకు కాసులు కురిపించే వ్యాపార వస్తువుగా మారిపోయింది. అన్నం ముద్దగా నిరుపేదల నోట్లోకి వెళ్లాల్సిన బియ్యం.. అధికార పార్టీ నాయకుల జేబులు నింపే అక్రమ దందాకు ఉపయోగపడుతున్నాయి. నెలకు లక్ష క్వింటాళ్లు సేకరిస్తూ.. వాటి పాలిషింగ్‌కు ఏకంగా ఓ రైస్‌మిల్లునే లీజుకు తీసుకున్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఎంత దండుకుంటున్నారో తెలుసుకోవచ్చు. అద్దంకి నియోజకవర్గానికి చెందిన రాఘవ, రాము, హనుమంతరావు, ప్రకాశం జిల్లా ఒంగోలు వాసి శ్రీనివాసరావు, పల్నాడు జిల్లా వినుకొండకు చెందిన అంజితో కూడిన ముఠా చౌక బియ్యాన్ని తరలించి పెద్దఎత్తున అక్రమార్జనకు పాల్పడుతోంది. రాఘవ బాపట్ల జిల్లా పర్చూరు, అద్దంకి, బాపట్ల, చీరాల, ప్రకాశం జిల్లా దర్శి, యర్రగొండపాలెం, సంతనూతలపాడు, కనిగిరి తదితర ప్రాంతాల నుంచి, అంజి పల్నాడు జిల్లా వినుకొండ, చిలుకలూరిపేట తదితర నియోజకవర్గాలలో డీలర్ల నుంచి నేరుగా ప్రతి నెల 1 నుంచి 15 మధ్య బియ్యాన్ని సేకరిస్తున్నారు. వీటిని పాలిషింగ్ చేసేందుకు ఒంగోలు, అద్దంకి ప్రాంతాల్లో ప్రత్యేకంగా మిల్లు లీజుకు తీసుకోవడం గమనార్హం. నెలకు సుమారు లక్ష క్వింటాళ్ల బియ్యాన్ని కృష్ణపట్నం పోర్టుకు తరలిస్తున్నారు. అక్కడినుంచి కంటైనర్లలో దక్షిణాఫ్రికాకు చేరవేస్తున్నారు.

కాసుల పంట..

పలు నియోజకవర్గాల పచ్చ నేతలకు చౌక బియ్యం దందా కాసులు కురిపిస్తోంది. కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రారంభంలో నెలకు రూ.12 లక్షలు తీసుకున్నవారు.. 4 నెలలు తిరగకముందే కప్పాన్ని భారీగా పెంచేశారు. చీరాల పచ్చ నేతకు బియ్యం మాఫియా నెలకు ఏకంగా రూ.25 లక్షలు చెల్లించేలా ఒప్పందం కుదుర్చుకుంది. 2 నెలల అడ్వాన్స్ కింద అక్షరాలా రూ.50 లక్షలు ఇచ్చేశారు. అద్దంకి, పర్చూరు నియోజకవర్గాల్లో పచ్చ నేత ప్రధాన అనుచరులకు బియ్యం మాఫియా కప్పం చెల్లిస్తుండగా.. బాపట్ల మాఫియా పచ్చ నేత బంధువుకు నెల మామూళ్లు ఇస్తున్నారు. వేమూరు, రేపల్లెతో పాటు మిగిలిన నియోజకవర్గాల పచ్చ నేతలకు సైతం ఇప్పుడు బియ్యం మాఫియా రేటు పెంచి రూ.25 లక్షలు చెల్లిస్తోంది. ఒంగోలు అధికార పార్టీ నేతకు అత్యధికంగా నెలకు రూ.30 లక్షలు చెల్లిస్తున్నట్లు మాఫియా ముఠాలోని ఓ సభ్యుడు తెలిపారు.

బియ్యం కొనుగోళ్లు ఇలా.. ఇవ్వకపోతే బెదిరింపులు

చౌకబియ్యం మాఫియా డీలర్లకు కిలోకు రూ.15 నుంచి రూ.17 చెల్లిస్తుండగా కొన్నిచోట్ల బియ్యం సేకరించిన స్థానిక వ్యాపారికి కిలోకు రూ.22 నుంచి రూ.24 ఇస్తోంది. డీలర్లు కార్డుదారులకు కిలోకు గతంలో రూ.8 ఇవ్వగా ప్రస్తుతం కిలోకు రూ.10 చెల్లిస్తున్నారు. అద్దంకి ముఠా సభ్యులు మంత్రి పేరు చెప్పి ఆయా నియోజకవర్గాల పచ్చ నేతలతో పాటు స్థానికంగా అక్రమ బియ్యం వ్యాపారం సాగిస్తున్నవారిని బెదిరిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. గతంలో వేరేవారికి బియ్యం ఇవ్వడం లేదా సొంతంగా పెద్ద వ్యాపారులతో సంబంధాలు పెట్టుకుని కృష్ణపట్నం పోర్టుకు బియ్యం తరలించినవారు అద్దంకి బ్యాచ్‌కు బియ్యం ఇచ్చేందుకు తొలుత నిరాకరించారు. దీంతో వారిని మంత్రి పేరుచెప్పి బెదిరించారు. అక్రమ కేసులు పెడతామని హెచ్చరించినట్లు కొందరు వ్యాపారులు చెబుతున్నారు.

బియ్యం లారీ ముందు పైలట్ వాహనాలతో..

పాలిషింగ్ తర్వాత బియ్యాన్ని రాత్రివేళ లారీల ద్వారా కృష్ణపట్నం పోర్టుకు తరలిస్తున్నారు. బియ్యం లారీ పోర్టుకు వెళ్లేవరకు ముందు రెండు కార్లలో మాఫియా ముఠా సభ్యులు పైలట్‌గా వెళ్తున్నారు. ఎక్కడికక్కడ అధికారులకు మామూళ్లు చెల్లిస్తున్నారు. బియ్యం సేకరిస్తున్న నియోజకవర్గాల పరిధిలో కొందరు విజిలెన్స్, సివిల్ సీఐలకు రూ.50 వేలు, ఎస్ఐలకు రూ.15 వేలు, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారికి, పౌర సరఫరాల అధికారులకు రూ.50 వేల చొప్పున ఇస్తున్నట్లు సమాచారం. ఒక్కో చెక్ పోస్టుకు రూ.500 చొప్పున చెల్లిస్తున్నారు.

క్లుప్తంగా...

మూకాంబిక సన్నిధిలో స్టాలిన్ సతీమణి
అమ్మవారికి విశేష పూజలు



యశవంతపుర: కర్ణాటకలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన ఉడుపి జిల్లాలోని ప్రఖ్యాత కొల్లూరు ముకాంబికా అమ్మవారి ఆలయాన్ని తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ సతీమణి దుర్గ దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆమె స్నేహితులతో కలిసి దేవస్థానానికి వచ్చారు. దేవస్థానం అధికారులు ఆమెకు దర్శన ఏర్పాట్లు చేశారు. ఆమె అమ్మవారికి బంగారు కిరీటాన్ని కానుకగా అందజేశారు. స్టాలిన్ తనయుడు, తమిళనాడు డిప్యూటీ సీఎం ఉదయనిధి స్టాలిన్.. సనాతన ధర్మం అంటువ్యాధి వంటిదని, దానిని నిర్మూలించాలని గతంలో ప్రకటించి విమర్శలకు గురికావడం తెలిసిందే. ఈ తరుణంలో ఆయన తల్లి దేవస్థానానికి రావడం, పూజలుచేసి కిరీటాన్ని బహూకరించడం అందరినీ ఆశ్చర్యానికి కలిగించింది.

చీరాల మహిళకు కేంద్ర ప్రభుత్వ ఎక్స్‌లెన్స్ అవార్డు



చీరాల అర్బన్: వ్యాపార కార్యకలాపాలను తనదైన శైలిలో కొనసాగించి అధిక రాబడులు తెచ్చేందుకు కృషి చేసిన బాపట్ల జిల్లా చీరాల మేరీక్రిస్టియన్‌పేటకు చెందిన గాలంకి మేరికి కేంద్ర ప్రభుత్వం శనివారం ఢిల్లీలో ఎక్స్‌లెన్స్ అవార్డును అందజేసింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పలు వ్యాపార రంగాల్లో ప్రతిభ కనబరచిన మహిళలకు కేంద్ర ప్రభుత్వం ఈ అవార్డులను ప్రదానం చేసింది. అందులో భాగంగా బాపట్ల జిల్లా చీరాలకు చెందిన గాలంకి మేరీ వెస్టేజ్ కంపెనీకి సంబంధించిన వ్యాపార కార్యకలాపాలను తనదైన శైలిలో కొనసాగించి అధిక రాబడులను తెచ్చేందుకు కృషి చేసినందుకు ఆమెకు డైరెక్ట్ సెల్లింగ్ ట్రైనింగ్ స్కిల్ డెవలప్‌మెంట్ ఎక్స్‌లెన్సీ అవార్డును కేంద్ర మంత్రి స్మృతీ ఇరాని చేతుల మీదగా అందించారు.

త్వరలో అమరావతి నిర్మాణ పనులు
మంత్రి నారాయణ

రాజమహేంద్రవరం సిటీ: రాజధాని అమరావతి నిర్మాణ పనులు ఈ నెల 15వ తేదీలోపు ప్రారంభం కానున్నాయని రాష్ట్ర మంత్రి పి.నారాయణ తెలిపారు. రాజమహేంద్రవరంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఎత్తివేయడంతో టెండర్లు తెరచి, కాంట్రాక్ట్ సంస్థలను ఎంపిక ప్రక్రియ ప్రారంభించామన్నారు. కాంట్రాక్టు ఏజెన్సీలపై రెండు రోజుల్లో జీవోలు జారీ చేస్తామన్నారు. అమరావతి నిర్మాణానికి 2014–19 మధ్య ఖరారు చేసిన డిజైన్లలో ఎటువంటి మార్పూ ఉండదని చెప్పారు. అమరావతిలో 4 వేల ఎకరాల మిగులు భూమి ఉందని, రాజధానిలో మౌలిక వసతుల కల్పన పూర్తయితే భూముల ధరలు పెరుగుతాయని అన్నారు. భూములు అమ్మి మాత్రమే రాజధాని నిర్మిస్తామని, ప్రజల పన్నుల ఆదాయం నుంచి ఒక్క రూపాయి కూడా అమరావతికి ఖర్చు చేయబోమని చెప్పారు. మూడేళ్లలో రాజధాని నిర్మాణం పూర్తి చేస్తామన్నారు.

జనావాసాల మధ్య మద్యం దుకాణం!

ఆగిరిపల్లి : ఏలూరు జిల్లా ఆగిరిపల్లిలో జనావాసాల మధ్య మద్యం దుకాణం ఏర్పాటుకు రంగం సిద్ధం చేస్తున్నారు. స్థానిక జంక్షన్ రోడ్డులో మడుపల్లి కాంప్లెక్స్ ఎదురుగా జనావాసాల మధ్య దీనిని ఏర్పాటు చేస్తుండటం గమనార్హం. ఒకపక్క ప్రభుత్వ పాఠశాల, మరోపక్క శోభనాచల స్వామివారి కల్యాణ మండపం, చుట్టూ నివాసాలు ఉన్నప్పటికీ ఇవేమీ పట్టించుకోకుండా మద్యం దుకాణదారులు బరితెగించి మరీ ఏర్పాట్లు చేస్తున్నారు.

కేసినో వేట.. జీవితాలతో ఆట..!



గోవా, శ్రీలంక, నేపాల్ కేంద్రంగా దందా

గోవా అనగానే బీచ్‌లతోపాటు కేసినోలు గుర్తుకొస్తాయి. ఆ కేసినోలపై తెలుగు రాష్ట్రాల్లోని కొందరికి ఉన్న ఆకర్షణను అవకాశంగా చేసుకుని కొన్ని ముఠాలు చెలరేగిపోతున్నాయి. ఈవెంట్ల పేరుతో పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్నారు. ఎక్కడికక్కడ ఏజెంట్లను నియమించుకుని మరీ అమాయకులకు ఎర వేస్తున్నారు. గోవాతో పాటు శ్రీలంక, నేపాల్‌లలో కూడా దందా సాగుతోంది. రూ.లక్షన్నర నుంచి రూ.2 లక్షల వరకు చెల్లించి వెళ్లేవారు.. ఆటలు ముగిశాక ఒట్టి చేతులతోనో, అప్పల భారంతోనో, ఆస్తులు రాసేసో.. వెనక్కి రాక తప్పడం లేదు.ఇలా వెళ్లిన వందల మంది సర్వం పోగొట్టుకుని వస్తున్నారు.

- ఈవెంట్లకు వాట్సప్ ద్వారా ఆహ్వానాలు
- నిర్వాహకులు తెలుగు రాష్ట్రాలకు చెందినవారే
- ఈవెంట్లు ఉంటే విమానాలన్నీ ఫుల్
- ఒక్కో ట్రిప్‌కి రూ.లక్షన్నర నుంచి రూ. 2 లక్షలు హుష్
- ఒట్టి చేతులతో వస్తున్న వందల మంది బాధితులు



సాక్షి ప్రతినిధి, గుంటూరు : మధ్య తరగతి, సంపన్నవర్గాలకు కేసినో ఈవెంట్లు నిర్వహించే ముఠాలు గాలం వేస్తున్నాయి. గోవాలోని కేసినోలతో చీకోటి ప్రవీణ్ తెరపైకి రాగా.. ఆయనను ఆదర్శంగా తీసుకుని మరికొందరు ఈ దందాలో అడుగుపెట్టారు. గోవాలో 13 ముక్కలాటపై నిషేధం ఉన్నా, అద్దెకు తీసుకున్న కేసినోలలో వీటిని నిర్వహిస్తున్నారు. తెలుగు రాష్ట్రాలలో ఎనిమిది మంది సిండికేట్‌గా ఏర్పడ్డారు. శ్రీనివాసరెడ్డి, ధన, రఫీ, వీరన్నగౌడ్, ప్రశాంత్‌రెడ్డి, నాగరాజు, పరమేష్, తిరుపతిరెడ్డిలు తమ వాట్సప్ గ్రూపుల ద్వారా దందా నడుపుతున్నారు. ఏరియాలవారీగా సభ్యులను ఏర్పాటు చేసుకుని ఎవరినైనా గోవా పంపితే కమీషన్ ఇస్తున్నారు. ప్రతి నెలలో ఇరవైకిపైగా ఇలాంటి ఈవెంట్స్ నిర్వహిస్తున్నారు. గోవాలోని బిగ్ బీ, క్యాడీలాక్ డైమండ్ తదితర కేసినోలను అద్దెకు తీసుకుంటున్నారు. నాలుగు రోజుల ఈవెంట్‌కు రూ.కోటి వరకు అద్దె చెల్లిస్తున్నారంటే వారి రాబడి స్థాయి ఎంతో తెలుసుకోవచ్చు.

డిపాజిట్ మొత్తాన్ని బట్టి ఆఫర్లు

వెళ్లేవారు రూ.రెండు లక్షల వరకు డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. ఆ మేరకు వారికి కాయిన్లు అందిస్తారు. ఈ కాయిన్లతో కేసినోలో ఆడాల్సి ఉంటుంది. వీరికి రానుపోనూ ఉచితంగా విమాన టిక్కెట్లు, గోవాలో బస సదుపాయం, కట్టిన మొత్తాన్ని బట్టి ఫ్రీ మద్యం, వినోద కార్యక్రమాలు వంటి ఆఫర్లు ఉంటాయి. గుంటూరు, విజయవాడ, రాజమండ్రి, విశాఖ, హైదరాబాద్‌ల నుంచి విమానాల్లో గోవా తీసుకెళ్తున్నారు. ఈవెంట్లు ఉన్న రోజుల్లో గోవా వెళ్లే విమానాలన్నీ రద్దీగా ఉంటున్నాయి. ఒక్కో ఈవెంట్‌కు ఒక్కో ఆర్గనైజర్, అతడికి ఫోన్ నెంబర్ కేటాయిస్తున్నారు. అందర్-బాహర్, బక్కారత్, రౌలెట్టీ, బ్లాక్ జాక్, జండూ, తీన్‌పత్తీ, రమ్మీ/సిండికేట్‌తో పాటు 13 ముక్కల ఆట ఆడిస్తున్నారు.

అప్పలిచ్చి.. ఆస్తులు కొట్టేసి..

గెలిచినా ఏదో విధంగా డబ్బులు గుంజి పంపుతున్నారు. డబ్బులు పోతే అక్కడే వీరికి అప్పులు ఇచ్చి మరీ లాగేస్తున్నారు. తర్వాత పొలాలు, స్థలాలు వంటి స్థిరాస్తులు కూడా రాయించుకుంటున్నారు. తెలుగు రాష్ట్రాల నుంచి ఇలా ఈవెంట్లకు వెళ్తున్న వారి సంఖ్య వందల్లో ఉంటోంది. గోవా కేసినోలో ఆడితే జీఎస్టీతో కలిపి అక్కడి నిర్వాహకులకు చెల్లించాలి. తెలుగు రాష్ట్రాల నుంచి ఈవెంట్లు చేస్తున్న వారు అక్కడ తమ సొంత స్వైపింగ్ మిషన్లు పెడుతున్నారు. జీఎస్టీ కూడా చెల్లించకుండానే ఈవెంట్లు చేస్తున్నా ప్రభుత్వాలు, నిఘా వర్గాలు పట్టించుకోవడం లేదు. దీంతో దందా యథేచ్ఛగా సాగిపోతోంది. ఈ ముఠాల చేతిలో చిక్కిన వారి కుటుంబాలు రోడ్డునపడుతున్నాయి.

నల్లమలలో విస్తరిస్తున్న కార్చిచ్చు

ఆత్మకూరురూరల్: నాగార్జునసాగర్ – శ్రీశైలం టైగర్ రిజర్వ్ అభయారణ్యంలో రెండు రోజులుగా కార్చిచ్చు విస్తరిస్తోంది. కర్నూలు – గుంటూరు రోడ్డు సమీపంలో శుక్రవారం రాజుకున్న నిప్పురవ్వలు శనివారం రాత్రి ఆత్మకూరు డివిజన్‌లోని బైర్లూటి రేంజ్ పంగిడి బీట్, మార్కాపురం డివిజన్‌లోని వజ్రాల మడుగు ప్రాంతాలకు విస్తరించింది. బైర్లూటీ రేంజ్ అధికారి కృష్ణప్రసాద్ తన సిబ్బందితో మంటలను అదుపు చేసేందుకు శ్రమిస్తున్నారు. అడవిలో బాగా గడ్డి ఎండిపోయి ఉండటం వల్ల మంటలు వేగంగా విస్తరిస్తున్నాయి. దీంతో మంటల్ని ఆర్పివేయడం కష్టంగా మారింది. ఆకురాల్చు అడవులు అయిన నల్లమల అడవులలో కార్చిచ్చు అడవికి పెద్దగా నష్టం చేయదని అధికారులు చెబుతున్నారు. వేసవిలో గడ్డి వరకు కాలడం సర్వసాధారణమైనప్పటికీ ఈ సారి రెండు రోజులుగా కార్చిచ్చు విస్తరిస్తుపోతోంది. అటవీ శాఖకు చెందిన సాధారణ సిబ్బందితో పాటు, ఫైర్ వాచర్లు, ఫైర్ ఫైటర్లు మంటలు అదుపు చేసే పనిలో నిమగ్నమై ఉన్నారు. ఈ కార్చిచ్చు వలన అడవిలో సరీసృపాలు, చిన్నచిన్న జంతువులకు ముప్పువాటిల్లే ప్రమాదం ఉంది.



నల్లమల బైర్లూటీ డివిజన్‌లో అటవీ ప్రాంతంలో మంటలను ఆర్పుతున్న సిబ్బంది

శ్రీవారి దర్శనానికి 10 గంటలు

తిరుమల: తిరుమలలో శ్రీవారి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. క్యూకాంప్లెక్స్‌లో 9 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శుక్రవారం అర్ధరాత్రి వరకు 67,127 మంది స్వామివారిని దర్శించుకోగా 22, 910 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.47 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. ఇదిలా ఉంటే సర్వ దర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలో వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. కేటాయించిన సమయాన్ని కంటే ముందు వెళ్లిన భక్తులను క్యూలో అనుమతించరని స్పష్టం చేసింది.



అంగరంగ వైభవంగా ప్రతిష్ఠా మహోత్సవాలు



నిడమర్రు: ఏలూరు జిల్లా నిడమర్రు మండలం బువ్వనపల్లి గ్రామం వేద మంత్రాలతో పులకిస్తోంది. గ్రామంలోని జగ్గయ్య చెర్వు వద్ద నూతనంగా నిర్మించిన శ్రీవేణు గోపాలస్వామి ఆలయ ప్రారంభం, శ్రీవేణు గోపాలస్వామివారి నూతన విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా రెండు రోజులుగా ఆలయం వద్ద వేద పండితుల ఆధ్వర్యంలో పూజలు, హోమాలు, యజ్ఞయాగాదులు నిర్వహిస్తున్నారు.

కనులపండువగా మద్ది రావమ్మ జాతర



భీమడోలు: ఏలూరు జిల్లా భీమడోలులో శ్రీమద్ది రావమ్మ జాతర మహోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. శనివారం రాత్రి అమ్మవారి ఊరేగింపు ఘనంగా జరిగింది. పుష్కర కాలానికి ఒకసారి జరిగే ఈ జాతర మహోత్సవాలు ఈ నెల 9వ తేదీతో ముగుస్తాయి. గ్రామంలోని అన్ని కుటుంబాల వారు తమ బంధువులు, స్నేహితులు, ఆత్మీయులను ఆహ్వానించడంతో పెద్ద సంఖ్యలో జనం గ్రామంలో పోటెత్తారు.

తిరుచ్చిపై వెంకన్న విహారం



చంద్రగిరి : శ్రీనివాసమంగాపురంలో వెలసిన శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారు శనివారం సాయంత్రం బంగారు తిరుచ్చి వాహనంపై విహరించారు. వారపు ఉత్సవాల్లో భాగంగా వేకువనే స్వామివారిని సుప్రభాతంతో మేల్కొలిపి నిత్యకైంకర్యాలు సమర్పించారు. దేవదేవేరులకు కనులపండువగా కల్యాణోత్సవం జరిపించారు. సాయంత్రం వైభవంగా ఊంజల్ సేవ నిర్వహించారు. అనంతరం ఉభయ దేవేరీ సమేతంగా స్వామివారు తిరుచ్చిపై కొలువుదీరి మాడ వీధుల్లో ఊరేగారు. కార్యక్రమంలో ఆలయ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా మారెమ్మ జాతర

గణపవరం: పశ్చిమగోదావరి జిల్లా గణపవరం గ్రామ దేవత శ్రీదండు మారెమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు శనివారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. జాతర ప్రారంభ సందర్భంగా శనివారం రాత్రి అమ్మవారి గవళ్లగుడుపు సేవ వైభవంగా జరిగింది. అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు చేసి సేవ నిర్వహించారు.

రత్నగిరి.. భక్తజనసిరి

అన్నవరం: కాకినాడ జిల్లా అన్నవరం దేవస్థానంలో సత్యదేవుడిని శనివారం పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించి, పూజలు చేశారు. రత్నగిరితో పాటు వివిధ ప్రాంతాల్లో శుక్రవారం రాత్రి, శనివారం తెల్లవారుజామున పెద్ద సంఖ్యలో వివాహాలు జరిగాయి. ఆ నవదంపతులు తమ బంధుమిత్రులతో కలసి సత్యదేవుని ఆలయానికి తరలివచ్చారు. వీరందరూ స్వామివారి వ్రతాలాచరించి, దర్శనాలు చేసుకున్నారు. దీంతో ఆలయం వద్ద రద్దీ ఏర్పడింది.

బాలాజీకి రూ.3.36 లక్షల ఆదాయం



మామిడికుదురు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం అప్పనపల్లిలోని శ్రీ బాలబాలాజీ స్వామి ఆలయానికి శనివారం భారీగా భక్తులు తరలి వచ్చారు. తెల్లవారు జామున సుప్రభాత సేవ, తొలి హారతితో దర్శనాలు ప్రారంభమయ్యాయి. పవిత్ర వైనతేయ గోదావరి నదిలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. స్వామి వారికి తల నీలాలు, ముడుపులు, మొక్కుబడులు చెల్లించారు. లక్ష్మీ నారాయణ హోమాన్ని దర్శించుకున్నారు. గోశాలను సందర్శించి, పూజలు చేశారు.



● ఇమ్రాన్ హష్మీ

తెలుగు హీరో... హిందీ విలన్

తెలుగు తెరపై బాలీవుడ్ హీరోయిన్ల హవా ఎప్పుడూ ఉంటూనే ఉంటుంది. కానీ ఇప్పుడు బాలీవుడ్ నటులు కూడా తెలుగు సినిమాలు చేసేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. అయితే తెలుగు సినిమాల్లో ఎక్కువగా విలన్ రోల్స్ చేసేందుకే బాలీవుడ్ యాక్టర్స్ ఆసక్తి చూపిస్తున్నారు. ఇలా తొలిసారిగా తెలుగు తెరపై విలన్‌గా కనిపించనున్న కొందరు బాలీవుడ్ యాక్టర్స్, వారు ఓకే చేసిన సినిమాలు వివరాలు ఇలా ఉన్నాయి.

ఇటు ఓజీ... అటు జీ2

'మర్డర్, గ్యాంగ్‌స్టర్, ముంబై సాగ, టైగర్ 3, వన్స్ అపాన్ ఏ టైమ్ ఇన్ ముంబై' వంటి పలు బాలీవుడ్ సినిమాల్లో నటించిన ఇమ్రాన్ హష్మీ గురించి తెలుగు ఆడియన్స్‌కు తెలిసిందే. ఈ హీరో టాలీవుడ్ ఎంట్రీ ఇప్పుడు ఖరారైంది. ప్రెజెంట్ రెండు తెలుగు సినిమాల్లో విలన్‌గా నటిస్తున్నారు ఇమ్రాన్ హష్మీ. పవన్ కల్యాణ్ హీరోగా సుజీత్ దర్శకత్వంలోని గ్యాంగ్‌స్టర్ ఫిల్మ్ 'ఓజీ' (ఒరిజినల్ గ్యాంగ్‌స్టర్ – ప్రచారంలో ఉన్న టైటిల్)లో ఇమ్రాన్ హష్మీ ఓ లీడ్ రోల్ చేస్తున్నారు. ఓమి భావ్ అనే పాత్రలో హష్మీ కనిపించనున్నట్లుగా తెలిసింది. డీవీవీ దానయ్య నిర్మిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ తుది దశకు చేరుకుంది. వీలైనంత తొందరగా ఈ సినిమా చిత్రీకరణ పూర్తి చేసి, ఈ ఏడాదే రిలీజ్ చేయాలని చిత్రయూనిట్ ప్లాన్ చేస్తోంది. మరోవైపు అడివి శేష్ 'జీ 2' (గూఢచారి 2) చిత్రంలోనూ ఇమ్రాన్ హష్మీ ఓ లీడ్ రోల్‌లో నటిస్తున్నారు. అడివి శేష్ హీరోగా తెరకెక్కుతున్న ఈ స్పై యాక్షన్ థ్రిల్లర్ మూవీలో బాలీవుడ్ నటి వామికా గబ్బి మరో లీడ్ రోల్‌లో నటిస్తున్నారు. కాగా 'జీ 2' సినిమా షూటింగ్‌లో ఆల్రెడీ ఇమ్రాన్ హష్మీ జాయిన్ అయ్యారు. గత ఏడాది అక్టోబరులో 'జీ 2' కోసం ఓ యాక్షన్ సీక్వెన్స్‌ను చిత్రీకరిస్తుండగా ఇమ్రాన్ గాయపడ్డారు. కానీ ఆ తర్వాత తిరిగి షూటింగ్‌లో పాల్గొన్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్, ఏకే ఎంటర్‌టైన్మెంట్స్ పతాకాలపై టీజీ విశ్వప్రసాద్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. వినయ్ కుమార్ సిరిగినీడి ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. ఈ మూవీ ఈ ఏడాదే రిలీజ్ కానుంది. కాగా అడివి శేష్ హీరోగా నటించిన సూపర్ హిట్ ఫిల్మ్ 'గూఢచారి'కి సీక్వెల్‌గా 'జీ 2' చిత్రం రూపొందుతున్న సంగతి తెలిసిందే. ఇలా ఒకేసారి రెండు తెలుగు సినిమాల్లో విలన్‌గా నటిస్తూ, డబుల్ విలన్‌గా ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు ఇమ్రాన్ హష్మీ.

మల్టీ మిలియనీర్

'నీర్జా, పద్మావత్, సంజు, గంగుభాయి కతియావాడి' వంటి చిత్రాలతో నటుడిగా బాలీవుడ్‌లో నిరూపించుకున్నారు జిమ్ సర్భ్. ఈ నటుడికి టాలీవుడ్ ఎంట్రీ చాన్స్ లభించింది. నాగార్జున–ధనుష్ హీరోలుగా శేఖర్ కమ్ముల దర్శకత్వంలో 'కుబేర' అనే మూవీ తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో రష్మికా మందన్నా హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఈ మూవీలో ఓ మల్టీ మిలియనీర్ పాత్రను జిమ్ సర్భ్ చేస్తున్నారు. తెలుగు, తమిళ, హిందీ భాషల్లో ఈ పీరియాడికల్ ఫిల్మ్‌ను తెరకెక్కిస్తున్నారు మేకర్స్. శేఖర్ కమ్ముల అమిగోస్ క్రియేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌తో కలిసి ఎస్‌వీసీఎల్ఎల్‌పీ పతాకంపై సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్ రావు ఈ చిత్రాన్ని హై బడ్జెట్ హై ప్రొడక్షన్ వాల్యూస్‌తో నిర్మిస్తున్నారు. జూన్ 20న ఈ చిత్రం రిలీజ్ కానుంది. ఈ చిత్రంలోని కొన్ని సన్నివేశాల్లో ధనుష్ భిక్షగాడిగా కనిపిస్తారని, ఓ ఆఫీసర్‌గా నాగార్జున, మల్టీ మిలియనీర్ పాత్రలో జిమ్ సర్భ్ కనిపిస్తారని తెలిసింది. ఓ బలమైన సామాజిక అంశం, డబ్బు ప్రధానాంశాలుగా 'కుబేర' కథనం సాగుతుందని సమాచారం.



● జిమ్ సర్భ్

ఇన్‌స్పెక్టర్ స్వామి



● అనురాగ్ కశ్యప్

ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చిన తమిళ చిత్రం విజయ్ సేతుపతి 'మహారాజా', మలయాళ చిత్రం 'రైఫిల్ క్లబ్' వంటి చిత్రాల్లో బాలీవుడ్ దర్శకుడు అనురాగ్ కశ్యప్ నటన తెలుగు ప్రేక్షకులను మెప్పించింది. దీంతో అనురాగ్ కశ్యప్ యాక్టర్‌గా తెలుగులో ఓ స్ట్రయిట్ ఫిల్మ్ చేస్తే బాగుంటుందని కొందరు తెలుగు ఆడియన్స్ ఆశపడ్డారు. వారి ఆశ నిజమైంది. అడివి శేష్ హీరోగా 'డెకాయిట్: ఓ ప్రేమకథ' అనే సినిమా రూపొందుతోంది. ఈ చిత్రంలో మృణాల్ ఠాకూర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. తెలుగు, హిందీ భాషల్లో ఏక కాలంలో రూపొందుతున్న ఈ సినిమాకు షనీల్ డియో దర్శకత్వం వహిస్తున్నారు. కాగా ఈ సినిమాలోని ఇన్‌స్పెక్టర్ స్వామి అనే కీలక పాత్రలో అనురాగ్ కశ్యప్ నటిస్తున్నారు. ఆల్రెడీ ఈ సినిమా చిత్రీకరణలో ఆయన పాల్గొన్నారు. ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. నెక్ట్స్ షెడ్యూల్ చిత్రీకరణ మహారాష్ట్రలో ఉంటుందని తెలిసింది. కథ రీత్యా... ఇద్దరు ప్రేమికులు బ్రేకప్ చెప్పుకుంటారు. కొన్ని పరిస్థితుల కారణంగా వారికి ఇష్టం లేకపోయినా... వీరిద్దరూ కలిసి ఓ క్రైమ్ చేయాల్సి ఉంటుంది. ఈ క్రైమ్‌ను అడ్డుకోవాల్సిన బాధ్యత ఇన్‌స్పెక్టర్ స్వామిది. మరి... క్రిమినల్స్ అయిన ఈ ప్రేమికులను పోలీసాఫీసర్‌గా ఇన్‌స్పెక్టర్ స్వామి పట్టుకున్నాడా? అనేది 'డెకాయిట్' సినిమా చూసి తెలుసుకోవాలి. అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో సుప్రియ యార్లగడ్డ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ప్రేమ, ద్రోహం, ప్రతీకారం, భావోద్వేగం వంటి అంశాల మేళవింపుతో రూపొందుతున్న 'డెకాయిట్' మూవీ ఈ ఏడాదే రిలీజ్ కానుంది. మరోవైపు నటుడిగానే కాదు... 'పాంచ్, బాంబే టాకీస్, అగ్లీ, మ్యాడ్లీ, దో బార' వంటి హిందీ చిత్రాలతో అనురాగ్ కశ్యప్ బాలీవుడ్‌లో దర్శకుడిగా పాపులర్ అన్న సంగతి తెలిసిందే. అలాగే నిర్మాతగానూ, రైటర్‌గానూ ఆయన రాణిస్తున్న విషయం కూడా విదితమే.

అర్జున్‌కు విలన్‌గా...



● సోహైల్ ఖాన్

స్క్రీన్‌పై నందమూరి కల్యాణ్‌రామ్‌తో ఢీ అంటే ఢీ అంటున్నారు బాలీవుడ్ యాక్టర్ సోహైల్ ఖాన్. నందమూరి కల్యాణ్‌రామ్ హీరోగా ప్రదీప్ చిలుకూరి దర్శకత్వంలో 'అర్జున్ సన్నాఫ్ వైజయంతి' అనే యాక్షన్ థ్రిల్లర్ మూవీ తెరకెక్కుతోంది. సయీ మంజ్రేకర్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాలో విజయశాంతి, సోహైల్ ఖాన్, శ్రీకాంత్, 'యానిమల్' పృథ్వీరాజ్ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ మూవీలో ఐపీఎస్ ఆఫీసర్‌గా నటిస్తున్నారు విజయశాంతి. ఇక ఈ మూవీలో విలన్‌గా నటిస్తున్నారు సోహైల్ ఖాన్. 'పార్ట్‌నర్, వీర్, దబాంగ్ 3' వంటి చిత్రాల్లో నటుడిగా అభినందనలు అందుకున్న సోహైల్ ఖాన్‌కు తెలుగులో ఇదే తొలి చిత్రం కావడం విశేషం. ముప్పా వెంకయ్య చౌదరి సమర్పణలో అశోక్ వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు ఈ సినిమాను నిర్మిస్తున్నారు. టాకీ పార్టు పూర్తయింది.

రామ్‌చరణ్‌కు విలన్‌గా...

రామ్‌చరణ్‌కు విలన్‌గా కనిపించనున్నారు బాలీవుడ్ యంగ్ హీరో దివ్యేందు. హీరో రామ్‌చరణ్, దర్శకుడు బుచ్చిబాబు కాంబినేషన్‌లో ఓ పీరియాడికల్ స్పోర్ట్స్ డ్రామా 'పెద్ది' (ప్రచారంలో ఉన్న టైటిల్) తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, జగపతిబాబు, శివరాజ్‌కుమార్, దివ్యేందు ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమా కొత్త షెడ్యూల్ చిత్రీకరణ ఈ వారంలో ప్రారంభం కానుందని తెలిసింది. కాగా ఈ మల్టీ స్పోర్ట్స్ (క్రికెట్, కుస్తీ తదితర క్రీడలు) డ్రామాలో దివ్యేందు ఓ కీలక పాత్రలో నటిస్తున్నారు. ఆల్రెడీ దివ్యేందు ఈ సినిమా షూటింగ్‌లో పాల్గొన్నారు. కాగా ఈ సినిమాలో రామ్‌చరణ్ పాత్రకు విలన్‌గా కనిపిస్తారట దివ్యేందు. సుకుమార్ రైటింగ్స్, మైత్రీ మూవీ మేకర్స్ సమర్పణలో వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్న ఈ చిత్రం ఈ ఏడాదే రిలీజ్ కానుంది. మార్చి 27న రామ్‌చరణ్ బర్త్ డే సందర్భంగా ఈ సినిమా టీజర్ రిలీజ్ కావొచ్చని, దీపావళికి ఈ చిత్రం విడుదలయ్యే అవకాశం ఉందనీ సమాచారం. మరోవైపు 'ప్యార్‌కా పంచనామా, టాయిలెట్: ఏక్ ప్రేమకథ, ఓల్డ్ కపుల్' వంటి బాలీవుడ్ చిత్రాల్లో నటుడిగా రాణించారు దివ్యేందు. కాగా 'మిర్జాపూర్, సాల్ట్ సిటీ, ది రైల్వే మెన్' వంటి వెబ్ సిరీస్‌లతో దివ్యేందు మరింత పాపులర్ అయ్యారు. ఇప్పుడు తెలుగు ఇండస్ట్రీకి వస్తున్నారు.



● దివ్యేందు

కొందరు బాలీవుడ్ యాక్టర్స్ ఆల్రెడీ తెలుగులో బిజీ అయిపోయారు. బాలకృష్ణ హీరోగా చేసిన 'భగవంత్ సింగ్ కేసరి'లో అర్జున్ రామ్‌పాల్, 'డాకు మహారాజ్'లో బాబీ డియోల్ విలన్స్‌గా నటించారు. కాగా పవన్ కల్యాణ్ 'హరిహరవీర మల్లు' చిత్రంలో ఎంతో కీలకమైన ఔరంగజేబు పాత్రలో బాబీ డియోల్ యాక్ట్ చేస్తున్నారు. అలాగే ఎన్టీఆర్ 'దేవర 2' చిత్రంలోనూ బాబీ డియోల్ విలన్‌గా కనిపిస్తారనే ప్రచారం సాగుతోంది. గత ఏడాది విడుదలైన రామ్ 'డబుల్ ఇస్మార్ట్' మూవీలో ఫుల్ లెంగ్త్ విలన్ రోల్ చేశారు సంజయ్ దత్. ఇప్పుడు ప్రభాస్ 'రాజా సాబ్', సాయిదుర్గా తేజ్ 'సంబరాల ఏటిగట్టు' చిత్రాల్లోనూ లీడ్ రోల్స్ చేస్తున్నట్లుగా తెలిసింది. అలాగే ప్రభాస్ 'ఫౌజి' చిత్రంలో మిథున్ చక్రవర్తి, అనుపమ్ ఖేర్ లీడ్ యాక్టర్స్‌గా చేస్తున్నారు. నాగార్జున–నానీల 'దేవదాసు' (2018)లో విలన్‌గా యాక్ట్ చేసిన కునాల్ కపూర్ ప్రస్తుతం చిరంజీవి 'విశ్వంభర'లో మళ్లీ విలన్‌గా యాక్ట్ చేస్తున్నారని తెలిసింది. ప్రభాస్ 'కల్కి'లో అమితాబ్ బచ్చన్ ఎంతటి బలమైన రోల్ చేశారో ప్రత్యేకించి చెప్పక్కర్లేదు. 'కల్కి 2'లోనూ అమితాబ్ బచ్చన్ రోల్ కొనసాగుతుందని తెలిసిందే... ఇలా విలన్స్‌గా, క్యారెక్టర్ ఆర్టిస్టులుగా నటిస్తున్న బాలీవుడ్ యాక్టర్స్ మరికొందరు ఉన్నారు.

– ముసిమి శివాంజనేయులు

అందుకే బతిమాలుతున్నా! – నాని



● ప్రియదర్శి, రామ్ జగదీశ్, నాని, రోషన్, శ్రీదేవి, దీప్తి, ప్రశాంతి

''నా కెరీర్‌లో ఎప్పుడూ దయచేసి ఓ సినిమా చూడండి అని అడగలేదు. కానీ 'కోర్టు' లాంటి మంచి సినిమాని తెలుగు ప్రేక్షకులు మిస్ కాకూడదని చెబుతున్నాను.. అందరూ చూడాలని బతిమాలుతున్నాను'' అని హీరో నాని చెప్పారు. ప్రియదర్శి ప్రధాన పాత్రలో రోషన్, శ్రీదేవి ఇతర పాత్రల్లో నటించిన చిత్రం 'కోర్టు'. రామ్ జగదీశ్ దర్శకత్వం వహించారు. నాని వాల్ పోస్టర్ సినిమా సమర్పణలో ప్రశాంతి తిపిర్నేని నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 14న విడుదల కానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్, ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌కి డైరెక్టర్స్ నాగ్ అశ్విన్, ప్రశాంత్ వర్మ, శైలేష్ కొలను, శ్రీకాంత్ ఓదెల, శౌర్యువ్, ఇంద్రగంటి మోహన కృష్ణ, దేవ కట్టా అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ–''కోర్టు' సినిమాకి వెళ్లాక నా మాటలు మీ అంచనాలకి సరిపోలేదనిపిస్తే... రెండు నెలల్లో రిలీజ్ అవుతున్న నా 'హిట్ 3' సినిమాని ఎవరూ చూడొద్దు'' అని కోరారు. ''బలగం' తర్వాత ఎలాంటి సినిమా చేయాలని ఆలోచిస్తున్నప్పుడు 'కోర్టు' చేయమని నాని అన్న చెప్పారు'' అని ప్రియదర్శి తెలిపారు. ''ఈ సినిమా అద్భుతమైన విజయం సాధించాలని కోరుకుంటున్నాను'' అన్నారు నాగ్ అశ్విన్, శ్రీకాంత్ ఓదెల. ''నానీగారు వాల్ పోస్టర్ సినిమా ద్వారా నన్ను డైరెక్టర్‌గా పరిచయం చేశారు. ఈ సినిమా పెద్ద సక్సెస్ సాధించాలి'' అని ప్రశాంత్ వర్మ ఆకాంక్షించారు. ''కోర్టు' ట్రైలర్ చూశాక సినిమా అద్భుతంగా వచ్చిందనిపిస్తోంది'' అన్నారు శైలేష్ కొలను. ''ఈ సినిమాని ఆడియన్స్ సెలబ్రేట్ చేసుకుంటారని భావిస్తున్నాను'' అని దేవ కట్టా తెలిపారు. ''కోర్టు' చాలా అందమైన సినిమా'' అన్నారు నిర్మాత దీప్తి. ''కోర్టు' మనందరికీ జీవితం. అందరూ థియేటర్స్‌కి రండి'' అన్నారు రామ్ జగదీశ్. ''ఈ సినిమా ప్రోమోస్ చాలా ఆసక్తిగా ఉన్నాయి. అందరూ థియేటర్స్‌లో చూడాలి'' అన్నారు ఇంద్రగంటి మోహనకృష్ణ. నటీనటులు శ్రీదేవి, రోహిణి, సురభి ప్రభావతి, హర్ష రోషన్, శ్రీనివాస్ భోగిరెడ్డి, శివాజీ, డైరెక్టర్ శౌర్యువ్, మ్యూజిక్ డైరెక్టర్ విజయ్ బుల్గానిన్, లిరిక్ రైటర్ పూర్ణాచారి తదితరులు మాట్లాడారు.

అర్జున్... సన్నాఫ్ వైజయంతి



● విజయశాంతి, కల్యాణ్ రామ్

నందమూరి కల్యాణ్ రామ్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రానికి 'అర్జున్ సన్నాఫ్ వైజయంతి' అనే పేరు ఖరారు చేశారు మేకర్స్. ప్రదీప్ చిలుకూరి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో నటి విజయశాంతి కీలక పాత్ర పోషిస్తున్నారు. సయీ మంజ్రేకర్ హీరోయిన్‌గా, సోహైల్ ఖాన్ విలన్ పాత్రలో నటిస్తున్నారు. ముప్పా వెంకయ్య చౌదరి సమర్పణలో అశోక క్రియేషన్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్‌పై అశోక్ వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు నిర్మిస్తున్నారు. శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఈ సినిమాకి 'అర్జున్... సన్నాఫ్ వైజయంతి' టైటిల్ ఫిక్స్ చేసి, ఫస్ట్ లుక్ రిలీజ్ చేశారు. ''మోస్ట్ ఎవైటెడ్ యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందుతోన్న చిత్రం 'అర్జున్... సన్నాఫ్ వైజయంతి'. ఇందులో విజయశాంతి పవర్‌ఫుల్ ఐపీఎస్ ఆఫీసర్‌గా నటిస్తున్నారు. మా టైటిల్, ఫస్ట్ లుక్‌కి అద్భుతమైన స్పందన వస్తోంది. ఇప్పటికే టాకీ పార్ట్ పూర్తయింది. మిగిలిన షూటింగ్ పూర్తయ్యాక, సినిమా రిలీజ్ డేట్‌ని అనౌన్స్ చేస్తాం'' అని చిత్రయూనిట్ తెలిపింది. శ్రీకాంత్, పృథ్వీరాజ్ కీలక పాత్రలు పోషిస్తున్న ఈ సినిమాకి సంగీతం: అజనీష్ లోక్‌నాథ్, కెమేరా: రామ్‌ప్రసాద్.



● శ్రీమణి, వినీత్ కుమార్ సింగ్, బన్నీ వాసు, దివ్యాంశ్ గోయల్

క్లైమాక్స్‌లో కన్నీళ్లు వచ్చాయి – బన్నీ వాసు

''ఒక చరిత్రని సినిమాగా తీయడం అంత సులభం కాదు. అలాంటి ఒక కొత్త చరిత్రని 'ఛావా' వంటి గొప్ప సినిమాగా ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చిన డైరెక్టర్ లక్ష్మణ్‌గారికి ధన్యవాదాలు. ఈ రోజు మనం స్వేచ్ఛ, స్వాతంత్ర్యాన్ని అనుభవిస్తున్నామంటే కారణం శంభాజీ మహారాజ్‌లాంటి మహావీరుల త్యాగ ఫలితమే. 'ఛావా' మూవీ క్లైమాక్స్‌లో భావోద్వేగ సన్నివేశాలు చూసి కన్నీళ్లు వచ్చాయి'' అని నిర్మాత బన్నీ వాసు తెలిపారు. విక్కీ కౌశల్, రష్మికా మందన్న జంటగా నటించిన చిత్రం 'ఛావా'. లక్ష్మణ్ ఉటేకర్ దర్శకత్వం వహించారు. దినేష్ విజన్ నిర్మించిన ఈ చిత్రం ఫిబ్రవరి 14న హిందీలో విడుదలైంది. ఈ సినిమాని గీతా ఆర్ట్స్ డిస్ట్రిబ్యూషన్స్ సంస్థ తెలుగులో శుక్రవారం విడుదల చేసింది. ఈ సందర్భంగా శనివారం నిర్వహించిన థ్యాంక్స్ మీట్‌లో బన్నీ వాసు మాట్లాడుతూ– ''ఛావా' కేవలం సినిమా మాత్రమే కాదు... గ్రేట్ ఎమోషన్. నాలుగు రోజుల్లోనే పాటలని పూర్తి చేసిన ఏఆర్ రెహమాన్‌గారికి థ్యాంక్స్'' అన్నారు. ''ఈ సినిమాలో నా పాత్రకు వస్తున్న ఆదరణ చాలా ఆనందాన్ని ఇస్తోంది. తెలుగులో నాకు వాయిస్ ఇచ్చిన ఫణి వంశీగారికి థ్యాంక్స్'' అని నటుడు వినీత్ కుమార్ సింగ్ తెలిపారు. ''మా సినిమాని ఇంత గొప్పగా ఆదరిస్తున్న తెలుగు ప్రేక్షకులకు కృతజ్ఞతలు'' అని మాడ్డాక్ సీఎఫ్ఓ దివ్యాంశ్ గోయల్ అన్నారు. ఈ థ్యాంక్స్ మీట్‌లో తెలుగు డైలాగ్ రైటర్ సామ్రాట్, తెలుగు డబ్బింగ్ డైరెక్టర్ రాఘవ, లిరిక్ రైటర్ శ్రీమణి మాట్లాడారు.

మార్పు కోసం..!

లైంగిక వేధింపులపై విప్లవాత్మకమైన, వినూత్న ప్రయత్నంలో భాగంగా రూపొందిన లఘు చిత్రం 'కీప్ ది ఫైర్ అలైవ్'. ఈ షార్ట్ ఫిల్మ్‌కి కె. ప్రఫుల్‌చంద్ర దర్శకత్వం వహించారు. కాగా ఈ షార్ట్ ఫిల్మ్‌ను హీరోయిన్ సంయుక్త సమర్పిస్తున్నారు. మార్చి 8న ఉమెన్స్ డే సందర్భంగా ఈ విషయాన్ని అధికారికంగా వెల్లడించారు. ఈ సందర్భంగా కె. ప్రఫుల్ చంద్ర మాట్లాడుతూ– ''సమాజంలో మార్పు తీసుకురావాలన్నదే 'కీప్ ది ఫైర్ అలైవ్' ముఖ్య ఉద్దేశం. సమాజంలో మార్పు కోసం ఈ రోజు మనం ఒక అడుగు వేయాలి. ఈ మార్పు ఫలాలను భవిష్యత్ తరాలు కచ్చితంగా అనుభవిస్తాయి అనే పాయింట్‌తో ఈ లఘు చిత్రాన్ని తెరకెక్కించాము. లైంగిక వేధింపులకు సంబంధించిన విషయాలు బాధతో పాటు కోపాన్ని కలిగిస్తాయి. వాటిని అధిగమించాలంటే కఠినమైన చట్టాలు తీసుకొస్తే సరిపోతుందా అంటే కచ్చితంగా కాదు. వీటి కన్నా స్పృహ అత్యంత ముఖ్యమైనది. అండర్ ది సేమ్ స్కై ప్రొడక్షన్ బ్యానర్ పై ఈ షార్ట్ ఫిల్మ్‌ను తీశాం. ఈ షార్ట్ ఫిల్మ్‌ను మళ్లీ మళ్లీ చూసేలా సంయుక్త గొంతు మ్యాజిక్ చేసింది. ఆమె వాయిస్ ఓవర్‌లోని ప్రతి పదం ఒక అగ్ని కణంలా ఉంటుంది. అలాగే ఆదిశక్తి అనే ఫౌండేషన్‌ను స్థాపించి, మహిళా శక్తిని ప్రపంచానికి తెలియజేయాలనే సంకల్పంతో అడుగులు వేస్తున్నారు ఆమె. అందరం కలిసి మార్పు కోసం ఒక అడుగు వేస్తే సమాజంలో స్త్రీలపై ఎలాంటి దాడులు జరగవు. మా షార్ట్ ఫిల్మ్ కచ్చితంగా ఒక మేలుకొలుపు'' అని అన్నారు.



● 'కీప్ ది ఫైర్ అలైవ్' పోస్టర్

అలాంటి ప్రోత్సాహం ఉండాలి – ఆదిత్య ఓం

''ప్రస్తుతం పర్యావరణ అసమతుల్యత వల్ల ఎలాంటి అనర్థాలు జరుగుతున్నాయో అందరికీ తెలిసిందే. అలాంటి ఓ మంచి సందేశంతో తీసిన 'బంధీ' సినిమాని ఇంత బాగా ఆదరిస్తున్న తెలుగు ప్రేక్షకులకు కృతజ్ఞతలు. ఇలాంటి ప్రోత్సాహం ఉంటే మరిన్ని మంచి చిత్రాలతో ప్రేక్షకులను మెప్పించే ప్రయత్నం చేస్తాను'' అని ఆదిత్య ఓం చెప్పారు. రఘు తిరుమల దర్శకత్వంలో ఆదిత్య ఓం నటించిన చిత్రం 'బంధీ'. గల్లీ సినిమా బ్యానర్‌పై రూపొందిన ఈ మూవీ ఫిబ్రవరి 28న విడుదలైంది. హైదరాబాద్‌లో నిర్వహించిన సక్సెస్ మీట్‌కి తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ జనరల్ సెక్రటరీ ప్రసన్నకుమార్ ముఖ్య అతిథిగా విచ్చేసి, మాట్లాడుతూ– ''పర్యావరణాన్ని రక్షించాలనే నేపథ్యంలో తీసిన 'బంధీ' అందర్నీ ఆకట్టుకుంటోంది. ఆదిత్య ఓం యూపీ నుంచి ఇక్కడకు వచ్చి ఎంతో ప్యాషన్‌తో పని చేస్తున్నారు'' అన్నారు. రఘు తిరుమల మాట్లాడుతూ– ''నాలాంటి కొత్త వాళ్లని ఆదిత్య ఓంగారు బాగా ప్రోత్సహించారు. ఆయన లేకపోతే ఈ సినిమా లేదు. మా చిత్రాన్ని ఇంతలా ఆదరిస్తున్న ప్రేక్షకులకు ధన్యవాదాలు'' అని తెలిపారు.



● ఆదిత్య ఓం, రఘు తిరుమల

బోలెడంత షాపింగ్..!

పదేళ్లలో రూ.1,90,00,000 కోట్లకు రిటైల్ ● 2024లో రూ.82,00,000 కోట్ల వ్యయం

సాక్షి, బిజినెస్ బ్యూరో: పెరుగుతున్న మధ్యతరగతి, ఆదాయాల్లో వృద్ధి, డిజిటల్ అవగాహన కలిగిన యువ కస్టమర్లు, విస్తరిస్తున్న మహిళా శ్రామిక శక్తి.. ఇంకేముంది బోలెడంత షాపింగ్ చేస్తున్నారు. దేశవ్యాప్తంగా వినియోగదార్లు గత ఏడాది రూ.82,00,000 కోట్ల విలువైన వస్తువులను కొనుగోలు చేశారు. మన దేశంలోకి విదేశీ కంపెనీల రాక, అలాగే బీటూసీ బ్రాండ్లు వెల్లువెత్తడం, మారుతున్న ప్రజల అభిరుచులతో రిటైల్ మార్కెట్ అంచనాలను మించి రికార్డులను సృష్టిస్తోంది. వచ్చే దశాబ్దంలో భారతీయ రిటైల్ మార్కెట్ ఏటా 8.8 శాతం వృద్ధి చెంది 2034 నాటికి రూ.1,90,00,000 కోట్లు మించిపోనుందని బోస్టన్ కన్సల్టింగ్ గ్రూప్, రిటైలర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సంయుక్త నివేదిక వెల్లడించింది.



రిటైల్ రంగం పరుగెడుతోంది..

ఆన్‌లైన్ షాపింగ్ విస్తృతి	
2019	2024
18%	50%

2014లో రూ.35,00,000 కోట్ల నుంచి వార్షిక ప్రాతిపదికన రిటైల్ రంగం ఏటా 8.9 శాతం దూసుకెళ్లిందంటే కొనుగోలు తీరుతెన్నుల్లో వస్తున్న మార్పులను అర్థం చేసుకోవచ్చు. జీవనశైలి, వినోదం కోసం చేస్తున్న వ్యయాలు ఏటా 10 శాతం పెరిగాయి. వ్యవస్థీకృత రిటైల్‌లో పెట్టుబడులు 2014–2024 మధ్య రెండింతలయ్యాయి. ఈ కాలంలో ఆన్‌లైన్ షాపింగ్‌లో 30 శాతం వృద్ధి నమోదైంది. వినియోగానికి అనుగుణంగా రిటైల్ రంగం పరుగెడుతోంది. భారతదేశ వినియోగ వృద్ధి ఇతర ఆర్థిక వ్యవస్థల కంటే ఎక్కువగా ఉండడం



విశేషం. ఈ నేపథ్యంలో 2030 నాటికి మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరిస్తుందని అంచనా. 32.5 కోట్లుగా ఉన్న గృహాల సంఖ్య 2034 నాటికి 40.7 కోట్లకు చేరుకోనుందని నివేదికలు చెబుతున్నాయి.

ఆర్థిక స్తోమతనుబట్టి..

వినియోగదార్ల కొనుగోళ్లను నిర్ణయిస్తున్న అంశాలు ఆర్థిక స్తోమతనుబట్టి మారుతున్నాయి. దిగువ మధ్యతరగతి కస్టమర్లలో అత్యధికుల షాపింగ్‌ను ధర ప్రభావితం చేస్తోంది. మధ్య తరగతి, అధిక ఆదాయ కుటుంబాల్లో ఎక్కువ మంది ఫీచర్లకే ప్రాధాన్యత ఇస్తున్నారు.

వర్గం	ధర	ఫీచర్స్
దిగువ తరగతి	51%	41%
మధ్య తరగతి	39%	41%
అధిక ఆదాయ	37%	40%

కొనుగోలు నిర్ణయం ఇలా..

ఏదైనా వస్తువును కొనుగోలు చేయాలంటే అత్యధికులు ఆఫ్‌లైన్‌పైనే ఆధారపడుతున్నారు. అంటే ప్రత్యక్షంగా దుకాణాలకు వెళ్లి కావాల్సిన ఉత్పత్తులను చూసి, ముట్టుకుని నిర్ణయం తీసుకుంటున్నారన్న మాట. మిశ్రమ మార్గాలలో అంటే నేరుగా షాప్‌కు వెళ్లి వస్తువులను పరిశీలించి ఆన్‌లైన్‌లో ఆర్డర్ పెట్టడం లేదా ఆన్‌లైన్‌లో పరిశోధించి ఆఫ్‌లైన్‌లో కొనడం.

ఆఫ్‌లైన్ ద్వారా	- 58%
ఆన్‌లైన్ విధానంలో	- 26%
మిశ్రమ మార్గాల్లో	- 16%



లోకల్‌కే మొగ్గు..

భారతీయ బ్రాండ్లు, స్థానిక ఉత్పత్తులను కొనడానికి జనం ఇష్టపడుతున్నారు. 2016 నుండి భారత్‌లో 600లపైచిలుకు స్వదేశీ డైరెక్ట్ టు కంజ్యూమర్ (డీటీసీ) బ్రాండ్లు ఉద్భవించాయి.



70% దేశీయంగా తయారైన ఆహారోత్పత్తులు కొనుగోలు చేస్తున్నవారు

45% వ్యక్తిగత సంరక్షణ, దుస్తులు కొంటున్నవారు

విదేశీ బ్రాండ్లకు సై..

ప్రపంచీకరణ, విదేశీ బ్రాండ్ల పట్ల భారతీయులు సానుకూలంగా భావిస్తున్నారు. గ్లోబల్ బ్రాండ్లకై వినియోగదారుల డిమాండ్‌ను తీర్చడానికి గడిచిన నాలుగు సంవత్సరాల్లో భారత్‌కు 60కిపైగా విదేశీ సంస్థలు ఎంట్రీ ఇచ్చాయి.



51% ప్రపంచీకరణ నాకు మేలు చేస్తుంది

49% నేను ప్రపంచ పౌరుడిని


48% ప్రపంచ బ్రాండ్లు మెరుగైన ఉత్పత్తులను తయారు చేస్తాయి -

26% దిగుమతి చేసుకున్న ఉత్పత్తులు స్థానిక జీవనశైలికి అనుగుణంగా తయారు కావు

మందగమనంలోకి అమెరికా!

ఫెడరల్ రిజర్వ్ చైర్మన్ జెరోమ్ పావెల్ అంచనా ● తీవ్ర అనిశ్చితి పరిస్థితుల నేపథ్యం

వాషింగ్టన్: తీవ్ర అనిశ్చితి పరిస్థితుల నేపథ్యంలో అమెరికా ఆర్థిక వ్యవస్థ మందగమనంలోకి అడుగు పెట్టొచ్చని ఫెడరల్ రిజర్వ్ చైర్మన్ జెరోమ్ పావెల్ అభిప్రాయపడ్డారు. వినియోగదారుల వ్యయంలో మందగమనం సంభవించే అవకాశముందని, ముఖ్యంగా ఆర్థిక పరిస్థితులపై తీవ్ర అనిశ్చితి కొనసాగుతోందని వ్యాపార వర్గాల్లో అంచనాలు నెలకొన్నాయి. ఈ వార్తల నేపథ్యంలో ఫెడ్ చైర్మన్ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. చికాగో బూత్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌లో జరిగిన ఆర్థిక ఫోరంలో ఆయన చేసిన ప్రసంగంలో ముఖ్యాంశాలు.



- కొత్త ట్రంప్ ప్రభుత్వ విధానాలు ఆర్థిక వ్యవస్థపై ఎలాంటి ప్రభావం చూపుతాయో అన్న అంశంపై స్పష్టత వచ్చే వరకు ఫెడ్ వడ్డీ రేట్లను తగ్గించడంలో ఏ మాత్రం తొందరపడబోదు.
- కొత్త ప్రభుత్వం 4 ప్రధాన రంగాల్లో గణనీయమైన విధాన మార్పులను అమలు చేసే ప్రక్రియలో ఉంది. వాణిజ్యం, వలస, ద్రవ్య, నియంత్రణ విధానాల్లో మార్పులు చోటుచేసుకునే వీలుంది. ఈ మార్పులు, వాటి ప్రభావాలపై అనిశ్చితి తీవ్రంగా ఉంది.
- పరిస్థితులు ఎలా మారుతున్నాయో అర్థం చేసుకోవడంపై మేము దృష్టి సారిస్తాము. మేము తొందరపడాల్సిన అవసరం లేదు. స్పష్టత కోసం ఎదురుచూడడానికే మేము మొగ్గు చూపిస్తాము.
- ఆర్థిక వ్యవస్థ పటిష్ట స్థితిలో ఉంది. అయితే చోటుచేసుకుంటున్న పరిణామాలు భవిష్యత్తులో వ్యయాలు, అలాగే పెట్టుబడులపై ఎలా ప్రభావం చూపుతాయో వేచి చూడాలి.
- కీలక సూచీలు స్థిరంగానే ఉన్నాయని. అయితే ద్రవ్యోల్బణం విషయంలో ఇంకా అస్పష్టత కొనసాగుతోంది. ఉపాధి కల్పనలో మాత్రం వృద్ధి ధోరణి కొనసాగుతోంది.
- ద్రవ్యోల్బణం అంచనాలను మించిన వేగంతో తగ్గినా లేదా ఆర్థిక వ్యవస్థ బలహీనపడినా ద్రవ్య విధానంలో అవసరమైన మార్పులు చేసేందుకు సిద్ధంగా ఉన్నాం.
- ఫిబ్రవరి నెలలో అమెరికా ప్రభుత్వం 1,51,000 ఉద్యోగాల వృద్ధిని నమోదుచేసింది. అయితే సెప్టెంబర్ నుంచి చూస్తే నెలకు సగటున 1,91,000 ఉద్యోగ కల్పన జరుగుతోంది.

మార్కెట్లపై ప్రతికూలతలు..

ట్రంప్ ప్రభుత్వం మెక్సికో, కెనడా వంటి ప్రధాన వ్యాపార భాగస్వాములపై భారీ దిగుమతి సుంకాలను ప్రకటించడం, అలాగే చైనా నుండి దిగుమతులపై సుంకాలను రెట్టింపు చేయడం వంటి పరిణామాలు మార్కెట్లపై తీవ్ర ప్రభావం చూపుతున్న సంగతి తెలిసిందే. అయితే తాజా పరిస్థితుల నేపథ్యంలో ఫెడరల్ రిజర్వ్ మార్చి 18–19 తేదీల్లో జరిపే తన పాలసీ సమావేశంలో 4.25%–4.50% శ్రేణిలో వడ్డీ రేట్లను స్థిరంగా ఉంచే అవకాశం ఉంది. పాలసీ నిర్ణేతలు ఆవిష్కరించే కొత్త ఆర్థిక అంచనాలు.. ట్రంప్ ప్రభుత్వ తొలి రెండు నెలల విధానాలు, ఇవి ద్రవ్యోల్బణం, ఉపాధి, ఆర్థిక వృద్ధి, వడ్డీ రేట్ల మార్గాన్ని ఎలా ప్రభావితం చేశాయనే అంశంపై స్పష్టత నిచ్చే అవకాశం ఉంది. కాగా, మార్కెట్‌లో పెట్టుబడిదారులు ప్రస్తుతం అమెరికా ఆర్థిక వ్యవస్థలో మాంద్యం సంభవించే అవకాశం ఎక్కువగా ఉందని భావిస్తున్నారు. ఈ ఏడాది చివరి నాటికి ఫెడ్ మూడు దఫాలుగా పావు శాతం (మొత్తం 0.75%) చొప్పున రేటు కోతలు ఉండే అవకాశం ఉందని భావిస్తుండడం గమనార్హం.

ఎల్ఐసీ హౌసింగ్ రుణ సమీకరణ

రూ. 1.23 లక్షల కోట్లకు బోర్డు ఓకే

ముంబై: వచ్చే ఆర్థిక సంవత్సరం(2025–26)లో రుణాల ద్వారా రూ. 1.23 లక్షల కోట్లు సమీకరించేందుకు బోర్డు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు ఎల్ఐసీ హౌసింగ్ ఫైనాన్స్ తాజాగా వెల్లడించింది. రుణాలు, బాండ్ల జారీ, రిడీమబుల్ ఎన్‌సీడీలు, ప్రయివేట్ ప్లేస్‌మెంట్‌సహా ఇతర మార్గాలను ఇందుకు వినియోగించుకోనున్నట్లు తెలియజేసింది. ఆడిట్ కమిటీ సిఫారసులమేరకు రుణ సమీకరణను ప్రతిపాదించినట్లు పేర్కొంది.

అప్పుల్లోనూ ఆమెదే పైచేయి

- పురుషుల కంటే ఎక్కువ
- చెల్లింపుల్లోనూ మగువలే మెరుగు
- క్రిఫ్ హైమార్క్ నివేదిక

ముంబై: ఇంటి బాధ్యతల్లో కీలక పాత్ర పోషిస్తున్న మహిళలు.. కుటుంబం, వృత్తిపరమైన అవసరాలకు రుణాలను తీసుకోవడానికీ వెనుకాడడం లేదు. గతేడాది యాక్టివ్ రుణ గ్రహీతల్లో పురుషుల కంటే మహిళలే ఎక్కువగా ఉన్నట్టు క్రెడిట్ బ్యూరో సంస్థ 'క్రిఫ్ హైమార్క్' తెలిపింది. రుణాలు తీసుకోవడమే కాదు, వాటిని సకాలంలో తిరిగి చెల్లించడంలోనూ పురుషులతో పోల్చితే మహిళలే మెరుగైన పనితీరు చూపిస్తున్నట్టు వెల్లడించింది. 2024 డిసెంబర్ నాటికి యాక్టివ్ మహిళా రుణగ్రహీతలు 10.8 శాతం పెరిగి 8.3 కోట్లుగా ఉన్నట్టు తెలిపింది. అదే సమయంలో పురుష రుణ గ్రహీతల్లో వృద్ధి 6.5 శాతంగానే ఉన్నట్టు వెల్లడించింది. ''రుణాల విషయంలో పురుషుల కంటే స్త్రీలే మెరుగైన ప్రవర్తన చూపిస్తున్నారు. బంగారం రుణాలు మినహా మిగిలిన రుణాల్లో 91 నుంచి 180 రోజుల వరకు చెల్లింపులు నిలిపివేసిన రుణ గ్రహీతల్లో మహిళలు తక్కువగా ఉన్నారు''అని ఈ నివేదిక తెలిపింది. గృహ రుణాలు, వ్యాపార రుణాలు, వ్యవసాయం, ట్రాక్టర్ల రుణాలు, ప్రాపర్టీ రుణాలు, విద్యా రుణాల్లో మహిళల తీరు మెరుగ్గా ఉన్నట్టు వెల్లడించింది. వినియోగ రుణాల్లోనూ (కన్జ్యూమర్) మగవారి కంటే చెల్లింపుల పరంగా మహిళల ప్రవర్తనే మెరుగ్గా ఉన్నట్టు తెలిపింది. 2024 చివరికి మొత్తం మహిళా రుణ గ్రహీతలు 18 శాతం పెరిగి 36.5 కోట్లుగా ఉన్నట్టు పేర్కొంది. రుణాల్లో 35 ఏళ్ల లోపు వారు ఎక్కువగా తీసుకుంటున్నారు. మహిళలకు సంబంధించి గృహ రుణాలు, వ్యాపార రుణాలు, ప్రాపర్టీ రుణాలు, ఆటో రుణాలు, క్రెడిట్ కార్డ్, విద్యా రుణాల్లో మహారాష్ట్ర ముందున్నట్టు ఈ నివేదిక వెల్లడించింది.



రూ. 1,000కే ఎస్ఎస్ఈ ఇన్‌స్ట్రుమెంట్

- ఎన్‌పీవోలకు వెసులుబాటు
- సెబీ తాజా ప్రతిపాదనలు



న్యూఢిల్లీ: క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ తాజాగా లాభాపేక్షలేని సంస్థ(ఎన్‌పీవో)ల నిధుల సమీకరణకు మరింత వెసులుబాటు కల్పించే యోచనలో ఉంది. ఇందుకు వీలుగా ఎన్‌పీవోలు జారీ చేసే జీరో కూపన్, జీరో ప్రిన్సిపల్ ఇన్‌స్ట్రుమెంట్(జెడ్‌సీజెడ్‌పీ)ల కనీస పరిమాణాన్ని భారీగా తగ్గించేందుకు ప్రతిపాదించింది. వెరసి ప్రస్తుత రూ. 10,000 నుంచి రూ. 5,000 లేదా రూ. 1,000కు దరఖాస్తు కనీస పరిమాణాన్ని కుదించాలని భావిస్తోంది. ఇందుకు చర్చా పత్రాన్ని విడుదల చేసింది. తద్వారా మార్చి 14వరకూ ప్రజాభిప్రాయ సేకరణకు తెరతీసింది. సోషల్ స్టాక్ ఎక్స్ఛేంజీ(ఎస్ఎస్ఈ)లతో ఎన్‌పీవోలు జెడ్‌సీజెడ్‌పీలను జారీ చేస్తుంటాయి. ప్రస్తుత ప్రతిపాదనలు అమలైతే ఎన్‌పీవోలు జారీ చేసే జెడ్‌సీజెడ్‌పీలలో రిటైలర్ల పెట్టుబడులు భారీగా పెరిగే అవకాశముంటుంది.

జెడ్‌సీజెడ్‌పీలంటే?

సెబీ ఎన్‌పీవోల కోసం ఎస్ఎస్ఈని ఏర్పాటు చేసింది. ఎస్ఎస్ఈలో లిస్టయిన ఎన్‌పీవోలు అందుకునే విరాళాలకుగాను జెడ్‌సీజెడ్‌పీలను జారీ చేస్తాయి. నిజానికి 2023 నవంబర్‌లో జెడ్‌సీజెడ్‌పీ కనీస పరిమాణాన్ని రూ. 2 లక్షల నుంచి రూ. 10,000కు కుదించింది. ఇదేవిధంగా జెడ్‌సీజెడ్‌పీ మొత్తం పరిమాణాన్ని రూ. కోటి నుంచి రూ. 50 లక్షలకు తగ్గించింది. ఎస్ఎస్ఈల ద్వారా రిటైలర్ల విరాళాలు పెరుగుతుండటాన్ని ఎన్‌పీవోలు సెబీ దృష్టికి తీసుకువెళ్లాయి. అయితే రూ. 10,000 కనీస పరిమాణం పలువురికి అడ్డు తగులుతున్నట్లు అభిప్రాయపడ్డాయి. ప్రస్తుత స్టాక్ ఎక్స్ఛేంజీలకు భిన్నమైన ఎస్ఎస్ఈ దేశీయంగా కొత్త విభాగంకాగా.. సామాజిక సంస్థలు, దాతలను కలపడంతోపాటు.. నిధుల ఆసరాకు వీలు కలుగుతుంది.

హీరో ఫిన్‌కార్ప్‌తో మారుతీ సుజుకీ ఒప్పందం



ముంబై: కస్టమర్లకు రుణ సౌకర్యం కోసం హీరో ఫిన్ కార్ప్‌తో ఒప్పందం కుదుర్చుకున్నట్లు మారుతీ సుజుకీ ఇండియా శనివారం తెలిపింది. వినియోగదార్ల విభిన్న అభిరుచులు, అవసరాలకు అనుగుణంగా వినూత్న, పారదర్శక, ఆకర్షణీయ రుణ పరిష్కారాలు అందిస్తామని మారుతీ సుజుకీ మార్కెటింగ్, సేల్స్ సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పార్థో బెనర్జీ తెలిపారు. దీంతో మారుతీ సుజుకీ ఇండియా 40 కంటే ఎక్కువ రిటైల్ ఫైనాన్స్ భాగస్వాములను కలిగి ఉందన్నారు. ఈ భాగస్వామ్యం ప్రతి భారతీయుడికి కారు యాజమాన్యాన్ని మరింత సులభతరం చేస్తుందని హీరో ఫిన్‌కార్ప్ ఎండీ, సీఈవో అభిమన్యు ముంజాల్ అన్నారు.

2030 నాటికి 30శాతం మహిళలు: వేదాంత

న్యూఢిల్లీ: సంస్థ మొత్తం ఉద్యోగుల్లో 2030 నాటికి మహిళల సంఖ్య 30 శాతం సాధన దిశగా అడుగులు వేస్తున్నామని వేదాంత శనివారం తెలిపింది. మహిళా సిబ్బందిలో అత్యంత కీలక నిర్ణయాలు తీసుకొనే పదవుల్లో 28% మంది ఉన్నారని, ఇది దేశంలో మెటల్స్, మైనింగ్ కంపెనీల్లోనే అత్యధికమని పేర్కొంది. అర్హత కలిగిన మహిళలకు తగిన స్థానం కల్పిస్తున్నామని కంపెనీ తెలిపింది. అనువైన పని గంటలు, ఎటువంటి ప్రశ్నలు వేయకుండా వర్క్ ఫ్రమ్ హోమ్ సౌకర్యం, పిల్లల సంరక్షణ కోసం ఏడాదంతా సెలవులు, జీవిత భాగస్వామి నియామకం తదితర స్నేహపూర్వక విధానాల అమలు ద్వారా ప్రతి దశలోనూ మహిళల ప్రగతికి తోడ్పాటు అందిస్తున్నామని వివరించింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వేదాంత గ్రూప్‌నకు చెందిన హిందుస్థాన్ జింక్ ఉమెన్ ఆఫ్ జింక్ క్యాంపెయిన్ ప్రారంభించింది. మెటల్ రంగం పట్ల మహిళల్లో మరింత ఆసక్తిని పెంచడం ఈ ప్రచార కార్యక్రమ ముఖ్య ఉద్దేశం.



కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

9-3-2025

విశాఖ	410-00
చిత్తూరు	443-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	425-00
విజయవాడ	410-00
రిటైల్ ధర (డజను)	66.00
హైదరాబాద్	410-00
వరంగల్	412-00
రిటైల్ ధర	4.70

రూ. 1.5 లక్షల కోట్లకు రష్యా చమురు కొనుగోళ్లు

న్యూఢిల్లీ: ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి రష్యా నుంచి భారత్ దాదాపు 112.5 బిలియన్ యూరోల (సుమారు రూ. 1.5 లక్షల కోట్లు) ముడి చమురు కొనుగోలు చేసినట్లు సెంటర్ ఫర్ రీసెర్చ్ ఆన్ ఎనర్జీ అండ్ క్లీన్ ఎయిర్ (క్రియా) ఒక నివేదికలో తెలిపింది. రష్యా–ఉక్రెయిన్ మధ్య ఉద్రిక్తతలు మొదలైన 2022 ఫిబ్రవరి 24 నుంచి శిలాజ ఇంధనాలకు సంబంధించి రష్యాకు లభించిన చెల్లింపుల వివరాలను ఇందులో పొందుపర్చింది. దీని ప్రకారం యుద్ధం మొదలైనప్పటి నుంచి రష్యా శిలాజ ఇంధన ఎగుమతుల ద్వారా 835 బిలియన్ యూరోల ఆదాయం ఆర్జించినట్లు వివరించింది. చైనా అత్యధికంగా 235 బిలియన్ యూరోల (170 బిలియన్ యూరోల చమురు, 34.3 బిలియన్ యూరోల బొగ్గు, 30.5 బిలియన్ యూరోల గ్యాస్) ఇంధనాలు కొనుగోలు చేసింది. భారత్ 205.84 బిలియన్ యూరోల ఇంధనాలను కొనుగోలు చేసింది. ఇందులో 112.5 బిలియన్ యూరో క్రూడాయిల్, 13.25 బిలియన్ డాలర్ల బొగ్గు ఉంది. యుద్ధం వల్ల విధించిన ఆంక్షలతో రష్యా చమురు చౌకగా లభిస్తున్న నేపథ్యంలో ఆ దేశం నుంచి భారత్ గణనీయంగా కొనుగోళ్లు పెంచుకున్న సంగతి తెలిసిందే. ఒకప్పుడు బ్యారెల్‌కి 18–20 శాతం వరకు లభించిన డిస్కౌంటు ఇటీవలి కాలంలో 3 డాలర్ల దిగువకు పడిపోయింది.



ఐపీవోకు నాలెడ్జ్ రియల్టీ ట్రస్ట్

సెబీకి ప్రాస్పెక్టస్ దాఖలు



న్యూఢిల్లీ: సత్వా గ్రూప్‌తోపాటు బ్లాక్‌స్టోన్‌కు పెట్టుబడులున్న నాలెడ్జ్ రియల్టీ ట్రస్ట్ పబ్లిక్ ఇష్యూ బాట పట్టింది. ఇందుకు వీలుగా క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి ముసాయిదా ప్రాస్పెక్టస్ దాఖలు చేసింది. ఐపీవోలో భాగంగా వాటాదారులకు యూనిట్లను విక్రయించనుంది. తద్వారా రూ. 6,200 కోట్లు సమీకరించే ప్రణాళికల్లో నాలెడ్జ్ రీట్(కేఆర్‌టీ) ఉంది. కాగా.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024–25) తొలి అర్ధభాగం (ఏప్రిల్–సెప్టెంబర్)లో రూ. 1,632 కోట్ల నికర నిర్వహణ ఆదాయం సాధించింది. 2024 సెప్టెంబర్‌కల్లా ఆస్తుల విలువ రూ. 60,000 కోట్లుగా నమోదైంది. లిస్టింగ్‌కావడం ద్వారా ఆరు ప్రధాన నగరాలలో సంస్థకుగల ప్రధాన కార్యాలయ ఆస్తులను మానిటైజ్ చేసుకునే యోచనలో ఉంది. లిస్టింగ్ తదుపరి దేశీయంగా అతిపెద్ద ఆఫీస్ రీట్‌గా నిలవనున్నట్లు ఒక ప్రకటనలో కంపెనీ పేర్కొంది.

స్పైస్‌జెట్‌కు కొత్త చిక్కులు

న్యూఢిల్లీ: చవక విమానయాన సేవలు అందిస్తున్న స్పైస్‌జెట్‌కు కొత్త సమస్యలు ఎదురయ్యాయి. విమానాల లీజు రంగంలో ఉన్న ఐర్లాండ్‌కు చెందిన మూడు సంస్థలు, ఒక మాజీ పైలట్ స్పైస్‌జెట్‌పై ఎన్‌సీఎల్‌టీలో దివాలా పిటిషన్లు దాఖలు చేయడం ఇందుకు కారణం. స్పైస్‌జెట్ సుమారు రూ.110 కోట్లు బకాయి పడిందని, ఐబీసీ సెక్షన్ 9 కింద దివాలా ప్రక్రియను ప్రారంభించాలని కోరుతూ ఎస్‌జీఎఫ్ ఆల్ఫా, ఎస్‌జీఎఫ్ జెనెసిస్, ఎస్‌జీఎఫ్ చార్లీ పిటిషన్లు దాఖలు చేశాయి. ఈ వారం ప్రారంభంలో నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ విచారణ సందర్భంగా పరిష్కార చర్చలు జరుగుతున్నందున ఈ విషయాన్ని పరిష్కరించడానికి స్పైస్‌జెట్ కొంత సమయం కోరింది. తదుపరి విచారణ కోసం 2025 ఏప్రిల్ 7న మూడు పిటిషన్లను లిస్ట్ చేయాలని ఎన్‌సీఎల్‌టీ ఆదేశించింది. లీజుదారులు గతంలో స్పైస్‌జెట్‌కు ఐదు బోయింగ్ 737 విమానాలను లీజుకు ఇచ్చాయి. ఇంజిన్లతో సహా విమానంలోని భాగాలను దొంగిలించి ఇతర విమానాలలో ఉపయోగించారని ఆరోపిస్తూ ఈ కంపెనీలు స్పైస్‌జెట్‌కు లీగల్ నోటీసును పంపించాయి. 19 సంవత్సరాలుగా విమానయాన రంగంలో ఉన్న స్పైస్‌జెట్.. ఎన్‌సీఎల్‌టీ, అప్పిలేట్ ట్రిబ్యునల్ ఎన్‌సీఎల్‌ఏటీ వద్ద విల్లిస్ లీజ్, ఎయిర్‌కాజిల్ ఐర్లాండ్, విల్మింగ్టన్, సెలెస్టియల్ ఏవియేషన్ వంటి రుణదాతల నుండి దివాలా పిటిషన్లను ఎదుర్కొంటోంది.



నూకల ఎగుమతులపై నిషేధం ఎత్తివేత

న్యూఢిల్లీ: నూకల ఎగుమతులపై కేంద్ర ప్రభుత్వం నిషేధం ఎత్తివేసింది. ఆదేశాలు వెంటనే అమల్లోకి వస్తాయని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ తెలిపింది. ప్రభుత్వ గోడౌన్లలో బియ్యం నిల్వలు పుష్కలంగా ఉండటంతో పాటు రిటైల్ ధరలూ అదుపులోకి రావడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. నిల్వలు భారీగా పెరగడంతో ఎగుమతులకు ఆమోదం ఇవ్వాలంటూ ఎగుమతిదారులు ప్రభుత్వాన్ని గతంలో కోరారు. కాగా 2022 సెప్టెంబర్‌లో నూకల ఎగుమతులపై భారత్ నిషేధం విధించింది. గత ఏడాది బాస్మతియేతర తెల్ల బియ్యం ఎగుమతుల కోసం నిర్దేశించిన టన్నుకు 490 డాలర్ల కనీస ఎగుమతి ధరను (ఎంఈపీ) ప్రభుత్వం తొలగించింది. అలాగే ఈ రకం ఎగుమతులపై ఉన్న పూర్తి నిషేధాన్ని ఉపసంహరించుకుంది. భారత్ గత ఆర్థిక సంవత్సరంలో గాంబియా, బెనిన్, సెనెగల్, ఇండోనేషియా తదితర దేశాలకు 194 మిలియన్ డాలర్ల విలువైన నూకలు ఎగుమతి చేసింది. 2022–23లో 983 మిలియన్ డాలర్లు, 2021–22లో 1.13 బిలియన్ డాలర్ల విలువ చేసే నూకలు భారత్ నుంచి విదేశాలకు చేరాయి.



గంటకు రూ. 67కే జీపీయూలు

ఐటీ మంత్రి అశ్విని వైష్ణవ్

న్యూఢిల్లీ: ఇండియాఏఐ కంప్యూట్ పోర్టల్‌లో గ్రాఫిక్స్ ప్రాసెసింగ్ యూనిట్లు (జీపీయూలు) అత్యంత తక్కువ ధరకి, గంటకు రూ. 67కే అందుబాటులో ఉంటాయని కేంద్ర ఐటీ మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. ఇండియా ఏఐ మిషన్ మొదటి వార్షికోత్సవం సందర్భంగా ఇండియాఏఐ కంప్యూట్ పోర్టల్, డేటాసెట్ ప్లాట్‌ఫాం ఏఐకోశ మొదలైనవి ఆయన ఆవిష్కరించారు. అంకుర సంస్థలు, విద్యార్థులు, పరిశోధకులకు మొదలైన వారికి ఇండియాఏఐ కంప్యూట్ పోర్టల్‌లో 18,000 జీపీయులు, క్లౌడ్ స్టోరేజ్, ఇతరత్రా ఏఐ సర్వీసులు అందుబాటులో ఉంటాయని మంత్రి వివరించారు. సొంత ఫౌండేషనల్ మోడల్స్‌ను రూపొందించుకోవడంపై భారత్ పురోగతి బాగుందన్నారు. ఇందుకు సంబంధించి 67 దరఖాస్తులు వచ్చినట్లు చెప్పారు. ఏఐ అప్లికేషన్స్, సొల్యూషన్స్‌ను తయారు చేయడంలో పరిశోధకులు, ఎంట్రప్రెన్యూర్లు, స్టార్టప్‌లకు ఉపయోగపడేలా డేటాసెట్లు, సాధనాలు మొదలైనవన్నీ ఏఐకోశలో ఉంటాయి. ప్రభుత్వ–ప్రైవేట్ భాగస్వామ్యం ద్వారా ఏఐ ఆవిష్కరణలకు తోడ్పడే సమగ్ర వ్యవస్థను తయారు చేసే దిశగా కేంద్ర క్యాబినెట్ గతేడాది మార్చిలో రూ. 10,372 కోట్ల బడ్జెట్‌తో ఇండియాఏఐ మిషన్ ఏర్పాటుకు ఆమోదముద్ర వేసింది.




సెమీఫైనల్లో ఆయుశ్ ఓటమి



పారిస్: ఓర్లియాన్స్ మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్-300 బ్యాడ్మింటన్ టోర్నమెంట్ సెమీఫైనల్లో భారత యువ షట్లర్ ఆయుశ్ శెట్టి పరాజయం పాలయ్యాడు. శనివారం జరిగిన పురుషుల సింగిల్స్ సెమీఫైనల్లో ప్రపంచ 48వ ర్యాంకర్ ఆయుశ్ శెట్టి 13-21, 15-21తో ప్రపంచ 14వ ర్యాంకర్ చున్ యీ లిన్ (చైనీస్ తైపీ) చేతిలో ఓడాడు. 40 నిమిషాల్లో ముగిసిన సెమీస్ పోరులో ఆయుశ్ వరుస గేముల్లో పరాజయం పాలయ్యాడు. తొలి గేమ్ ఆరంభంలో చక్కటి ఆటతీరు కనబర్చిన ఆయుశ్ 6-3తో ఆధిక్యంలో నిలిచాడు. అనంతరం 7-5కు చేరుకున్న ఆయుశ్... ప్రత్యర్థిని కోలుకునేందుకు అవకాశం ఇచ్చాడు. దీంతో చైనీస్ తైపీ షట్లర్ 7-7తో స్కోరు సమం చేశాడు. ఇక అక్కడి నుంచి మ్యాచ్ మొత్తం జోరు కనబర్చిన చున్ యీ లిన్ వరుస గేమ్స్‌లో విజేతగా నిలిచాడు. 2023 ప్రపంచ జూనియర్ చాంపియన్‌షిప్‌లో కాంస్య పతకం నెగ్గిన 19 ఏళ్ల ఆయుశ్ ఈ టోర్నీలో... చక్కటి విజయాలతో సెమీస్ చేరాడు. తొలి రౌండ్‌లో ప్రపంచ మాజీ చాంపియన్ కీన్ యె లో (సింగపూర్)పై గెలిచిన ఆయుశ్... ప్రి క్వార్టర్స్‌లో ప్రపంచ 38వ ర్యాంకర్ జేసన్ గుణవాన్ (హాంకాంగ్)ను ఓడించాడు. క్వార్టర్స్‌లో ప్రపంచ 31వ ర్యాంకర్ రస్మస్ గెమ్కె (డెన్మార్క్)పై విజయం సాధించిన ఆయుశ్... సెమీస్‌లో అదే జోరు కొనసాగించలేకపోయాడు. దీంతో ఈ టోర్నీలో భారత్ పోరాటం ముగిసింది.

ఐపీఎల్ తొలి దశకు బుమ్రా దూరం!



ముంబై: భారత స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా... ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) తొలి దశ పోటీలకు దూరమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. లీగ్‌లో బుమ్రా ముంబై ఇండియన్స్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. ఆస్ట్రేలియాతో 'బోర్డర్-గావస్కర్ ట్రోఫీ' సందర్భంగా గాయపడిన స్టార్ పేసర్... వెన్నునొప్పి కారణంగా ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీలో ఆడటం లేదు. ప్రస్తుతం బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ (సీఓఈ)లో రీహాబిలిటేషన్‌లో ఉన్న బుమ్రా... ఈ నెల మార్చి 22 నుంచి ప్రారంభమయ్యే ఐపీఎల్ 18వ సీజన్‌కు ముందు కోలుకునే అవకాశాలు కనిపించడం లేదు. 'బుమ్రా గాయం తీవ్రత తక్కువే ఉంది. సీఓఈలో బౌలింగ్ ప్రాక్టీస్ కూడా ప్రారంభించాడు. అయితే అతడు పోటీ క్రికెట్‌లో ఇప్పుడప్పుడే బౌలింగ్ చేయడం కష్టమే. వచ్చే నెల తొలి వారం వరకు మరింత స్పష్టత వస్తుంది' అని బీసీసీఐ వర్గాలు వెల్లడించాయి. ఈ నేపథ్యంలో ముంబై ఇండియన్స్ ఆడనున్న తొలి మూడు, నాలుగు మ్యాచ్‌లకు బుమ్రా అందుబాటులో ఉండకపోవచ్చు. ఐపీఎల్ అనంతరం భారత జట్టు ఐదు టెస్టులు ఆడేందుకు ఇంగ్లండ్ వెళ్లనున్న నేపథ్యంలో బుమ్రా గాయం విషయంలో బీసీసీఐ ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది. పనిభారాన్ని దృష్టిలో పెట్టుకొని బుమ్రా విషయంలో నిర్ణయం తీసుకోనుంది.



జార్జియా వోల్

వోల్ కమాల్... బెంగళూరు ధమాల్

12 పరుగుల తేడాతో యూపీ వారియర్స్ గెలుపు

- జార్జియా వోల్ 99 నాటౌట్
- యూపీని వణికించిన రిచా, స్నేహ

లక్నో: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) చరిత్రకెక్కిన పరుగుల పోరులో డిఫెండింగ్ చాంపియన్ బెంగళూరు పోరాడి ఓడింది. డబ్ల్యూపీఎల్ ప్లే ఆఫ్స్‌కు దూరమైంది. గెలిస్తే రేసులో నిలవాల్సిన మ్యాచ్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) 12 పరుగుల తేడాతో యూపీ వారియర్స్ చేతిలో పరాజయం చవిచూసింది. **తాజా ఫలితంతో ముంబై ఇండియన్స్, గుజరాత్ జెయింట్స్ ప్లేఆఫ్స్‌కు అర్హత సాధించాయి. ఢిల్లీ ఇదివరకే ప్లేఆఫ్స్ చేరింది.** ముందుగా బ్యాటింగ్‌కు దిగిన వారియర్స్ 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 225 పరుగుల భారీ స్కోరు చేసింది. డబ్ల్యూపీఎల్‌లో ఇదే అత్యధిక స్కోరు కాగా... 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' జార్జియా వోల్ (56 బంతుల్లో 99 నాటౌట్; 17 ఫోర్లు, 1 సిక్స్) ఆకాశమే హద్దుగా చెలరేగింది. కిరణ్ నవ్‌గిరే (16 బంతుల్లో 46; 2 ఫోర్లు, 5 సిక్స్‌లు) ధనాధన్ ఆట ఆడేసింది. ఆర్సీబీ బౌలర్లలో జార్జియా వేర్‌హమ్ 2 వికెట్లు తీసింది. అనంతరం కష్టమైన లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన రాయల్ చాలెంజర్స్ 19.3 ఓవర్లలో 213 పరుగులకు ఆలౌటైంది. రిచా ఘోష్ (33 బంతుల్లో 69; 6 ఫోర్లు, 5 సిక్స్‌లు), స్నేహ రాణా (6 బంతుల్లో 26; 2 ఫోర్లు, 3 సిక్స్‌లు) మెరుపులతో యూపీ శిబిరాన్ని వణికించారు. సోఫీ ఎకిల్‌స్టోన్, దీప్తిశర్మ చెరో 3 వికెట్లు తీశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం (మార్చి 8) సందర్భంగా యూపీ ప్లేయర్ తమ రెగ్యులర్ టీమ్ కిట్‌కు బదులుగా గులాబీ రంగు జెర్సీలను ధరించారు.

జార్జియా 'జిగేల్'

సొంత మైదానంలో ఆఖరి పోరులో బ్యాటింగ్‌కు దిగిన యూపీ ఓపెనర్లు గ్రేస్ హారిస్, జార్జియా వోల్ బెంగళూరు బౌలర్లపై విరుచుకుపడ్డారు. బంతిని అదేపనిగా బౌండరీని దాటించడంతో స్కోరు రాకెట్ వేగంతో దూసుకుపోయింది. పవర్‌ప్లేలో 67 పరుగులు రాబట్టింది. గ్రేస్ హారిస్ (22 బంతుల్లో 39; 7 ఫోర్లు, 1 సిక్స్) రనౌట్ కావడంతో తొలి వికెట్‌కు 77 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. అయితే కిరణ్ నవ్‌గిరే రావడంతో మరో మెరుపు భాగస్వామ్యం నమోదైంది. 9.3 ఓవర్లలోనే వారియర్స్ స్కోరు వందకు చేరుకుంది. 13వ ఓవర్లో కిరణ్ అవుట్ కావడంతో రెండో వికెట్‌కు 71 పరుగుల భాగస్వామ్యానికి తెరపడగా... మరోవైపు జార్జియా వోల్ కడదాకా అజేయంగా క్రీజులో నిలిచింది. పరుగు తేడాతో సెంచరీ భాగ్యాన్ని దక్కించుకోలేక పోయింది. ఆఖరి బంతికి రెండో పరుగు తీసే క్రమంలో దీప్తి రనౌటైంది.

రిచా ధనాధన్ షో వృథా

మూడో ఓవర్లో కెప్టెన్ స్మృతి మంధాన (4), మరుసటి ఓవర్లో మేఘన (12 బంతుల్లో 27; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), పవర్ ప్లే తర్వాత ఎలిస్ పెర్రీ (15 బంతుల్లో 28; 6 ఫోర్లు), రాఘ్వి బిస్త్ (14), కనిక (8) నిష్క్రమించడంతో 107/5 స్కోరు వద్ద బెంగళూరు ఆశలు అడుగంటాయి. ఈ దశలో హిట్టర్ రిచా ఘోష్ అసాధారణ పోరాటం చేసింది. భారీ సిక్స్‌లు, చూడచక్కని బౌండరీలతో విజయంపై ఆశలు రేపింది. 25 బంతుల్లోనే ఫిఫ్టీ పూర్తిచేసుకుంది. 22 బంతుల్లో 55 పరుగులు చేయాల్సిన దశలో రిచా అవుటైంది. చార్లీ డీన్ (9), జార్జియా వేర్‌హామ్ (17) నిరాశపరిచారు.



స్నేహ రాణా

4, 6, 6, 4, 6, అవుట్

19వ ఓవర్లో స్నేహ రాణా మెరుపులు బెంగళూరులో ఆశలు రేపాయి. దీప్తి వేసిన ఈ ఓవర్లో కిమ్‌గార్త్ సింగిల్ తీసి స్నేహకు స్ట్రయిక్ ఇచ్చింది. తర్వాతి ఐదు బంతుల్లో ఆమె 4, 6, 6, 4(నోబాల్), 6లతో చకచకా 26 పరుగులు చేసింది. 7 బంతుల్లో 15 పరుగుల సమీకరణం సులువనిపించింది. కానీ ఆఖరి బంతికి స్నేహ రాణా భారీ షాట్‌కు ప్రయత్నించి బౌండరీ వద్ద పూనమ్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరగడంతో యూపీ ఊపిరి పీల్చుకుంది.

స్కోరు వివరాలు

యూపీ వారియర్స్ ఇన్నింగ్స్: గ్రేస్ హారిస్ రనౌట్ 39; జార్జియా వోల్ నాటౌట్ 99; కిరణ్ (సి) పెర్రి (బి) వేర్‌హామ్ 46; చినెల్లీ హెన్రీ (సి) స్మృతి (బి) వేర్‌హామ్ 19; సోఫీ (బి) చార్లీడీన్ 13; దీప్తిశర్మ రనౌట్ 1; ఎక్స్‌ట్రాలు 8; **మొత్తం (20 ఓవర్లలో 5 వికెట్లకు) 225. వికెట్ల పతనం:** 1-77, 2-148, 3-191, 4-223, 5-225. **బౌలింగ్:** కిమ్ గార్త్ 4-0-42-0, రేణుక సింగ్ 3-0-42-0, చార్లీ డీన్ 4-0-47-1, ఎలీస్ పెర్రి 4-0-35-0, జార్జియా వేర్‌హామ్ 4-0-43-2, స్నేహ రాణా 1-0-13-0.

రాయల్ చాలెంజర్స్ బెంగళూరు ఇన్నింగ్స్: మేఘన (సి) వోల్ (బి) సోఫీ 27; స్మృతి మంధాన (సి) వోల్ (బి) హెన్రీ 4; ఎలిస్ పెర్రి (బి) అంజలి 28; రాఘ్వి బిస్త్ (సి) ఉమాఛెత్రి (బి) హెన్రీ 14; రిచా ఘోష్ (సి) హెన్రీ (బి) దీప్తి శర్మ 69; కనిక (బి) దీప్తి శర్మ 8; జార్జియా వేర్‌హమ్ (సి) సబ్-ఆరుశ్రీ (బి) సోఫీ 17; చార్లీ డీన్ (సి) కిరణ్ (బి) సోఫీ 9; కిమ్‌గార్త్ నాటౌట్ 3; స్నేహ రాణా (సి) పూనమ్ (బి) దీప్తిశర్మ 26; రేణుక రనౌట్ 1; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం (19.3 ఓవర్లలో ఆలౌట్) 213. వికెట్ల పతనం:** 1-29, 2-43, 3-76, 4-80, 5-107, 6-171, 7-182, 8-183, 9-211, 10-213. **బౌలింగ్:** చినెల్లీ హెన్రీ 4-0-39-2, గ్రేస్ హారిస్ 1-0-22-0, సోఫి ఎకిల్‌స్టోన్ 4-0-25-3, క్రాంతి గౌడ్ 3-0-35-0, అంజలి శర్వాణి 3-0-40-1, దీప్తిశర్మ 4-0-50-3, జార్జియా వోల్ 0.3-0-2-0.

క్లాసికల్ అంటేనే ఇష్టం

ప్రపంచ చెస్ చాంపియన్ గుకేశ్ వ్యాఖ్య



న్యూఢిల్లీ: చదరంగంలో ఎన్ని ఫార్మాట్లు వచ్చినా... క్లాసికల్‌కు ఉన్న ప్రాధాన్యత వేరని ప్రపంచ చెస్ చాంపియన్ దొమ్మరాజు గుకేశ్ అన్నాడు. ఇటీవలి కాలంలో అన్నీ ఫార్మాట్లలో సత్తా చాటుతున్న గుకేశ్... తనకు స్వతహాగా సంప్రదాయ క్లాసికల్ గేమ్ అంటేనే ఎక్కువ ఇష్టమని వెల్లడించాడు. 'ఏ ఫార్మాట్‌లో ఆడాలి అనే దాని గురించి పెద్దగా ఆలోచించను. ఫ్రీ స్టయిల్ ఉత్తేజకరమైన ఫార్మాట్... ఆడేటప్పుడు ఎంతో బాగుంటుంది. ఇప్పటి వరకు ఫ్రీస్టయిల్ విభాగంలో రెండు టోర్నీలు మాత్రమే జరిగాయి. ఇప్పుడే దానిపై వ్యాఖ్యానించడం తొందరపాటు అవుతుంది. ఫ్రీస్టయిల్ ఫార్మాట్ మరింత ఆదరణ పొందాలని కోరుకుంటున్నా. అదే సమయంలో క్లాసికల్ విభాగానికి ఉన్న ప్రాధాన్యత వేరు. ఘన చరిత్ర ఉన్న క్లాసికల్ విభాగంలో ప్రపంచ చాంపియన్‌షిప్ అన్నిటి కంటే అత్యున్నతమైంది. క్లాసికల్, ర్యాపిడ్, బ్లిట్జ్‌కు ఫ్రీస్టయిల్ అదనం. నేను అన్నింట్లో ఆడాలని అనుకుంటున్నా' అని గుకేశ్ శనివారం ఓ కాన్‌క్లేవ్‌లో అన్నాడు. వచ్చే నెల 7-14 వరకు జరగనున్న పారిస్ అంచె ఫ్రీస్టయిల్ చెస్ గ్రాండ్‌స్లామ్ టూర్‌లో పాల్గొననున్నట్లు గుకేశ్ వెల్లడించాడు. ప్రపంచ నంబర్‌వన్ మాగ్నస్ కార్ల్‌సన్‌తో పాటు 12 మంది గ్రాండ్‌మాస్టర్లు పాల్గొంటున్న ఈ చెస్ గ్రాండ్‌స్లామ్ తొలి అంచె జర్మనీ పోటీల్లో విన్సెంట్ కెయిమెర్ విజేతగా నిలిచాడు. కెరీర్ తొలి నాళ్లలో ఎదుర్కొన్న ఆర్థిక కష్టాలను గుకేశ్ కాన్‌క్లేవ్‌లో గుర్తుచేసుకున్నాడు. టోర్నమెంట్‌లలో పాల్గొనేందుకు డబ్బులు లేని సమయంలో తల్లిదండ్రుల స్నేహితులు అండగా నిలిచారని అన్నాడు. 'ఒకప్పుడు పోటీలకు వెళ్లేందుకు తగినంత డబ్బు లేకపోయేది. కుటుంబ సభ్యులు ఎంతో ప్రయత్నించి నిధులు సమకూర్చేవారు. నిస్వార్థపరమైన కొందరి సాయం వల్లే ఈ స్థాయికి వచ్చా. ఇప్పుడు ఆర్థిక ఇబ్బందులు తొలగిపోయాయి' అని గుకేశ్ అన్నాడు. కొవిడ్-19 ప్రభావం తర్వాత దేశంలో చెస్‌కు మరింత ఆదరణ పెరిగిందని గుకేశ్ అభిప్రాయపడ్డాడు. ప్రస్తుతం ప్రపంచ అత్యుత్తమ 100 మంది చెస్ ప్లేయర్లలో భారత్ నుంచి 13 మంది ఉన్నారని అది చదరంగంలో మన ప్రగతికి చిహ్నమని గుకేశ్ అన్నాడు. వీరందరికీ దారి చూపింది విశ్వనాథన్ ఆనంద్ అని... ఆయన బాటలోనే మరింత మంది గ్రాండ్‌మాస్టర్లు వచ్చారని పేర్కొన్నాడు. దేశంలో చెస్‌కు మంచి ఆదరణ లభిస్తోందని... స్పాన్సర్లతో పాటు ప్రభుత్వాలు కూడా అండగా నిలుస్తున్నాయని గుకేశ్ వివరించాడు.

ముంబై ఇండియన్స్ జట్టులో బాష్

గాయపడిన లిజాడ్ స్థానంలో ఎంపిక



న్యూఢిల్లీ: ముంబై ఇండియన్స్ (ఎమ్ఐ) ఫ్రాంచైజీ ఈ సీజన్ ఐపీఎల్ కోసం సఫారీ బౌలింగ్ ఆల్‌రౌండర్ కార్బిన్ బాష్‌ను జట్టులోకి తీసుకుంది. దక్షిణాఫ్రికాకే చెందిన పేసర్ లిజాడ్ విలియమ్స్ గాయంతో లీగ్‌కు దూరం కావడంతో అతని స్థానాన్ని ఆ దేశ ఆటగాడితోనే భర్తీ చేసుకుంది. 'మోకాలు గాయంతో సతమతమవుతున్న లిజాడ్ త్వరలో మొదలయ్యే ఐపీఎల్ సీజన్ మొత్తానికి అందుబాటులో లేకుండా పోయాడు. దీంతో అతని స్థానంలో బాష్‌ను జట్టులోకి తీసుకున్నాం' అని ఎమ్ఐ ఫ్రాంచైజీ ఒక ప్రకటనలో తెలిపింది. 30 ఏళ్ల బాష్ ఇప్పటివరకు ఐపీఎల్‌లో అరంగేట్రం చేయలేదు. కానీ టి20ల్లో 86 మ్యాచ్‌లు ఆడిన అనుభవముంది. 59 వికెట్లు తీసిన అతను బ్యాటింగ్‌లోనూ 81 పరుగులతో అత్యధిక వ్యక్తిగత స్కోరు నమోదు చేశాడు. సఫారీ లీగ్ ఎస్ఏ20లో ఈ ఏడాది ముంబై ఇండియన్స్ కేప్‌టౌన్ టైటిల్ గెలుపొందడంలో కీలకపాత్ర పోషించాడు. ఈ టోర్నీలో అతను 11 వికెట్లు పడగొట్టాడు. దక్షిణాఫ్రికా జాతీయ జట్టు తరఫున ఒక టెస్టు, రెండు అంతర్జాతీయ వన్డేలు ఆడాడు. 2022లో సఫారీ ఆల్‌రౌండర్ బాష్ రాజస్తాన్ రాయల్స్‌కు నెట్‌బౌలర్‌గా పనిచేశాడు. పాకిస్తాన్ సూపర్ లీగ్ (పీఎస్ఎల్) కోసం ఈ జనవరిలో జరిగిన వేలంలో బాష్‌ను పెషావర్ జల్మీ ఫ్రాంచైజీ అతన్ని కొనుక్కుంది. అయితే ఈ సీజన్ పీఎస్ఎల్ పోటీలను ఐపీఎల్ జరిగే సమయంలోనే ఏప్రిల్, మే నెలలో నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో కార్బిన్ బాష్ పీఎస్ఎల్ కాంట్రాక్టును రద్దుచేసుకొని ఐపీఎల్‌కు అందుబాటులో ఉంటానని ప్రకటించాడు.


శ్రీనిధి డెక్కన్ ఎఫ్‌సీ జట్టు జోరు

ఐ-లీగ్‌లో ఏడో విజయం

సాక్షి, హైదరాబాద్: ఐ-లీగ్ ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో హైదరాబాద్‌కు చెందిన శ్రీనిధి డెక్కన్ ఫుట్‌బాల్ క్లబ్ (ఎఫ్‌సీ) జట్టు ఏడో విజయం నమోదు చేసుకుంది. శనివారం పంజాబ్‌లోని మహిల్పూర్ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో శ్రీనిధి డెక్కన్ ఎఫ్‌సీ జట్టు 1-0 గోల్స్ తేడాతో ఢిల్లీ ఫుట్‌బాల్ క్లబ్‌పై గెలిచింది. మ్యాచ్‌లో నమోదైన ఏకైక గోల్ శ్రీనిధి డెక్కన్ ఫుట్‌బాల్ క్లబ్ ప్లేయర్ డేవిడ్ కాస్టానెడా (62వ నిమిషంలో) చేశాడు. ఈ సీజన్‌లో కాస్టానెడాకు ఇది 13వ గోల్ కావడం విశేషం. 12 జట్లు పోటీపడుతున్న ఐ-లీగ్‌లో శ్రీనిధి జట్టు 18 మ్యాచ్‌లు పూర్తి చేసుకుంది. ఇందులో 7 మ్యాచ్‌ల్లో గెలిచి... మరో 7 మ్యాచ్‌ల్లో ఓడింది. 4 మ్యాచ్‌లు 'డ్రా' చేసుకొని ఓవరాల్‌గా 25 పాయింట్లతో పట్టిక ఏడో స్థానంలో నిలిచింది. గత నాలుగు మ్యాచ్‌ల్లో శ్రీనిధి జట్టుకు ఇది మూడో విజయం. మరోవైపు 18 మ్యాచ్‌లాడిన ఢిల్లీ 3 విజయాలు, 11 పరాజయాలు, 4 'డ్రా'లతో 13 పాయింట్లు ఖాతాలో వేసుకొని పట్టిక అట్టడుగున 12వ స్థానంలో కొనసాగుతోంది. ఈ నెల 19న హైదరాబాద్ వేదికగా జరగనున్న తమ తదుపరి మ్యాచ్‌లో ఇంటర్ కాశి ఫుట్‌బాల్ క్లబ్‌తో శ్రీనిధి డెక్కన్ జట్టు తలపడనుంది.



కేకేఆర్ సహాయక కోచ్‌గా గిబ్సన్



కోల్‌కతా: ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) ఫ్రాంచైజీ కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్) ఓటిస్ గిబ్సన్‌ను సహాయక కోచ్‌గా ఎంపిక చేసుకుంది. ఈ నెల 22 నుంచి ఐపీఎల్ 18వ సీజన్ ప్రారంభం కానుండగా... వెస్టిండీస్ మాజీ పేసర్ గిబ్సన్ కేకేఆర్ జట్టుకు అసిస్టెంట్ కోచ్‌గా వ్యవహరించనున్నాడు. ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో 650కి పైగా వికెట్లు పడగొట్టిన 55 ఏళ్ల గిబ్సన్... 1995 నుంచి 99 మధ్య వెస్టిండీస్ జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు. అనంతరం కోచింగ్ వైపు మళ్లిన గిబ్సన్... ఇంగ్లండ్ జాతీయ జట్టుకు రెండు పర్యాయాలు బౌలింగ్ కోచ్‌గా పనిచేశాడు. 2010-14 మధ్య వెస్టిండీస్ హెడ్ కోచ్‌గా, 2017-19 మధ్య దక్షిణాఫ్రికా ప్రధాన కోచ్‌గా వ్యవహరించిన గిబ్సన్ అనుభవం తమ జట్టుకు ఎంతగానో ఉపయోగపడుతుందని డిఫెండింగ్ చాంపియన్ కోల్‌కతా నైట్‌రైడర్స్ భావిస్తోంది. ప్రస్తుతం కోల్‌కతా జట్టుకు చంద్రకాంత్ పండిత్ హెడ్ కోచ్‌గా వ్యవహరిస్తుండగా... బౌలింగ్ కోచ్‌గా భరత్ అరుణ్, స్పిన్ బౌలింగ్ కోచ్‌గా కార్ల్ క్రో పనిచేస్తున్నారు. గంభీర్ అనంతరం వెస్టిండీస్ మాజీ ఆటగాడు డ్వేన్ బ్రేవో కేకేఆర్ మెంటార్‌గా వ్యవహరిస్తున్నాడు.

అరవింద్... కొత్త చాంపియన్



న్యూఢిల్లీ: భారత చదరంగంలో నేటితరం సంచలన విజేతలతో పోల్చుకుంటే అరవింద్ చిదంబరం ఆలస్యంగా వికసించిన చాంపియన్. ఇప్పటికే టీనేజీలోనే దొమ్మరాజు గుకేశ్, ఆర్.ప్రజ్ఞానంద, అర్జున్ ఇరిగేశి అంతర్జాతీయ చెస్ టోర్నీలు, ఎలో రేటింగ్స్‌లో సత్తా చాటుకున్నారు. కానీ 64 గడుల బరిలో అరవింద్ 25 ఏళ్ల వయసులో వార్తల్లోకెక్కాడు. ప్రాగ్ మాస్టర్స్ టోర్నీలో విజేతగా నిలువడం ద్వారా భారత్‌లో కొత్త చదరంగ చక్రవర్తిగా అవతరించాడు. వయసు రీత్యా అతను లేటే కావొచ్చు... కానీ లేటెస్ట్ చాంపియన్‌గా భారత క్రీడా ఖ్యాతిని పెంచాడు. గుకేశ్, ప్రజ్ఞానంద, అర్జున్‌లతో కలిసి ఇప్పుడు నాలుగో స్తంభమయ్యాడు.

విజేతగా మలచిన తల్లి

మధురైలో పుట్టిన అరవింద్ పసిప్రాయంలోనే తండ్రిని కోల్పోయాడు. మూడేళ్ల వయసులోనే కన్నతండ్రి లోకాన్ని వీడితే... కన్నతల్లే అన్నీ తానై పెంచింది. జీవితబీమా (ఎల్ఐసీ) ఏజెంట్‌గా పనిచేస్తూ మదురై నుంచి చెన్నైకి మారి బతుకుబండిని లాగించింది. ఏడేళ్ల వయసులో తాత చెస్‌లో ఓనమాలు నేర్పితే అందులోనే కెరీర్‌ను ఎంచుకున్నాడు. విఖ్యాత వేలమ్మాళ్ స్కూల్‌లో విద్యనభ్యసించిన అరవింద్ చదువుకునే రోజుల్లో ఇప్పటి ప్రపంచ చాంపియన్ గుకేశ్‌కు సీనియర్. గుకేశ్ కూడా వేలమ్మాళ్ విద్యార్థే! ప్రాగ్ మాస్టర్స్‌లాంటి మేటి టోర్నీల్లో సాధారణంగా టాప్-20 ర్యాంకింగ్ ప్లేయర్లకు పాల్గొనే అవకాశముంటుంది. అంతకుమించి ర్యాంకుల్లో ఉంటే నిర్వాహకుల నుంచి వైల్డ్‌కార్డ్‌లాంటి ఎంట్రీలు ఉండాల్సిందే. అలా వచ్చిన అవకాశాన్ని అరవింద్ చక్కగా సద్వినియోగం చేసుకున్నాడు.

2013లో తొలి జీఎమ్ నార్మ్


భారత విఖ్యాత గ్రాండ్‌మాస్టర్ విశ్వనాథన్ ఆనంద్ 2013లో మాగ్నస్ కార్ల్‌సన్‌కు ప్రపంచ చెస్ చాంపియన్ కిరీటాన్ని కోల్పోయిన ఏడాదే పాఠశాల విద్యనభ్యసిస్తున్న అరవింద్ తొలి గ్రాండ్‌మాస్టర్ (జీఎమ్) నార్మ్ పొందాడు. అక్కడి నుంచి అతని ఆట మరో దశకు చేరడంతో 2015లో గ్రాండ్‌మాస్టర్ హోదా లభించింది. అడపాదడపా టోర్నీల్లో గెలుస్తున్నప్పటికీ 2019 అతని కెరీర్‌ను మలుపుతిప్పింది. భారత ఓపెన్‌లో క్లాసికల్, ర్యాపిడ్, బ్లిట్జ్ ఇలా మూడు విభాగాల్లోనూ అరవింద్ విజేతగా నిలిచి అరుదైన ఘనత సాధించిన ఆటగాళ్లలో ఒకడిగా నిలిచాడు. దాంతో పాటే తొలిసారి 2700 ఎలో రేటింగ్‌లోకి వచ్చేశాడు. ఇప్పుడు ప్రాగ్ టైటిల్‌తో లైవ్ వరల్డ్ ర్యాంకింగ్స్‌లో అరవింద్ 14వ స్థానంలో ఉన్నాడు. భారత్ తరఫున నాలుగో ర్యాంకర్‌గా ఎదిగాడు.

ఈ పుస్తకం.. 99 ఏళ్లు ఆలస్యం



పుస్తకం. ఎవరికైనా ఇస్తే తిరిగి రావడం చాలా కష్టం. గ్రంథాలయాల నుంచి తెచ్చిన పుస్తకాలైతే మరీ తప్పనిసరైతే తప్ప తిరిగివ్వరు. అలాంటిది 99 ఏళ్ల కిందటి పుస్తకం మళ్లీ లైబ్రరీకి చేరింది! తన తాత లైబ్రరీ నుంచి తెచ్చిన పుస్తకాన్ని ఓ మనవరాలు లైబ్రరీకి అందజేసింది. అమెరికాలో న్యూజెర్సీలోని బర్కిలీ టౌన్‌షిప్‌లో ఉంటున్న 81 ఏళ్ల కూపర్ పాత ఇంటిని కూల్చేసింది. తల్లికి చెందిన వస్తువుల బాక్సులన్నింటినీ కొత్తింటికి తెచ్చుకుంది. వాటిని తెరవగా 'హోమ్‌మేడ్ టాయ్స్ ఫర్ గార్ల్స్ అండ్ బాయ్స్'అనే పుస్తకం కనపడింది. బహుశా తన కొడుకుకు నచ్చిన పుస్తకమేమో అనుకుంది. కానీ తెరిచి చూస్తే అది 1911లో ప్రచురించిన పుస్తకమని తేలింది! పైగా 1926 మార్చిలో న్యూజెర్సీలోని ఔషన్ కౌంటీ లైబ్రరీ నుంచి తెచ్చినట్లుగా రాసుంది. అది తన తాత తెచ్చిన పుస్తకమని అర్థమైంది. కూపర్ పుట్టే నాటికే తాత చనిపోయాడు. దాంతో జ్ఞాపకాలేవీ గుర్తు లేవు. కానీ ఆయన చెక్క పడవలు నిర్మించేవాడని తల్లి చెప్పగా విన్నది. పుస్తకాన్ని లైబ్రరీకి తిరిగిచ్చేయాలని అనుకున్నా, ఇన్నాళ్లు దగ్గర పెట్టుకున్నందుకు ఫైన్ కట్టాల్సి వస్తుందని భయపడింది. ఏదేతే అదయిందని ఔషన్ కౌంటీ లైబ్రరీకి వెళ్లి పుస్తకం చూపించింది. దాంతో, 'ఓ మై గాడ్, ఈ పుస్తకం వందేళ్ల నాటిది'అంటూ లైబ్రరియన్ అవాక్కయ్యాడు. పాత రికార్డులన్ని తిరగేసి 99 ఏళ్ల కిందట తీసుకున్నట్టుగా గుర్తించాడు. వందేళ్లనాటి పుస్తకాన్ని తెచ్చిచ్చినందుకు కూపర్‌ను ప్రశంసించాడు. పుస్తకాన్ని లైబ్రరీలో ప్రదర్శనకు ఉంచారు. వందేళ్ల నాటి ఆ పుస్తకాన్ని చూడటానికి, తాకడానికి పుస్తకాభిమానులు బారులు తీరుతున్నారు.

– సాక్షి, నేషనల్ డెస్క్



పుస్తకం తీసుకున్న తేదీ



యూరప్ దేశం గ్రీన్‌ల్యాండ్ రాజధాని, ఆర్కిటిక్ సముద్ర తీర న్యూక్‌లో తీవ్రంగా మంచుకురియడంతో ఇలా నివాస భవనాలతోపాటు పట్టణమంతా మంచుమయంగా మారిపోయింది

హెడ్మాస్టర్ లీవ్ ఇవ్వకపోవడమే కారణం

చేతికి సెలైన్‌తోనే స్కూలుకొచ్చిన టీచర్

భువనేశ్వర్: తీవ్ర అనారోగ్యం పాలైన ఓ ఉపాధ్యాయుడు సెలవు కోసం పెట్టుకున్న దరఖాస్తును ప్రధానోపాధ్యాయురాలు తిరస్కరించారు. ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా సెలవివ్వడం కుదరదంటూ తెగేసి చెప్పారు. పాపం ఆ ఉపాధ్యాయుడు విధిలేక చేతికి ఐవీ డిప్ సెలైన్ పెట్టుకునే విధులకు హాజరయ్యారు. ఆయన ఆరోగ్యం విషమించడం చూసి తోటి వారే ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఈ ఘటన ఒడిశాలోని బొలంగీర్‌లో చోటుచేసుకుంది. ఇక్కడి ప్రభుత్వ పాఠశాలలో విజయలక్ష్మి ప్రధాన్ హెడ్మాస్టర్ కాగా, ప్రకాశ్ భోయి గణితం టీచర్. ఇటీవల తన తాత అంత్యక్రియల కార్యక్రమానికి హాజరైన అనంతరం ప్రకాశ్ ఆరోగ్యం దెబ్బతింది. విధులకు హాజరు కాలేనందున, సెలవు ఇప్పించమంటూ ఆయన ప్రధానోపాధ్యాయినికి విజ్ఞప్తి చేశారు. పరీక్షల సమయం కాబట్టి, మ్యాథ్స్ టీచర్ అవసరం ఎంతో ఉంటుందని చెబుతూ ఆమె ఆ వినతిని తిరస్కరించారు. ఎన్ని సార్లు కోరినా హెడ్మాస్టర్ వినిపించుకోకపోవడంతో ప్రకాశ్ భోయి చేతికి సెలైన్ పెట్టుకునే విధులకు వచ్చారు. ఆయన పరిస్థితి చూసి తోటి టీచర్లే ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై పటన్‌గఢ్ బ్లాక్ విద్యాధికారి(బీఈవో) ప్రసాద్ మాఝి స్పందించారు. కాజువల్ లీవ్ కోసం ప్రకాశ్ భోయి పంపించిన దరఖాస్తును ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మీ ప్రధాన్ ఎందుకు తిరస్కరించారనే విషయమై విచారణ చేపట్టామన్నారు. ఆమెదే తప్పని తేలితే చర్యలు తీసుకుంటామని చెప్పారు.

శ్రామిక శక్తిలో మహిళలు పెరగాలి

రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పిలుపు



న్యూఢిల్లీ: దేశంలోని శ్రామిక శక్తిలో మహిళల భాగస్వామ్యం పెరగాల్సిన అవసరముందని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఉద్ఘాటించారు. వేగంగా వృద్ధి చెందుతున్న మన ఆర్థిక వ్యవస్థ ప్రపంచంలో మూడో స్థానానికి చేరుకుంటోందని, అంతేవేగంతో శ్రామిక శక్తిలో మహిళల భాగస్వామ్యం పెరగాలని ఆమె ఆకాంక్షించారు. ఆ లక్ష్యం సాధించాలంటే విద్య, ఉద్యోగాల్లో మహిళలకు సమాన అవకాశాలు కల్పించడం కీలకమన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళా శిశు సంక్షేమ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముర్ము మాట్లాడారు. 'వికసిత్ భారత్'నిర్మాణానికి మహిళల సాధికారత, స్వేచ్ఛ, స్వావలంబన కీలకమన్నారు. వారి విజయం కోసం మహిళలకు అడుగడుగునా మద్దతు ఇవ్వాలని ఆమె కోరారు. వికసిత్ భారత్ కల సాకారం కోసం మహిళలు ఎనలేని కృషి చేస్తున్నారన్నారు. అమ్మాయికయినా, అబ్బాయికయినా భయం లేకుండా స్వేచ్ఛగా జీవించగలిగే సమాజాన్ని సృష్టించాలని పిలుపునిచ్చారు. అలాంటి ఆదర్శ సమాజమే మహిళలను గౌరవించే ప్రగతిశీల సామాజిక వాతావరణాన్ని పెంపొందిస్తుందన్నారు. గత ఐదు దశాబ్దాల్లో మహిళలు అపూర్వ ప్రగతి సాధించారని, ఒడిశాలోని సాధారణ కుటుంబం నుంచి రాష్ట్రపతి భవన్ వరకు సాగిన ప్రయాణమే మనదేశంలో ఉన్న సమానత్వం, సామాజిక న్యాయానికి నిదర్శనమని చెప్పారు. ఈ విజయాల పరంపర కొనసాగాలని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. మహిళా సాధికారత కోసం ప్రభుత్వం చేస్తున్న కృషిని ప్రశంసించిన ముర్ము.. చట్టసభల్లో రిజర్వేషన్లు మహిళా రాజకీయ సాధికారత దిశగా చారిత్రాత్మక అడుగని పేర్కొన్నారు. సమాజంలో మహిళలు, పురుషులు సమానులనే భావన రావాలని, ఏ ఒక్క చక్రం పనిచేయకపోయినా రథం ముందుకెళ్లదనే ప్రాథమిక సూత్రాన్ని గుర్తు పెట్టుకోవాలని సూచించారు. మహిళల ప్రతిభను గౌరవించగలిగితే.. వారు దేశం గర్వ పడేలా చేయగలరని విశ్వాసం వ్యక్తం చేశారు.

పదకొండేళ్లలో 11 అబద్ధాలు

ప్రధాని నరేంద్ర మోదీపై మల్లికార్జున ఖర్గే ధ్వజం

కలబుర్గి: ప్రధాని నరేంద్ర మోదీ అధికారంలో ఉన్న 11 ఏళ్లలో పదకొండు అతిపెద్ద అబద్ధాలు చెప్పారని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. శనివారం నాడిక్కడ ఒక అధికారిక కార్యక్రమంలో పాల్గొన్న ఖర్గే ప్రధానిపై విమర్శలు గుప్పించారు. మోదీ చెప్పినవి అతిపెద్ద అబద్ధాలని ధ్వజమెత్తారు. అందులో మొదటిది.. విదేశాల నుంచి నల్లధనాన్ని వెనక్కి తెచ్చి ప్రతి ఒక్కరి ఖాతాలోకి 15 లక్షల రూపాయలు జమ చేస్తామన్నారు. రెండోది.. ప్రతియేటా రెండు కోట్ల ఉద్యోగాలను ఇస్తామన్నారు. 'ఇదీ జరగలేదు. అయినప్పటికీ మన యువత బీజేపీకి ఎందుకు మద్దతు ఇస్తోందో తెలియడం లేదు. మతం, కులం, ప్రవర్తన ఆధారంగా యువత మోదీ వైపు మొగ్గుతున్నారా? అనేది నాకు తెలియదు' అని ఖర్గే అన్నారు. పెట్రోలు, డీజిల్ ధరలను తగ్గిస్తామన్నారు.. వాస్తవానికి పెట్రో ధరలు 40 నుంచి 50 శాతం పెరిగాయి. గంగానదిని 2022 కల్లా శుద్ధి చేస్తామన్నారు. ఇదీ అబద్ధమే. మేకిన్ ఇండియా ద్వారా లక్షలాది ఉద్యోగాల కల్పన మరొక అబద్ధం. 2022 కల్లా భారతీయులందరికీ పక్కా గృహాలు నిర్మిస్తామన్నారు.. ఇదీ అబద్ధమే అని ఖర్గే విమర్శించారు. అబద్ధాలు చెబితే ప్రజలు విశ్వసించరని అన్నారు.

మహిళా సమృద్ధి యోజనకు రూ.5,100 కోట్లు

ఢిల్లీ సీఎం రేఖా గుప్తా వెల్లడి

న్యూఢిల్లీ: అసెంబ్లీ ఎన్నికల హామీల్లో ప్రధానమైన మహిళా సమృద్ధి యోజన అమలుకు రూ.5,100 కోట్లు కేటాయించేందుకు ఢిల్లీ ప్రభుత్వం ఆమోదం తెలిపింది. అధికారంలోకి వస్తే నిరుపేద మహిళలకు నెలకు రూ.2,500 చొప్పున అందజేస్తామని బీజేపీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించింది. శనివారం జరిగిన మంత్రివర్గ సమావేశం మహిళా సమృద్ధి యోజన కోసం రూ.5,100 కోట్లు కేటాయించేందుకు ఆమోదం తెలిపిందని సీఎం రేఖా గుప్తా వెల్లడించారు. పథకం కింద అర్హులైన లబ్ధిదారుల నమోదు ఆన్‌లైన్‌లో వెంటనే ప్రారంభమైందని ఆమె మీడియాకు తెలిపారు. చర్చోపచర్చల అనంతరం అర్హతా నిబంధనలు, షరతులపై స్పష్టత వచ్చిందన్నారు. పథకం అమలును పర్యవేక్షించేందుకు తన సారథ్యంలో మంత్రులు ఆశిష్ సూద్, పర్వేశ్ వర్మ, కపిల్ మిశ్రాలతో కమిటీ ఏర్పాటైందన్నారు. దరఖాస్తుదారులను వడబోసేందుకు ఆధార్ సంఖ్య ఆధారిత ఈ–కేవైసీ ధ్రువీకరణను అమలు చేస్తామని సీఎం గుప్తా వివరించారు.

బాలికలను మతం మారిస్తే మరణ శిక్షే

చట్టం తెస్తామన్న మధ్యప్రదేశ్ సీఎం యాదవ్

భోపాల్: బాలికలపై అత్యాచారానికి పాల్పడిన వారికి మరణ శిక్ష విధించినట్లుగానే వారి మతం మార్చినా మరణ శిక్ష విధించేందుకు చట్టంలో మార్పులు తెస్తామని మధ్యప్రదేశ్ సీఎం మోహన్ యాదవ్ చెప్పారు. 'అమాయకులైన బాలికలపై అత్యాచారాలకు పాల్పడిన వారిపై కఠినంగా వ్యవహరిస్తాం. ఇందుకుగాను మరణ శిక్ష విధించాలన్న నిబంధనను తీసుకువచ్చాం. దీంతోపాటు, బాలికలను మతం మార్చిన వారికి సైతం మరణ శిక్ష విధించేందుకు వీలుగా మధ్యప్రదేశ్ మత స్వేచ్ఛా చట్టంలో మార్పు చేస్తాం 'అని సీఎం శనివారం ఒక కార్యక్రమంలో ప్రకటించారు.

ఆస్ట్రేలియాలో ఐదుగురు మహిళలపై లైంగిక దాడి

భారతీయ ప్రముఖుడికి 40 ఏళ్ల జైలు శిక్ష

సిడ్నీ: ఆస్ట్రేలియాలో ఐదుగురు మహిళలపై లైంగిక దాడికి పాల్పడిన నేరానికి గాను భారతీయ ప్రముఖుడొకరికి న్యాయస్థానం 40 ఏళ్ల జైలు శిక్ష విధించింది. 30 ఏళ్ల వరకు ఎలాంటి పెరోల్‌కు అవకాశం లేదని శుక్రవారం స్పష్టం చేసింది. బాలేశ్ ధన్‌ఖడ్(43) మోసపూరిత ఉద్యోగ ప్రకటనలతో ఐదుగురు కొరియా మహిళలను ఆకర్షించి ప్రణాళిక ప్రకారం వారిని సిడ్నీలోని తన నివాసానికి రప్పించాడు. అక్కడ వారికి డ్రగ్స్ కలిపిన డ్రింక్స్ ఇచ్చి మత్తులో ఉండగా లైంగిక దాడికి పాల్పడినట్లు రుజువైందని డౌనింగ్ సెంటర్ డిస్ట్రిక్ట్ కోర్టు పేర్కొంది. తీర్పు వెలువడిన సమయంలో ధన్‌ఖడ్ కోర్టులోనే ఉన్నాడు. భవిష్యత్ లైంగిక సంతృప్తి కోసం అతను తన నేరాలను రికార్డు చేసి, వీడియోల రూపంలో భద్రపర్చుకోవడాన్ని జడ్జి మైకేల్ కింగ్ ప్రస్తావించారు. బాధితులంతా 21–27 ఏళ్ల మధ్య వయస్కులైన కొరియా మహిళలు. ఒక్కొక్కరికి వారి తెలివితేటలు, అందాన్ని బట్టి వేరుగా మార్కులు కూడా వేసేవాడని పోలీసులు తెలిపారు. బాధిత మహిళలతో జరిపిన చర్చలను సైతం రికార్డు చేశాడు. వారికి ఉద్యోగం అవసరం ఎంతుందనే దాన్ని బట్టి కుట్రను అమలు చేసేవాడు. చివరికి ఐదో బాధితురాలు 2018 అక్టోబర్‌లో ఫిర్యాదు చేయడంతో ఇతడి నేరాలకు ఫుల్‌స్టాప్ పడింది. పోలీసులు సిడ్నీ సెంట్రల్ బిజినెస్ డిస్ట్రిక్ట్‌లోని ఇతడి కార్యాలయంపై దాడి చేసి డ్రగ్స్‌తోపాటు టేబుల్ క్లాక్ మాదిరిగా ఉన్న వీడియో రికార్డర్‌ను స్వాధీనం చేసుకున్నారు. అందులోనే అత్యాచారాల క్రమమంతా నిక్షిప్తమై ఉండటం గమనార్హం. విచారణ జరిపిన కోర్టు ధన్‌ఖడ్ 39 నేరాలకు పాల్పడినట్లు గుర్తించింది. ఇందులో లైంగిక దాడికి సంబంధించిన నేరాలు 13 వరకు ఉన్నాయి. కోర్టు విధించిన జైలు శిక్షలో పెరోల్‌కు వీలులేని 30 ఏళ్ల కాలం 2053తో ముగియనుంది. మొత్తం 40 ఏళ్ల జైలు శిక్ష పూర్తయ్యే సరికి ధన్‌ఖడ్‌కు 83 ఏళ్లొస్తాయి.

విద్యార్థిగా వెళ్లి...

2006లో చదువుకునేందుకు ఆస్ట్రేలియా వెళ్లిన ధన్‌ఖడ్ భారతీయ ఆస్ట్రేలియన్లలో పేరున్న నాయకుడి స్థాయికి ఎదిగారు. భారతీయ జనతా పార్టీ అనే గ్రూపును నెలకొల్పారు. హిందూ కౌన్సిల్ ఆఫ్ ఆస్ట్రేలియా అధికార ప్రతినిధిగా 2018లో అరెస్టయ్యే వరకు వ్యవహరించారు. ఏబీసీ, బ్రిటిష్ అమెరికన్ టొబాకో, టొయోటా, సిడ్నీ ట్రెయిన్స్ కంపెనీలకు డేటా విజువలైజేషన్ కన్సల్టెంట్‌గా సేవలందించారు. పలు సామాజిక కార్యక్రమాల్లో పాలుపంచుకుంటూ ప్రముఖుడిగా గుర్తింపు తెచ్చుకున్నారు.

తూత్తుకుడిలో రూ.32.95 కోట్ల డ్రగ్స్ పట్టివేత

సాక్షి, చెన్నై: ఓడలో అక్రమంగా తరలిస్తున్న రూ.32.95 కోట్ల విలువైన గంజాయి నూనె(హష్ ఆయిల్)ను భారత తీర రక్షక దళం (ఐసీజీ), డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్‌ఐ) సంయుక్తంగా చేపట్టిన దాడిలో స్వాధీనం చేసుకున్నారు. ఈ నెల 5న మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో తూత్తుకుడి నుంచి మాల్దీవుల రాజధాని మాలెకు వెళ్తున్న ఓ పడవలో డ్రగ్స్ ఉన్నట్లు డీఆర్‌ఐకు రహస్య సమాచారం అందింది. ఈ మేరకు వెంటనే రంగంలోకి దిగిన ఐసీజీ రాత్రి 8.05 గంటల ప్రాంతంలో మన్నార్ గల్ఫ్‌కు దక్షిణంగా అనుమానాస్పద నౌకను అడ్డుకుంది. కోస్ట్ గార్డ్ సిబ్బంది వెంటనే ఓడలోకి ప్రవేశించి సిబ్బందిని అరెస్టు చేశారు. అనంతరం ఆ ఓడను దాదాపు 40 గంటల ప్రయాణం అనంతరం తిరిగి తూత్తుకుడికి తీసుకు వచ్చారు. ఆ నౌకను, అందులోని 9 మందిని డీఆర్‌ఐకి అప్పగించారు.

మోదీ గ్యారెంటీ అంతా మోసం: ఆతిశీ

న్యూఢిల్లీ: అంతర్జాతీయ మహిళా దినోత్సవం కంటే ముందుగానే మహిళల ఖాతాల్లో రూ.2,500 జమ చేస్తామంటూ ఇచ్చిన హామీని నెరవేర్చడంలో ఢిల్లీలోని బీజేపీ ప్రభుత్వం విఫలమైందని ఆప్ నేత, మాజీ సీఎం ఆతిశీ ధ్వజమెత్తారు. మోదీ గ్యారెంటీ అంటూ చేసుకునే ప్రచారమంతా మోసమన్నారు. మహిళా దినోత్సవం రోజున డబ్బును బ్యాంక్ అకౌంట్లలో జమ చేయడానికి బదులు కేవలం నాలుగు సభ్యుల కమిటీని మాత్రమే ఏర్పాటు చేసిందన్నారు.

పబ్‌లో కాల్పులు..12 మందికి గాయాలు

టొరంటో: కెనడాలోని టొరంటోలోని ఓ పబ్‌లో జరిగిన కాల్పుల్లో 12 మంది గాయపడ్డారు. శుక్రవారం రాత్రి 10.40 గంటల సమయంలో బార్‌లోకి ప్రవేశించిన ముగ్గురు వ్యక్తులు లోపల కూర్చుని ఉన్న వినియోగదారులపై విచక్షణా రహితంగా కాల్పులకు దిగారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని బాధితులను ఆస్పత్రులకు తరలించారు. క్షతగాత్రులైన 12 మందిలో ఆరుగురికి మాత్రమే బుల్లెట్ గాయాలుకాగా, మిగతా వారికి పగిలిన కిటికీల అద్దాలు తగిలి గాయాలయ్యాయి. వీరెవరికీ ప్రాణాపాయం లేకపోవడం ఎంతో అదృష్టమని పోలీసులు తెలిపారు. ఘటనకు కారణాలు తెలియాల్సి ఉందని, ఇప్పటి వరకు ఎవరినీ అరెస్ట్ చేయలేదన్నారు.

ఆ ఒక్క హత్యకు అనుమతివ్వండి

రాష్ట్రపతి ముర్ముకు ఎన్సీపీ నేత లేఖ

ముంబై: మహారాష్ట్ర మహిళలు అణచివేత, రేపిస్ట్ మనస్తత్వాన్ని చంపేయాలనుకుంటున్నందున ఆ ఒక్క హత్యకు అనుమతివ్వాలంటూ ఎన్సీపీ(ఎస్పీ) నేత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మును కోరారు. శరద్ పవార్ సారథ్యంలోని ఎన్సీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు రోహిణి ఖడ్సే శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఈ మేరకు రాష్ట్రపతికి లేఖ రాశారు. ముంబైలో ఇటీవల జరిగిన 12 ఏళ్ల బాలికపై గ్యాంగ్ రేప్ ఘటనను ప్రస్తావిస్తూ.. అణచివేత మనస్తత్వాన్ని, అత్యాచార ధోరణిని, శాంతిభద్రతల పరిరక్షణలో అసమర్థతను మేం చంపాలనుకుంటున్నాం. మా విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందిస్తారని ఆశిస్తున్నాం'అని ఖడ్సే పేర్కొన్నారు. అత్యాచారాలు, దాడులు, కిడ్నాప్‌లు, గృహహింస వంటి ఘటనలతో మహిళలకు అత్యంత రక్షణ లేని దేశాల్లో భారత్ ఒకటని తెలిపే నివేదికను రోహిణి ప్రస్తావించారు.

గుజరాత్‌లో

పార్టీ క్షాళన

రాష్ట్ర కార్యకర్తల భేటీలో రాహుల్

అహ్మదాబాద్: గుజరాత్‌లో కాంగ్రెస్ పార్టీని ప్రక్షాళన చేయాల్సి ఉందని అగ్ర నేత రాహుల్‌గాంధీ అన్నారు. అప్పటిదాక పార్టీని రాష్ట్ర ప్రజలు నమ్మరని అభిప్రాయపడ్డారు. పార్టీలో ఉంటూ బీజేపీకి కోసం పని చేస్తున్న నాయకులను గుర్తించి తొలగించాలని ఆదేశించారు. 2027 అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని రెండురోజుల పాటు రాష్ట్రంలో పర్యటిస్తున్న రాహుల్ శనివారం రెండో రోజు పార్టీ కార్యకర్తలనుద్దేశించి మాట్లాడారు. రాష్ట్ర శాఖలో భారీ మార్పులు చేయాలని ఈ సందర్భంగా సూచించారు.

సమర్థులకు సంకెళ్లు: పార్టీ భావజాలాన్ని మోస్తూ ప్రజల మధ్య తిరుగు తున్న నేతలు, ప్రజలకు దూరంగా ఉన్నవారిని వడపోయడమే మొదటి పని కావాలని రాహుల్ సూచించారు. ''తొలగింపుల విషయంలో కఠినంగా ఉంటాం. పార్టీని గుండెల్లో పెట్టుకుని మోస్తున్న సీనియర్ నాయకుల దగ్గరకు మనం చేరుకోవాలి. ఎన్నికల్లో గెలుపోటములతో నిమిత్తం లేకుండా పార్టీ కోసం రక్తం ధారపోస్తున్నవారికి దన్నుగా నిలవాలి. నాతో సహా పార్టీ పెద్దలు ప్రజల మధ్యకు వెళ్లాలి. వారి సమస్యలు వినాలి. మన నుంచి ఏమాశిస్తున్నారో తెలుసుకోవాలి. వారి విద్య, ఆరోగ్యం, భవిష్యత్తు కోసం ఏం చేయగలమో చెప్పాలి'' అన్నారు. కార్యకర్తల మాటలు వినడానికే వచ్చానంటూ భరోసా ఇచ్చారు. ''గుజరాత్‌లో కాంగ్రెస్‌కు 40% ఓట్లున్నాయి. మరో 5% పెంచుకోగలిగితే అధికారంలోకి రావచ్చు'' అన్నారు.

కాంగ్రెస్‌కు నాయకత్వాన్నిచ్చిందే గుజరాత్

గాంధీ రూపంలో కాంగ్రెస్‌కు నాయకత్వాన్ని, ఆలోచనా విధానాన్ని, పోరాట పటిమను, జీవన విధానాన్ని ఇచ్చిందే గుజరాత్ రాష్ట్రమని రాహుల్ గుర్తు చేశారు. ''గాంధీ లేకపోతే దేశానికి స్వాతంత్ర్యం వచ్చేది కాదు. కాంగ్రెస్‌కు చెందిన ఐదుగురు గొప్ప నేతల్లో ఒకరైన సర్దార్ పటేల్ కూడా గుజరాతీయే.

ఏప్రిల్‌లో ఏఐసీసీ సమావేశాలు..

ఏప్రిల్ 8, 9 తేదీల్లో అహ్మదాబాద్‌లో ఏఐసీసీ సమావేశాలు జరగనున్నాయి. అవి గుజరాత్ జరగనుండటం 64 ఏళ్ల తర్వాత ఇదే తొలిసారి. 2022 అసెంబ్లీ ఎన్నికల్లో 182 స్థానాలకు కాంగ్రెస్ కేవలం 17 సీట్లే నెగ్గింది.

లంకలో మహిళా రిసార్టు



రిసార్టు టీం

సిబ్బంది నుంచి యాజమాన్యం దాకా అంతా స్త్రీలే

పర్యాటక రంగం. శ్రీలంక ఆర్థిక వ్యవస్థకు జీవనాడి. ఇంతటి కీలకమైన రంగంలో ఇప్పటికీ మహిళలకు అవకాశాలు తక్కువే. అలాంటి చోట పురుషాధిక్యాన్ని సవాలు చేస్తోంది ఓ రిసార్ట్. దంబుల్లా నగరంలో ఉన్న ఆ రిసార్ట్ పేరు అంబాయాలు. శ్రీలంకలో పూర్తిగా మహిళల ఆధ్వర్యంలో నడుస్తున్న తొలి రిసార్టుగా ఇది రికార్డు సృష్టించింది...!

తల్లి స్ఫూర్తితో ఏర్పాటు

చంద్ర విక్రమసింఘే అనే అనుభవజ్ఞుడైన హోటల్ వ్యాపారి ఈ రిసార్టును ఏర్పాటు చేశారు. ఆయన తల్లి సింగిల్ పేరెంట్. ఏడుగురు సంతానాన్ని ఒంటి చేత్తో పెంచి పెద్ద చేసింది. తల్లి స్ఫూర్తే పూర్తి మహిళల రిసార్టు ఆలోచనకు ప్రేరణ అంటారు విక్రమ సింఘే. ''మహిళలు ఏం చేయగలరో నాకు తెలుసు. ఆ ఆలోచన రాగానే వెంటనే రంగంలోకి దిగాను. నేను ఎంచుకున్న మహిళా టీమ్ అద్భుతంగా పని చేసింది. ఇప్పుడు మీరు చూస్తున్న రిసార్టుకు రూపమిచ్చింది'' అని చెప్పారాయన. సంక్షోభం అనంతరం అప్పుల ఊబిలో కూరుకుపోయిన దేశాన్ని ఆర్థికంగా ముందుకు నడిపేందుకు మహిళల సామర్థ్యం ఎంతో ఉపయోగపడుతుందన్నది ఆయన అభిప్రాయం.



లైట్లు బిగిస్తూ..

సర్వం మహిళలే...

కొలంబోకు ఈశాన్యంగా 160 కిలోమీటర్ల దూరంలో ఉంది అంబా యాలు రిసార్టు. ఒక మామిడి తోట మధ్యలో అందమైన పరిసరాల్లో కొలువుదీరింది. ఇందులోని మొత్తం 75 మందిసిబ్బందీ మహిళలే. తోట పని, వంట, హౌస్‌కీపింగ్, అతిథులను ఉద్దేశించి మాట్లతాడటమే గాక చివరికి వారి భద్రత కూడా మహిళల బాధ్యతే. జనవరిలో ప్రారంభమైన ఈ రిసార్ట్ పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. కేవలం పర్యాటకులకు ఆతిథ్యమివ్వడమే గాక ఆతిథ్య తదితర రంగాల్లో మహిళలు నైపుణ్యాన్ని పెంపొందించుకోవడానికి శిక్షణ కార్యక్రమాలను కూడా ఈ రిసార్టు నిర్వహిస్తోంది! మహిళల ఆధ్వర్యంలో రిసార్టు ఆలోచనను మహిళా హక్కుల కార్యకర్తలు కూడా ప్రశంసిస్తున్నారు. ఈ స్ఫూర్తితో మరిన్ని వ్యాపార సంస్థలు ఇలాంటి కార్యక్రమాలకు ముందుకొస్తాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

వివక్షను రూపుమాపడానికి..

''చదువు పూర్తయ్యాక అకౌంటింగ్ వైపు వెళ్లాలనుకున్నా. కానీ హాస్పిటాలిటీ రంగంలో మూడు నెలల శిక్షణ నా జీవితాన్ని మార్చేసింది. మేమిప్పుడు దేశవ్యాప్తంగా ఎంతోమంది అమ్మాయిలకు ప్రేరణ కావడం చెప్పలేనంత ఆనందాన్నిస్తోంది''

– జీవంతి అధికారి, రిసార్టు మేనేజర్

ధోరణి మారుతోంది...

హోటల్‌లో పనిచేసే మహిళలను చులకనగా చూడటం దాదాపుగా అన్ని సమాజాల్లోనూ ఉంది. శిక్షణ లేమి, అరకొర సౌకర్యాలు, తక్కువ జీతాలు, భాషాపరమైన అడ్డంకుల వంటి కారణాలతో శ్రీలంకలో మహిళలు ఆతిథ్య పరిశ్రమకు కాస్త దూరంగానే ఉంటారు. గ్రామీణ ప్రాంతాల్లో ఈ ధోరని మరీ ఎక్కువ. లంక రాజకీయాల్లో మహిళలు తమదైన ముద్రవేసినా, ప్రభుత్వంలో కీలక పదవులు నిర్వహించినా ఆతిథ్య పరిశ్రమ విషయంలో మాత్రం ఇన్నేళ్లుగా పెద్ద మార్పేమీ లేదు. ప్రపంచ, ప్రాంతీయ స్థాయిల్లో చూస్తే శ్రీలంక పర్యాటకంలో మహిళల ఉపాధి చాలా తక్కువ. 2.2 కోట్ల జనాభాలో మహిళలు 52 శాతం మంది. కానీ 2 లక్షల మందికి పైగా పని చేస్తున్న లంక ఆతిథ్య రంగంలో మాత్రం మహిళలు కేవలం 10 శాతమే ఉన్నారు! ఆ దేశ ఆర్థిక వ్యవస్థలో పర్యాటక, ఆతిథ్య రంగం వాటా కొన్నేళ్లుగా క్రమంగా తగ్గుతూ వస్తోంది. 2018 లో 5 నుంచి 2023 నాటికి ఏకంగా 2.3 శాతానికి పడిపోయింది.

– సాక్షి, నేషనల్ డెస్క్



కిచెన్‌లో..

సాక్షి ప్లస్
ఆదివారం | 9-3-2025

ప్రధాని రాజీనామా చేస్తే మంత్రి మండలి రద్దవుతుందా?

భారత రాజ్యాంగం పార్లమెంటరీ లేదా మంత్రివర్గ పాలిత ప్రభుత్వాన్ని నిర్దేశించింది. పార్లమెంటరీ వ్యవస్థ ముఖ్య లక్షణం రెండు రకాలైన అధిపతులు ఉండటం. రాజ్యాంగ పరంగా ఉండే రాష్ట్రపతికి నామమాత్ర అధికారాలు ఉంటే, ప్రధాన మంత్రి అధ్యక్షతన ఉన్న మంత్రిమండలి అన్ని అధికారాలను చెలాయిస్తుంది.

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
పాలిటీ

ప్రధాన మంత్రి-మంత్రి మండలి

రాజ్యాంగ రీత్యా దేశాధిపతి రాష్ట్రపతి అయితే ప్రధాన మంత్రి అధ్యక్షతన ఉన్న మంత్రి మండలి వాస్తవమైన కార్యనిర్వాహక అధికారాలను కలిగి ఉంటుంది. భారతదేశంలో బ్రిటిష్ తరహా పార్లమెంటరీ వ్యవస్థ ఉంది. దీన్నే 'వెస్ట్ మినిస్టర్' పద్ధతి అంటారు. (వెస్ట్ మినిస్టర్ అనేది ఇంగ్లండ్‌లో ఒక ప్రాంతం. అక్కడే పార్లమెంటు భవనం ఉంది. అందువల్ల దీనికి ఆ పేరు వచ్చింది.)

రాజ్యాంగ స్థానం

భారత రాజ్యాంగంలోని 5వ భాగంలో ప్రకరణలు 74, 75, 78లో ప్రధాన మంత్రి, కేంద్ర మంత్రి మండలికి సంబంధించిన వివరాలను పొందుపరిచారు.

ప్రకరణ 74(1): రాష్ట్రపతికి తన విధి నిర్వహణలో సహాయం, సలహాలను అందించడానికి ప్రధాన మంత్రి అధ్యక్షతన మంత్రి మండలి ఉంటుంది. వీరి సలహా మేరకే రాష్ట్రపతి తన విధులను నిర్వర్తించాలి.

ప్రత్యేక వివరణ: మౌలిక రాజ్యాంగంలో మంత్రి మండలి సలహాను రాష్ట్రపతి తప్పనిసరిగా పాటించాలి అని అర్థం వచ్చేలా ఎలాంటి పదబంధం లేదు. అయితే 1976లో 42వ రాజ్యాంగ సవరణ ద్వారా ప్రకరణకు 'షల్' (Shall) అనే పదం చేర్చారు. దీని ప్రకారం మంత్రి మండలి సలహా మేరకే రాష్ట్రపతి తన విధులను నిర్వర్తించాల్సి ఉంటుంది.

1978లో 44వ రాజ్యాంగ సవరణ ద్వారా ప్రకరణ 74లో మరో అంశాన్ని చేర్చారు. మంత్రి మండలి నిర్ణయాన్ని రాష్ట్రపతి పునర్ పరిశీలనకు పంపవచ్చు. పునర్ పరిశీలనకు పంపిన అంశాలను మంత్రి మండలి మార్పు చేయవచ్చు, చేయకపోవచ్చు. రెండో పర్యాయం రాష్ట్రపతి ఆమోదానికి పంపితే ఆ అంశాలను ఆయన తప్పకుండా ఆమోదించాలి.

ప్రకరణ 74(2) ప్రకారం మంత్రిమండలి రాష్ట్రపతికి ఏ సలహా ఇచ్చారో, ఆ సలహా ఎందుకు ఇచ్చారో న్యాయస్థానాల్లో ప్రశ్నించడానికి వీలు లేదు.

నియామకం

- **ప్రకరణ 75(1)** ప్రకారం ప్రధాన మంత్రిని రాష్ట్రపతి నియమిస్తారు. అదేవిధంగా ప్రధాని సలహా మేరకు ఇతర మంత్రులను కూడా నియమిస్తారు.
- **ప్రకరణ 75(1ఎ)** ప్రకారం కేంద్రంలో మంత్రిమండలి సంఖ్య, ప్రధాన మంత్రితో కలిపి లోక్‌సభ సభ్యుల మొత్తం సంఖ్యలో 15 శాతానికి మించరాదు.
- **ప్రకరణ 75(1బి)** ప్రకారం ఏదైనా గుర్తింపు ఉన్న రాజకీయ పార్టీకి చెందిన సభ్యుడు పార్టీ ఫిరాయింపుల చట్టం ప్రకారం అనర్హుడైతే, అతడిని మంత్రిగా నియమించరాదు. ఈ అనర్హత అతడు మంత్రిగా ఉన్న కాలంలో జరిగితే, అది అతడి సభ్యత్వ కాలం ముగిసేంత వరకు కొనసాగుతుంది. ఒకవేళ తిరిగి ఎన్నికల్లో పోటీ చేసి విజయం సాధిస్తే, అంతటితో అనర్హత ముగుస్తుంది.
  గమనిక: 75(1ఎ), (1బి) క్లాజులను 2003లో 91వ రాజ్యాంగ సవరణ ద్వారా చేర్చారు.
- **ప్రకరణ 75(2)** ప్రకారం రాష్ట్రపతి విశ్వాసం ఉన్నంత వరకు ప్రధాన మంత్రి, మంత్రి మండలి పదవుల్లో కొనసాగుతారు.
- **ప్రకరణ 75(3)** ప్రకారం మంత్రులు సంయుక్తంగా లోక్‌సభకు బాధ్యత వహిస్తారు.
- **ప్రకరణ 75(4)** ప్రకారం, మంత్రులందరూ తమ పదవిలోకి ప్రవేశించే ముందు మూడో షెడ్యూల్‌లో పేర్కొన్న నమూనా ప్రకారం రాష్ట్రపతి సమక్షంలో ప్రమాణం చేయాలి.
- **ప్రకరణ 75(5)** ప్రకారం ఎవరైనా వ్యక్తి మంత్రి పదవి చేపట్టాక ఆరు నెలల్లోపు పార్లమెంటు సభ్యునిగా ఎన్నిక కాకుంటే ఆయన మంత్రి పదవిని కోల్పోతారు.
- **ప్రకరణ 75(6)** ప్రకారం మంత్రుల జీతభత్యాలను పార్లమెంటు నిర్ణయిస్తుంది. వీటి ప్రస్తావన రెండో షెడ్యూల్‌లో ఉంది.



ప్రధాని నియామకానికి సంబంధించి రాజ్యాంగంలో ప్రత్యేకమైన ప్రక్రియ గురించి పేర్కొనలేదు. పార్లమెంటరీ సాంప్రదాయాల ప్రకారం, లోక్‌సభ ఎన్నికల్లో అత్యధిక స్థానాలు సాధించిన రాజకీయ పార్టీకి చెందిన నాయకుడిని రాష్ట్రపతి ఆహ్వానించి, ప్రధాన మంత్రిగా నియమించి, ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయమని కోరతారు. లోక్‌సభలో ఏ రాజకీయ పార్టీకి నిర్దిష్టమైన మెజారిటీ సీట్లు లభించనప్పుడు రాష్ట్రపతి తన విచక్షణాధికారాన్ని వినియోగించి స్థిరమైన ప్రభుత్వాన్ని ఏర్పరిచే క్రమంలో అత్యధిక స్థానాలు సాధించిన రాజకీయ పార్టీ లేదా పార్టీల కూటమి నాయకుడిని ప్రధానిగా నియమించి, మెజారిటీ నిరూపించుకోమని కోరతారు.

ఉదాహరణకు 1979లో నీలం సంజీవరెడ్డి రాష్ట్రపతిగా ఉన్నప్పుడు చరణ్‌సింగ్‌ను ప్రధానిగా నియమించడం కొంత వివాదానికి దారితీసింది. నాటి ప్రతిపక్ష నాయకుడైన వై.బి.చవాన్‌ను ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాల్సిందిగా సంజీవరెడ్డి ఆహ్వానించారు. కానీ, చవాన్ తన అశక్తతను వ్యక్తపరిచారు. ఈ పరిస్థితిలో జగ్జీవన్‌రామ్‌ను విస్మరించి చరణ్‌సింగ్‌ను ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయమని ఆహ్వానించడం వివాదానికి కారణమైంది. అయితే చరణ్‌సింగ్ లోక్‌సభ సమావేశాలకు హాజరు కాకుండానే ప్రధాని పదవికి రాజీనామా చేశారు.

ఈ విధంగా లోక్‌సభలో సంపూర్ణ మెజారిటీ లేకుండా 1989లో వి.పి.సింగ్, 1990లో చంద్రశేఖర్, 1991లో పి.వి. నరసింహారావు, 1996లో ఎ.బి.వాజ్‌పేయి, 1996లో దేవెగౌడ, 1997లో ఐ.కె. గుజ్రాల్, 1998లో ఎ.బి. వాజ్‌పేయి, 2004, 2009లో మన్మోహన్ సింగ్ ప్రధాన మంత్రులుగా నియమితులయ్యారు.

సుప్రీం కోర్టు తీర్పులు: మెజారిటీ కోల్పోయిన ప్రధాన మంత్రి రాజీనామా చేసి, తదనంతరం లోక్‌సభ రద్దయితే, ఆ వ్యక్తిని ఆపద్ధర్మ ప్రధానిగా కొనసాగించి పరిపాలన చేయవచ్చు. అయితే విధాన నిర్ణయాలు చేయరాదని 1971లో యు.ఎన్.రావు Vs ఇందిరా గాంధీ కేసు సందర్భంగా సుప్రీం కోర్టు తీర్పు చెప్పింది.

ప్రధాన మంత్రి అర్హతలు: రాజ్యాంగంలో ప్రధాన మంత్రి పదవికి సంబంధించి ఎలాంటి ప్రత్యేక అర్హతలు గురించి పేర్కొనలేదు. అయితే పార్లమెంట్‌లో సభ్యుడిగా ఉండాలి. నియమితులయ్యే సమయానికి పార్లమెంటులో సభ్యత్వం లేకపోతే నియామకం పొందిన రోజు నుంచి ఆరు నెలల్లోపు పార్లమెంటు సభ్యుడిగా ఎన్నికవ్వాలి.

ప్రత్యేక వివరణ: రాజ్యాంగపరంగా ప్రధాన మంత్రిగా నియమితులవడానికి పార్లమెంటు సభ్యుడైతే చాలు. సాధారణంగా ప్రధానమంత్రి లోక్‌సభలో సభ్యుడై ఉండాలి. రాజ్య సభలో సభ్యులుగా ఉండి ప్రధాన మంత్రులైనవారు ఇందిరా గాంధీ (1966), దేవెగౌడ (1996), ఇందర్ కుమార్ గుజ్రాల్ (1997), మన్మోహన్ సింగ్ (2004, 2009).

ప్రధాని ప్రమాణ స్వీకారం - జీతభత్యాలు

- ప్రధాన మంత్రితో రాష్ట్రపతి పదవీ ప్రమాణ స్వీకారం చేయిస్తారు. రాజ్యాంగ పరంగా భారత ఐక్యతను, సమగ్రతను పరిరక్షిస్తామని, నమ్మకంతో, నిర్భయంగా, నిజాయితీగా విధులు నిర్వర్తిస్తామని ప్రధాన మంత్రి ప్రమాణం చేయాలి.
- ప్రధాన మంత్రి, ఇతర మంత్రుల జీతభత్యాలను పార్లమెంటు ఒక చట్టం ద్వారా నిర్ణయిస్తుంది. పార్లమెంటు సభ్యులకు వచ్చే జీతభత్యాలు, ఇతర సౌకర్యాలను కలిగి ఉంటారు.
- ప్రకరణ 78 ప్రకారం రాష్ట్రపతికి ప్రభుత్వానికి సంబంధించిన సమాచారాన్ని తెలియజేయడం ప్రధాన మంత్రి బాధ్యత.
- ప్రకరణ 78(ఎ) ప్రకారం కేంద్ర మంత్రి మండలి నిర్ణయాన్ని ప్రధాన మంత్రి రాష్ట్రపతికి తెలియజేస్తారు.
- ప్రకరణ 78 (బి) ప్రకారం, ప్రభుత్వానికి సంబంధించిన ఇతర సమాచారాన్ని రాష్ట్రపతి ప్రధాన మంత్రి ద్వారా తెలుసుకోవచ్చు.
- ప్రకరణ 78 (సి) ప్రకారం.. సమర్పించిన సమాచారంలో ఏదైనా అంశం మంత్రి చేసిన నిర్ణయమా లేదా మంత్రి మండలి చేసిన నిర్ణయమా అనే సంశయం ఉన్నప్పుడు, దాన్ని మంత్రి మండలి పరిశీలనకు పంపమని రాష్ట్రపతి ప్రధాన మంత్రిని కోరవచ్చు.

ప్రత్యేక వివరణ: మంత్రి మండలి ఏర్పాటు పూర్తిగా ప్రధాన మంత్రి విశిష్టాధికారం. ఎవరిని మంత్రిగా తీసుకోవాలి, ఎవరిని తొలగించాలి, ఎలా పునర్ వ్యవస్థీకరించాలి అనేది ప్రధాన మంత్రి అభీష్టం. అయితే రాజకీయ పరమైన అంశాలు, వివిధ వర్గాలకు, ప్రాంతాలకు ప్రాతినిధ్యం ఇవ్వడం, పరిపాలనా సౌలభ్యం మొదలైన అనేక అంశాలను పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది. అధికార పార్టీ ప్రయోజనాల దృష్ట్యా ప్రధాన మంత్రికి ఇష్టం లేకపోయినా కొందరు ప్రముఖులను మంత్రి మండలిలోకి తీసుకోవాల్సి వస్తుంది.

ప్రధాన మంత్రి పదవీ కాలం, తొలగింపు

సాధారణంగా ప్రధాన మంత్రి పదవీ కాలం లోక్‌సభతో పాటుగా అయిదేళ్లు ఉంటుంది. అయితే ఇది లోక్‌సభలోని మెజారిటీ సభ్యుల విశ్వాసంపై ఆధారపడి ఉంటుంది. పదవిలో కొనసాగడానికి ఇష్టపడనప్పుడు రాష్ట్రపతికి రాజీనామా పత్రాన్ని సమర్పిస్తారు. ప్రధాన మంత్రి రాజీనామా చేస్తే మంత్రి మండలి స్వతహాగా రద్దవుతుంది. పార్లమెంటరీ సాంప్రదాయం ప్రకారం ప్రధాన మంత్రి కింద పేర్కొన్న పరిస్థితుల్లో పదవి కోల్పోతారు.

- లోక్ సభలో మంత్రి మండలిపై ప్రవేశ పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గినప్పుడు.
- లోక్ సభలో విశ్వాసం కోరిన తీర్మానానికి మెజారిటీ లభించనప్పుడు.
- లోక్ సభ ద్రవ్య బిల్లును తిరస్కరించినప్పుడు.
- బడ్జెట్‌పై కోత తీర్మానం నెగ్గినప్పుడు.
- రాష్ట్రపతి ప్రసంగానికి సంబంధించిన ధన్యవాద తీర్మానం వీగిపోవడం లేదా ప్రతిపక్షాలు ప్రతిపాదించిన సవరణ తీర్మానం నెగ్గడం.

సింగరేణి బొగ్గుగనులు ఉన్న రాష్ట్రం?

భారతదేశం - ఖనిజ వనరులు

వజ్రాలు: ప్రపంచంలో ప్రస్తుతం వజ్రాల ఉత్పత్తిలో రష్యా, బోట్స్‌వానా, కాంగో, కెనడా దేశాలు మొదటి నాలుగు స్థానాల్లో ఉన్నాయి. భారతదేశంలో నిల్వలు, ఉత్పత్తిపరంగా మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్ మొదటి రెండు స్థానాలను ఆక్రమించాయి. కింబర్లైట్ శిలాస్తరాల్లో ఇవి లభ్యమవుతున్నాయి.

గనుల విస్తరణ:
- మధ్యప్రదేశ్ - కేన్ నది ఒడ్డున ఉన్న పన్నా.
- ఆంధ్రప్రదేశ్ - అనంతపురం జిల్లాలోని వజ్రకరూర్ కింబర్లైట్, కృష్ణా నదిలోయ.
- కేరళ - కోజికోడ్.

అభ్రకం (మైకా): మైకా ఉత్పత్తిలో భారత్ ప్రపంచంలోనే ప్రథమ స్థానంలో ఉంది. ఎలక్ట్రికల్ ఇండస్ట్రీలో ఇన్సులేటర్‌గా, ఎలక్ట్రానిక్ ఇండస్ట్రీలో మైక్రో చిప్స్ రూపంలో, గ్లాస్ ఇండస్ట్రీలో గట్టితనం కోసం దీన్ని ఎక్కువగా వినియోగిస్తున్నారు.

ఇది హైడ్రోసిలికేట్ల రూపంలో భూపటలంలో మూడు రూపాల్లో లభ్యమవుతుంది. **అవి:**
1. **మస్కోవైట్ (పొటాష్ మైకా):** శ్వేత వర్ణంలో ఉంటుంది. దీన్నే 'రూబీ మైకా' అంటారు. ఇది అత్యంత నాణ్యమైంది.
2. **ఫ్లోగోపైట్:** పసుపు రంగులో ఉంటుంది. దీన్నే 'మెగ్నీషియా మైకా' అంటారు.
3. **బయోటైట్:** నలుపు వర్ణంలో ఉంటుంది.

గనుల విస్తరణ:
- బిహార్ - గయ.
- జార్ఖండ్ - కోడెర్మా, హజారీబాగ్, సింగ్భుమ్, పాలమావు.
- ఆంధ్రప్రదేశ్ - నెల్లూరు (గూడూరు).
- తెలంగాణ - ఖమ్మం.

బెరైటీస్ (ముగ్గురాయి): బెరైటీస్ నిల్వలు, ఉత్పత్తిపరంగా భారతదేశం ప్రపంచంలోనే ప్రథమ స్థానంలో ఉంది. దేశంలో ఆంధ్రప్రదేశ్‌లోని మంగంపేట, అనంతరాజుపేట (కడప జిల్లా) ప్రాంతాలు వీటికి ప్రసిద్ధి చెందాయి. ఈ ఖనిజం బేరియం ఆక్సైడ్ల రూపంలో లభ్యమవుతుంది. దీన్ని ముడి చమురును వెలికితీయడంలో కందెనగా, వైద్య అవసరాలకు ఉపయోగిస్తారు.

గనుల విస్తరణ:
- ఆంధ్రప్రదేశ్ - కడప.
- తెలంగాణ - ఖమ్మం.

ఆస్‌బెస్టాస్ (రాతి నార): సిమెంటు రేకులు, తాళ్లు, పెయింటింగులు, బుల్లెట్‌ప్రూఫ్ జాకెట్ల తయారీలో ఆస్‌బెస్టాస్‌ను ఉపయోగిస్తారు. వీటి నిల్వలు, ఉత్పత్తిలో రాజస్థాన్, ఆంధ్రప్రదేశ్ మొదటి రెండు స్థానాల్లో ఉన్నాయి. ఈ గనుల్లో పనిచేసే కార్మికులు 'ఆస్‌బెస్టోసిస్' అనే ఊపిరితిత్తులకు సంబంధించిన కేన్సర్‌కు గురవుతున్నారు.

సున్నపురాయి: సున్నపురాయిని 75 శాతం సిమెంట్ పరిశ్రమల్లో, 16 శాతం స్టీల్ ఇండస్ట్రీల్లో ఉపయోగిస్తారు. భారతదేశంలో నిల్వలపరంగా కర్ణాటక, రాజస్థాన్; ఉత్పత్తిపరంగా మధ్యప్రదేశ్, రాజస్థాన్ మొదటి రెండు స్థానాల్లో ఉన్నాయి.

డోలమైట్: దీన్ని 90 శాతం స్టీల్ ఇండస్ట్రీల్లో, 4 శాతం ఎరువుల పరిశ్రమల్లో వాడుతున్నారు. దీని ఉత్పత్తిలో ఛత్తీస్‌గఢ్, ఒడిశా మొదటి రెండు స్థానాల్లో ఉన్నాయి.

గ్రాఫైట్: పెన్సిళ్లు, ఎలక్ట్రిక్ బ్యాటరీల తయారీలో దీన్ని వాడతారు. దీని నిల్వల విషయంలో చైనా, భారత్ మొదటి రెండు స్థానాల్లో ఉన్నాయి. భారత్‌లో దీని ఉత్పత్తిలో ఒడిశా, జార్ఖండ్, తమిళనాడు మొదటి మూడు స్థానాల్లో ఉన్నాయి.

ఇతర లోహ, అలోహ ఖనిజాలు

జింక్: ఇది సల్ఫైడ్ల రూపంలో లభ్యమవుతుంది. గాల్వనైజేషన్ ప్రక్రియలో దీన్ని ఎక్కువగా ఉపయోగిస్తారు. నిల్వలు, ఉత్పత్తిలో రాజస్థాన్ ప్రథమ స్థానంలో ఉంది.

సీసం: ఇది 'గెలీనా' అనే సల్ఫైడ్‌ల రూపంలో లభ్యమవుతుంది. దీన్ని కేబుల్ కవర్లు, పెయింట్ల తయారీలో, రబ్బర్ తయారీకి చెందిన 'వల్కనైజేషన్' ప్రక్రియలో ఉపయోగిస్తారు. ప్రపంచంలో నిల్వలు, ఉత్పత్తి పరంగా ఆస్ట్రేలియా మొదటి స్థానంలో ఉంది. న్యూ సౌత్ వేల్స్, క్వీన్స్‌లాండ్‌లోని బ్రోకన్ హిల్స్ ప్రాంతాల్లో ఇది ఎక్కువగా లభ్యమవుతోంది.

భారతదేశంలో సీసం నిల్వలు రాజస్థాన్, ఆంధ్రప్రదేశ్(కర్నూలు, గుంటూరు), తెలంగాణ(నల్గొండ, ఖమ్మం), బిహార్, ఒడిశా రాష్ట్రాల్లో ఉన్నాయి.

తగరం: మలేషియాలో దీని ఉత్పత్తి ఎక్కువగా ఉండగా స్మెల్టింగ్ ఇండస్ట్రీ ఎక్కువగా సింగపూర్‌లో ఉంది. భారత్‌లో దీని నిల్వలు జార్ఖండ్ (హజారీబాగ్), బిహార్ (గయ), ఛత్తీస్‌గఢ్‌లో ఉన్నాయి.

వెండి (సిల్వర్): అర్జంటైట్ రూపంలో క్వార్ట్జైట్ శిలాస్తరాల్లో బంగారంతో కలిసి లభ్యమవుతుంది. దీన్ని ఎలక్ట్రో ప్లేటింగ్, ఫొటోగ్రఫీ, పారిశ్రామిక రసాయనాల తయారీలో ఉపయోగిస్తారు. దీని నిల్వలు రాజస్థాన్(జువార్)లో ఎక్కువగా ఉన్నాయి. కర్ణాటక (కోలార్), ఆంధ్రప్రదేశ్ (కడప, గుంటూరు, కర్నూలు), జార్ఖండ్ (రాంచీ, హజారీబాగ్) ప్రాంతాల్లోనూ వీటి నిల్వలు ఉన్నాయి.

టంగ్‌స్టన్: రాజస్థాన్‌లోని 'డేగనా' ప్రాంతంలో ఉన్నాయి.

నికెల్: ఒడిశాలో ఎక్కువగా లభిస్తోంది.

కోబాల్ట్: రాజస్థాన్, కేరళలో దీని నిల్వలు అధికంగా ఉన్నాయి.

ఉప్పు: గుజరాత్ దీని ఉత్పత్తికి ప్రసిద్ధి.

రాతి ఉప్పు: మండి (హిమాచల్ ప్రదేశ్)లో అధికంగా లభ్యమవుతోంది.

కియొనైట్: జార్ఖండ్‌లో అధికంగా లభిస్తుంది.

జిప్సం: రాజస్థాన్‌లో దీని నిల్వలు అధికం.

ఇంధన ఖనిజాలు

మండే స్వభావం ఉన్న ఖనిజాలు, పునరుత్పత్తి చెందని సాంప్రదాయ ఇంధన వనరులు (బొగ్గు, పెట్రోలియం, సహజవాయువు) ఇంధన ఖనిజాలకు ఉదాహరణ. ఇవి ప్రధానంగా హైడ్రోకార్బన్లు.

బొగ్గు: దీన్నే నల్ల బంగారం అంటారు. ఇది దేశంలో ప్రధానంగా రెండు భౌమ కాలాలకు చెందిన అవక్షేప శిలాస్తరాల్లో లభ్యమవుతోంది. **అవి:**

1) **గోండ్వానా బొగ్గు:** దేశంలో లభ్యమయ్యే బొగ్గులో 90 శాతం ఈ రకానికి చెందిందే. ఇది ఎక్కువగా దిగువ గోండ్వానా యుగానికి చెందిన అవక్షేప శిలాస్తరాల్లోని దామోదర్ లోయ (జార్ఖండ్-దామోదర్), సోన్ (మధ్య ప్రదేశ్), మహానది (ఒడిశా), గోదావరి (ఆంధ్రప్రదేశ్), వార్ధా (మహారాష్ట్ర)లో నిక్షిప్తమై ఉంది. ఇది అత్యంత నాణ్యమైన బొగ్గు.

2) **టెర్షియరీ బొగ్గు:** ఇది ఎక్కువగా తమిళనాడు, గుజరాత్, రాజస్థాన్, అసోం, జమ్ము-కశ్మీర్‌లోని ద్వీపకల్ప, ద్వీపకల్పేతర ప్రాంతాల్లో లభ్యమవుతోంది.

బొగ్గులోని కర్బన శాతాన్ని అనుసరించి దీన్ని 4 రకాలుగా వర్గీకరించారు. అవి..

1. **ఆంత్రసైట్:** అత్యంత నాణ్యమైన బొగ్గు. ఇందులో 90-95 శాతం కార్బన్ ఉంటుంది. జమ్ము-కశ్మీర్‌లో మాత్రమే కొద్ది పరిమాణంలో లభ్యమవుతోంది.



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం
జాగ్రఫీ

2. **బిట్యూమినస్:** ఇందులో 85-90 శాతం కార్బన్ ఉంటుంది. దేశంలో ఎక్కువగా లభ్యమయ్యే రకం ఇది. దీని వినియోగం కూడా ఎక్కువే.
3. **లిగ్నైట్ (బ్రౌన్‌కోల్):** 30-40 శాతం కార్బన్ ఉంటుంది. దీని నాణ్యత తక్కువ. తమిళనాడులోని నైవేలి ప్రాంతంలో 90 శాతం నిల్వలు ఉన్నాయి.
4. **పీట్:** కార్బన్ 10 శాతం మాత్రమే ఉంటుంది. ఇది కర్ర నుంచి బొగ్గు ఏర్పడటంలోని మొదటి దశ. దీన్నే కొయ్య బొగ్గు అని కూడా అంటారు.

భారత్‌లో 285 బిలియన్ టన్నుల బొగ్గు నిల్వలున్నాయి. వీటిలో 200 బిలియన్ టన్నులు బిట్యూమినస్, మిగిలినవి లిగ్నైట్ రకానికి చెందినవి. బొగ్గు నిల్వల్లో జార్ఖండ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, పశ్చిమబెంగాల్, తెలంగాణ; ఉత్పత్తిలో ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, ఒడిశా, మధ్యప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు వరుసగా మొదటి స్థానాల్లో ఉన్నాయి.

దేశంలో ప్రధానమైన గోండ్వానా బొగ్గు గనులు
జార్ఖండ్ - జారియా, బొకారో, డాల్టన్‌గాంజ్.
పశ్చిమ బెంగాల్- రాణిగంజ్, గిరిధి, కరన్ పురా, డార్జిలింగ్.
ఛత్తీస్‌గఢ్-కోర్బా, బీరమ్‌పూర్, చిరిమిరి, హస్‌డో-అరండ్, తాతాపాని- రామ్‌కోలా.
మధ్యప్రదేశ్- సింగ్రౌలి, సొహాగ్‌పూర్, ఉమారియా.
మహారాష్ట్ర - చందా, వార్ధా, కంప్టీ, భాండర్.
తెలంగాణ - సింగరేణి, కొత్తగూడెం, తాండూరు, పాల్వంచ.

టెర్షియరీ బొగ్గు గనులు:
తమిళనాడు - నైవేలి జయమ్ కొండ చోళాపురం, మన్నార్ గుడి, హిమాచల్ ప్రదేశ్, చంద్రలోయ.
అసోం - మాకుమ్, జెంజి, నజీరా, జయపూర్.
రాజస్థాన్ - బికనీర్ .
ఉత్తర ప్రదేశ్ - నామ్‌చిక్, నాంరూధ్.

బొగ్గు ఉత్పత్తిలో చైనా, యూఎస్‌ఏ, భారత్ వరుసగా మొదటి మూడు స్థానాల్లో ఉన్నాయి.

విస్తరణ:
యూఎస్ఏ: పెన్సిల్వేనియా నుంచి అలబామా వరకు ఉన్న అపలేచియన్ ప్రాంతం, కెంటకీ, పశ్చిమ వర్జీనియా.
ఉక్రెయిన్: డొనెట్స్క్ ప్రాంతం.
రష్యా: కుజ్‌నెట్స్క్ బేసిన్ .
కజకిస్థాన్: కరగండా.
జర్మనీ: రూర్ లోయ.
ఆస్ట్రేలియా: న్యూసౌత్‌వేల్స్.

పెట్రోలియం: దీన్నే ముడి చమురు, రాతి నూనె, క్రూడాయిల్, బంగారుద్రవం అని కూడా అంటారు. ఇది ప్రధానంగా అవక్షేప శిలల నుంచి లభ్యమవుతుంది. ప్రపంచంలో మొదటిసారిగా పెట్రోలియం బావిని 'పెన్సిల్వేనియా'లో కనుగొన్నారు. పెట్రోలియం నిల్వలు, ఉత్పత్తి, ఎగుమతుల్లో సౌదీ అరేబియా ప్రథమస్థానంలో ఉంది. దీని వినియోగంలో యూఎస్ఏ మొదటి స్థానంలో ఉంది. తర్వాత స్థానాల్లో చైనా, జపాన్, ఇండియా ఉన్నాయి.

భారతదేశంలో మొదటగా అసోంలోని 'మాకుమ్' ప్రాంతంలో ముడి చమురును గుర్తించారు. 'దిగ్బాయ్' ప్రాంతంలో దీన్ని ఉత్పత్తి చేశారు. దేశంలో చమురు నిక్షేపాల అన్వేషణ, వెలికితీత కోసం 1957లో 'డెహ్రాడూన్'లో ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కమిషన్ (ONGC)ను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఇది విదేశాల్లో చమురు నిక్షేపాలను వెలికితీయడానికి OVL (ONGC Videsh Ltd.) అనే సంస్థను ఏర్పాటు చేసుకుంది. ఇటీవల రష్యాలోని 'శకాలిన్' క్షేత్రంలో పెట్టుబడులు పెట్టారు. ప్రస్తుతం ముడి చమురు ఉత్పత్తిలో మహారాష్ట్ర ప్రథమ స్థానంలో ఉండగా, గుజరాత్ రెండో స్థానంలో ఉంది.

ముడి చమురు బావుల విస్తరణ:

మహారాష్ట్ర: ముంబై-హైలోని పొన్న, ముక్త, గాంధార, హీరా బావులు, శాలిశెట్టి, బస్సైన్.

గుజరాత్: అంకలేశ్వర్ (జవహర్‌లాల్ నెహ్రూ ముడి చమురు బావి), నవ్‌గావ్, థోర్కా కలోల్, కోసాంబ (వీటన్నింటినీ కలిపి గాంధార క్షేత్రం లేదా కాంబే బేసిన్ అంటారు), ఖంబట్ బేసిన్‌లోని అలియాబాట్, కచ్ ప్రాంతంలోని కలోల్, మేసిన్.

అసోం: దిగ్బాయ్, నహర్ కాటియా, మొరాన్, హుగ్రిజన్, సిబ్ సాగర్, రుద్రసాగర్.

తమిళనాడు: కావేరి బేసిన్‌లోని నారీమనం, కోవెల్‌పూల్.

త్రిపుర: మూమ్‌బాగ, బారాముర, దేవ్‌టమూరా.

ఏపీ: కేజీ బేసిన్‌లోని రవ్వ, లింగాల.

సహజవాయువు: భారతదేశంలో మొదటిసారిగా సహజవాయువును హిమాచల్ ప్రదేశ్‌లోని జ్వాలాముఖి వద్ద కనుగొన్నారు. సహజవాయువును ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి రవాణా చేయడానికి గ్యాస్ అథారిటీ ఆఫ్ ఇండియా (GAIL)ను ఏర్పాటు చేశారు. ఈ సంస్థ నిర్మించిన పైప్ లైన్లలో ప్రముఖమైంది - HBJ పైప్‌లైన్. ఇది గుజరాత్‌లోని హజీరా నుంచి మధ్య ప్రదేశ్‌లోని బీజాపూర్ మీదుగా ఉత్తర ప్రదేశ్‌లోని జగదీష్‌పూర్ వరకు ఉంది. ప్రస్తుతం దీన్ని ఉత్తర ప్రదేశ్‌లోని దుబ్రాల వరకు (1750 కి.మీ.) పొడిగించారు.

విస్తరణ:
1. అసోం, త్రిపుర
2. కాంబే బేసిన్ (గుజరాత్)
3. బాంబే హై
4. కేజీ బేసిన్ కైకలూరు, పాసర్లపూడి (ఆంధ్రప్రదేశ్)
5. కావేరి బేసిన్ (తమిళనాడు)
6. రాజస్థాన్‌లోని తానోట్

అణు ఇంధన ఖనిజాలు

ఇవి శక్తిని వికిరణ రూపంలో వెదజల్లే అస్థిర కేంద్రక పదార్థాలు. యురేనియం (పిచ్‌బ్లెండ్), థోరియం (మోనోజైట్), జిర్కోనియం, ఇల్మనైట్, టిటానియం వీటికి ఉదాహరణ.

యురేనియం: దేశంలో యురేనియం నిల్వలు ఎక్కువగా జార్ఖండ్ (జాదుగూడ), బిహార్ (గయ), ఆంధ్రప్రదేశ్ (కడప జిల్లాలోని తుమ్మలపల్లి), తెలంగాణ(నల్గొండ జిల్లాలోని పెద్ద అడిశర్లపల్లి), రాజస్థాన్‌లోని ఆరావళి పర్వత ప్రాంతాల్లో ఉన్నాయి.

థోరియం: ఇది ఎక్కువగా కేరళ, విశాఖ తీర ప్రాంత ఇసుక రేణువుల్లో లభ్యమవుతోంది.

ఇల్మనైట్, టిటానియం ఎక్కువగా విశాఖ తీరంలో లభిస్తోంది. జిర్కోనియం కేరళ తీరంలో; లిథియం జార్ఖండ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ ప్రాంతాల్లో లభ్యమవుతోంది.

మాదిరి ప్రశ్నలు

1. నాణ్యత ఆధారంగా ఇనుప ధాతువు రకాలను ఆరోహణ క్రమంలో అమర్చండి.
   ఎ. మాగ్నటైట్ బి. హెమటైట్
   సి. లియోనైట్ డి. సెడరైట్
   1) డి, సి, బి, ఎ 2) సి, డి, బి, ఎ
   3) ఎ, బి, సి, డి 4) ఎ, సి, బి, డి
2. అల్యూమినియం భూ పటలంలో ఏ రూపంలో లభ్యమవుతుంది?
   1) పెరైట్ 2) బాక్సైట్
   3) మాగ్నసైట్ 4) శుద్ధలోహం
3. కోర్బా బొగ్గు గనులు ఎక్కడ ఉన్నాయి?
   1) మధ్యప్రదేశ్ 2) జార్ఖండ్
   3) ఛత్తీస్‌గఢ్ 4) ఒడిశా
4. సఖాలియన్ చమురు క్షేత్రం ఉన్న దేశం?
   1) అమెరికా 2) ఉక్రైన్
   3) చైనా 4) రష్యా
5. కరగండా బొగ్గు క్షేత్రం ఏ దేశంలో ఉంది?
   1) కజకిస్థాన్ 2) జర్మనీ
   3) ఉక్రైన్ 4) జాంబియా
6. సింగరేణి బొగ్గుగనులు ఉన్న రాష్ట్రం?
   1) ఆంధ్రప్రదేశ్ 2) మధ్యప్రదేశ్
   3) తెలంగాణా 4) ఒడిశా
7. మార్గేరీటా బొగ్గు నిక్షేపాలు ఉన్న ప్రాంతం?
   1) మేఘాలయ 2) అసోం
   3) మణిపూర్ 4) త్రిపుర
8. ఒడిశాలోని సుకిందా దేనికి ప్రసిద్ధి?
   1) కాపర్ 2) క్రోమైట్
   3) బాక్సైట్ 4) బొగ్గు

సమాధానాలు

1) 1; 2) 2; 3) 3; 4) 4;
5) 1; 6) 3; 7) 2; 8) 2.

విద్య, ఉద్యోగ సమాచారం

టీఎంసీ ముంబైలో ప్రాజెక్ట్ సైంటిస్ట్-సి పోస్టులు

ముంబైలోని టాటా మెమోరియల్ సెంటర్(టీఎంసీ) ప్రాజెక్ట్ సైంటిస్ట్-సి(నాన్ మెడికల్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 02.
- » **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో మాస్టర్స్(ఎకనామిక్స్, హెల్త్ ఎకనామిక్స్, పబ్లిక్ హెల్త్, లైఫ్ సైన్స్, బయోస్టాటిస్టిక్స్)లో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
- » **వయసు:** 45 ఏళ్లు మించకూడదు.
- » **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 17.03.2025.
- » **వెబ్‌సైట్:** https://actrec.gov.in

ఉడుపి కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్‌లో బూత్ ఆపరేటర్ పోస్టులు

కర్ణాటకలోని ఉడుపి కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్(యూసీఎస్ఎల్).. ఒప్పంద ప్రాతిపదికన బూత్ ఆపరేటర్(పెయింటింగ్)పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 02.
- » **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఎస్ఎస్ఎల్‌సీ, ఐటీఐ, ఎన్‌టీసీలో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
- » **వయసు:** 17.03.2025 నాటికి 30 ఏళ్లు మించకూడదు.
- » **వేతనం:** నెలకు రూ.22,170.
- » **ఎంపిక విధానం:** రాతపరీక్ష ద్వారా ఎంపికచేస్తారు.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 17.03.2025.
- » **వెబ్‌సైట్:** https://cochinshipyard.in

ఉడుపి కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్‌లో ఆఫీస్ అసిస్టెంట్ పోస్టులు

కర్ణాటకలోని ఉడుపి కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్(యూసీఎస్ఎల్) ఒప్పంద ప్రాతిపదికన ఆఫీస్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 08.
- » **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఏఐసీటీఈ గుర్తించిన యూనివర్శిటీ నుంచి డిగ్రీలో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
- » **వయసు:** 17.03.2025 నాటికి 30 ఏళ్లు మించకూడదు.
- » **వేతనం:** నెలకు రూ.25,000.
- » **ఎంపిక విధానం:** రాతపరీక్ష ద్వారా ఎంపికచేస్తారు.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 17.03.2025.
- » **వెబ్‌సైట్:** https://cochinshipyard.in

కాకతీయ రాజ్య మూల పురుషుడు ఎవరు?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

తెలంగాణ చరిత్ర

కాకతీయుల చరిత్ర

మధ్యయుగ భారతదేశ చరిత్రలో ఢిల్లీ సుల్తానులు ఉత్తర భారతదేశాన్ని పాలిస్తున్నప్పుడు దక్షిణాపథంలో యాదవ, కాకతీయ, పాండ్య, హోయసాల రాజ్యాలు వర్ధిల్లాయి. ఢిల్లీ సుల్తాన్ అల్లాఉద్దీన్ ఖిల్జీ దక్షిణాపథ రాజ్యాలను జయించాలని భావించాడు.

కాకతీయులు కొంతకాలం రాష్ట్రకూటులు, తూర్పు, పశ్చిమ చాళుక్యులకు సామంత సేనా నాయకులుగా ఉన్నారు. వీరు తెలంగాణ ప్రాంతంలో రాజ్యం స్థాపించి, నిస్సారంగా ఉన్న భూ ప్రాంతాలను బహుముఖంగా అభివృద్ధి చేసి ప్రత్యేకతను చాటుకున్నారు. వీరు మొదట సబ్బినాడు, అనుమకొండ, కొలనుపాక, పిల్లలమర్రి, సతనాటి సీమ (మధిర ప్రాంతం), కొరవి సీమ (వరంగల్-మానుకోట) ప్రాంతాల్లో పాలించారు. తర్వాత స్వతంత్రులై క్రీ.శ. 1000 – క్రీ.శ. 1323 వరకు తెలంగాణా ప్రాంతమంతటా రాజ్యాన్ని స్థాపించి, సుమారు 300 ఏళ్ల ఓరుగల్లు (వరంగల్)ను రాజధానిగా చేసుకొని అఖిలాంధ్రదేశాన్ని పాలించారు. మధ్యయుగాలనాటి సామాజిక, సాంస్కృతిక రంగాలకు గట్టి పునాది వేసి తర్వాత వచ్చిన రెడ్డి, విజయనగర రాజులకు మార్గదర్శకులయ్యారు.

పుట్టు పూర్వోత్తరాలు, శాసన ఆధారాలు:

కాకతీయుల వంశం, కులం, పుట్టు పూర్వో త్తరాల గురించి చరిత్రకారుల్లో భిన్నాభిప్రా యాలున్నాయి. వీరు మొదట ఆంధ్ర దేశానికి పశ్చిమ సరిహద్దులోని 'కాకతీ' గ్రామం నుంచి వచ్చి తూర్పు చాళుక్యుల కొలువులో ఉంటూ ఆంధ్రులయ్యారని మారేమండ రామారావు అభిప్రాయం. క్రీ.శ. 956 నాటి తూర్పు చాళుక్య రాజు దానార్ణవుడు వేయించిన మాంగల్లు శాసనం ఆధారంగా ఈ వంశంలోని కాకర్త్య గుండయ పూర్వీకుల పేర్లకు చివర రాష్ట్రకూట అనే పదం ఉండటం వల్ల (ఉదా: గుండియ రాష్ట్రకూట, ఎరియ రాష్ట్రకూట) వీరు రాష్ట్రకూటులని ఆచార్య పి.వి. పరబ్రహ్మశాస్త్రి పేర్కొన్నారు. అందువల్ల కాకతీయ రాజ్య మూల పురుషుడు కాకర్త్య గుండయగా నిర్ధారించారు.

1220లో కాకతీయ గణపతి దేవుని సోదరి 'మైలాంబ' బయ్యారం అనే గ్రామంలో ఆమె తల్లి పేరుతో గొప్ప తటాకం (చెరువు) నిర్మించి, అక్కడ శాసనాన్ని వేయించింది. ఈ శాసనం ప్రకారం కాకతీయ వంశ మూల పురుషుడు వెన్నమ నాయకుడు. కాకతిపురమనే స్థలం నుంచి వారి పూర్వీకులు పాలించినట్లు ఇది విశదీకరిస్తోంది. 1163లో కాకతీయ రుద్రదేవుడు అనుమకొండ శాసనం వేయించాడు. ఇందులో రెండో ప్రోలరాజు, అతడి కుమారుడు రుద్రదేవుడి విజయాల వర్ణన ఉంది. ఈ శాసనాన్ని 1882లో జె.ఎఫ్.ప్లీట్ అనే ఆంగ్లేయుడు పరిశోధించి వెలుగులోకి తెచ్చాడు. కాకతీయ చరిత్రకు మాంగల్లు, అనుమకొండ, బయ్యారం శాసనాలు ప్రధానాధారాలు.



వాఙ్మయ ఆధారాలు: కాకతీయ ప్రతాపరుద్రుని ఆస్థానకవి విద్యానాథుడు. ఇతడు 'ప్రతాపరుద్ర యశోభూషణం' అనే అలంకార శాస్త్ర గ్రంథాన్ని సంస్కృతంలో రచించాడు. ఇందులో ప్రతాపరుద్రునికి చెందిన చారిత్రక అంశాలున్నాయి. దీని ప్రకారం కాకతీ అనే దుర్గాశక్తి ఏకశిలానగరవాసులకు (ఓరుగల్లు) కులదేవత అని, ఆమెను ఆరాధించడం వల్ల కాకతీయులుగా పేరు వచ్చిందని పేర్కొన్నాడు.

రావిపాటి త్రిపురాంతకుడు సంస్కృతంలో 'ప్రేమాభిరామం' నాటకం రాశాడు. దీని ఆధారంగా వినుకొండ వల్లభరాయుడు తెలుగులో 'క్రీడాభిరామం' రాశాడు. పాల్కురికి సోమనాథుడు రచించిన 'పండితారాధ్య చరిత్ర', 'బసవ పురాణం', కొలని గణపతిదేవుడి 'శివయోగసారం', కాకతీ రుద్రదేవుడి 'నీతిసారం', మడికి సింగన 'సకల నీతి సమ్మతం', తెలుగు చోడబద్దెన 'నీతిసార ముక్తావళి', శ్రీనాథుడి 'పల్నాటి వీర చరిత్ర', జాయపసేనాని- 'నృత్తరత్నావళి', ఏకామ్రనాథుడి 'ప్రతాపరుద్ర చరిత్ర' తదితర గ్రంథాలు కాకతీయుల చరిత్రకు ప్రధాన మూలాధారాలు. కాకతీయులు మొదట జైన మతాన్ని ఆరాధించారు. జైనమత కుష్మాండిని పూజించి, తర్వాత కాలంలో కాకతమ్మ (దుర్గ) ను పూజించినట్లు తెలుస్తోంది. కాకతీ అంటే కుష్మాండం (గుమ్మడికాయ) అని అర్థం. కాకతీ అనే పురం నుంచి పాలించడం వల్ల కాకతీయులు అయ్యారని శాసనాలు పేర్కొంటున్నాయి. అయితే ఈ కాకతీ పురం ఎక్కడుందనే అంశాన్ని ఇప్పటికీ గుర్తించలేదు. కాకతీయులు ఏ కులానికి చెందినవారనే విషయం కూడా వివాదాస్పదమే. వీరు క్షత్రియులు లేదా చతుర్థ కులజులని చరిత్రకారుల అభిప్రాయం. గణపతిదేవుని మోటుపల్లి, పాకాల, కాంచీపుర శాసనాలు వీరిని క్షత్రియులుగా, సూర్యవంశీయులుగా వర్ణించాయి. వీరు జన్మతా క్షత్రియులు కారని, చతుర్థాన్వయ సంజాతులేనని, వీరి సన్నిహిత బంధువులందరూ చతుర్థ కులస్థులేనని మరికొందరి చరిత్రకారుల అభిప్రాయం. రాజ్యం చేపట్టిన తర్వాత వీరు క్షత్రియత్వాన్ని ఆపాదించుకొని ఉండొచ్చునని వీరు భావించారు.

కాకతీయ మొదటి రాజులు

మొదటి బేతరాజు; మొదటి, రెండో ప్రోలరాజులు; రెండో బేతరాజు; దుర్గరాజు పశ్చిమ చాళుక్యులకు సామంతులుగా ఉండేవారు. ఖాజీపేట శాసనం ప్రకారం మొదటి బేతరాజుకు 'కాకతీ పురాధినేత', 'అరిగజకేసరి', 'కాకతీ వల్లభ' అనే బిరుదులున్నాయి. మొదటి బేతరాజు ఓరుగల్లు సమీపంలో కేసరి సముద్రం(చెరువు) తవ్వించాడు. బేతరాజు కాలం 1000-1052.

రెండో బేతరాజుకు 'త్రిభువనమల్ల', 'విక్రమ చక్రి', 'చలమర్తి గండడు', 'మహామండలేశ్వరుడు' అనే బిరుదులున్నాయి. ఇతడి గురువు శైవ కాలముఖ శాఖకు చెందిన రామేశ్వర పండితుడు. రెండో బేతరాజు రాజధాని అనుమకొండ.

రెండో ప్రోలరాజు (1117- 1158): ఇతడు కాకతీయ రాజుల్లో మొదటి స్వతంత్ర రాజు. కళ్యాణి చాళుక్య రాజు సోమేశ్వరుడి మరణానంతరం ఇతడు స్వతంత్ర రాజ్యాన్ని ప్రకటించుకున్నాడు.

రుద్రదేవుడు (1158-1195): రెండో ప్రోలరాజు అనంతరం రుద్రదేవుడు(మొదటి ప్రతాపరుద్రుడు) అధికారంలోకి వచ్చాడు. అచితేంద్రుడు వేయించిన అనుమకొండ శాసనం రుద్రదేవుడి ప్రతిభ, విజయాలు రాజ్య నిర్మాణ దక్షత గురించి వివరిస్తుంది. ఇతడు రాజ్యాన్ని తూర్పున బంగాళాఖాతం నుంచి దక్షిణాన శ్రీశైలం, పశ్చిమాన కళ్యాణి, ఉత్తరాన గోదావరి నదీతీరం వరకు విస్తరించాడు. కాకతీ రుద్రదేవుడు 1182లో జరిగిన పల్నాటి యుద్ధంలో నలగామ రాజుకు సైన్యాన్ని పంపి, సహాయపడ్డాడు. ఇతడి సామ్రాజ్య విస్తరణలో నతనాట, కోట, విప్పర్ల సామంతనాయకులు సహాయపడ్డారు. రుద్రదేవుడికి 'వినయ విద్యాభూషణుడు' అనే బిరుదు ఉంది.

రుద్రదేవుడు సంస్కృతంలో 'నీతిసారం' అనే గ్రంథాన్ని రాశాడు. అనుమకొండ వద్ద గంగచియ తటాకాన్ని తవ్వించాడు. అనమకొండలో వేయి స్తంభాల గుడి, ఓరుగల్లు దుర్గం, ఏకశిలా నగరాలకు పునాది వేశాడు. 1196లో దేవగిరి యాదవరాజు జైతుగి చేతిలో రుద్రదేవుడు మరణించాడు. అనంతరం రాజ్యాధికారాన్ని చేపట్టిన రుద్రదేవుడి సోదరుడు మహాదేవుడు యాదవులపై దాడిచేసి, ఆ యుద్ధంలో మరణించాడు. యాదవరాజైన జైతుగి (జైత్రపాలుడు) యువరాజైన గణపతిదేవుడిని బందీగా పట్టుకున్నాడు. గణపతిదేవుని గుణగణాలను మెచ్చుకొని కాకతీయ సింహాసనంపై కూర్చోబెట్టాడు.

గణపతిదేవుడు (1199-1259):
ఇతడు మహాదేవుడి కుమారుడు. కాకతీయరాజుల్లో అగ్రగణ్యుడు, పరిపాలనాదక్షుడు, రాజనీతిజ్ఞుడు. నెల్లూరు, కంచి, కళింగ, వెలనాటి, చోళ రాజ్యాలను జయించాడు. 'రాయగజకేసరి' బిరుదు పొందాడు. 60 ఏళ్లకు పైగా రాజ్యపాలన చేశాడు. ఓరుగల్లు కోట నిర్మాణాన్ని పూర్తి చేశాడు. ఓరుగల్లులోని స్వయంభూ దేవాలయానికి నాలుగు దిక్కులా కాకతీయ తోరణాలను రాతితో నిర్మించాడు. ములుగు సమీపంలో ఘనపురం గ్రామంలో అనేక దేవాలయాలు నిర్మించాడు. పాలంపేట గ్రామంలో ప్రపంచ ప్రసిద్ధి గాంచిన రామప్ప దేవాలయంతో పాటు పిల్లలమర్రి, పానగల్లు, నాగులపాడు ఆలయాలు ఇతడి కాలంలో నిర్మించినవే. గణపతిదేవుడి సేనాధిపతి రేచర్ల రుద్రుడు. ఇతడు రాజ్య విస్తరణలో విశేష సేవలందించాడు. గణపతి దేవుడి కాలంలోనే రేచర్ల రుద్రుడు రామప్పగుడిని నిర్మించాడు. గణపతిదేవుడు రామప్ప, పాకాల, లక్కవరం చెరువులను తవ్వించాడు. అనమకొండ నుంచి రాజధానిని ఓరుగల్లుకు మార్చాడు. కాకతీయుల కాలంలో మోటుపల్లి రేవు ద్వారా విదేశీ వర్తకం జరిగేది. ఈ రేవుకు 'దేశీయ కొండ పట్టణం' అనే పేరు కూడా ఉంది. విదేశీ వర్తకులను రేవు దొంగల నుంచి రక్షించడం, అధిక సుంకాలు నియంత్రించడానికి గణపతి దేవుడు మోటుపల్లి అభయశాసనం వేయించాడు. రేచర్ల రుద్రుడిని 'కాకతీయ రాజ్యభారధౌరేయుడు' బిరుదుతో గణపతి దేవుడు సత్కరించాడు. దివిసీమ, పినచోడ సామంతరాజు కుమార్తెలైన నారమ్మ (నారాంబ), పేరాంబను వివాహమాడాడు. బావ మరిది జాయపసేనానిని గజసాహితిగా నియమించాడు. జాయపసేనాని నృత్త రత్నావళి, గీత రత్నావళి, వాద్య రత్నావళి అనే గ్రంథాలను సంస్కృతంలో రాశాడు. గణపతి దేవుడికి రుద్రాంబ (రుద్రమదేవి), గణపాంబ అనే ఇద్దరు కుమార్తెలున్నారు. రుద్రమదేవిని వీర భద్రుడికి ఇచ్చి వివాహం చేశాడు. ఈమెకు పురుష వేశం వేయించి రుద్రదేవమహారాజు పేరుతో 1259లో యువరాజుగా పట్టాభిషేకం చేశాడు.

కడప ప్రాంతాన్ని పాలించిన తెలుగు చోడుల రాజ్యాన్ని కాకతీయ రాజ్యంలో గణపతిదేవుడు విలీనం చేశాడు. ఇతడు అనేక దిగ్విజయ యాత్రలతో ఆంధ్రదేశాన్ని ఏకం చేసి 'ఆంధ్రదేశాధీశ్వరుడు'గా ఖ్యాతిగాంచాడు. ఈయన శైవ భక్తుడు. ఇతడి శివదీక్షా గురువు విశ్వేశ్వర శివదేశికుడు. శివదేశికుడు అనేక గోళకీ మఠాలు స్థాపించాడు. గణపతిదేవుడు నెల్లూరు ప్రాంతాన్ని పాలించిన రెండో మనుమసిద్ధికి యుద్ధంలో సహాయపడ్డాడు. మనుమసిద్ధి ఆస్థానంలోని కవి తిక్కన సోమయాజి. ఇతడికి 'కవి బ్రహ్మ', 'ఉభయ కవిమిత్రుడు' అనే బిరుదులు ఉన్నాయి.



The scientific objectives include..

MODEL QUESTIONS

BANK EXAMS

GENERAL ENGLISH



Directions (Q. 1 - 5): Read each sentence to find out whether there is any grammatical mistake/ error in it. The error, if any, will be in one part of the sentence. Mark the number of that part with error as your answer. If there is 'No error', mark (5) as your answer.

1. If I was president (1)/ I will (2)/ make health care (3)/ more affordable. (4)/ No error (5)
2. Despite government sponsored endeavors (1)/ to improve classroom performance, (2)/ an extraordinary high percentage of students(3)/ fail to gain admission to higher education.(4)/No error (5)
3. Wordsworth was one of the first European poet (1)/ to consider (2)/ the lowliest members of society (3)/ to be valid subjects for poetry. (4)/ No error (5)
4. It is probable (1)/ that the prototype cellular motor (2)/ might be ready for testing (3)/ around the end of next year. (4)/ No error (5)
5. The publishers, unwilling to shoulder the entire risk, (1)/ insisted that the author (2)/ shou-ld pay half the cost of the initial print run (3)/ of his controversial new book. (4)/ No error (5)

Directions (Q. 6 to 10): Which of the phrases (1), (2), (3), and (4) given below each sentence should replace the phrase underlined in the sentence to make it grammatically correct? If there is no error mark (5) No correction required as your answer.

6. It ought to be <u>her with whom you share your secrets, not me.</u>
   1) her with whom you share your secrets, not I.
   2) she with whom you share your secrets, not me.
   3) she with whom you share your secrets, not I.
   4) her with who you share your secrets, not me.
   5) No correction required
7. The government requires <u>that these forms should be submitted</u> before the end of the financial year.
   1) that these forms should be submitted
   2) that these forms be submitted
   3) for these forms to be submitted
   4) these forms submission
   5) No correction required
8. A conjunction is used to connect <u>words and sentences together.</u>
   1) words and sentences together
   2) words or sentences together
   3) words and sentences
   4) words or sentences
   5) No correction required
9. <u>You taking a loan to buy a car annoyed Father.</u>
   1) Your taking a loan to buy a car annoyed Father.
   2) Your taking a loan to buy a car aggravated Father.
   3) You taking a loan to buy a car annoyed Father.
   4) Father was annoyed by you taking a loan to buy a car.
   5) No correction required
10. Between you <u>and I, I doubt that he will come.</u>
    1) and I, I doubt that he will come.
    2) and I, I doubt that he would come.
    3) and me, I doubt that he will come.
    4) and me, I doubt that he would come.
    5) No correction required

Directions (Q. 11-15): Rearrange the following six sentences (A), (B), (C), (D), (E) and (F) in a proper sequence to form a meaningful paragraph and then answer the questions given below.

A) The scientific objectives include atmospheric entry science, long range and close-up surface imaging, rock and soil composition and material properties experiments, and meteorology, with the general objective being to characterize the Martian environment for further exploration.
B) Mars Pathfinder was an ambitious mission to send a lander and a separate, remote-controlled rover to the surface of Mars.
C) The mission had the primary objective of demonstrating the feasibility of low-cost landings on and exploration of the Martian surface.
D) This was the second of NASA's low-cost planetary Discovery missions to be launched.
E) This objective was met by tests of communications between the rover and lander, and the lander and Earth, tests of the imaging devices and sensors, and tests of the maneuverability and systems of the rover on the surface.
F) It demonstrated a number of innovative, economical, and highly effective approaches to spacecraft and mission design of a planetary landing mission.

11. What is the FIRST sentence after rearrangement?
    1) C 2) B 3) D 4) E 5) F
12. What is the THIRD sentence after rearrangement?
    1) A 2) B 3) D 4) F 5) C
13. What is the FOURTH sentence after rearrangement?
    1) A 2) C 3) D 4) E 5) F
14. What is the FIFTH sentence after rearrangement?
    1) B 2) C 3) D 4) E 5) F
15. What is the SECOND sentence after rearrangement?
    1) A 2) B 3) D 4) E 5) F

Directions (Q. 16-20): Each question below has a blank/ two blanks, each blank indicating that something has been omitted. Choose the word/ set of words from the five options for each blank that best fits the meaning of the sentence as a whole.

16. Contrary to the weekly action in the market which is ____ with activity, today it presents a ____ picture.
    1) Abuzz, grim 2) critical, solid 3) appreciated, wonderful 4) honoured, celebrating 5) praise, amazing
17. He ____ his demand for registration of a case against the ____.
    1) Assured, law 2) support, punished 3) believed, persons 4) reiterated, culprits 5) withheld, sensitive
18. Severity of the heat ____ in many regions reached new heights with the ____ temperature rising above 43 degrees.
    1) Transforms, matters 2) summer, issues 3) boils, issues 4) wave, maximum 5) minimizes, problems
19. The government ____ an expert committee to study the ____ of the project.
    1) Grown, participation 2) people, utility 3) upcoming, involve 4) constituted, feasibility 5) urban, content
20. The Srisailam dam ____ constructed and completed in all ____ in 1984.
    1) Had, aspect 2) has, expects 3) expertise, were 4) have, issues 5)was, respects

Directions (Q. 21-30): In the following passage there are blanks, each of which has been numbered. These numbers are printed below the passage and against each, five words/ phrases are suggested, one of which fits the blank appropriately. Find out the appropriate word in each case and mark your answer.

Many decades ____ (21), radio commentary used to be the best way to catch the cricket ____ (22). Then ____ (23) live television. It may now well be the age of data, ____ (24) live over smart phones and shareable ____ (25) social media. Cricket analytics and content firms, which came up in recent years to serve the burgeoning ____ (26) of professional teams in an era of non-stop cricket, now ____ (27) they have a new audience to serve. This, even as they are finding newer ways ____ (28) teams make better decisions and players iron out their grey areas. "Gone are the days when people chased cricket. It is cricket that is running behind fans with data and scorecards," Mr. Ramakrishnan says. His idea is to keep cricket fans engaged without their having to watch it live, which is possible because of ____ (29) Internet. So a ____ (30) travelling in a bus will not only be able to have an informed opinion about a match currently taking place but also can be in a position to share that immediately on social media.

21. 1) before 2) ago 3) after 4) old 5) behind
22. 1) action 2) deed 3) act 4) exploit 5) battle
23. 1) comes 2) will came 3) came 4) come 5) coming
24. 1) delivered 2) brings 3) transport 4) pass 5) fetch
25. 1) on 2) in 3) with 4) for 5) from
26. 1) interest 2) wish 3) needs 4) serve 5) progress
27. 1) demand 2) substitute 3) bear 4) burden 5) recognize
28. 1) to help 2) for helping 3) helps 4) helped 5) help
29. 1) some 2) any one 3) ethernet 4) mobile 5) date
30. 1) buff 2) fan 3) prediction 4) fawn 5) preference

ANSWERS

1) 1	2) 3	3) 1	4) 3	5) 3
6) 5	7) 2	8) 4	9) 1	10) 3
11) 2	12) 4	13) 2	14) 4	15) 3
16) 1	17) 4	18) 4	19) 4	20) 5
21) 2	22) 1	23) 3	24) 1	25) 1
26) 3	27) 5	28) 1	29) 4	30) 2

విద్య, ఉద్యోగ సమాచారం

టీహెచ్‌డీసీ ఇండియా లిమిటెడ్‌లో 129 ఇంజనీర్ పోస్టులు

ఉత్తరాఖండ్‌లోని తెహ్రీ హైడ్రో డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఇండియా లిమిటెడ్(టీహెచ్‌డీసీ).. వివిధ విభాగాల్లో ఇంజనీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 129.
- **విభాగాలు:** సివిల్, ఎలక్ట్రికల్, మెకానికల్, జియాలజీ, జియోటెక్నికల్, ఎన్విరాన్‌మెంట్, మైనింగ్, హ్యూమన్ రిసోర్స్, ఫైనాన్స్.
- **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, బీఈ, బీటెక్, ఎంబీఏ, సీఏ, సీఎంఏలో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
- **వయసు:** 12.02.2025 నాటికి 30 ఏళ్లు ఉండాలి.
- **వేతనం:** నెలకు రూ.50,000 నుంచి రూ.1,60,000.
- **ఎంపిక విధానం:** షార్ట్‌లిస్టింగ్, కంప్యూటర్ బేస్డ్ టెస్ట్, పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా ఎంపికచేస్తారు.
- **పరీక్ష విధానం:** కంప్యూటర్ ఆధారిత రాతపరీక్ష, మొత్తం 150 మార్కులకు 150 ప్రశ్నలు ఉంటాయి. పరీక్ష మాధ్యమం ఇంగ్లిష్, హిందీ. పరీక్ష సమయం 2 1/2 గంటలు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 14.03.2025.
- **వెబ్‌సైట్:** https://thdc.co.in/

నైపర్-అహ్మదాబాద్‌లో 11 ఫ్యాకల్టీ పోస్టులు

అహ్మదాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్(నైపర్).. రెగ్యులర్ ప్రాతిపదికన వివిధ విభాగాల్లో ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 11.
- **పోస్టుల వివరాలు:** ప్రొఫెసర్-05, అసోసియేట్ ప్రొఫెసర్-02, అసిస్టెంట్ ప్రొఫెసర్-04.
- **విభాగాలు:** బయోటెక్నాలజీ, మెడికల్ కెమిస్ట్రీ, మెడికల్ డివైజెస్, ఫార్మకాలజీ అండ్ టాక్సికాలజీ, ఫార్మాస్యూటిక్స్, ఫార్మాస్యూటికల్ అనాలసిస్.
- **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో పీహెచ్‌డీలో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
- **వయసు:** ప్రొఫెసర్‌కు 50 ఏళ్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు 40 ఏళ్లు, అసోసియేట్ ప్రొఫెసర్‌కు 45 ఏళ్లు ఉండాలి.
- **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 23.03.2025.
- **వెబ్‌సైట్:** https://niperahm.ac.in/